
బొలీవియా డైరీ
చే గువేరా
ప్రజాశక్తి బుక్‌హౌస్

# బొలివియా డైరీ

ఎర్నెస్టో చెగువేరా

# బొలీవియా డైరీ

ఎర్నెస్టో చేగువేరా

ప్రజాశక్తి బుక్‌హౌస్
*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*
*హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013*

ENGLISH TITLE : **BOLIVIAN DIARY**
AUTHOR : **CHEGUVERA**
INTRODUCTION : **FIDEL CASTRO**

92771

అనువాదం :
కె. సత్యరంజన్
గుడిపూడి విజయరావు

ప్రచురణ సంఖ్య : 1136

ముద్రణ : నవంబర్, 2013

వెల : ₹ 100/-

ముఖచిత్రం డిజైన్ : శ్రీరాం కారంకి

ప్రతులకు
**ప్రజాశక్తి బుక్‌హౌస్**
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు
హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

# విషయసూచిక


ముందుమాట ........................................ 7

పరిచయం : జాన్ లీ ఆండర్సన్ ........................................ 11

అవశ్య ఉపోద్ఘాతం : ఫైడెల్ కాస్ట్రో ........................................ 25

**బొలీవియా డైరీ** ........................................ 46

నవంబరు 1966 ........................................ 47

డిసెంబరు 1966 ........................................ 55

జనవరి 1967 ........................................ 69

ఫిబ్రవరి 1967 ........................................ 83

మార్చి 1967 ........................................ 97

ఏప్రియల్ 1967 ........................................ 119

మే 1967 ........................................ 141

జూన్ 1967 ........................................ 157

జూలై 1967 ........................................ 173

ఆగస్టు 1967 ........................................ 191

సెప్టెంబరు 1967 ........................................ 209

అక్టోబరు 1967 ........................................ 233

'తుదిపలుకులు' ........................................ 238

ఫొటోలు ........................................ 241

# ముందుమాట

**చే** గువేరా పేరు తెలియని వారు నేడు సాధారణంగా ఉండరు. చే అనగానే ఓ గొప్ప విప్లవ వీరుడు మదిలో స్ఫురిస్తాడు. అర్జెంటినాలో జన్మించిన చే దేశాలకు అతీతంగా క్యూబా విప్లవ పోరాటంలో ఫైడెల్ కాస్ట్రోతో పాటు ఓ ప్రధాన భాగస్వామిగా పాల్గొనడమే కాదు, విప్లవం విజయవంతం అయిన తర్వాత ఆ దేశ నిర్మాణంలోనూ ముఖ్యమైన పాత్ర వహించారు. అలా క్యూబాలోనే స్థిరపడిపోయి, అధికారంతో పాటు సుఖవంతమైన జీవితాన్ని అనుభవించడానికి అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ ప్రపంచమే తన మాతృభూమి అనుకున్న చే అక్కడ ఉండలేకపోయాడు. క్యూబాలో ఉంటూనే కాంగో పోరాటంలో పాల్గొన్నాడు. తిరిగి వచ్చిన తర్వాత మొత్తం లాటిన్ అమెరికాలో విప్లవ పోరాటాన్ని విజయవంతం చేయాలన్న పథకంలో భాగంగా బొలీవియాలో గెరిల్లా పోరాటం నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. కొద్దిమంది విప్లవకారులతో కలిసి 1966 నవంబరులో చే బొలీవియా చేరుకున్నాడు. అక్కడి సైనిక నియంతృత్వ పాలకునికి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటాన్ని ఆరంభించాడు. తొలుత కొన్ని విజయాలనూ సాధించాడు. కాని కొద్ది కాలంలోనే సైన్యం గెరిల్లా యోధులను చుట్టుముట్టకలిగింది. చాల మందిని చంపివేసింది. సిఐఏ సహాయంతో బొలీవియా మిలిటరీ 1967 అక్టోబరులో చేను పట్టుకోగలిగింది. ఓ స్కూలు భవనంలో బంధించి కాల్చి చంపివేసింది. పోరాట కాలంలో చే రాసుకున్న డైరీ ఆయన బ్యాక్‌ప్యాక్‌లో లభించింది. చాల సరళంగా, సూటిగా రోజువారీ ఘటనలను నమోదుచేసిన ఈ డైరీ చే వ్యక్తిత్వాన్ని ఓ గెరిల్లా యోధునిగా, ఓ విప్లవకారునిగా, ఓ మానవతా మూర్తిగా– ఇలా అనేక కోణాల

నుండి ఆవిష్కరిస్తుంది. సిఐఏ ఆధీనంలోకి వెళ్లిన ఈ డైరీని క్యూబా సంపాదించి, 1968లో ఆ దేశ అధ్యక్షులు, చే సహయోధుడు అయిన కాస్ట్రో ముందుమాటతో సహా ప్రచురించింది.

ప్రజాశక్తి బుక్‌హౌస్ చే మోటర్‌సైకిల్ డైరీ, చే రచనలు, చే గురించిన కాస్ట్రో జ్ఞాపకాలు, కాస్ట్రో తొలిజీవితం లాంటి పుస్తకాలను ఇప్పటికే ప్రచురించింది. ఇప్పుడు తెలుగు పాఠకులు ఎంతగానో ఎదురు చూస్తున్న, చే బొలీవియా డైరీని సగర్వంగా అందిస్తున్నది. మిగతా ప్రచురణలాగే దీన్నీ పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాము.

**- ప్రజాశక్తి బుక్‌హౌస్**

**హైదరాబాదు**

# బొలీవియా మ్యాప్

### చే గెరిల్లా కార్యకలాపాల ప్రాంతం



## చే గెరిల్లా కార్యకలాపాల ప్రాంతం (విపులంగా)



# పరిచయం

## జాన్ లీ ఆండర్సన్

ఈ ప్రపంచాన్ని మార్చాలని కోరుకున్న మనిషిగా ఎర్నెస్టో చేగువేరా బొలీవియా అడవులలో సాగించిన చిట్టచివరి గెరిల్లా ఆందోళనను అక్షరబద్ధం చేసి గొప్ప వారసత్వాన్ని మనకు మిగిల్చి వెళ్ళాడు. దక్షిణ అమెరికాలోని అతి సంక్లిష్టమైన భూభాగం మీద ఒక్కరొక్కరుగా సహచరులను కోల్పోతూ పదకొండు నెలలపాటు ఒక ఉదాత్త లక్ష్యంతో సాగించిన దుర్భరమైన, దుర్గమమైన తన ప్రయాణాన్ని అతి సంక్షిప్తంగా 'బొలీవియా డైరీ'ల రూపంలో మనకు అందించారు.

బొలీవియా నైరుతి దిక్కున ఉన్న కంటకప్రాయమైన చాకో అడవులలోని నూతన గెరిల్లా బేస్‌క్యాంప్‌ను చేరుకున్న 1966 నవంబరు 7 నుండి చే ఈ డైరీ రాయడం మొదలు పెట్టాడు. 'ఒక కొత్త దశ ఆరంభమైంది' – ఇది డైరీలో చే రాసిన తొలివాక్యం. లాటిన్ అమెరికా ఖండంలో మొత్తంగా మార్క్సిస్టు విమోచన ఉద్యమాలు రగిలించడానికి బొలీవియాను కేంద్రంగా చేసుకుని పని చెయ్యాలన్న తన ప్రణాళిక పట్ల చే కు ఉన్న ఆశావహ దృక్పథాన్ని ఈ తొలి వాక్యం మనకు తెలియచేస్తుంది. ఐదు నెలల తరువాత 1967 ఏప్రిల్ నెలలో, అప్పటికీ చే ఎక్కడున్నాడనేది ఒక మిస్టరీగా ఉన్న నేపథ్యంలో ఫైడల్ కాస్ట్రో సారథ్యంలో హవానాలో జరిగిన తృతీయ ప్రపంచ దేశాల విప్లవకారుల సదస్సు సందర్భంగా ప్రచురించిన 'తృతీయ ఖండానికి సందేశం' అన్న చే వ్యాసం అతని ప్రాపంచిక దృక్పథానికి అద్దం పడుతుంది. అప్పటికి రెండేళ్ళ క్రితం నుండి చే క్యూబా ప్రజలకు బహిరంగంగా కనబడకుండా ఉన్నాడు. ప్రపంచంలోని విప్లవకారులందరూ సాయుధులై మానవాళికే కడు ప్రమాదకారిగా మారిన శత్రువు – అమెరికాను బలహీనం చెయ్యడానికి రెండు, మూడు, నాలుగు – వీలైనన్ని వియత్నాంలు

సృష్టించాలని, తద్వారా సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించి ఆ స్థానే ఒక నూతన ప్రపంచ క్రమాన్ని, సోషలిజాన్ని స్థాపించాలని చే తన సందేశంలో పిలుపునిచ్చారు. తన ఉద్దేశం పట్ల ఎటువంటి సందేహాలకూ తావులేని విధంగా 'సుదీర్ఘమైన, క్రూరమైన యుద్ధానికి' సిద్ధం కావాలని స్పష్టం చేశాడు. పంతొమ్మిదవ శతాబ్దపు క్యూబా స్వాతంత్ర్య పోరాట యోధుడు జోస్ మార్టి చెప్పిన మాటలను తన సందేశంలో ఉల్లేఖించాడు. "ఇది కొలిమిలు రగిలించాల్సిన సమయం, ఇక మనం కేవలం వెలుగులు మాత్రమే చూడాలి" అన్నాడు. అయితే చే కన్నకలల సాకారం కాలేదు. 'తృతీయ ఖండానికి' చే పంపిన సందేశం ప్రచురించే నాటికే బొలీవియా అధికార యంత్రాంగం చే గెరిల్లా దళాల ఆచూకీ కనిపెట్టేసింది. చే, అతన్ని వెన్నంటి ఉన్న గెరిల్లా దళం తప్పించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఏ రోజు గడిస్తే ఆ రోజు బతికి ఉన్నట్లు ఊపిరి పీల్చుకునేంత ప్రమాదంలో పడ్డారు. తన సహచరులు అనేక మంది శత్రువుల చేతికి చిక్కారు. ఇంకొంత మంది గెరిల్లా దళం నుండి వైదొలిగారు. బొలీవియా అధికార యంత్రాంగం ఈ దళ నాయకుడు 'చే' అని గుర్తించింది. ఈ విషయం ఉప్పందిన వాషింగ్టన్ వెంటనే రంగంలోకి దిగింది. సిఐఎ ఏజెంట్లను, ప్రత్యేక బలగాలను, మిలిటరీ సలహాదారులను బొలీవియాలో దించింది. చే కోసం వేట ఆరంభమైంది.

అక్కడ నుండి జరిగిన పరిణామాలన్నింటికీ చే తనకు తానుగా బాధ్యత వహించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. వాస్తవానికి చే గెరిల్లా స్థావరాన్ని శత్రువు గుర్తించడానికి ముందుగానే బొలీవియాలో చే రాజకీయంగా ఒంటరివాడు అయ్యాడు. బొలీవియా కమ్యూనిస్టు పార్టీ అధినేత మారియో మాంజేతో విభేదాలు తలెత్తాయి. బొలీవియా గెరిల్లా దళాలకు తనను నాయకుడిగా ప్రకటించమని మారియో మాంజే చేసిన విజ్ఞప్తిని చే ఏ మాత్రం లౌక్యం లేకుండా తిరస్కరించాడు. దీంతో మారియోమాంజే అప్పటిదాకా ఇచ్చిన పార్టీ మద్దతును ఉపసంహరించుకున్నాడు. దీంతో చే కు వెన్నుదన్నుగా నిలిచిన 'నెట్‌వర్క్' సాయం నిలిచిపోయింది. గెరిల్లా కార్యకలాపాలకు ఈ 'నెట్‌వర్క్'యే గుండెకాయ వంటిది. ఆహార – ఆయుధ సరఫరాలు, రిక్రూట్‌మెంట్లు, రహస్య సమాచార సేకరణ వంటి కార్యకలాపాలన్నీ జరిగే 'నెట్‌వర్క్' లేకపోవడం, దానికి తోడు రేడియో ట్రాన్స్‌మీటర్ పాడయి హవానాతో సంబంధాలు తెగిపోవడంతో చే మరింత చిక్కుల్లో పడ్డాడు. బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి.

అప్పటికే అతన్ని అంటిపెట్టుకుని ఉన్న గెరిల్లా దళంలో సహచరుల మరణాలు, ఉద్యమాన్ని వీడిపోవడాలు, అటు బొలీవియా – ఇటు క్యూబాలో సాయం అందించే సహచరుల పట్ల విశ్వాసలేమి – వీటన్నింటితో నైతికస్థైర్యం దిగజారిపోయింది. విధిలేని పరిస్థితులలో దళం రెండుగా విడిపోయి ముందుకు సాగింది. ప్రయాణం దారి తప్పింది. నెలల పాటు కాలం వ్యర్థమైనా ఈ రెండు దళాలూ ఒకదాని ఆచూకీ ఇంకోటి కనిపెట్టుకోలేక పోయాయి. చే కు ఆస్థమా తిరగబెట్టింది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. ఎక్కడికి కదలాలన్న కంచర గాడిదల సాయం కావాల్సి వచ్చింది. గెరిల్లా దళాలు ఎదురుపడినప్పుడల్లా రైతులు భయంతో, అపనమ్మకంతో వ్యవహరించేవారు. సామాజిక మార్పు కోసం దళాలు ఇచ్చిన పిలుపులు చెవిటివాని ముందు శంఖం ఊదినట్లు నిష్ప్రయోజనంగా మిగిలాయి. ఆహారం, కంచెరగాడిదల కోసం చే దళాలు పౌరులనే బందీలుగా చేసుకుని తమ అవసరాలు సాధించుకోవాల్సిన దుస్థితికి నెట్టబడ్డారు. దళ సభ్యుల మధ్య ఉద్రిక్తలు, అసంతృప్తులు, అకారణ కోపాలు పెరిగిపోయాయి. ఒక దశలో చే భావోద్వేగాలను అదుపు చేసుకోలేక తాను ఎక్కిన కంచెరగాడిద మెడలో కత్తి దూసాడు.

1967 ఆగస్టు 31న క్యూబా గెరిల్లా జోయాక్విన్ నాయకత్వంలోని రెండవ దళం ఒక నదిని దాటే ప్రయత్నంలో ఉండగా శత్రుసైనికులు మట్టుపెట్టి దాడిచేసి దళాన్ని సమూలంగా నిర్మూలించారు. ఇంకొక్క రోజు గడిచింది. ఆహార లేమితో చే దళ సభ్యులు పూర్తిగా నీరసించిపోయి ఉన్నారు. తప్పించుకునే ప్రయత్నంలో మైదాన ప్రాంతం నుండి ఆండీ పర్వత సానువుల వైపుకు మళ్ళారు. అక్కడ కూడా చే దళాలకు పౌర నిరాకరణ ఎదురయింది. దళాల రాకను కనిపెట్టి కొన్ని చోట్ల గూడేలు విడిచి పారిపోతే, ఇంకొన్ని చోట్ల బొలీవియా సైనికులకు దళాల కదలికల గురించి ఉప్పందించే వాళ్ళు. డైరీలో చే పూర్తి చేసిన చిట్టచివరి పేజీ 1967 అక్టోబరు 7వ తారీఖుది. గెరిల్లాలు ఉన్న ప్రాంతాన్ని సైన్యం చుట్టుముట్టినట్లు విన్న రేడియో ప్రసారం పట్ల సందేహాన్ని వ్యక్తం చేసాడు. ఈ సమాచారం తప్పుదోవ పట్టించడానికి ప్రసారం చేసినదిగా భావించారు. సముద్ర మట్టానికి 2000 అడుగుల ఎత్తున ఉన్నట్లుగా రికార్డు చేసాడు. ఆ మరుసటి రోజే ఒక కొండవాగు మలుపులో బొలీవియా సైనిక సాయుధ దళాలు, చే సహచరులను చుట్టుముట్టాయి. తుపాకుల యుద్ధంలో గాయపడిన 'చే'ను బందీ చేసి తీసుకెళ్ళారు.

లాహిగ్యురా దగ్గర ఉన్న ఒక శివారు గ్రామంలో చే ను ఆ రాత్రి బందీగా ఉంచారు. బొలీవియా మిలిటరీ అధ్యక్షుడు జనరల్ రీనె బారియాంటోస్ 'చే'ను నిర్దాక్షిణ్యంగా ఖతం చెయ్యమని అక్కడ ఉన్న అధికారులకు రేడియో సందేశం పంపించాడు. అక్టోబరు 9, 1967 సిఐఎ ఏజెంటుగా ఉన్న ఒక క్యూబన్ – అమెరికన్ ఆ రోజు ఉదయం అంతా చే డైరీలను మైక్రో ఫిల్ములు తీస్తూ గడిపాడు. మధ్యాహ్నం 1.30 నిముషాలకు దగ్గరలో ఉన్న ఒక స్కూలు గదికి చే ను తీసుకువెళ్ళారు. బొలీవియా సైనిక సార్జెంట్ చే ను కాల్చి చంపాడు. అప్పటికి చే వయసు ముప్పైతొమ్మిదేళ్ళు. భార్య, ఐదుగురు పిల్లలు – వీరే అతని ఆస్థి. చే అమరత్వం చిరకాలంలోనే ఒక ఇతిహాసం స్థాయికి చేరుకుంది.

ఆ రోజు పొద్దువాలక ముందే చే పార్థివ శరీరాన్ని ఒక సైనిక హెలికాప్టర్‌లో లాహిగ్యురా నుంచి దాపునే ఉన్న సాయుధ గిడ్డంగి పట్టణం వాలెగ్రాండెకు తరలించారు. న్యూస్ట్రోసిన్యోర్‌డి మాల్టా ఆసుపత్రిలోని లాండ్రీ గదిలో తుపాకి గుళ్ళ దెబ్బలు తిన్న చే శరీరాన్ని పడేసారు. ఆ రోజు రాత్రి, మర్నాడు పగలూ అక్కడే ఉంది చే విగత శరీరం. చే భౌతిక కాయాన్ని చూడవచ్చిన పౌరులు, సైనికులు, జర్నలిస్టులతో తొక్కిడిగా మారిపోయింది ఆ ఆసుపత్రి ఆవరణ. చొక్కాలేకుండా, తలపైకి చూస్తూ, తెరిచి ఉన్న కళ్ళలో తొణికిసలాడుతున్న ప్రశాంతతతో ఉన్న చే పార్థివ శరీరాన్ని చూసి శిలువ ఎక్కిన ఏసుక్రీస్తుతో పోల్చుకున్నారు ప్రజలు. ప్రపంచ వ్యాప్తంగా పత్రికలలో ప్రచురించిన ఈ ఫొటోలు చే మరణాన్ని ధృవపరస్తూనే ఆ మరణానికి ఒక అతీతశక్తిని ఆపాదించాయి.

అక్టోబరు 10–11, అర్ధరాత్రిపూట చే, చే సహచర కామ్రేడ్ల భౌతికకాయాలను మిలిటరీ అదృశ్యం చేసేసింది. వాలెగ్రాండెలో పాడుబడ్డ విమానాశ్రయంలో బుల్‌డోజర్లతో గొయ్యితీసి శవాలను సామూహికంగా ఖననం చేసింది. ఖననానికి ముందు చే మొహానికి నమూనా మాస్క్, చేతి ముద్రలు తీసుకున్నారు ఫోరెనిక్స్ నిపుణులు. అతని రెండు చేతులూ శరీరం నుంచి వేరుచేసి ఫార్మాల్డిహైడ్ ద్రావణం ఉన్న గాజు జాడీల్లో భద్రపరిచారు. చే పార్థివ శరీరాన్ని అదృశ్యం చేసేసి అతని మరణానికి దారితీసిన పరిస్థితులను దాచిపెట్టవచ్చని బొలీవియా ప్రభుత్వం భ్రమించింది. ఎదురు కాల్పుల్లో ఆయన గాయాలతో చే మరణించాడు అనేది అధికారిక ప్రకటనల సారాంశం. మేరునగధీరుడైన ఆ గెరిల్లా యోధుడికి అంజలి ఘటించే వీలు కూడా లేకుండా

బొలీవియా ప్రభుత్వం చే ముఖానికి నమూనా మాస్క్ తయారు చేయించడం, చేతులను ఖండించి భద్రపరచడం 'చే'ను గుర్తించడానికి చేసిందే అని బొలీవియా ప్రభుత్వం నమ్మబలకడానికి ప్రయత్నించింది.  కానీ 'చే' మరణాన్ని ప్రజలు నమ్మరేమో అన్న సందేహంతోనే బొలీవియా ప్రభుత్వం ఇలాంటి సిగ్గుమాలిన పనికి పూనుకుందని సర్వే సర్వత్రా అర్థం చేసుకున్నారు.

చే దగ్గర చేజిక్కించుకున్న రెండు ఎరుపు రంగు స్ప్రైరల్ నోటు పుస్తకాలు, చెర్రీ రంగు ప్లాస్టిక్ కవర్‌లో ఉన్న 1967 అజెండాను, పశ్చిమజర్మనీలో ప్రచురించారు. దీంతో యూరప్, అమెరికా దేశాల్లోని ప్రచురణకర్తలు ఆ డైరీలు ప్రచురించడానికి పోటీలు పడ్డారు.  బొలీవియా ప్రభుత్వం ప్రచురణ హక్కుల మీద వివాదం లేవనెత్తింది. అమెరికాలో పేరు మోసిన ఒక ప్రచురణ సంస్థ బేరియాంటోస్‌తో నాలుగు లక్షల డాలర్లకు ఈ డైరీలు ముద్రించే హక్కుల కోసం బేరం కుదుర్చుకుంది. ఈ బేరసారాలు నడుస్తుండగానే 1968 జూలై నెలలో క్యూబా ప్రభుత్వం హఠాత్తుగా చే డైరీలను సంపూర్ణంగా, కాస్ట్రో ఉపోద్ఘాతంతో ప్రచురించాయి. స్పానిష్ భాషలో ప్రచురించిన ఈ పుస్తకం ఆ వెనువెంటనే ఫ్రెంచి, ఇటాలియన్, జర్మన్, ఇంగ్లీష్ భాషల్లోకి అనువాదం అయింది. దాంతో బొలీవియా డైరీ అంతర్జాతీయంగా ఉత్తమ అమ్మకాల పుస్తకాల జాబితాలోకి చేరింది.

'అవశ్య ఉపోద్ఘాతం' పేరిట కాస్ట్రో రాసిన ముందుమాటలో 'చే'ను నిజమైన విప్లవ యోధుడిగా అభివర్ణించాడు.  పురిటిలోనే సంధికొట్టిన బొలీవియా గెరిల్లా ఆందోళనకు క్యూబా ప్రభుత్వం అందించిన సహకారాన్ని సమర్థించాడు. చే బలిదానం చిరస్థాయిగా, చిరస్మరణీయంగా నిలిచిపోతుంది, గెలిచి తీరుతుందన్న విశ్వాసం వెలిబుచ్చాడు.  'తన జీవితాన్ని పణంగా పెట్టి చే ఇచ్చిన పిలుపును పేదలు, పీడితులు ఏనాటికైనా అందుకుంటారు.  వేనవేల హస్తాలు ఆయుధాలు అందుకుంటాయి.  పరిపూర్ణ స్వేచ్ఛను సాధించుకు తీరుతారు' అంటాడు.  బొలీవియా సైన్యం, సిఐఎలకు వ్యతిరేకంగా తాను తిరుగుబాటును ప్రేరేపించాను అన్న ప్రచారానికి జవాబుగా "ప్రస్తుతానికి చే డైరీలు మా చేతుల్లోకి ఎలా వచ్చి చేరాయనే విషయం గురించి నేనేమీ చెప్పను.  కాని ఒక్కటి మాత్రం చెప్పదలిచా – ఈ డైరీల కోసం మేం ఎవరికీ ఒక్క నయాపైసా చెల్లించనక్కరలేదు" అని రాసాడు కాస్ట్రో.

నిజానికి చే డైరీ ఫొటో కాపీలు – ఆ తరువాత ఖండిత హస్తాలు, మాస్క్ కూడా – బొలీవియా అంతర్గత మంత్రిగా వ్యవహరిస్తున్న ఆంటోనియా ఆర్ఘ్యడాస్ తరపు ఏజెంట్లు ఆ దేశ సరిహద్దులను దాటించారు. ఆర్ఘ్యడాస్ అటు సిఐఎతోనూ ఇటు బొలీవియా కమ్యూనిస్టు పార్టీతోనూ సంబంధ బాంధవ్యాలు నెరిపేవాడు. ఈ వ్యవహారం బట్టబయలు కావడంతో ఆర్ఘ్యడాస్ దేశం విడిచి పారిపోయాడు. కాని మళ్ళీ ఆ గూటికే తిరిగి చేరుకున్నాడు. తర్వాత అతని మీద హత్యా ప్రయత్నం జరగడంతో మళ్ళీ దేశం విడిచి పారిపోయాడు. ఈ సారి క్యూబాలో తలదాచుకున్నాడు. చానా ఏళ్ళు క్యూబాలో గడిపి తిరిగి మాతృదేశానికి చేరుకున్నాడు. రహస్య జీవితం గడిపాడు. ఏనాడూ ప్రజల సమక్షంలోకి రాని చీకటి జీవితం గడిపాడు. చే డైరీలను ముద్రించడంలో కాస్ట్రో అసమాన సాహసం ప్రదర్శించాడు. అయినా చే మరణం, చే డైరీల ప్రచురణ ఘాటైన చర్చకు దారితీసింది. బొలీవియాలో తప్పు ఎక్కడ జరిగింది. చే పరాజయానికి బాధ్యులు ఎవరు, కాస్ట్రో అతనికి కావల్సినంత సాయం అందించలేక పోయాడా అన్న అంశాలపై వాదోపవాదాలు చెలరేగాయి. బొలీవియాలో చే వైఫల్యం వామపక్షాలలో కూడా చర్చకు దారితీసింది. చే 'కేంద్రక సిద్ధాంతం' మీద అనేక ప్రశ్నలు తలెత్తాయి. క్యూబా విప్లవ పోరాట స్ఫూర్తితో, అనుభవాలతో చే ప్రతిపాదించిన కేంద్రక సిద్ధాంతం సారాంశం ఏమిటంటే – చిన్న చిన్న గెరిల్లా దళాలు సాయుధ పోరాటం ద్వారా పల్లెపల్లెనూ చైతన్యపరిచి పౌర సహాయంతో తిరుగుబాటు పునాదిని విస్తరించవచ్చు అనేది.

బొలీవియా ఉదంతం పశ్చిమ దేశాల చేతికి వాటంగా అందివచ్చింది. విప్లవ సిద్ధాంతాలన్నీ తప్పుడువనీ, విప్లవకారులు ప్రపంచంలో ఇంకెక్కడయినా ఇలాంటి ప్రయత్నాలు చేస్తే వారికీ చే కు ఎదురైన భంగపాటు తప్పదనీ ఊదరగొట్టుడు ప్రచారం సాగించాయి. 1968లో అమెరికన్ ప్రచురణ సంస్థ స్టీన్ & డే వెలువరించిన చే డైరీలో ఇటువంటి సందేహమే అచ్చొత్తారు. ఆర్ఘ్యడాస్ కుంభకోణం బయట పడడంతో ఈ ప్రచురణ సంస్థ చే డైరీలు, ఇతరత్రా స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లను ప్రచురించే హక్కులను బొలీవియా ప్రభుత్వం నుండి కొనుగోలు చేసి ఆదరా బాదరా ఈ పుస్తకం వెలువరించింది. క్యూబా వెలువరించిన అదే పుస్తకానికి ప్రతిగా అన్నట్లు ఆనాటి ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణానికి తగినట్లుగా అమెరికన్ ప్రభుత్వంతో అతి దగ్గరి సంబంధాలు ఉన్న డేనియల్ జేమ్స్ అనే పాత్రికేయుడు, చరిత్రకారుడితో తన పుస్తకానికి ముందు

మాట రాయించింది. సహజంగానే జేమ్స్ బొలీవియా ప్రయోగం కుప్పకూలిపోవడానికి చే అంచనాల వైఫల్యాలు, నాయకత్వ లక్షణాలలేమి, కాస్ట్రో నుండి, బొలీవియా కమ్యూనిస్టు పార్టీ నుండి అందవలసిన సహాయం పట్ల సందేహాలను వ్యక్తం చేస్తూ రాసుకొచ్చాడు. అయినా విధిలేక చే విప్లవ ఆకాంక్ష పట్ల అపారమైన గౌరవం వ్యక్తం చేసాడు.

బొలీవియాలోని బారియాంటోస్ పాలనకు దన్నుగా అమెరికా సేనలను ప్రత్యక్షంగా ఆ దేశంలోకి లాగాలన్న చే వ్యూహం ఫలించి ఉంటే యావత్ లాటిన్ అమెరికా దేశాల్లోని వామపక్ష వాదుల నుండే గాక మధ్యేవాద పార్టీల నుండి కూడా వ్యతిరేకతను ఎగదోసి, అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడేట్టు చేసేవాడని జేమ్స్ విశ్లేషించాడు. ఆ రకంగా చే నాయకత్వంలోని ఒక చిన్న గెరిల్లా దళం ఒక భూఖండంలో విప్లవ జ్వాలలు రగిలించడానికి ఉత్ప్రేరకంగా పనిచేసి ఉండేది. ఇహదాని పర్యవసానాలు పశ్చిమదేశాలకు భారీ నష్టాన్ని చేకూర్చేవి. కాబట్టి బొలీవియాలో చే మొదలు పెట్టిన విప్లవాందోళనగానీ, అతని లక్ష్యంగానీ కీలకమైన ప్రాముఖ్యత గలవన్న సత్యాన్ని ఎవరూ కాదనలేరు.

అర్జెంటీనా దేశంలోని రోసారియో నివాసితులు రాజకీయంగా ఉదారవాదులైన ఒక మధ్యతరగతి కుటుంబంలో 1928లో చే జన్మించాడు. ఐదుగురు సంతానంలో ఎర్నెస్టో గువేరా డిరోలా సెర్నా ఒకడు. అర్జెంటీనాలో ఉక్కుమనిషి జువాన్ డొమింగో పెరోన్ పరిపాలన సాగుతుంది ఆనాడు. యువక వయస్కుడయిన చే మొదట్లో రాజకీయాల పట్ల అంతగా ఆసక్తి కనబరచలేదు. ఆస్థమాతో బాధపడుతూ ఉండేవాడు. అలర్జీల మీద పరిశోధన సాగించాలని ఉత్సాహం చూపేవాడు. బ్యూనస్ ఎయిర్స్ విశ్వ విద్యాలయంలో మెడిసిన్ చదివాడు. పరిశోధకుడిగా ఏదో ఒక నాటికి మానవాళిని పట్టి పీడిస్తున్న అంటువ్యాధులను నిర్మూలించగలగాలి అని కలకనేవాడు. అయితే చేగువేరాలో సాహసయాత్రల పట్ల విపరీతమైన ఆకర్షణ ఉండేది. భ్రమణ కాంక్ష తీరడానికా అన్నట్లు దక్షిణ అమెరికాలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించాడు. ఆ క్రమంలోనే లాటిన్ అమెరికా దేశాల్లో విస్తరించి ఉన్న కటిక పేదరికం, రాజకీయ అసమానతలు అతనిలోని సామాజిక చైతన్యాన్ని నిద్రలేపాయి.

1953లో డాక్టర్ పట్టా పుచ్చుకున్నాక లాటిన్ అమెరికాలో ఉత్తరదిశగా ప్రయాణం మొదలు పెట్టాడు. ఎక్కడ, ఏ సామాజిక సమస్యతో పెనవేసుకోవాలా అని అన్వేషిస్తూ చివరికి గ్వాటిమాలాలో వామపక్ష భావజాలంతో స్ఫూర్తిపొంది పనిచేస్తున్న జాకోబో అర్బెంజా ప్రభుత్వ విధానాలపట్ల ఆకర్షితుడై ఆ దేశంలో పనిచెయ్యాలనే నిర్ణయానికి వచ్చాడు. కొద్ది నెలలలోనే అమెరికన్ సిఐఎ సంస్థ ఇచ్చిన ఊతంతో మిలిటరీ తిరుగుబాటుతో అర్బెంజా ప్రభుత్వాన్ని కూలగొట్టడం కళ్ళారా చూసాడు. ఈ అనుభవంతో అతని రాజకీయ అవగాహన అతివాద భావజాలం వైపు మొగ్గింది. మార్క్సిస్టు అవ్వాలనే నిర్ణయానికి వచ్చాడు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడడమే తన అంతిమ లక్ష్యం అనే నిర్ధారణకు వచ్చాడు. మెక్సికోకు పయనమయ్యాడు. అక్కడ కాస్ట్రోను కలుసుకున్నాడు. నవ యువకుడు, న్యాయవాది అయిన కాస్ట్రో అప్పటికి ప్రవాస జీవితం గడుపుతూ అమెరికా అండదండలతో క్యూబాలో నియంతృత్వ పాలన కొనసాగిస్తున్న జనరల్ ఫుల్గెనికో బాటిస్టా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చెయ్యడానికి గెరిల్లా దళాలను సమీకరిస్తున్నాడు. మెక్సికోలో జతపడిన ఈ క్యూబా కామ్రేడ్లే గువేరాకు 'చే' అనే ముద్దుపేరు పెట్టారు. ఆ పేరునే గువేరా తన విప్లవ నామధేయంగా స్వీకరించాడు. 1956-58 మధ్య కాలంలో క్యూబాలో జరిగిన గెరిల్లా ఆందోళనలలో కాస్ట్రోకు 'చే' అత్యంత సన్నిహితుడుగా అత్యున్నత మిలిటరీ కమాండరుగా, భయమంటే ఎరుగని వీర యోధుడిగా, తిరుగుబాటు దళాలలో కరడుగట్టిన మార్క్సిస్టుగా, దళాలలో వేగులను, వెన్నుపోటుదారులను నిర్దాక్షిణ్యంగా శిక్షించే కఠినాత్ముడిగా పేరొందాడు.

1959లో తిరుగుబాటు విజయవంతం అయ్యాక పరాజిత క్యూబా రక్షణ దళాలను విచారించే విప్లవకోర్టులకు అధ్యక్షత వహించాడు. కాస్ట్రో అధికారాలను బలోపేతం చేసాడు. సోషలిస్టు క్యూబాకు విప్లవ సాయుధ బలగాల సంపత్తిని, అంతర్గత భద్రతా వ్యవస్థను, జాతీయ పౌర సైన్యాన్ని నిర్మాణం చెయ్యడంలో కీలకపాత్ర పోషించాడు. క్యూబా కమ్యూనిస్టు పార్టీతో కాస్ట్రోకు రాజకీయ సంకీర్ణం ఏర్పాటుకు మధ్యవర్తిత్వం వహించాడు. అతి కీలకమైన వ్యవసాయ సంస్కరణల చట్టాన్ని రూపొందించడంలో క్రియాశీల పాత్ర పోషించాడు. విశాలమైన ప్రైవేటు, విదేశీ సాగు భూముల్ని, పడావు భూముల్ని జాతీయం చేసి రాజ్యం నేతృత్వంలో క్యూబా ఆర్థిక వ్యవస్థ నడిచే దానికి

మార్గం వేసాడు. అమెరికాతో సంబంధాలు తెగ తెంపులు చేసుకోవడానికి తగిన తెంపరితనం ప్రదర్శించి రాజకీయంగా, ఆర్థికంగా క్యూబా ప్రభావవంతంగా ఎదిగే దానికి ప్రాతిపదిక ఏర్పాటు చేశాడు. సోవియట్ రష్యాకు – కాస్ట్రోకు మధ్య సన్నిహిత సంబంధాలు నెలకొల్పేందుకు ఉత్ప్రేరకంగా పనిచేసాడు. క్యూబాను ఒంటరిపాటు చెయ్యాలన్న అమెరికా ప్రయత్నాలను నీరుగార్చడానికి కాస్ట్రో ప్రత్యేక దూత హోదాలో చే పశ్చిమార్ధ భూగోళంలోని అనేక దేశాలు పర్యటించి వాణిజ్య, రాయబార సంబంధాలు నెలకొనేందుకు కృషిచేసాడు. ఈ క్రమంలోనే కృశ్చేవ్, మావో, టిటో, నాజర్, నెహ్రూ వంటి దేశాధినాయకులను కలిసాడు. సోవియట్ అణు మిస్సైళ్ళను క్యూబాలో రహస్యంగా నెలకొల్పడానికి వీలుగా కాస్ట్రో తరపున చే కృశ్చేవ్‌తో రహస్య చర్చలకు వెళ్ళాడు. చివరకు అది 1962 మిస్సైల్ సంక్షోభానికి దారితీసింది.

క్యూబా జాతీయ బ్యాంకు అధ్యక్షుడిగా ఎంపికయ్యాడు. ఇదే చే తొలి అధికారిక నియామకం. క్యూబా ఆర్థిక వ్యవస్థ మీద రాజ్య నియంత్రణను వేగవంతం చేసాడు. డబ్బు పట్ల విముఖత మూలంగానే క్యూబా కరెన్సీ మీద కేవలం 'చే' అన్న విప్లవ నామధేయంతోనే సంతకాలు చేసాడు. అలాగే క్యూబా పరిశ్రమల శాఖ మంత్రిగా దేశాన్ని శీఘ్రగతిన పారిశ్రామికీకరణ దిశగా నడిపించి ప్రధానంగా పంచదార ఎగుమతుల మీదే ఆధారపడి ఉన్న ఈ ద్వీపకల్ప ఆర్థిక బలహీనతను అధిగమించడానికి ప్రణాళికలు వేసాడు. అయితే ఈ దిశగా చే విజయం సాధించలేకపోయాడు. అప్పటికే రష్యా మీద ఆధారపాటు పెరిగిపోవడం, రష్యా ఈ పారిశ్రామికీకరణ ప్రణాళికను వ్యతిరేకించడంతో 1960వ దశకం మధ్య నాటికే సోవియట్ తరహా సోషలిజం మీద 'చే' కినుక వహించాడు.

1965 ఫిబ్రవరి నెలలో అల్జీర్స్‌లో జరిగిన ఒక సదస్సులో ప్రసంగిస్తూ 'వర్ధమాన దేశాలతో సోవియట్ కూడా దోపిడి సంబంధాలతో వ్యవహరిస్తుందని' చే ఆరోపించాడు. 'పశ్చిమదేశాల సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం చెయ్యడానికి ఒక నూతన సోషలిస్టు సంఘీభావాన్ని పెంపొందించుకోవడానికి తృతీయ ప్రపంచ దేశాలు ముందుకు రావాలని పిలుపునిచ్చాడు. ఆ తరువాత కాలంలో 'సోషలిజం – క్యూబా మానవుడు' అన్న వ్యాసంలో "నిజమైన సోషలిస్టు చైతన్యం కలిగించాలంటే వీరోచిత త్యాగాలు ఒక్కటే మార్గం' అన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసాడు. సోషలిజంలో ఇదొక

ఉదాత్త భావనే కానీ, అలాంటిది అప్పటిదాకా ఎక్కడా ఆచరణలో లేనిది. అయితే ఆ ఉదాత్త భావనను క్యూబా ప్రజానీకంలో పాదుకొల్పడానికి, విప్లవాత్మక ఉత్తమ వ్యవస్థను నెలకొల్పడానికి 'ఐచ్ఛిక శ్రమ'ను అమలు చెయ్యడానికి ప్రయత్నించాడు. నూతన సోషలిస్టు మానవ నిర్మాణానికి భౌతిక సౌకర్యాలు ఒనగూర్చడమే కాకుండా నైతిక ఉన్నతి మీద ఆధారపడాలని ఈ ప్రపంచానికి ఒక కొత్త ఉదాహరణ చూపాలని ఆశించాడు. చే స్వయంగా వారాంతపు శెలవులలో ఏ ఫ్యాక్టరీలోనో, చెరుకు తోటల్లోనో శ్రమ చేసాడు. అతి కొద్దిమంది అనుయాయులు మాత్రమే చే ను అనుసరించారు. ప్రజానీకంలో కూడా అత్యల్ప భాగం మాత్రమే చే వాదనతో ఏకీభవించారు. అయితే చే విప్లవస్ఫూర్తి కొంత మంది సంకుచిత మనస్కులైన కామ్రేడ్లలో అసూయను రగిలించింది.

వీటన్నింటి కన్నా చే గురించి చెప్పుకోవాల్సిన ప్రముఖమైన అంశం ఏంటంటే – దేశ విదేశాల్లో విప్లవ నిర్మాణం కోసం జరిగే కృషికి అతను అంకిత భావంతో అందించిన తోడ్పాటు. క్యూబా ఒక్కటే సోషలిస్టు దేశంగా మనుగడ సాధించలేదని చే స్థిరాభిప్రాయం. అందుకే ఇతర దేశాల్లో తిరుగుబాట్ల కోసం పరులు అసూయపడేంతగా కృషి చేసాడు. కాస్ట్రో ఇచ్చిన అండతో 1959 నుండి మొదలుకుని నికరాగువా, గ్వాటిమాలా, వెనిజులా, పెరూ, అర్జెంటీనా వంటి దేశాలకు క్యూబా గడ్డమీద నుండే లెక్కలేనన్ని గెరిల్లా ఆందోళనలను నడిపించాడు. ఆయుధాలు, సంపత్తి, నిర్మాణం వంటివి సమకూర్చాడు. అయితే ఇవన్నీ నిష్ఫలంగా మారాయి. లాటిన్ అమెరికా 'మరో క్యూబా' అనుభవం తమకు ఎదురు కాకూడదని అమెరికా గట్టి పట్టుమీద ఉంది. ఏ దేశంలో విప్లవ పోరాటం మొదలయినా అక్కడల్లా ప్రతీఘాత విప్లవ శక్తులకు అమెరికా అండగా నిలిచింది. 1965 నుండి అధికారికంగా కాకపోయినా సోవియట్ రష్యా అమెరికా పట్ల 'శాంతియుత సహజీవన' విధానాన్ని అవలంబించసాగింది. ఈ కారణానే చే ప్రయత్నాల యెడల పట్టీపట్టనట్లు వ్యవహరించింది. దాంతో సోవియట్ పట్ల 'చే' నమ్మకం వమ్మయింది. దీనికి తోడు అల్జీర్స్ సమావేశంలో సోవియట్ మీద చే బహిరంగ విమర్శలకు పూనుకోవడంతో – క్యూబాలో చే ఉనికి కాస్ట్రోకు అసౌకర్యంగా తయారయింది. బహుశా అందుకేనేమో ఈ మాటు చే తానే స్వయంగా గెరిల్లా ఆందోళనకు నాయకత్వం వహించి క్యూబా విడిచి వెళ్ళాడు. బెల్జియన్ కాంగోలో ఉన్న

గెరిల్లా దళాలకు అండగా తన దళాలను బయల్దేరదీసాడు. ఆఫ్రికా ఖండమంతటా విప్లవ జ్వాలలు రగిలించడానికి బృహత్తర ప్రాతిపదికను సమకూర్చాడు చే. కాని ఏడు నెలల అనంతరం సిఐఎ వెన్నుదన్ను ఉన్న కిరాయి హంతక ముఠాల దాడులతో చే, చే బలగం అక్కడ నుండి తప్పుకోవలసి వచ్చింది.

దార్–ఎ–సలామ్, ప్రేగ్‌లలో రహస్య జీవితం గడిపి 1966 జూలై నెలలో చే తిరిగి క్యూబా చేరుకున్నాడు. అదీ రహస్యంగానే. తన మందీ మార్బలాన్ని కూడగట్టి తదుపరి లక్ష్యం కేసి నడవాలని నిర్ణయించుకున్నాడు. అదే బొలీవియా. బొలీవియానే అందుకు తగిన చోటని కాస్ట్రోనే చే ను ఒప్పించాడు. అప్పటికి చే ముందు ఉన్న ప్రత్యామ్నాయాలూ లేవు. ఎటూ దిక్కుతోచని పరిస్థితి. కాంగో వైఫల్యానికి కొన్ని నెలల ముందుగా 1965 అక్టోబరులో చే రాసిన వీడ్కోలు ఉత్తరాన్ని కాస్ట్రో బహిరంగపరిచాడు. అధికారిక పదవులన్నింటికీ రాజీనామా పెడుతున్నట్లు, ఆఖరికి క్యూబా పౌరసత్వాన్ని కూడా పరిత్యజిస్తున్నట్లు (తాను ఇంక ముందు విశ్వ పౌరుడిగా ఉండాలనేది చే అభిప్రాయం) చే ఆ ఉత్తరంలో రాసిపెట్టాడు. చే ఆకాంక్షలు నెరవేరడానికి వీలుగా కాస్ట్రో ఆ మేరకు డిక్రీ కూడా జారీ చేసాడు. ఫైడల్‌కు రాసిన ఆ ఉత్తరంలో 'ఈ ప్రపంచంలోని ఇతర దేశాలు నా చేతనైన సాయం కోరుకుంటున్నాయి. నువ్వు నేర్పిన విశ్వాసం, నా జాతి జనుల విప్లవస్ఫూర్తి, పవిత్రమైన నా తదుపరి కర్తవ్యాలను పరిపూర్తి చెయ్యాలనే అభినివేశంతో నేను కొంగ్రొత్త యుద్ధభూములకు బయల్దేరాను' అని పేర్కొన్నాడు చే. ఈ నాటకీయ తుది వీడ్కోలు తదనంతర పరిణామాలు వాటంతట అవే చోటు చేసుకున్నాయి. చే ఒకరకమైన అసహనంతో, అతి ముఖ్యులైన వారికి తప్ప, ప్రజలకు కనబడకుండా హవానాకు పశ్చిమాన ఉన్న కొండల మధ్యని పంట పొలాల్లో గెరిల్లా దళానికి శిక్షణ ఇస్తూ మూడు నెలలు గడిపాడు. బొలీవియా విముక్తి కోసం పయనమయ్యాడు.

మరణానంతరం చే ఒక ఆధునిక ఇతిహాస పురుషుడయ్యాడు. ఇటువంటి జీవితమే ఆశించి, వరించినట్లు మృత్యువును ముద్దాడాడు. చే రాసిన బొలీవియా డైరీలు పన్నెండు భాషలలోకి అనువదించబడి లక్షలాది ప్రతులు అమ్ముడుపోయి చరిత్ర సృష్టించాయి. చే ఫొటో విశ్వవ్యాప్తంగా ఒక 'ఐకాన్'గా గుర్తింపు పొందింది. పోస్టర్లు, చొక్కాలు, మోటారు సైకిల్ అలంకరణలు ఒకటేమిటి, ఎక్కడ చూసినా 'చే' ఛాయా

చిత్రమే. అర్జెంటీనా ఫుట్‌బాల్ ఆటగాడు మారడోనా అయితే తన జబ్బల మీద 'చే' మొహాన్ని పచ్చబొట్టుగా పొడిపించుకున్నాడు. ప్రముఖ స్విట్జర్లాండ్ వాచ్ కంపెనీ స్వాచ్ ఎరుపురంగు నేపథ్యంలో చే మొహం ముద్రించిన 'డయల్'తో పరిమితి సంఖ్యలో గడియారాలు మార్కెట్‌లో విడుదల చేసింది. చే గురించి అనేక పుస్తకాల్లో వ్యాసాలు వచ్చాయి. పుస్తకాలకూ కొదవలేదు. ఫీచర్ ఫిల్మ్‌లు, డాక్యుమెంటరీలు లెక్కలేనన్ని రూపొందించారు. పింక్ – రాప్ గ్రూపు 'చే' బొమ్మను, అతని మాటలను తమ పాటల్లో ఉపయోగపెట్టుకున్నారు. ఇక నేటి యువతరం అయితే – చే జీవితం గురించి, మరణం గురించి ఏమీ తెలియకపోయినా నవ నవోన్మేషంగా అందంగా ఉండే చే బొమ్మ ముద్రించిన చొక్కాలు తొడగడం ఫ్యాషన్‌గా మలుచుకున్నారు. యథాతద వాదానికి యువత ధిక్కారంగా చే ఛాయాచిత్రాన్ని ఆరాధిస్తున్నారు.

1995 వరకూ చే మృతదేహాన్ని ఎక్కడ పూడ్చిపెట్టిందీ బొలీవియా అతి రహస్యంగా కాపాడుకుంటూ వచ్చింది. చివరకు ఒక మాజీ సైనికాధికారి ఈ రహస్యాన్ని బట్టబయలు చేసాడు. దీంతో చే మృతదేహం కోసం తీవ్రమైన అన్వేషణ కొనసాగింది. 1997 జూలై నెలలో ఆచూకీ దొరికింది. 'వీరోచిత గెరిల్లా యోధుడి ఆఖరి పోరాట దివసం'గా క్యూబా చే ను స్మరించే అక్టోబరు 8న 1997 నాటికి 30 వసంతాలు పూర్తయిన సందర్భంగా చే శరీరాన్ని సంపూర్ణ గౌరవ ప్రపత్తులతో ప్రత్యేకంగా నిర్మించిన ఒక 'మసూలియమ్'లో అతను, అతని సహచరుల జ్ఞాపకార్థం మరలా ఖననం గావించారు.

బొలీవియాలో చే డైరీలు రాజ్యానికి కీడు సంభవించకుండా కాపాడే తంత్రంగా భావించే స్థితి ఏర్పడింది. లాపాజ్‌లో దేశ అత్యున్నత సెంట్రల్ బ్యాంకు ఇనుప కొట్టంలో సాయుధ పహారా మధ్య 1986 నుండీ దాచిపెట్టి ఉంచారు. అంతకు ముందు ఈ డైరీలు కనిపించకుండా పోయాయి. బొలీవియా మాజీ నియంత జనరల్ లూయిస్ గార్షియామెజ్ విపరీతమైన లాభాలు పోగేసుకుందామనే దురాశతో వీటిని లండన్‌లోని 'సూత్‌బై'లో వేలం పాటకు పెట్టించాడు. బొలీవియా ప్రభుత్వ జోక్యంతో చే డైరీలు వేలం పాట నుండి తిరిగి సర్కారు చేతికి చేరాయి. 1980 నుండి దేశాన్ని పరిపాలించిన గార్షియామెజ్ ఇతరత్రా అనేక నేరాలతో పాటు సైనిక ప్రధాన కార్యాలయంలో భద్రపరిచిన చే డైరీలను కూడా దొంగతనం చేసాడని నేరపరిశోధకులు నిర్ధారించారు. న్యాయపరమైన

రాతకోతల మీదట "సూత్‌బై" ఆ డైరీలను బొలీవియా ప్రభుత్వానికి దాఖలు పరిచింది. అప్పటినుంచీ అవి సెంట్రల్ బ్యాంకులో భద్రపరిచారు. గార్షియామెజ్ దేశం విడిచి పారిపోయాడు. కొన్నేళ్ళు అతని కోసం వేట సాగింది. చివరకు మెక్సికోలో అరెస్టు చేసి బొలీవియాకు అప్పగించారు.

1995లో అతని మీద విచారణ పూర్తయి వేర్వేరు నేరాలకుగాను 30 సంవత్సరాల కారాగార శిక్ష పడింది. అదృష్టం తిరగబడింది అంటారే, అట్లా చే బొలీవియా గెరిల్లా దళంలో బతికి బట్టకట్టిన లయోల గుజ్‌మన్ అనే ఏకైక మహిళ గార్షియామెజ్ ఈ శిక్ష నుండి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్ళిపోవడానికి సాయపడింది.

బొలీవియాలో చేదు గతం ఇంకా వర్తమానాన్ని వెంటాడుతూనే వుంది. దేశ అంతర్గత వ్యవహారాల మాజీ మంత్రి ఆంటోనియో ఆర్గ్యుడాస్– చే డైరీలు తొలిసారిగా వెలుగు చూడడానికి సహకరించిన మనిషి – ఫిబ్రవరి 22, 2000 సంవత్సరం నాడు, సరిగ్గా చే డైరీల కొత్త ఎడిషను ముద్రణకు వెళ్ళే రోజునే దేశ రాజధాని లాపాజ్‌లో ఒక బాంబుదాడిలో మరణించాడు. ఆర్గ్యుడాస్ వెంట తీసుకు వెళ్తున్న బాంబు ప్రమాదవశాత్తూ పేలి అతను మరణించాడని బొలీవియా ప్రభుత్వం ప్రకటించింది. పోలీసుల సోదాలో ఆర్గ్యుడాస్ నివాసంలో ఆ అపార్ట్‌మెంట్ భవన సముదాయం మొత్తాన్ని కుప్పకూల్చేంత భారీ స్థాయిలో బాంబులు,ప్రేలుడు పదార్థాలు బయటపడ్డాయట కూడా. అంతకు ముందు లాపాజ్‌లో జరిగిన బాంబు ప్రేలుళ్ళ వెనక ఉన్నదీ ఇతనే అయి వుంటాడని సదరు సర్కారు వారి అనుమానం. అయితే అతని ఉద్దేశాలు ఏమిటనేవి నిర్ధారించలేదు. మొత్తానికి అతని మరణం ఒక మిస్టరీగా మారింది. ఇదే 'చే శాపం' అని చాలా మంది ప్రజలు భావించారు. అప్పటికే 'చే'ను బంధించి, హత్య కావించడంతో సంబంధం ఉన్న అనేక మంది అధికారులు ఇలాంటి హింసాత్మక మరణాల పాలవడంతో బొలీవియా ప్రజలలో 'చే' శాపం' అనే భావన బలీయంగా నాటుకుంది. ఫిబ్రవరి 24న లాపాజ్ నుండి వెలువడే దినపత్రిక లారేజాన్ ఆర్గ్యుడాస్ మరణవార్తకు ఉంచిన శీర్షిక ఇదీ – 'మరో విచిత్రమరణం' ప్రత్యక్షంగానో పరోక్షంగా చే తో తలపడిన వాళ్ళు స్వంత కత్తికే బలయిపోతారు అన్న నమ్మకం చరిత్రలో స్థిరపడిపోయేలా ఉంది.

* * *

చే డైరీ ఒక రకంగా చూస్తే పునరావృతమైన కథలా అనిపిస్తుంది. మరో విధంగా చూస్తే వ్యక్తిగత వైఫల్యమూ కనిపిస్తుంది. అంతా చేస్తే ఇది ఒక అసాధారణ మానవుడి అనుభవం, అందులోనే ఒక ద్వైదీ ప్రతిఫలనం, ఈ ప్రపంచాన్ని మార్చాలని ప్రయత్నిస్తూనే, తన మనుగడ కోసమూ పోరాటం సాగించి అంతిమంగా రెండింటా వైఫల్యం చెందిన విషాద అనుభవం ఇది. ఉదాత్త ఆశయాల కోసం మానవుడి గవేషణ భౌతిక ప్రపంచంలోని విషమ వాస్తవాల మధ్య ఉండే వైరుధ్యాలను చే డైరీ అత్యద్భుతంగా మనకు పట్టి ఇస్తుంది. చరిత్ర నిర్మాణం అనేది అతి అరుదుగా చోటు చేసుకుంటుంది. సర్వ సాధారణంగా స్వాభావికంగానే రూపుదిద్దుకుంటుంది. అది అదృష్టమా దురదృష్టమా, అందులో మానవ తప్పిదాల పాత్ర ఏమిటి అనేది కేవలం యాధృచ్ఛికమే.

ఇవాళ పర్వతారోహకుల, సముద్ర సాహస ప్రయాణీకుల ఆత్మకథలను ప్రపంచం ఎంతో ఆసక్తిగా చదువుతుంది. బొలీవియా డైరీ కూడా అటువంటి సాహసగాథ. లెక్కలేనన్ని అడ్డంకులు ఎదురయినా మానవ సంకల్పం కఠినాతి కఠినమైన మార్గంలో పయనానికి ఎంతటి ఆదరువుగా నిలుస్తుందో చే డైరీను చదివి మనం అర్థం చేసుకోవచ్చు. అయితే చే విషాదాంతం కూడా మనకు ఎందుకు ఉత్తేజం ఇస్తుందంటే ఏ ఆకాంక్షలతో చే బొలీవియాలో అడుగు పెట్టాడో ఆ ఆశయ సాధనలోనే తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసాడనే చారిత్రక సత్యం మనలను ముప్పిరి గొంటుంది.

# అవశ్య ఉపోద్ఘాతం

## ఫైడెల్ కాస్ట్రో

గెరిల్లా జీవితంలో రోజువారీ సంఘటనలను సూక్ష్మంగా తన వ్యక్తిగత డైరీలో రాసుకోవడం 'చే'కు ఉన్న అలవాట్లలో ఒకటి. దుర్గమ మార్గాల్లో దట్టమైన అడవుల్లో చే సహచరులు భుజాన వీపున వేలాడుతుండే ఆయుధాలు, మందుగుండు, పట్టాకత్తి తదితరాల బరువు మోతకి అలిసి కాసేపు దమ్ము పీల్చుకోవడానికి అగినప్పుడో, ఆ రోజుకి ప్రయాణం ఆపి తాత్కాలిక బస ఏర్పాటు చేసుకుని విశ్రాంతి తీసుకునేటప్పుడో చే ఒక నోట్సు పుస్తకం, పెన్నూ చేతబట్టుకుని కూచుని రాసుకుంటూ ఉండేవాడు. చిన్న చిన్న అక్షరాలు, డాక్టర్లకు అలవాటయిన అర్థంకాని గొలుసుకట్టు రాత అతనిది. ఆ తరువాత ఆ నోట్సు ఆధారంగా క్యూబా విప్లవ యుద్ధం తాలూకు అత్యద్భుతమైన చారిత్రక జ్ఞాపకాలను విప్లవాత్మక, ప్రభోదాత్మక, మానవీయ కోణంలో ఆవిష్కరించారు.

రోజువారీ ప్రధానమైన సంఘటనలను అక్షరబద్ధం చేసే చే అలవాటుకు మనం కృతజ్ఞతలు చెప్పుకోవాలి. బొలీవియాలో అతను గడిపిన వీరోచిత జీవితం తాలూకు విపులమైన, నికరమైన, వెలకట్టలేని సమాచారం మనకు అందించారు.

అయితే ఈ డైరీని ప్రచురించాలనే ఉద్దేశంతో రాయలేదు. క్రమం తప్పకుండా రాసుకున్న ఈ డైరీ ఆధారంగా జరిగిన పరిణామాలను అవలోకించడానికి, సాధారణ పరిస్థితులను తన దళాలను బేరీజు వెయ్యడానికి చే ప్రయత్నించేవాడు. అయితే ఈ డైరీల ద్వారా చే సునిశిత పరిశీలన, విశ్లేషణాత్మక దృక్పథం, కొండొకచో హాస్యచతురత మనకు బోధపడతాయి. ఎందుకనో ఇలా డైరీ రాసే అలవాటును చే మొదటి నుండి తుదివరకు చైతన్యవంతంగా కొనసాగించాడు.

సాయుధ పోరాటం మొదలైన క్లిష్టమైన తొలి నాళ్ళ నుండే, వెన్ను విరిగేంత శారీరక శ్రమ తరువాత, దళనాయకుడి బాధ్యతలతో డస్సిపోయి ఉన్నా కూడా విశ్రాంతి కోసం దొరికిన కొద్దిపాటి సమయంలోనే చే డైరీలో నోట్సు రాసుకోవడం చిన్నా చితకా విషయం కాదు. కఠినాతి కఠినమైన భౌతిక పరిస్థితుల మధ్య కూడా చే నోట్సు రాసుకునే తీరు అతని మనో నిబ్బరానికి, గుండె ధైర్యానికి ప్రతీకగా మనం చెప్పుకోవచ్చు.

బొలీవియా డైరీలో రోజువారీ సంఘటనల విశ్లేషణ ఉంది. తప్పొప్పులను ఎంచడం, విమర్శ, ఉన్నాయి. ఏ గెరిల్లా విప్లవ వీరుడుకైనా ఉండాల్సిన లక్షణం ఇది.

ఏ గెరిల్లా దళానికైనా తొలిదశలో కేంద్రంగా భాసించే కొద్దిమంది వ్యక్తులే ఆలంబనగా ఉంటారు. తీవ్రమైన అననుకూల పరిస్థితులు, బలం బలగాల రీత్యా శత్రువుదే పైచెయ్యిగా ఉండే స్థితిలో దళ నిర్వహణ పట్ల సునిశితమైన ఆత్మ విమర్శనా పూర్వక ధోరణి లోపిస్తే ఒక్కోసారి మొత్తం గెరిల్లా దళమే దెబ్బతిని పోయే ప్రమాదంలో పడిపోతుంది.  ఏమాత్రం పొరబాటు జరిగినా అందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. అందుకే దళ నాయకుడు సునిశిత దృక్పథం కలిగి ఉండాలి. ఎటువంటి ఘటన అయినా, అది ఎంత చిన్న విషయమైనా లెక్కలోకి తీసుకోదగ్గది కాదనుకునే అంశం అనుకున్నా సరే దాని నుండి దళ సభ్యులకు, కాబోయే గెరిల్లా దళ నాయకులకు తగిన గుణపాఠంగా నేర్పాలి.

గెరిల్లా శిక్షణ నిరంతరం గౌరవాన్ని, చైతన్యాన్ని ఆ మనిషిలో మరింతగా నింపాలని డిమాండు చేస్తుంటుంది. విప్లవ హృదయాల్ని ఎంత సున్నితంగా స్పందింప చెయ్యాలో "చే" గొప్పగా ఆకళింపు చేసుకున్నాడు. మార్కోస్ విషయమే తీసుకోండి. దళం నుండి అవమానకరమైన రీతిలో పంపించెయ్యాల్సి ఉంటుందని చే అనేక తడవలు హెచ్చరించాడు.  'అంతకన్నా తుపాకి గుండేసి నన్ను చంపెయ్యి' అని మార్కోస్ బదులిచ్చాడు. చివరకు మార్కోస్  వీరోచితంగా తన జీవితాన్ని అర్పించాడు. దళ సభ్యుల పట్ల చే అపార విశ్వాసాన్ని చూపించేవాడు, అయితే పోరాట కాలంలో ఏదో ఒక కారణాన అందరూ మార్కోస్ మాదిరి చివాట్లు తిన్నవాళ్ళే. దళ నాయకుడిగా చే తన అనుచరులతో అత్యంత మానవీయ, కామ్రేడరీ  దృక్పథంతో వ్యవహరిస్తూనే కష్టకాలంలో కూడా వీరి నుండి 'డిమాండింగ్'గా పని రాబట్టేవాడు.  దళ సభ్యుల పట్ల

కన్నా నాయకుడిగా తనపట్ల తానూ అంత కఠినంగా వ్యవహరించడంలో చే మహాదిట్ట. గెరిల్లాలకు ఉండాల్సిన నైతిక చైతన్యం పట్ల అత్యంత క్రమశిక్షణతో వ్యవహరిస్తూ దళ సభ్యులకు తాను ఒక ఉదాహరణగా నిలిచేవాడు.

బొలీవియా డైరీలో అనేక చోట్ల రెజీస్‌డెబ్రే అరెస్టు, ఖైదు పట్ల చే తీవ్రంగా స్పందించాడు. నిజానికి డెబ్రే గెరిల్లా దళంలోనే కొనసాగాలని అనుకున్నా అటువంటి విప్లవ రచయితను ఒక ప్రత్యేకమైన కార్యార్థం యూరప్‌కు పంపాడు. ఒక్క సందర్భంలో డెబ్రే వ్యవహార శైలి పట్ల సందేహాలు వ్యక్తం చేసిన 'చే' యే అతన్ని ప్రత్యేకమైన కార్యార్థం యూరప్‌కు పంపడం 'చే'లో ఉన్న అసంగత ఆలోచనా ధోరణిని ప్రతిఫలిస్తుంది.

అయితే డెబ్రే పాశవికశక్తుల చేతుల్లో ఖైదుకాబడి కూడా ఎంత నిబ్బరంగా, ధైర్యంగా వారిని ఎదుర్కొన్నాడో చే తెలుసుకునే అవకాశమే లేకుండా పోయింది. కానీ అక్టోబరు 3న, తన మరణానికి కొద్ది రోజుల ముందుగా, 'ఇవాళ డెబ్రీ ఇంటర్వ్యూ విన్నాం. ఒక విద్యార్థి రెచ్చగొడుతూ మాట్లాడినా చాలా నిబ్బరంగా ఎదుర్కొన్నాడు. అంటూ చే ఆ విప్లవ రచయిత గురించి చివరిసారిగా క్లుప్తంగా ఉదహరించాడు. ఈ డైరీలో క్యూబా విప్లవానికి, గెరిల్లా ఉద్యమానికి మధ్య ఉన్న సంబంధం గురించి చే తరచూ ప్రస్తావించాడు. దానికి తోడు చే డైరీలను తొలిగా మేమే అచ్చులోకి తీసుకువస్తున్నాం కాబట్టి దీన్ని 'కవ్వింపు చర్య'గా పెడర్థాలు తీసేవాళ్ళకూ కొదవలేదు. విప్లవానికి బద్ధ శత్రువులు, అమెరికన్ సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలు లాటిన్ అమెరికాలోని అవినీతిమయ దోపిడి ప్రభుత్వాలు ఇదొక సాకుగా తీసుకుని క్యూబాను మరింత దిగ్భంధనం చెయ్యడానికి, మరింత ఒంటరిపాటు చెయ్యడానికి, వీలైన రీతుల్లో దాడి చెయ్యడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తారు.

అట్లాంటి వాళ్ళంతా ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. ప్రపంచంలో ఇప్పటిదాకా అమెరికా సామ్రాజ్యవాదం ఎక్కడెక్కడో తలదూర్చి దుంప నాశనం చేసినా సభ్య ప్రపంచానికి ఏనాడూ క్షమాపణలు చెప్పింది లేదు. మా దేశంలో తొలి విప్లవాత్మక పరిపాలన ఆరంభమైన తొలిరోజు నుండే క్యూబా విప్లవాన్ని సర్వనాశనం చెయ్యడానికి నడుం బిగించింది ఈ అమెరికన్ సామ్రాజ్యవాదమే. ప్రపంచ పోలీసులా వ్యవహరిస్తుందని అందరికీ తెలుసు. ప్రతిఘాత విప్లవాలను ఒక క్రమ పద్ధతిలో ఎగదొయ్యడంలో,

అమానవీయమైన అత్యంత వెనుకబాటుతో కూడిన సామాజిక నిర్మాణాలకు ఊతం ఇచ్చి నిలబెట్టడంలో అమెరికన్ సామ్రాజ్యవాదానిది అందెవేసిన చెయ్యి అనేది జగద్విదితమే.

విప్లవోద్యమాలకు మా దేశం సంఘీభావంగా నిలవడాన్ని అడ్డం పెట్టుకుని 'యాంకీ'లు మా గడ్డమీదకి దండెత్తి రావచ్చుగాక, కాని వారి దురాక్రమణ ఆలోచనల వెనుక ఉన్న అసలు కారణాలు వేరు. సామాజిక విప్లవాలు ఎల్లెడలా ప్రభవిస్తున్న నేటి తాజా అంతర్జాతీయ పరిస్థితులలో అమెరికాకు ఒక సాకును కోరి అందిస్తున్నానేమో అన్న వ్యాకులతతో మేం అలాంటి సామాజిక విప్లవాలకు సంఘీభావం ప్రకటించకుండా ఉష్ట్రపక్షిలా ఇసుకలో తలదూర్చి దాగునే విధానాన్ని పాటించలేం గాక పాటించం. మా సంఘీభావాన్ని మేం తెలియచెప్పకుంటే అది ఈ ప్రపంచాన్ని తన బానిసగా చేసుకోవాలని, తన ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదానికి సహకరించడంగానే మేం భావిస్తాం.

మా దేశం అతి చిన్న దేశం. మిగిలిన ప్రపంచ దేశాలకు మాదిరిగానే వలసవాదం, సామ్రాజ్యవాదం శతాబ్దాల తరబడి దోచుకున్న మూలాన ఆర్థికంగా బలహీనపడిన అభివృద్ధి చెందని దేశం. అమెరికా తీరానికి తొంభై మైళ్ళ దూరంలో ఉంది. దాపునే అమెరికన్ నౌకాస్థావరం నెలకొని ఉన్నది. మా దేశం అభివృద్ధి కావడానికి ఆర్థికపరమైన,సామాజిక పరమైన అడ్డంకులు అనేకం ఉన్నాయి. విప్లవం విజయవంతం అయ్యాక మేం పెను ప్రమాదాల కాలం, చాలానే గడిపాం. అయినా మేం బలహీనపడలేదు. లొంగిపోలేదు.  అన్ని ఇక్కట్లనూ మా దేశం నికరమైన విప్లవకర మార్గాన్ని విడవకపోవడం ద్వారానే అధిగమించాం.

విప్లవాత్మక కోణం నుండి చూస్తే చే రాసిన ఈ బొలీవియా డైరీలను ప్రచురించడం వినా మాకు మరో మార్గం లేదు. ఈ డైరీలు ఆ దేశ నియంత బారియాంటోస్ చేతుల్లో పడ్డాయి. అక్కడ నుండి వీటి నకళ్ళు సిఐఎ, పెంటగాన్, అమెరికా ప్రభుత్వం చేతుల్లోకి చేరాయి. సిఐఎతో సత్సంబంధాలు ఉన్న జర్నలిస్టులు బొలీవియాలోనే ఈ రాత ప్రతి నకళ్ళను సంపాదించుకోగలిగారు. అయితే కనీసం ప్రస్తుతానికయినా వీటిని ప్రచురించం అనే హామీ మీదనే అనుకోండీ.

బారియాంటోస్ ప్రభుత్వము, ఆ దేశ అత్యున్నత మిలిటరీ అధికారులు ఈ డైరీలు వెలుగులోకి రాకూడదని కోరుకోవడానికి కారణాలు ఉన్నాయి. చేతివేళ్ళ మీద లెక్కింపతగిన అతికొద్ది మంది గెరిల్లాల చేతిలో పదేపదే పరాజయం చవిచూసి కొన్ని వారాల్లోనే 200 ఆయుధాలను గెరిల్లాలకు ధారబోసిన బొలీవియా సైన్యం అసమర్థత ఈ డైరీల మూలంగా బయటపడిపోతుంది.

బారియాంటోస్ పరిపాలనను చరిత్రలో తుడిచివెయ్యలేని ఒక మచ్చలా మిగిలిపోయేంత నిక్కచ్చిగా చే తన డైరీల్లో వివరించాడు.

సామ్రాజ్యవాదానికీ దాని కారణాలు దానికి ఉన్నాయి. చే, చే అసాధారణ ప్రతీకలు ప్రపంచ వ్యాప్తంగా నిరంతరం పెరుగుతూ వస్తున్నాయి. అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం చేసే పీడితులు, దోపిడికి గురికాబడే వాళ్ళు, విద్యార్థులు, మేధావులలో చే భావాలు, చే బొమ్మ చివరకు 'చే' అన్న ఒక్క అక్షరం అద్భుతమైన విశ్వాసాన్ని ఉత్సాహాన్ని నింపుతున్నాయి. అమెరికా సొంత గడ్డమీదే నీగ్రోల ఉద్యమం, అతివాద యువకులు చే ముఖచిత్రాన్ని తమ స్వంతం చేసుకున్నారు. వియత్నాం దురాక్రమణకు వ్యతిరేకంగా జరిగిన సమరశీల పౌరహక్కుల ఉద్యమాలు, ప్రదర్శనలలో 'చే' ఫోటోలనే ఉద్యమ చిహ్నాలుగా వాడుకున్నారు. చరిత్రలో ఒక మనిషి పేరు, బొమ్మ ప్రపంచ వ్యాప్తంగా ఇంతగా వినుతికెక్కిన దాఖలా ఇంకొకటి లేదు. కారణం స్పష్టమే. శ్రామికవర్గ అంతర్జాతీయతా స్ఫూర్తికోసం చే నిలబడ్డాడు. తన నిండు జీవితాన్ని ఫణంగా పెట్టాడు. స్వార్థరహితంగా, అంతర్జాతీయతా స్ఫూర్తితో పనిచేసాడు. ఆ స్ఫూర్తే ఇవాళ ప్రపంచాన్ని నడిపిస్తుంది. ఆ స్ఫూర్తే రేపటి ప్రపంచాన్ని పల్లవిస్తుంది.

అటు సామ్రాజ్యవాద దేశాల రాజధానుల నుండి ఇటు వలస పాలనలో మగ్గిపోయిన తృతీయ ప్రపంచ దేశాల వరకూ చే విశ్వవ్యాప్త విప్లవపోరాట చిహ్నంగా నిలిచాడు. అలాంటి చే జన్మించింది కూడా కొన్ని శతాబ్దాల పాటు వలస పాలన ఏలుబడిలో తీవ్రమైన దోపిడికి గురయిన, ఇప్పటికీ అమెరికన్ సామ్రాజ్యవాద నేరపూరిత దురహంకార దిగ్బంధనం కింద నలిగిపోతున్న ఒక చిన్న దేశంలోనే.

చే పేరు ప్రఖ్యాతులు ఇనుమడించడానికి దోహదం చేసే దేన్ని చూసినా ఇవాళ 'యాంకీ' సామ్రాజ్యవాదులు భయంతో వణికిపోతున్నారు. అందుకే ఈ డైరీలు అంటే

వారికి అంత ఉలికిపాటు. అదే ఈ రచనకు ఉన్న విలువ. ఒక అసాధారణ ధీమంతుడి సజీవ వ్యక్తీకరణ ఈ పుస్తకం. గెరిల్లా యోధులందరికీ విలువైన పాఠం. అందుకే ఈ పుస్తకానికి  పేలుడు పదార్థానికి ఉండే శక్తి అబ్బింది. కిరాయి హంతక సైన్యాలతో లాటిన్ అమెరికా ప్రజానీకాన్ని కట్టుబానిసలుగా చెయ్యడానికి ప్రయత్నిస్తున్న వారికి ఇది ఒక చెంపపెట్టు.  వాళ్ళు అనుకునేట్లు లాటిన్ అమెరికా ప్రజలు నిస్సహాయులు కాదని చెప్పే బలమైన సాధనం.  అందుకే ఈ పుస్తకం వెలుగులోకి రానీకుండా చెయ్యడానికి అమెరికన్ సామ్రాజ్యవాదులు నానా తంటాలు పడ్డారు.

అంతేకాదు తమని తాము విప్లవకారులమని అభివర్ణించుకునే అవకాశవాదులు, కుహనా కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు కూడా ఈ డైరీ అంటే పట్టనట్లే వ్యవహరించారు. ఇలాంటి వాళ్ళు 'చే'ను మాయదారి సాహసికుడిగా తృణీకరించారు, లేదంటే వట్టి ఆదర్శవాది అని చప్పరించేసారు. లాటిన్ అమెరికా ఖండంలోనే సాయుధ విప్లవ పోరాటానికి మంగళం పాడడానికి మాత్రమే చే మరణం తోడ్పడిందని తీర్పులూ చెప్పారు. 'గొప్ప సైద్ధాంతికవాది, గెరిల్లా యోధుడిగా అనుభవజ్ఞుడు అయిన చే గెరిల్లా పోరులో అసువులు బాయడం, బొలీవియా విముక్తి సాధించలేక పోవడం చే వైఫల్యాన్ని మనకు రుజువు చేస్తున్నాయి' అని వాదిస్తారు. ఇలాంటి అసంబద్ధవాదనలు ఎన్నో ముందుకు తెచ్చిన దిగజారుడు మనుషులు 'చే' మరణవార్త విని మీదు మిక్కిలి సంతోషించారు. ఈ విషయంలో సామ్రాజ్యవాదులకు, లాటిన్ అమెరికాలోని కులీన పాలక శక్తులకు – తమకు అట్టే తేడా లేనట్లు వ్యవహరించారు.

ఇలాంటి వాదనలు, కారణాలు ప్రచారంలోకి తెచ్చి తమ నాయకత్వాన్ని నిలబెట్టుకోవడానికి నయవంచనకు పూనుకున్నారు. ఒక్కోసారి వీళ్ళే ఎటువంటి తటపటాయింపులు లేకుండా సాయుధ పోరాటాన్ని బలపరుస్తూ మాట్లాడేవాళ్ళు. కాని నిజానికి అలాంటి గెరిల్లా ఉద్యమాలను మొగ్గలోనే చిదిమేసి విప్లవ కార్యక్రమాల్ని నీరుగార్చి ఆ స్థానంలో అసంబద్ధమైన రాజకీయ బేరసారాలు కుదుర్చుకుని తమ అసలు స్వరూపం తామంతట తామే బయట పెట్టుకునే వాళ్ళు. వీళ్ళందరికీ ప్రజల విముక్తి కోసం తాము పోరాటాలు ఎందుకు చెయ్యడం లేదో, అసలు పోరాట పంథానే ఎందుకు ఎంచుకోలేదో చెప్పకోవడానికి ఒక సాకు కావాలి. అందుకే వీళ్లు విప్లవాన్ని మాటలకే పరిమితం చేసారు.  అదొక పడికట్టు సిద్ధాంతం వాళ్ళకి. ప్రజలకు ఎలాంటి

సందేహమూ, చైతన్యమూ ఇవ్వాల్సిన అవసరం లేని ఒక మత్తుమందు గుళిక. ఇలాంటి వాళ్ళే ప్రజా పోరాటాలకు సాధనంగా వినియోగించాల్సిన సంస్థలను సంఘాలను దేశ విదేశీ పెట్టుబడిదారులతో లోపాయకారీ ఒప్పందాలు చేసుకునే చర్చా వేదికలుగా వుపయోగపెట్టుకున్నారు. దోపిడికి గురవుతున్న లాటిన్ అమెరికా ప్రజానీకం ప్రయోజనాలకు వ్యతిరేకమైన విధానాలకు కొమ్ముకాసారు.

విప్లవక్రమంలో మరణం సహజ సంభవం అని చే దృష్టి పథాన లేకపోలేదు. అంతమాత్రాన లాటిన్ అమెరికా దేశాల్లో విప్లవ ప్రస్థానం వెనుకపట్టు పట్టదని చే రేఖామాత్రంగా ఈ పుస్తకం చివరి పేజీల్లో స్పష్టం చెయ్యడానికి ప్రయత్నించాడు. తృతీయ ఖండ దేశాల సదస్సుకు పంపిన సందేశంలో కూడా అదే విషయం పేర్కొన్నాడు.

“మన కార్యాచరణ ప్రతీదీ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎక్కుబెట్టిన యుద్ధ సింహనాదమే... ఈ క్రమంలో మనల్ని మృత్యువు పలకరించవచ్చు. అయినా మనం దాన్ని స్వాగతిద్దాం. మన యుద్ధనాదం సోకాల్సిన చెవికి సోకి ఇంకో చెయ్యి ఇంకో చెయ్యి ఆయుధం అందుకోవడానికి ముందుకు వస్తుంది’ అన్నాడు చే.

తనను తాను విప్లవ సైనికుడిగా భావించాడు చే. బతకడం, చావడం గురించి ఏనాడూ కించిత్తు ఆందోళన పడలేదు. బొలీవియాలో గెరిల్లా సాయుధ పోరాటం విజయవంతం కాలేదు కాబట్టి చే నమ్మిన సిద్ధాంతాలు విఫలమైనట్లే అని సాధారణ సూత్రీకరణ చేసిన వాళ్ళు పొరబడినట్లే. అనేక మంది విప్లవయోధులు, విప్లవ తాత్విక చింతనాపరులూ ఆ మాటకొస్తే మార్క్సిజం సిద్ధాంతాన్ని ఈ ప్రపంచానికి అందించిన మార్క్స్ ఏంగెల్స్‌లు కూడా వాళ్ళ జీవిత కాలంలో వారు ఆశించిన సోషలిస్టు సమాజ ఆవిర్భావాన్ని చూడలేకపోయారు. కాబట్టి వీళ్ళు సిద్ధాంతాలు తప్పినట్లా?

క్యూబాలో విజయవంతమైన విప్లవానికి పునాది వందేళ్ళ క్రితం జోస్‌మార్టి, మేసియోలు మొదలు పెట్టిన పోరాటంలో ఉంది. క్యూబా స్వాతంత్ర్య సముపార్జన కోసం వాళ్ళు చేసిన పోరాటం అమెరికన్ సామ్రాజ్యవాదుల జోక్యంతో ముగిసింది. జోస్‌మార్టి, మేసియోల మరణంతో స్వాతంత్ర్య పోరాటం ఆగిపోయిందా? సోషలిస్టు విప్లవ అద్భుత సిద్ధాంతవేత్త జూలియో ఆంటోనియో మెల్లాను సామ్రాజ్యవాద ఏజెంట్లు

హత్య కావించడంతో ఈ పోరాటం నిలేయగలిగారా? లేదే. ఈ ఉదాత్త మహనీయుల ఆశయాలు, ఆలోచనలే క్యూబా విప్లవకారులకు స్ఫూర్తి నిచ్చాయి.

చే డైరీలను పరిశీలిస్తే విజయం సాధించడానికి ఎంతటి అనువైన అవకాశాలు ఉన్నాయో, గెరిల్లా పోరు ఎంతటి అసాధారణమైన ఉత్ప్రేరకంగా పనిచేస్తుందో మనకు బోధపడుతుంది. బొలీవియా నియంతృత్వ పాలన నానాటికీ ఎంత వేగంగా బలహీన పడుతుందనే వాస్తవాన్ని గుర్తించిన మీదటే చే 'ఈ ప్రభుత్వం ఎంత జోరున విచ్ఛిన్నం అంచుకు చేరుకుంటుందో, ఇలాంటప్పుడే మాకు మరో వందమంది గెరిల్లాలు లేని నిస్సహాయత తెలియవస్తుంది' అని డైరీలో రాసుకున్నాడు.

క్యూబా గెరిల్లా పోరాటంలో మా చిన్న దళం ఎన్నిమార్లు తుడిచిపెట్టుకుపోయే ప్రమాదాలను ఎదుర్కొందో 'చే' ఎరుగుదును. యుద్ధంలో ఏమైనా జరగవచ్చు. జయాపజయాలు ప్రధానంగా ఉన్న అవకాశాలు, పరిస్థితుల మీద ఆధారపడి ఉంటాయి. నిజానికి పరిస్థితులు కలిసిరాక అనుకోని ప్రమాదమే జరిగి ఉంటే దానిని ఆధారం చేసుకుని అసలు మేం ఎంచుకున్న మార్గమే తప్పని చెప్పే అధికారం గానీ, ఆ వంకన విప్లవాన్ని నీరసపరిచే ప్రజలను నిస్సహాయులుగా మార్చేందుకు గానీ ఎవరికన్నా హక్కు ఉంటుందా? విప్లవాలు అనేక మార్లు ఎదురుదెబ్బలు తిన్న చరిత్ర మనకు తెలుసు. క్యూబాలో మొంకాడా అనుభవం ఏం చెబుతుంది? ప్రజల సాయుధపోరాటం నిర్ణయాత్మక అంతిమ విజయం సాధించడానికి ఆరేళ్ళ ముందు ఒకసారి వైఫల్యాన్ని చవిచూసిందే కదా..

1953 జూలై 26న మొంకాడా కోటపై దాడి జరగడం తిరిగి 1956 డిసెంబరు నెలలో గ్రాన్మా నౌక మీద క్యూబా గడ్డ మీద గెరిల్లా దళం కాలుమోపడానికి మధ్య ఉన్న కాలంలో క్యూబాలో సాయుధ పోరాటం ఫలించే అవకాశం లేదని, అత్యాధునిక ఆయుధాలు కలిగిన సైన్యంతో అతి కొద్ది మంది గెరిల్లాలు తలపడి విజయం సాధించలేరని, గెరిల్లా వీరులు సాహసిక రాయుళ్ళు, ఆదర్శవాదులు, తప్పుడు అంచనాలతో బయల్దేరిన వాళ్ళనీ ఎంత మంది గట్టిగా నమ్మలేదూ? దీనికి తోడు 1956 డిసెంబరు 5 నాటికే ఈ గెరిల్లా దళం అనుభవలేమితో ఘోర పరాజయాన్ని చవిచూసి చెల్లాచెదురై పోయాక నిరాశావాదుల అభిప్రాయాలకు ఇంకెంత బలం

చిక్కిందనీ? అయినా ఇరవై ఐదు నెలల అతి స్వల్ప కాలంలో చెట్టుకొకరు పుట్టకొకరు అయిన గెరిల్లా దళం ఒక చోట కూడుకుని బలం సంతరించుకుంది. మరింత అనుభవం గడించి మరీ యావత్ సైన్యాన్ని మట్టి కరిపించలేదా?

పోరాటం చెయ్యకుండా ఉండడానికి ప్రతి సందర్భంలోనూ సవాలక్ష సాకులు ఉంటాయి వినసొంపుగా చెప్పడానికి. స్వాతంత్ర్యం సంపాదించ లేకపోవడానికి ఉపయోగపడే కచ్చితమైన మార్గం కూడా ఇదే. కానీ 'చే ఈ మార్గాన్ని ఎంచుకోలేదు. తను నమ్మిన ఆశయాల కోసం పోరాట మార్గాన్ని ఎంచుకున్నాడు. తన రక్తం, తన ప్రాణత్యాగంతో ఆ ఆశయాలకు మరింత బలం చేకూర్చాడు. చే ను విమర్శించ బట్టిన కుహనా విప్లవ విమర్శకులు, రాజకీయ పిరికితనంతో శాశ్వతంగా కార్యాచరణకు వెరపు చూపేవాళ్ళూ ఏదో ఒకరోజున వాళ్ళ జీవిత కాలంలోనే వాళ్ళ మూర్ఖత్వం బట్టబయలయ్యే రోజును చవిచూస్తారు.

లాటిన్ అమెరికా దేశాల్లో ఈ బాపతు విప్లవ జీవులు ప్రత్యక్షం కావడం నానాటికీ సర్వ సాధారణంగా మారుతుందనే అంశం కూడా ఈ డైరీలో మనం గమనించవచ్చు. బొలీవియా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి హోదాతో గణతికెక్కిన మారియా మాంజె గెరిల్లా దళం మీద రాజకీయ, సైనిక నాయకత్వం ఎవరికి ఉండాలి అనే అంశంమీద చే తో విభేదించాడు. 'ఈ విభేదంతో అవసరమైతే నేను పార్టీ పదవులకు రాజీనామా చేస్తాను' అనేంత వరకూ వెళ్ళాడు. అంటే ఒకసారి దక్కిన పార్టీ పదవి ఎల్లకాలం తనకు సంక్రమించిన చట్టబద్ధ హక్కుగా అతను భావించినట్లున్నాడు.

మారియా మాంజెకు ఎలాంటి గెరిల్లా యుద్ధ అనుభవం లేదు. తన జీవిత కాలంలో ఎలాంటి యుద్ధంలో తలపడలేదు. కమ్యూనిజం అంటే ఏమిటనే దాని గురించి అతను ఏర్పరుచుకున్న వ్యక్తిగత అభిప్రాయాలను తవిడనాడి ఉంటే ఇలాంటి సంకుచిత పిడివాద ధోరణికి అతను లోనయి ఉండేవాడు కాదు. ఇటువంటి పిడివాద సంకుచిత ధోరణులను విడనాడబట్టే క్యూబాలో మన పూర్వీకులు తొలి దశ స్వాతంత్ర్య సముపార్జనలో విజయం సాధించారు.

లాటిన్ అమెరికా ఖండంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ఎలా ఉండాలనే దాని మీద వాళ్ళ అవగాహన ఇలా ఉంటే ఇహ అలాంటి 'సోకాల్డ్' కమ్యూనిస్టు నాయకుల శ్రామికవర్గ అంతర్జాతీయతా అవగాహన ఎలా ఉంటుందో చెప్పనక్కరలేదు. ఇలాంటి ఆదిమ అవగాహన మూలంగానే రెడ్ ఇండియన్ తెగలను వలసవాదులు దురాక్రమణ పూరిత దండయాత్రలతో జయించగలిగారు.

ఇలాంటి కమ్యూనిస్టు పార్టీ 'బాస్' బొలీవియా విముక్తి కోసం పోరు సల్పడానికి ఆ గడ్డ మీద కాలుపెట్టిన గెరిల్లా దళాలు నిర్మించిన ఉద్యమానికి తనను నాయకుడిగా ప్రకటించాలని నిస్సిగ్గుగా కోరుకున్నాడు. ఒకనాడు బొలీవియా దేశానికి 'సుక్రే' చారిత్రక రాజధానిగా ఉండేది. 'సుక్రే' బొలీవియా దేశాన్ని స్పెయిన్ వలస పాలన నుండి విముక్తి చేసిన యోధుడు. జన్మత: 'సుక్రే' వెనిజులా దేశానికి చెందినవాడు. వలసపాలన నుండి విముక్తి పొందిన కొంత కాలానికే బొలీవియా తిరిగి స్పానియార్డ్‌ల వశం అయింది. మరలా 'సుక్రే' స్పానియార్డ్‌లతో తలపడి ఈ మారు బొలీవియాకు సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించేలా చూసాడు. వెనిజులా దేశానికి చెందినవాడయినా సుక్రే బొలీవియా విముక్తి కోసం ప్రదర్శించిన రాజకీయ, సైనిక, నిర్మాణపరమైన అవగాహన, విప్లవ తాత్విక చింతన కృత్రిమమైన, సంకుచితమైన దేశ భౌగోళిక సరిహద్దుల పరిమితులకు లోబడి ఉండని పరమసత్యం మారియామాంజె దృష్టిలో లేకపోవడం ఎంత విచారకరం.

బొలీవియా దేశానికి సముద్రం వైపుకు మార్గం లేదు. బొలీవియా విముక్తి నొందాలంటే ఇరుగు పొరుగు దేశాలలో విప్లవం విజయవంతం కావాల్సిన అవసరం ఇతరత్రా దేశాలకన్నా బొలీవియాకే ఎక్కువ. లాటిన్ అమెరికా ఖండ దేశాల విముక్తికి బొలీవియా భరింపనలవి కాని ఆటంకంగా మారకుండా ఉండాల్సిన అవసరమూ ఉంది. ఈ బలహీనతలను అధిగమించడానికి, బొలీవియా విముక్తి ఉద్యమాన్ని వేగవంతం చెయ్యడానికి 'చే' కు ఉన్న అపారమైన అనుభవం, వ్యక్తిగత ప్రతిష్ట, అతని శక్తియుక్తులను బొలీవియా కమ్యూనిస్టు పార్టీ అధిపతి సక్రమంగా ఉపయోగపెట్టుకోలేక పోయాడు.

నిజానికి బొలీవియా కమ్యూనిస్టు పార్టీతోనూ, అక్కడి మిలిటెంట్లతోనూ చే సంబంధ బాంధవ్యాలు ఏర్పరుచుకున్నాడు. దక్షిణ అమెరికా విప్లవోద్యమానికి సహకరించమని, చేయూత అందించాలని కోరాడు. పార్టీ అనుమతితో కొన్ని దళాలు

చే దళాలతో కలిసి పనిచేస్తూ అనేక కర్తవ్యాలు నెరవేర్చాయి. అయితే నాయకత్వ అంశం మీద బొలీవియా కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన చీలిక మూలంగా చే తో కలిసి పనిచేస్తున్న దళాలు తాము వేరే శిబిరంలో ఉన్నాం అనే పరిస్థితి సృష్టించాయి. అయితే చే తాను చేసే పోరాటం ఒక్క బొలీవియాకు మాత్రమే పరిమితం అయిందని అనుకోలేదు. విముక్తి కోసం సాగే ఈ విప్లవోద్యమం అనతి కాలంలోనే దక్షిణ అమెరికా దేశాలకు విస్తరిస్తుందనే ఆశాభావంతో ఉన్నాడు. ఒంటెత్తు పోకడలకు తావు లేకుండా బొలీవియాతో పాటు సామ్రాజ్యవాద పీడనలో నలిగిపోతున్న లాటిన్ అమెరికా దేశాల వాళ్ళందరినీ కలుపుకు పోవడమే చే ముందున్న లక్ష్యం. గెరిల్లా స్థావరాన్ని ఏర్పాటు చేసుకునే తొలిదశలో చే ప్రధానంగా ఆధారపడిన సాహస అజ్ఞాత దళం తరువాతి కాలంలో మారియా మాంజే పార్టీతోనే ఉండిపోయింది. నిజానికి ఈ దళమే గెరిల్లా స్థావరానికి తొలిగా మాంజేయే చేను ఆహ్వానించాడన్న విషయం మీద కినుక వహించింది. మాంజె పార్టీతో విభేదాల మూలంగా మరో పార్టీని ఏర్పాటు చేసుకోవడానికి గని కార్మికుల నాయకుడిగా ఉన్న మోజెస్ గువేరాను చే ఆహ్వానించాడు. అయితే ఆస్కార్ జమోరాతో ఏర్పడిన అభిప్రాయ భేదాలతో మోజెస్ గువేరా తన ప్రయత్నాలు విరమించుకున్నాడు. చే తో కలిసి బొలీవియాలో గెరిల్లా యుద్ధ తంత్రాన్ని నడిపించడానికి ముందుకు వచ్చిన జమోరా తీరా కార్యరంగంలోకి దూకాల్సి వచ్చేసరికి పిరికివాడిలా కాళ్ళు తొక్కుకుని చివరికి రంగంలోంచి తప్పుకున్నాడు. కాని చే బొలీవియాకు రావడానికి మునుపే గెరిల్లా పోరాటానికి సిద్ధమైన మోజెస్ గువేరా ఏ మాత్రం ఊగిసలాటలకు తావు లేకుండా 'చే' తో చేతులు కలిపాడు. తన మద్దతు అందించాడు. విప్లవం కోసం వీరోచితంగా తన జీవితాన్ని తృణప్రాయంగా అర్పించాడు.

అలాగే మాంజే పార్టీకు విధేయులుగా ఉన్న బొలీవియా గెరిల్లా యోధులు కూడా అదే బాటన నడిచారు. ఇంతి, కోకో, పెరిడోలు మాంజే నుండి విడగొట్టుకుని 'చే'కు బలమైన మద్దతు దారులుగా మారిపోయారు. గెరిల్లా దాడులలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. అయితే మాంజే వీటిని ఇచ్చగించలేదు. ఉద్యమాన్ని నీరుకార్చే ప్రయత్నాలు మొదలుపెట్టాడు. కమ్యూనిస్టు ఉద్యమంలో ఉండి మెరికల్లా శిక్షణ పొందిన మిలిటెంట్లను దళంలో చేరనీకుండా నిరుత్సాహపరిచాడు. విప్లవ చక్రంలో అన్ని విధాలా సాయుధ పోరాటానికి సిద్ధం అయిన వారిని పైకి రానీకుండా మాంజే

లాంటి అసమర్థ నాయకులు, కుహనావాదులు, తిమ్మిని బమ్మిని చేసే వాళ్ళు ఎంతటి నేరపూరితంగా వ్యవహరిస్తారనే దానికి ఇదొక ఉదాహరణ.

చే ఏనాడూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం-పదవుల కోసం, హోదాకోసం, పేరు కోసం-పాకులాడలేదు. లాటిన్ అమెరికా దేశాల్లో నెలకొని ఉన్న ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితుల దృష్ట్యా ఆయా దేశాల్లోని ప్రజల విముక్తి కోసం విప్లవ సాయుధ గెరిల్లా పోరాటం ఒక్కటే మార్గమని చే బలంగా విశ్వసించాడు. గెరిల్లా ఉద్యమానికి సైనిక-రాజకీయ నాయకత్వం ఒకటిగా ఉండాలని, అలాంటి ఐక్య నాయకత్వం నగరాల్లో ఉండే బ్యూరోక్రటిక్ ఆఫీసుల నుండి గాక గెరిల్లా దళం నుండే రావాలని చే గట్టిగా నమ్మాడు. ఈ విషయంలో రాజీపడే పరిస్థితే ఉండదనే కృత నిశ్చయం ప్రదర్శించాడు. గెరిల్లా యుద్ధ తంత్రానికి కేంద్ర బిందువుగా ఉండాల్సిన నాయకత్వాన్ని సంకుచిత, పిడివాద ఆలోచనా ధోరణులు ఉన్న వారి చేతుల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ పోకూడదనే పట్టుదలతో ఉన్నాడు. ఎందుకంటే ఈ పోరాటం దక్షిణ అమెరికా ఖండమంతటికి వ్యాప్తి చెందాల్సిన అంతిమ లక్ష్యంతో మొదలయిందని చే భావించారు. వివిధ లాటిన్ అమెరికా దేశాల్లోని విప్లవ శక్తులను కూడా పిడివాదం కలుషితం చేసేస్తుందని, పిడివాదానికి మించిన అసంబద్ధ ప్రతీఘాత, ప్రమాదకర ధోరణి ఇంకొకటి ఉండదని చే అభిప్రాయపడ్డాడు. అందుకే ఈ తృతీయ ఖండ దేశాల సదస్సుకు పంపిన సందేశంలో" మనం నికార్సయిన శ్రామికవర్గ అంతర్జాతీయతను అలవరుచుకుందాం. మానవత్వాన్ని పరిమళింపచేసే ఉదాత్త లక్ష్యంతోనే ఏజెండా కింద అయినా మనం పోరాటం చెయ్యాలి. అది అమెరికన్ అవనీండి, ఐరోపా వాసులు అవనీండి, ఆఫ్రికన్ కానీండి, ఆసియా దేశస్థులు కానీండి ఒక వియత్నాం కోసం, వెనిజులా కోసం, గ్వాటిమాలా కోసం, లావోస్ కోసం, గినియా కోసం, కొలంబియా, బొలీవియా, బ్రెజిల్- ఎక్కడ సాయుధ పోరాటం జరుగుతుంటే ఆ దేశం ఎర్ర జెండా కోసం మరణించడం అత్యంత అరుదైన గౌరవంగా, అవసరంగా మనం భావించాలి" అని అనగలిగాడు. ఏ దేశం జెండా కోసం తన నెత్తురు చిందించిన మనిషి ఆ దేశ పౌరుడు కానప్పటికీ అతను చిందించిన నెత్తురు బ్రతికి ఉన్న వాళ్లందరికీ ఒక అనుభవాన్ని అందిస్తుంది. తన దేశం విముక్తి పోరాటానికి కూడా అన్య దేశస్తులు తమ రక్తం చిందించాలనే పాఠం నేర్పుతుంది. ఇలా ఏ దేశం అయితే విముక్తి పోరాటంలో విజయం సాధిస్తుంది. ఆ దేశం మిగిలిన దేశాలు విముక్తి పోరాటానికి ఓ సందేశం అవుతుంది" అన్నాడు చే.

గెరిల్లా సాయుధ పోరాటాన్ని పెంపొందించేందుకు వివిధ లాటిన్ అమెరికా దేశాల నుండి యోధులు ముందుకు రావాలని, బొలీవియా గెరిల్లా దళం అలాంటి యోధులకు విప్లవ పాఠశాలగా పని చెయ్యాలని, దాడులు నేర్పాలని చే అభిలషించాడు. ఈ కర్తవ్యం నెరవేర్చుడానికి బొలీవియా వాసులతో పాటు దళానికి కేంద్రకంగా పనిచెయ్యడానికి అనుభవజ్ఞులైన గెరిల్లాలు కావాల్సి వచ్చింది. క్యూబా విప్లవ సాయుధ పోరాటంలో సియర్రా మాయెాస్ట్రా దగ్గర తనతో కలిసి పనిచేసిన కామ్రేడ్స్ ఈ బాధ్యతలు తీసుకోవడానికి ముందుకు వస్తే బావుండని ఆశించాడు. వాళ్ళ నడవడిక, ధైర్యసాహసాలు, త్యాగనిరతి – ఇవన్నీ చే కు తెలుసు. చే ఆశలను, ఆకాంక్షలను ఆ కామ్రేడ్స్ వమ్ము చెయ్యలేదు.

బొలీవియా సాయుధ ఆందోళనా కార్యక్రమంలో ఏనాడూ చే తన సహన శీలతను, యుక్తిని, ప్రతికూల పరిస్థితులలో కూడా కలత చెందని ధోరణిని ఈషణ్మాత్రం కోల్పోలేదు. చే లో ఉన్న అద్భుతమైన గుణాలు ఇవి. తన లక్ష్యం యొక్క ప్రాధాన్యత ఏమిటో గుర్తెరిగిన వాడు కాబట్టే పొరపాట్లకు తావీయని బాధ్యతాయుతమైన వైఖరితో చే వ్యవహరించాడు. గెరిల్లా దళం లెక్కలేని తనంగా వ్యవహరించిన ప్రతి సందర్భంలోనూ తమ వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని ఆ పొరబాట్లను సరిదిద్దాడు. అలాంటి దృష్టాంతాలను ఈ డైరీలో పొందుపరిచాడు.

విలువైన సభ్యులు ఉన్న పోరాట వీరుల దళంతో సంబంధాలు తెగిపోవడం, కొంత మంది సభ్యులు జబ్బుపడడం, ఇంకొంత మంది జబ్బుతో తీసుకుని తేరుకుంటున్న దశలో ఉండడం వంటి అనేక ప్రతికూల పరిస్థితులను చే అనూహ్యంగా అధిగమించాడు. తప్పిపోయిన దళం కొద్ది రోజులలో కలిసే అవకాశం ఉందని తొలుత భావించినా కొన్ని నెలల పాటు ఆచూకీ లేకుండా పోయింది. కాకులు దూరని కీకారణ్యంలో, దుర్గమ మార్గాల్లో ఆ దళం ఆచూకీ కోసం చే విపరీతంగా శ్రమించాడు. అదే సమయంలో ఆస్థమా జబ్బు ఉధృతమయింది. సాధారణమైన మందులు వాడితే నియంత్రణలో ఉండే ఆస్థమా, మందులు దొరకని పరిస్థితులలో చే ను నిర్దాక్షిణ్యంగా వేధించింది. గెరిల్లాలు చాలా తెలివిగా దాచిపెట్టిన మందుల ఆచూకీ కనిపెట్టిన శత్రువులు వాటిని చేజిక్కించుకొన్నారు. ఫలితంగా పోరాటం మీద ప్రతికూల ప్రభావం పడింది. దీనికి తోడు ఆగస్టు నాటికి, ఆచూకీ లేకుండా దళం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది.

శారీరకంగా కృశించినా చే మాత్రం ఉక్కు దృఢ సంకల్పంతో దాని ప్రభావం తన నైతిక స్థైర్యం మీదగాని, పోరాట పంథామీద కాని పడకుండా నిబ్బరించుకున్నాడు.

చే కు అనేక సందర్భాల్లో బొలీవియా రైతులు తారసపడ్డారు. అయితే వాళ్ళు అపనమ్మకంతో వ్యవహరించిన తీరును చే ఏనాడూ పొరబాటుగా అర్థం చేసుకోలేదు. ఎందుకంటే అంతకు ముందే అనేక సందర్భాలలో ఆ రైతులతో ఉన్న అనుబంధం రీత్యా వారి మానసిక పరిస్థితి ఎలా ఉంటుంది అనేది చే గమనంలో ఉంది. ఆ రైతుల మనసులు గెలిచి  తన దారికి తెచ్చుకోవడం అనేది సుదీర్ఘమైన, క్లిష్టతరమైన వ్యవహారం అనీ దానికి ఎంతో ఓర్పు కావాలని చే గుర్తించాడు. ఇందులో అపజయం ఎదురవుతుందని తుదిదాకా తను ఏనాడూ భావించలేదు.

మొత్తం పరిణామాలను మనం ఒక వరుస క్రమంలో పరిశీలిస్తే సెప్టెంబరు నెలలో, అంటే చే మరణించడానికి కొన్ని వారాల ముందుగా, దళంలో సభ్యుల సంఖ్య అమాంతం పడిపోయినా ఉద్యమాన్ని అభివృద్ధి చెయ్యాలనే తపనను మాత్రం గెరిల్లాలు కోల్పోలేదు. బొలీవియా నుండి దళంలో చేరిన క్యాడరు మరీ ముఖ్యంగా ఇంతి, కోకో పెరీడో వంటివారు భావి నాయకులు అయ్యే సత్తాను, ప్రతిభను కనబరిచారు. చే దళం మీద హిస్యరాస్ దగ్గర మెరుపు దాడిచేసి సైనిక బలగాలు సాధించిన విజయం గెరిల్లా సాయుధ పోరాటానికి కోలుకోలేని నష్టం కలిగించింది. ఈ దాడిలో అడ్వాన్సు పార్టీ దాదాపుగా తుడిచిపెట్టుకుపోయింది. దళానికి చాలా నష్టం కలిగించింది. రాజకీయంగా చైతన్యవంతమైన రైతాంగం ఉన్న మరో ప్రాంతానికి పట్టపగలే పయనం కట్టడం మూలంగా ఈ నష్టం జరిగింది. ఈ ఉద్దేశం గురించి చే తన డైరీలో పేర్కొనలేదు కానీ బతికి బయటపడ్డ దళ సభ్యులు తమ లక్ష్యం ఏమిటో వివరించారు. తాము ఎరగని కొత్త ప్రదేశంలో, తరచూ స్థానిక ప్రజలకు తారసపడుతూ ఒకే తోవ వెంట రోజుల తరబడి సాగుతూ అదీ పట్టపగటిపూట ముందుకు సాగాలను కోవడమే ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది.  దారిలో సైనిక బలగాలు ఎక్కడైనా తారసపడే అవకాశం ఉంది. ఈ విషయం తెలిసి కూడా శారీరకంగా తీవ్రమైన అశక్తుడిగా మారిన డాక్టరుకు ఏదో ఒక మేలు చేయ్యాలనే తలంపుతో 'చే' ఆ'రిస్కు' తీసుకున్నాడనిపిస్తుంది.

తమపై మెరుపుదాడి జరగడానికి ఒక రోజు ముందున డైరీలో చే ఇలా రాసాడు – "మేం పూజియో చేరుకున్నాం. అయితే అక్కడ అంతకు ముందు రోజున మమ్మల్ని చూసిన జనాలు అక్కడక్కడా తారసపడ్డారు. అంటే మా గురించి సమాచారం

నోటిమాటగా అలా పాకిపోయింది". "కంచరగాడిదలను వెంటేసుకుని నడక సాగించడం ప్రమాదమే. కానీ డాక్టరు మరీ బలహీనంగా ఉన్నందున ఉన్నంతలో అతనికి సౌకర్యంగా ఉంటుంది కాబట్టి తప్పట్లేదు"

ఆ మరుసటి రోజు పేజీలో ఇలా రాసాడు – "మధ్యాహ్నం ఒంటిగంటకు అడ్వాన్సు పార్టీ బయల్దేరి జిగ్లుయె చేరడానికి ప్రయత్నించింది. డాక్టరు గురించి, కంచరగాడిదల గురించి ఇక్కడ ఏదో ఒక నిర్ణయం తీసుకోవచ్చు అనుకుంది". అంటే జబ్బు పడిన మనిషి సంగతి ఏమిటో తేల్చుకున్నాక ఈ మార్గాన్ని వదలిపెట్టాలనే ముందస్థు జాగ్రత్త ఆలోచన చే మదిలో ఉంది అని మనకు అర్థం అవుతుంది. అయితే జగ్లుయె చేరుకోవడానికి మునుపే అడ్వాన్సు పార్టీ సైనిక బలగాల మెరుపుదాడికి బలయింది. దళానికి కోలుకోలేని నష్టం వాటిల్లింది.

ఆ తరువాత కొన్ని రోజులకే వైయురో నదీ ఒంపు దగ్గర చే అంతిమ పోరాటం చేసాడు.

కొద్దిమందే అయినా ఈ విప్లవకారులు ప్రగాఢమైన ప్రభావాన్ని వదిలి వెళ్ళారు. అత్యంత అననుకూల పరిస్థితులలో కూడా మరపురాని వీరోచిత వారసత్వాన్ని మనకు అందించిపోయారు. మహోన్నత శిఖరం వంటి లక్ష్యాన్ని పరిపూర్తి చేసే బాధ్యతను అతికొద్ది మందిగా ఉన్న ఈ విప్లవవీరులు తమ భుజస్కందాలకు ఎత్తుకుని చరిత్ర సృష్టించారు. వారి అచంచల విశ్వాసం, పురిపూర్ణ నిశ్చయం లాటిన్ అమెరికా ఖండంలో విప్లవ క్రమాన్ని ముందుకు తీసుకుపోతుంది. లక్ష్యసాధన పట్ల వాళ్ళకు ఉన్న అపారమైన నమ్మకం, ధృఢ నిర్ణయం వారి వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవడానికి మనకు తోడ్పడతాయి.

"ఈ రకమైన పోరాట పంథా మనల్ని మనం విప్లవకారులుగా తీర్చిదిద్దుకునే అవకాశాన్ని ఇచ్చింది. అత్యున్నత మానవుడిగా ఎదగడానికి, నికరమైన గెరిల్లాగా రూపొందడానికి అవకాశం ఇచ్చింది. ఈ రెండు లక్ష్యాలనూ అందుకోలేని వాళ్ళు పోరాటం నుండి వైదొలగవచ్చు" అని అంటాడు చే తనతో చేరవచ్చిన బొలీవియా సభ్యులతో.

కడదాకా చే తో ఈ పోరాటంలో నిలిచిన వాళ్ళందరూ ఆ రెండు బిరుదులకు అర్హులే. లాటిన్ అమెరికా ఖండం విప్లవ రూపాంతరీకరణ చెందడమనే సంక్లిష్ట లక్ష్య సాధనకు అదిగో అలాంటి పరిపూర్ణ విప్లవకారుల అవసరం ఈనాడు ఎంతైనా ఉంది.

తొలి స్వాతంత్ర్య సంగ్రామంలో మన పూర్వీకులు తలపడిన శత్రువు క్షీణదశలో ఉన్న వలసాధిపత్యం మాత్రమే. అయితే ఇవాళ విప్లవకారులు తలపడాల్సిన శత్రువు ఆషామాషీగా లేదు. సామ్రాజ్యవాద కూటమికి శక్తివంతమైన పునాదిగా నిలిచిన వాడు. పారిశ్రామికంగా – సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందినవాడు. గతంలో బొలీవియా ప్రజానీకం నియంత సైనికశక్తుల పాలనను అణగదొక్కారు. అయితే ప్రజాశత్రువు, సామ్రాజ్యవాద శక్తీ అయిన అమెరికన్ పాలకులు బొలీవియా సైనిక నియంతలను పునఃసమీకరించి సైనిక పరంగా వాళ్ళకు కావల్సిన హంగూ, బలాలను సమకూర్చింది. ఈ దఫా కూడా అలానే గెరిల్లాలకు వ్యతిరేకంగా పోరాడడానికి తక్షణమే బొలీవియా నియంతకు సైనిక సలహాదారులను, ఆయుధాలను సమకూర్చింది. ఇక్కడనే కాదు లాటిన్ అమెరికా ఖండ దేశాల్లో ఎక్కడ ప్రజలను అణిచి ఉంచడానికయినా కావల్సిన సాంకేతిక,సైనిక సహాయాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదులు అందిస్తూనే ఉన్నారు. ఇది చాలదన్నట్లు ఈ తడవ ప్రత్యక్ష జోక్యానికి పూనుకుంది. శాంటాడోమింగ్‌లో జరిగినట్లే ఇక్కడకీ నేరుగా సైనిక  దళాలను పంపింది.

ఇలాంటి శత్రువుతో పోరుకు తలపడాలంటే చే చెప్పిన లక్షణాలున్న విప్లవకారులు కావాలి. అలాంటి విప్లవకారులు లేకుండా, మార్గమధ్యంలో ఎదురయ్యే విస్తారమైన అడ్డంకులను ఎదుర్కొనే మానసిక స్థైర్యం లేకుండా, ఏక్షణాన అయినా ప్రాణాలను తృణప్రాయంగా త్యజించే సంసిద్ధత లేకుండా, తాము ఎంచుకున్న లక్ష్యం పట్ల ప్రగాఢ విశ్వాసం లేకుండా, ప్రజల అంతిమ బలం మీద నమ్మకం లేకుండా ప్రపంచంలో ఏ మూలకు అయినా తన సైనిక, సాంకేతిక అర్థబలాన్ని దించేసే అమెరికన్ సామ్రాజ్యవాదంతో తలపడకుండా లాటిన్ అమెరికా ఖండంలో ప్రజా విముక్తిని సాధించడం అసాధ్యం.

ఉత్తర అమెరికా ప్రజానీకం కూడా ఇప్పుడిప్పుడే తమను పరిపాలిస్తున్న రాక్షస రాజకీయ నిర్మాణం గురించి అర్థం చేసుకుంటున్నారు. రెండు వందల ఏళ్ళ క్రితం జాతి నిర్మాతలు ఆవిష్కరించిన బూర్జువా 'ఆదర్శగణరాజ్యం'కు భిన్నమైన పాలనలో ఉన్నాం అని గ్రహిస్తున్నారు. అమెరికన్ పాలకులు సాగిస్తున్న దురాక్రమణ పూరిత యుద్ధాలు, రాజకీయ నేరాలు, జాత్యాహంకార ధోరణులు మూలంగా, నైతిక బర్బరత్వం, అసహేతుకత, అమానవీయ – క్రూర పరిపాలనా వ్యవస్థ మూలంగా బలి అవుతున్న వారి పౌరుల సంఖ్య నానాటికీ పెరిగి పోవడం చూసి తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు.

మూడోవంతు ప్రపంచం ఆకలితో అలమటించి పోతూ, అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయిన నేపథ్యంలో ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, మానవ వనరులని సైనిక యంత్రాంగాన్ని పెంచి పోషించడానికి ఖర్చు చెయ్యడం చూస్తూ, మానవులను యంత్రాలకు నట్లుగా మారుస్తున్న ఉత్పత్తి విధానం చూస్తూ అసహనానికి లోనవుతున్నారు.

అయితే లాటిన్ అమెరికాలో విప్లవం జయిస్తేనే అమెరికన్ ప్రజానీకం సామ్రాజ్యవాదంతో అమీతుమీ తేల్చుకోగలుగుతారు. అలాగే అమెరికా అనుసరిస్తున్న సామ్రాజ్యవాద విధానాలకు ప్రజల నుండి ఏ మేరకు తిరుగుబాటు ఎదురవుతుందనే అంశం మీద లాటిన్ అమెరికాలో విప్లవశక్తులకు నిర్ణయాత్మక దశ ఒనగూడుతుంది.

అమెరికా ఖండంలోని ఈ అర్ధభూగోళంలో విప్లవం విజయం సాధించకపోతే ఇప్పటికీ ఈ రెండు అర్థ ఖండాల మధ్య ఉన్న అసమానతలు మరింత తీవ్రతరం అవుతాయి. అమెరికా ఖండంలోని ఈ రెండు అర్థభూగోళాల మధ్యన అసమానతలు ఈ శతాబ్దం తొలిపాదంలోనే మొదలయ్యాయి. అమెరికా శరవేగంగా పారిశ్రామికీకరణ చెందడంతో పాటు అదే వేగంతో, ఊపుతో దేశ సామాజిక – ఆర్థిక పరిణామ క్రమాన్నీ సామ్రాజ్యవాద ఆకాంక్షలకు అనుగుణంగా పెంపొందించారు. అదే సందర్భంలో అమెరికా ఖండంలోని బాల్కన్ దేశాలు స్తంభించిపోయిన అభివృద్ధితో బలహీనంగా తయారయ్యాయి. ఫ్యూడల్ శక్తులు, వాటికి వెన్నుదన్నుగా నిలిచిన ప్రతీప సైనిక బలగాలు పరిపాలనా పగ్గాలు చేజిక్కించుకున్నాయి. కేవలం ఇరవై ఏళ్ళలో ఈ అసమానతలు వందరెట్లు పెరిగాయి. ఈ అసమానతలు కేవలం ఆర్థిక, శాస్త్ర సాంకేతిక రంగాలలోనే కాదు రాజకీయ రంగంలో కూడా నెలకొన్నాయి.

ఈ ధోరణలు ఎల్లకాలం ఇలా సాగుతుంటే మనం ఇంకా ఇంకా పేదరికంలోకి కూరుకుపోతాం. బలహీనపడతాం. సామ్రాజ్యవాదశక్తుల మీద ఆధారపడడం మరింత పెరిగి తిరిగి బానిసత్వంలోకి జారిపోతాం. ఆఫ్రికా, ఆసియా ఖండాలలో అభివృద్ధికి నోచుకోని దేశాలన్నీ ఈ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి ఇవాళ.

పారిశ్రామికంగా అభివృద్ధి చెంది, ఉమ్మడి మార్కెట్లు శాస్త్ర సాంకేతిక సంస్థలు కలిగి ఉన్న ఐరోపా దేశాలే ఇవాళ ఎక్కడ వెనకబడిపోతావెూ, అమెరికన్ సామ్రాజ్యవాదానికి ఆర్థిక వలసలుగా మారిపోతావెూ అని ఆందోళనకు గురవుతున్నాయంటే లాటిన్ అమెరికా ప్రజానీకం భవిష్యత్తు ఏమిటో తలుచుకుంటేనే గుండె బేజారయిపోదూ.

ఉదారవాదులు, బూర్జువా సంస్కరణవాదులూ కుహనా విప్లవవాదులూ, కార్యాచరణకు వెన్నుచూపేవాళ్ళూ మన ప్రజల మీద నిర్ణయాత్మకంగా ప్రభావం చూపిస్తున్న ఇలాంటి అసమ పరిస్థితుల నుండి బయటపడడానికి ఎలాంటి పరిష్కారం చెబుతారు? వాళ్ళ దగ్గర నిజంగా ఏదైనా ప్రత్యామ్నాయాలు ఉంటే చెప్పమనండి చూద్దాం. ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక రంగాలలో శతాబ్దాల పాటు వెనుకబాటు తనంతో కునారిల్లుతున్న ఈ అర్ధ ప్రపంచం నైతికంగా భౌతికంగా సంపద్వంతం కావాలన్నా, మానవ వనరులు అభివృద్ధి చెందాలన్నా విప్లవం మినహా మరేం ప్రత్యామ్నాయం అర్జెంటీనా ఆ ఉదాత్త లక్ష్యాలను పరిపూర్తి చెయ్యగలదో చెప్పమనండి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే ఇప్పుడున్న లాటిన్ అమెరికా దేశాల వెనుకబాటుతనం విప్లవం మినహా మరే మార్గాన్ని ఎంచుకున్నాం అమెరికన్ బానిసత్వం వైపుకు నెట్టేస్తుంది. విప్లవం ఊసు లేకుండా నియంతలను, చౌకబారు రాజకీయ వేత్తలను, అమెరికన్ బహుళజాతి సంస్థల సేవకులను, వాళ్ళ యజమానులను, ప్రజలను పీడించుకుతినే పాలకులను ఈ లాటిన్ అమెరికా ఖండం నుండి తుడిచిపెట్టగలిగే మంత్రజాలం ఎవరి దగ్గరన్నా ఉన్నా వాళ్ళు చేతులెత్తవచ్చు – చే తో సవాలు చెయ్యవచ్చు. అలాంటి వాళ్ళు ఎవరన్నా ఉంటే ముందుకు రండి.

అయితే లాటిన్ అమెరికా దేశాల్లో ఉన్న 30 కోట్ల మంది ప్రజానీకానికి, అందునా అత్యంత పేద ప్రజానీకానికి ఆశావహమైన భవిష్యత్తును అందించే నిజాయితీతో కూడిన ప్రత్యామ్నాయాన్ని ఇప్పటి దాకా ఎవరూ ప్రతిపాదించలేదు. రాబోయే పాతికేళ్ళలో లాటిన్ అమెరికా జనాభా 60 కోట్లకు చేరుకుంటుంది. ఉదాత్తమైన జీవితం, సంస్కృతి–నాగరికతలతో గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు ఈ 60 కోట్ల మందికీ హక్కు వుంది. అలాంటి హక్కు సాధించిపెట్టడానికి తమ జీవితాలను ఫణంగా పెట్టిన చే, చే సహచరుల భావజాలానికి వ్యతిరేకంగా నోరెత్తకపోవడమే ఎవరికైనా శ్రేయస్కరం. ఎందుకంటే ఆ పిడికెడు మనుషులు లాటిన్ అమెరికా ఖండాన్ని విముక్తి చెయ్యాలనే ఉదాత్త లక్ష్యంతో చేసిన అసమాన త్యాగం వాళ్ళ చిత్తశుద్ధికి, వీరోచిత్వానికి, మానవ ఔన్నత్యానికి తార్కాణంగా నిలిచిపోతాయి. లాటిన్ అమెరికా ప్రజానీకం రాబోయే కాలంలో పోరాటాలలోకి వచ్చేందుకు ప్రేరణ కలిగించేదీ వాళ్ళే. ఏదో ఒకనాటికి ఏ పేదల, ఏ పీడితుల పక్షాన చే ఈ వీరోచిత కార్యం చేపట్టాడో వాళ్ళు చే పిలుపుకు చెవులారా స్పందిస్తారు. శాశ్వత విముక్తి సముపార్జించుకోవడానికి అనేకానేక హస్తాలు ఆయుధాలు అందుకుంటాయి.

అక్టోబరు 7వ తేదీన చే తన చివరి వాక్యాలు రాసాడు. మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఒక ఇరుకు నది ఒంపులో రాత్రి చీకటిపడేదాకా గడిపి, చీకటిలో తమను చుట్టుముట్టిన పద్మవ్యూహాన్ని ఛేదించుకుని బయట పడాలని తలపోసారు. ఈ లోగానే శత్రు సైనికుల భారీ బలగం ఒకటి వారికి తారసపడింది. అప్పటికే సంఖ్యాపరంగా దళం క్షీణించి ఉన్నా, శతృసైనికులు ముప్పేట దాడికి దిగినా మొక్కవోని ధైర్యంతో, పొద్దు కుంకేవరకూ వీరోచితంగా పోరాడారు. చే దరిదాపుల్లో 'పొజిషను' తీసుకుని పోరాడిన వారెవరూ బతికి బట్టకట్టలేదు. అనారోగ్యంతో తీసుకుంటున్న డాక్టరును, శారీరకంగా దుర్బలంగా ఉన్న మరో పెరూ దేశ దళసభ్యుడిని కాపాడుకుంటూ వెనక్కి తగ్గడానికి, వాళ్ళిద్దరినీ సురక్షిత ప్రాంతానికి చేర్చడానికి చే తుదికంటా విశ్వప్రయత్నం చేసాడు. చివరికి చే గాయపడ్డాడు. అయితే ఆ ముట్టడిలో డాక్టరు మరణించలేదు. కొన్ని రోజుల తరువాత వైయురో నదీ తీరంలో జరిగిన దాడిలో చనిపోయాడు. ఆ ప్రాంతం అంతా రాళ్ళూరప్పలూ ఎగుడు దిగుళ్ళతో ఉన్న మూలాని గెరిల్లా దళ సభ్యులు ఒకరినొకరు గుర్తించలేని పరిస్థితిలో చిక్కుకుపోయారు. ఇంతి, పెరెడో, మరికొంత మంది దళ సభ్యులు మాత్రం రెండో కొసన శతృసైనికులను కాచుకుంటూ చీకటి పడగానే తప్పించుకోగలిగారు. ముందస్థుగా కలవాలని అనుకున్న చోటుకు చేరుకున్నారు.

గాయపడిన తరువాత కూడా చే పోరాటం కొనసాగించాడు. అయితే శతృసైనికుల బుల్లెట్ల దెబ్బకి అతని ఎం–2 ఆయుధం బ్యారల్ దెబ్బతిని తుపాకి ఎందుకు పనికి రాకుండా పోవడంతో నిస్సహాయంగా మిగిలిపోయాడు. దాంతో 'చే'ను సజీవంగా బంధించడం శతృసైనికులకు సాధ్యపడింది. కాలికి తగిలిన గాయం మూలాన చే కదలలేని పరిస్థితిలో వారి చేతికి చిక్కాడు.

అతన్ని హిగ్యురాస్ ప్రాంతంలోని ఒక పల్లెకు తీసుకుపోయారు. దాదాపు మరో 24 గంటలు చే సజీవంగా ఉన్నాడు. పెదవి విప్పి ఒక్క ముక్క చెప్పలేదు. పైపెచ్చు తాగుబోతు ఆఫీసరు ఒకడ్ని 'చే' ఒక చేత్తో మొహం మీద చళ్ళున చరిచాడు.

బారియాంటోస్, ఒవాండా, ఇతర సైనిక ఉన్నతాధికారులు లాపాజ్‌లో భేటీ అయ్యారు. చే ను చంపించాలనే నిర్ణయానికి వచ్చారు. హిగ్యురాస్‌లోని పాడుపడిన స్కూల్లో చేను రహస్యంగా అంతం చేసిన తీరు ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. మేజర్ మిగ్యుయెల్ అయోరా, కల్నల్ ఆండ్రీస్ సెల్‌నిక్, అమెరికాలో సైనిక శిక్షణ పొందిన

ఇద్దరు రేంజర్లు దగ్గరుండి మరీ మారియో టెరావ్ అనే నాన్ – కమిషన్డ్ ఆఫీసరకు 'చే' ను చంపమని ఆజ్ఞలు ఇచ్చారు. టెరాన్ పూటుగా తాగి చేను బంధించిన స్కూలు గదిలోకి అడుగుపెట్టాడు కానీ దేనికో సతమతం అయిపోతా ఉన్నాడు. అప్పటికే అతను దళంలో బందీలుగా చిక్కిన ఒక బొలీవియా, ఒక పెరూ సభ్యులను కాల్చి చంపి మరీ లోపలికి వచ్చాడు. అతని ధోరణి చూసి చే నిబ్బరంగా 'భయపడకు. రా కాల్చి చంపు' అన్నాడు. దాంతో అతను బయటకు వెళ్ళిపోయాడు. సైనికాధికరులు టెరాన్‌కు మళ్ళీ ఆర్డరు వేసారు – చే ను కాల్చి చంపిరమ్మని. ఈసారి లోపలకి వచ్చిన టెరాన్ మిషన్‌గన్‌తో చే ను నడుం కింద భాగంలో కాల్చి చంపాడు. అప్పటికి కొన్ని గంటల ముందుగానే ఎదురు బొదురు కాల్పుల్లో చే మరణించాడనే అధికారిక కథనాలను చలామణిలో పెట్టారు.

అందుకే చంపేటప్పుడు గుండు గుండెలకో, తలకో గురిపెట్టకుండా జాగ్రత్తపడ్డారు. రక్తగాయాలతో మరణం అంచుకు చేరేలా అతి కిరాతకంగా వ్యవహరించి చివరకు ఎడమడొక్కలో పిస్టలుతో కాల్చిచంపారు. బొలీవియా సైనికులుగానీ, సైనికాధికారులుగానీ తమ చేతికి బంధీలుగా చిక్కినా చే ఇటువంటి కిరాతకానికి పాల్పడలేదు. దీన్నిబట్టే యుద్ధంలో కూడా శత్రువులకు చే ఎలాంటి గౌరవాన్ని ఇచ్చాడో మనం అర్థం చేసుకోవచ్చు.

బహుశా శత్రుసైనికుల చేతిలో బందీగా చిక్కి గడిపిన ఆ కొద్ది గంటలే చే జీవితంలోని అతి విషాద ఘడియలుగా చెప్పొచ్చు. అయినా ఆ విషాదాన్ని నిబ్బరంగా భరించిన మానసిక స్థైర్యం ఒక్క 'చే'కు మాత్రమే స్వంతం.

ఈ డైరీ మా చేతుల్లోకి ఎలా వచ్చి పడిందనే విషయాన్ని మాత్రం ప్రస్తుతానికి మేం వెల్లడించలేం. అయితే ఈ డైరీలకు గాను మేం పైసలు వెలకట్టాల్సిన అవసరం పడలేదని గర్వంగా చెప్పగలం. 1966 నవంబరు 7 నుండి 1967 అక్టోబరు 7 వరకు కాలక్రమంలో జరిగిన పరిణామాలన్నీ చే ఈ డైరీల్లో పొందుపరిచాడు. ఇందులో కొన్ని పేజీలు మా చేతికి ఇంకా చిక్కలేదు. అయితే ఆయా తేదీల్లో చెప్పుకోదగ్గ సంఘటనలు జరిగిన దాఖలా కూడా లేదు. ఆ పేజీలు లేకపోవడం మూలంగా ఈ డైరీలో ఉన్న విషయ ప్రాధాన్యతకు వచ్చిన లోటు కూడా ఏమీ లేదు.

మా చేతికి చిక్కిన డాక్యుమెంట్ల సాధికారత మీద మాకు ఎలాంటి సందేహం లేదు. అన్ని ఫొటోకాపీలనూ క్షుణ్ణంగా పరిశీలించాం. ఎంత చిన్న పొరబాటు అన్నా ఉందేమో, తేడా పాడాలు ఉన్నాయేమో అని జాగ్రత్తగా పరిశీలించి మా చేతికి చిక్కిన ఈ డైరీ నిజమైనదే అన్న నిర్ధారణకు వచ్చాం. గెరిల్లా దళంలో సజీవుడిగా ఉన్న మరొకసభ్యుడి డైరీతో ఈ డైరీని తేదీల వారీగా సరిపోల్చాం. దాంతో మా చేతికి చిక్కిన డైరీల ఫొటో కాపీలు నిజమైనవే అనేందుకు సాక్ష్యం కూడా దొరికింది.

బుల్లిబుల్లి అక్షరాలతో క్లిష్టమైన 'చే' చేతిరాతను పరిష్కరించడానికి చే అర్ధాంగి కామ్రేడ్ అలైడామార్చ్ విపరీతంగా శ్రమించింది.

ఈ డైరీ దాదాపు ఒకేసారి వివిధ దేశాల్లో ప్రచురితం అవుతుంది. ఫ్రాన్స్‌లో 'ఫ్రాంకోయిస్ మాస్పెరో' అనే ప్రచురణ సంస్థ, ఇటలీలో 'ఫెల్‌ట్రినెల్లీ', జర్మనీలో 'ట్రైకీంట్ వెర్లాగ్', అమెరికాలో 'రాంపార్ట్స్ మ్యాగ్‌జైన్' సంస్థలు ప్రచురిస్తున్నాయి. ఫ్రాన్స్‌లో 'స్పానిష్' ప్రతి, చిలీలో 'పంటీ' భాషలోనూ ఈ డైరీలు లభ్యమవుతాయి. ఇతర దేశాల్లో కూడా ఈ డైరీ వెలుగులోకి వస్తుంది.

***- 1968***

# బొలీవియా డైరీ

# నవంబరు 1966

**నవంబరు 7**

ఈ రోజు ఒక నూతన దశ ప్రారంభమయింది. రాత్రికల్లా మేము ఫార్మ్‌కు చేరుకున్నాము. కొచమాంబా మీదుగా రహస్యంగా వచ్చిన తర్వాత, పచుంగా నేను కాంటాక్టులు ఏర్పరుచుకున్నాము. రెండు జీపుల్లో రెండు రోజులపాటు ప్రయాణించాము.

ఫార్మ్ దగ్గరికి వచ్చిన తర్వాత జీపులను ఆపుచేసి, ఒక్కదానిలోనే ఇద్దరం ప్రయాణించాము. సమీపంలోని రైతు మమ్మల్ని అనుమానించకుండా అలా చేశాము. మా పని కొకాయిన్ తయారు చేయడం అని అతను గొణుగుతున్నాడు. ఆసక్తికరమైన వాస్తవం ఏమంటే, మా బృందంలో తుమాయిని కెమిస్ట్ అని నమ్మారు. రెండో ట్రిప్‌లో ఫార్మ్‌కు వెళుతున్నప్పుడు బిగోట్స్ అప్పుడే నేనెవరో తెలుసుకున్నాడు. దాదాపు లోయ అంచుకు జీపును తీసుకువెళ్లాడు. అక్కడ దాన్ని వదిలిపెట్టాము. మేము 20 కిలోమీటర్లు ప్రయాణించాము. అర్ధరాత్రికల్లా ఫార్మ్‌ను చేరుకున్నాము. అక్కడ పనిచేసే వారిలో ముగ్గురు పార్టీ సభ్యులు.

మాతో  పాటు పార్టీ ఏం చేస్తే అదిచేయడానికి బిగోట్స్ సిద్ధపడ్డాడు. కాని అతనికి మోంజె పట్ల విశ్వాసం ఉంది. ఆయన్ను గౌరవిస్తున్నట్లు, ఇష్టపడుతున్నట్లు అనిపించింది. రొడోల్ఫొ, కోకొ ఇద్దరు ఒకే దారిలో పోతున్నట్లు ఆయన భావిస్తున్నాడు. పోరాటానికి పార్టీ నిర్ణయించేలా మేము ప్రయత్నించాము. మాకు సహాయం చేయవలసిందిగా అతన్ని కోరాము. బల్గేరియాలో ఉన్న మోంజె తిరిగి వచ్చేవరకు మా గురించి తెలియ చేయవద్దని చెప్పాము. అతను ఈ రెండింటికి అంగీకరించాడు.

**నవంబరు 8**

పగలు పూట మేము ఇంటికి 100 మీటర్ల దూరంలో, వాగుపక్కన ఉన్న గుబురు చెట్లలో గడిపాము. మామీద ఒక రకమైన యగువాస దాడి చేసింది. అది

కుట్టనప్పటికీ చాల ఇబ్బంది కలుగచేసింది. యుగువాస, గాల్‌మిడ్జ్, మారిగఫ్, దోమలు, కాటిల్‌టిక్ కీటకాలు మాకు తారసపడ్డాయి.

అర్గనారజ్ సహాయంతో బిగోట్స్ జీపును మళ్లీ రోడ్డెక్కించాడు. పందులు, కోళ్లు లాంటి కొన్ని సరుకులు కొనుగోలు చేయడానికి అతడు ఏర్పాటు చేశాడు. జరుగుతున్నదాన్ని గురించి రాయాలని అనుకున్నాను. కాని మరుసటి వారం రెండో బృందాన్ని కలుసుకునే వరకు దాన్ని వాయిదా వేశాను.

**నవంబరు 9**

ఈ రోజు వార్తలేమీ లేవు. తమాయినీతో కలిసి ఆ ప్రాంతాన్ని చుట్టివచ్చాము. నచువాసు నది వెంట ప్రయాణించాము. నిజానికి అది ఒక పెద్ద వాగు మాత్రమే. దాని పుట్టుక ప్రదేశం వరకు మేము ప్రయాణించలేదు. నిట్టనిలువుగా ఉండే తీరాల మధ్య అది ప్రవహిస్తుంది. అది అంతగా ఎవరూ చూడని ప్రదేశం అనిపిస్తుంది. తగిన క్రమశిక్షణతో అక్కడ చాల కాలం ఉండవచ్చునని భావించాము.

మద్యాహ్నం సుడిగాలితో వర్షం రావడంతో మేము అడవి నుండి ఇంటికి చేరుకున్నాము. నా వంటి మీద నుండి ఆరు గోమార్లు తీసివేశాను.

**నవంబరు 10**

బొలీవియా కామ్రేడ్ సెరాఫిన్‌తో కలిసి పచుంగా, పోంబోలు పరిశీలన కోసం బయటకు వెళ్లారు. వాళ్లు మా కంటే ఇంకొంచెం ముందుకు వెళ్లారు. నది రెండుగా చీలిన దగ్గరికి చేరుకున్నారు. అది మంచిగా అనిపించింది. వారు తిరిగివచ్చి ఇంటి వద్ద తచ్చాడుతున్నారు. అప్పుడే వారు అర్గనాజర్ డ్రైవర్ కంట్లో పడ్డారు. ఆ డ్రైవరు అరగంజా వద్ద కొన్న సరుకులతో పాటు మనుషులను తీసుకుని వస్తున్నాడు. నాకు చాల కోపం వచ్చింది. రేపు అడవిలోకి వెళ్లి పోవాలని నిర్ణయించుకున్నాము. అక్కడ మేము పెర్మనెంటు శిబిరాన్ని ఏర్పాటు చేసుకుంటాము. తునామిని వారు చూస్తే ఫరవాలేదు. ఎందువల్లనంటే వాళ్లకి అతను ఇప్పటికే తెలుసు. అతను ఫార్మ్‌లో మరొక కిరాయి మనిషి కోసం వెళతాడు. పరిస్థితి వేగంగా క్షీణిస్తున్నది. మా స్వంత మనుషులను తెచ్చుకోవడానికి అనుమతి లభిస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది. వారితో నేను తేలిగ్గా ఉంటాను.

**నవంబరు 11**

ఈ రోజు విశేషాలేమీ లేవు. మేము కొత్త శిబిరంలో నిద్రపోయాము. అది ఇంటి దగ్గరనుండి వేరే దిశగా ఉంది.

దోమలు, కీటకాలు మాపై పెద్ద దాడినే చేశాయి. కాని వాటి నుండి రక్షించుకోవడానికి నా దగ్గర ఉన్నది ఒకటే దోమతెర.

తునామి అరగనారజ్ వద్దకు వెళ్లాడు. కోళ్లు, టర్కీలు, కొన్ని సరుకులు కొనుక్కొచ్చాడు. అతను అంత పెద్దగా ఏమీ అనుమానించడం లేదని అనిపించింది.

**నవంబరు 12**

ఈ రోజు ఏమీ వార్తలు లేవు. రెండో బృందంలో వచ్చే ఆరుగురికి కేటాయించిన శిబిరం నేలను శుభ్రం చేస్తున్న వద్దకు విహారయాత్రగా వెళ్లాము. అది శుభ్రం చేసిన ప్రధాన ప్రాంతం నుండి వంద మీటర్ల దూరంలో ఉంది. వాగుకు సమీపంలో ఒక మెరకమీద అది ఉంది. అక్కడ గుహలను ఏర్పాటు చేసుకుని వాటిలో ఆహారాన్ని ఇతర సరంజామాను నిల్వ చేసుకోవచ్చు. ఇప్పటికల్లా ఆరుగురిలోని మొదటి ఇద్దరి బృందం వస్తూవుంటుంది. ఈ వారం చివరికల్లా వారు ఫార్మ్‌ను చేరుకుంటారు. నా జుట్టు బాగా పెరుగుతున్నది. అయితే పలచగా పెరుగుతున్నది. నా తెల్ల జుట్టు మళ్లీ మామూలు రంగుకు వస్తున్నది. గడ్డం పెరుగుతున్నది. మరో రెండు నెలల్లో నేను మళ్లీ పాత రూపంలోకి వస్తాను.

**నవంబరు 13**

ఈ రోజు ఆదివారం. కొందరు వేటగాళ్లు మా స్థావరం సమీపానికి వచ్చారు. వాళ్లు అర్గనారజ్ సేవకులు. కొండ ప్రాంతం వాళ్లు. యువకులు, అవివాహితులు. రిక్రూట్ చేసుకోవడానికి ఎంతో అనుకూలమైనవారు. యజమాని పట్ల వారి మనస్సుల్లో తీవ్ర ద్వేషం గూడుకట్టుకుని ఉంది. నదికి దిగువన ఎనిమిది లీగులు పోతే ఇళ్లున్నాయని వాళ్లు చెప్పారు. కొన్ని వంకలు, నీళ్లు కూడ ఉన్నాయని కూడ అన్నారు. ఇంకా ఏమీ విశేషాలు లేవు.

**నవంబరు 14**

శిబిరంలో ఒక వారం గడిచింది. పచుంగో విచారంగా కనిపిస్తున్నాడు. పరిస్థితులకు అనుగుణంగా మారలేకపోతున్నాడు. కాని తనమీద తాను అదుపు సాధించుకోవాల్సి ఉంది. ఒక సొరంగం తవ్వడాన్ని ఈ రోజు ప్రారంభించాము. మా ఆచూకీ తెలిపే ఏ సరంజామానయినా దీనిలో దాచిపెట్టవచ్చు. దాన్ని కొయ్య దుంగలతో కప్పి పెట్టాలి. దాన్ని సాధ్యమైనంత మదుగులో ఉంచేందుకు ప్రయత్నించాము. ఇప్పటికే అరమీటరు లోతైన రంధ్రం చేసి సొరంగం తవ్వకాన్ని ప్రారంభించాము.

**నవంబరు 15**

సొరంగాన్ని తవ్వుతూనే ఉన్నాము. ఉదయం పోంబో, పచుంగో, మధ్యాహ్నం టుమాని తవ్వే వాళ్లు. ఆరు గంటలకు మేము పని ఆపుచేసేసరికి రెండు మీటర్ల లోతు పూర్తయింది. రేపటికల్లా పూర్తిచేయగలమనుకున్నాము. అప్పుడు మేము వదిలివేయవలసిన వస్తువులన్నింటిని అందులో ఉంచవచ్చు. రాత్రిపూట వర్షం రావడంతో నా వూయల మంచం తడిసి పోయింది. ఇంకేమీ వార్తలు లేవు.

**నవంబరు 16,**

సొరంగం తవ్వడం పూర్తయింది. దాన్ని కనపడకుండా చేశాము కూడ. దాని వద్దకు వెళ్లే దారినే కనపడకుండా చేయాల్సి ఉంది. మేము అన్నింటిని మా పాకకు తీసుకు వెళ్లాము. రేపు దాన్ని పూర్తిగా కప్పేస్తాము. సొరంగం ద్వారాన్ని బురద మన్నుతో, చెక్కలతో కప్పేస్తాము. ఈ సొరంగం ప్రణాళికను డాక్యుమెంటు1లో, నంబరు1 గా గుర్తించాము. మిగతా విషయాల్లో ఏమీ మార్పు లేదు. లాపాజ్ నుండి రేపు ఏమైనా వార్తలు వస్తాయని అనుకుంటున్నాము.

**నవంబరు 17**

ఆ ఇంట్లో మా ఆచూకీ తెలపడానికి అవకాశం ఉన్న వస్తువులన్నింటిని సొరంగంలో దాచేశాము. కొన్ని టిన్నుల ఆహారాన్ని కూడ దానిలో ఉంచాము. సొరంగాన్ని కనపడకుండా చేశాము.

లాపాజ్ నుండి ఎలాంటి సమాచారం లేదు. మా వాళ్లు తాము సరుకులు కొన్న అర్గనారజ్‌తో మాట్లాడారు. తామంతా కొకాయిన్ ఉత్పత్తికి సహకరిస్తున్నామనే చెపుతూ ఉన్నారు.

**నవంబరు 18**

లాపాజ్ నుండి వార్త ఏమీ రాలేదు. పచుంగో, పాంబోలు మళ్లీ వాగు వెంట అన్వేషణకు బయలు దేరారు. అది శిబిరానికి అనువైన స్థలమని వాళ్లకు అంతనమ్మకం లేదు. తుమాయినితో కలిసి సోమవారం మేము చూసి వస్తాము. వాగునుండి రాళ్లు తీయడానికి అవసరమైన రోడ్డును నిర్ధారించడానికి వచ్చాడు. కొంత కాలంగా ఆయన ఈ పనిలో బిజీగా ఉన్నాడు. మా ఉనికి గురించి ఆయనలో ఎలాంటి అనుమానం ఉన్నట్లు అనిపించడం లేదు. అంతా ఏమీ మార్పు లేకుండా కొనసాగుతున్నది. దోమలు, గోమార్లు కుట్టడం మూలంగా మాకు అల్సర్ వచ్చింది. ఉదయం కొంత చలిగా ఉంటున్నది.

**నవంబరు 19**

లాపాజ్ వార్తేమీ రాలేదు. ఇక్కడ కూడ ఎలాంటి వార్తలు లేవు. శనివారం కావడంతో వేటగాళ్లు తిరుగుతున్నారు. అందుచేత మేము రహస్య స్థావరంలోనే ఉండిపోయాము.

**నవంబరు 20**

మధ్యాహ్నానికి మార్కొస్, రోలాండోలు వచ్చారు. ఇప్పుడు మేము ఆరుగురం అయ్యాము. వచ్చీరావడంతోనే వారి ప్రయాణం గురించి వివరంగా చెప్పారు. వాళ్లకు కేవలం వారం క్రితం మాత్రమే తెలియచేయడంతో ఇంత ఆలశ్యం అయింది. వారు సావో పావొలో మార్గంలో అతి వేగంగా వచ్చినట్లు. మిగతా నలుగురు వచ్చే వారం కాని ఇక్కడకు చేరుకోరు.

వాళ్లతోపాటు వచ్చిన రోడోల్ఫో నాకు ఎంతో నచ్చాడు. దేన్నయినా ఛేదించడానికి బిగోట్స్ కన్నా అతను ఎక్కువ పట్టుదలగా ఉన్నట్లు కనిపిస్తున్నది. నా ఆదేశాలను ఉల్లంఘించి పాపికి, కోకోకు నేను ఇక్కడ ఉన్నట్లు అతను తెలియ చేశాడు. అది అధికారం పట్ల ఉన్న అసూయ అని అనిపిస్తుంది. కొని సిఫార్సులతో (డాక్యుమెంట్ 1, 2) మనిలాకు లేఖ రాశాను. పాపి ప్రశ్నలకు సమాధానం కూడ ఇచ్చాను. రోడాల్ఫో ఉదయానికి తిరిగి వచ్చాడు.

**నవంబరు 21**

పెద్ద బృందంగా తయారయిన తర్వాత ఇది మొదటి రోజు. మా కొత్త స్థలానికి వెళుతున్నపుడు వర్షం వచ్చింది. తడిసి పోయాము. ఇప్పుడు మేము కుదురుకున్నాము. మా టెంట్ ట్రక్ కవర్‌తో వేశాము. అది నీరుకారి పోతూ ఉంది. అయినా మాకు కొంచెం రక్షణ ఇవ్వగలదు. మా వూయల మంచాలకు నైలాన్ కవర్లు వేసుకున్నాము. కొన్ని ఇతర ఆయుధాలు వచ్చాయి. మార్కస్ వద్ద గరాండ్ ఉంది. రోలాండోకు డిపోనుండి ఎం-1 ఇస్తాము. జోర్గ్ మాతో ఉన్నాడు. అయితే ఇంట్లోనే. అతను ఫార్మ్‌ను మెరుగుపరిచే బాధ్యతలో ఉంటాడు. ఒక నమ్మకమయిన వ్యవసాయ శాస్త్రవేత్తను చూడమని రోడోల్ఫోకు చెప్పాను. ఎంత కాలం సాధ్యమైతే అంత వరకు అక్కడ ఉంటాము.

**నవంబరు 22**

టుమా, జోర్గ్, నేను నది (నకాహుయసు) వెంట అన్వేషణకు మళ్లీ బయలు దేరాము. ఆ నది ఎక్కడ మొదలయిందో తెలుసుకోవడం మా ఉద్దేశం. రాత్రి కురిసిన వర్షంతో నదీ ప్రవాహం బాగా మారిపోయింది. దానితో మేము వెళ్లదలుచుకున్న చోటికి వెళ్లలేకపోయాము. అది చాల సన్నగా ఉన్న ప్రవాహం. దాన్ని చేరుకోవడం చాల కష్టం. దాన్ని మేము పెర్మనెంట్ క్యాంప్‌గా తయారుచేసుకోవచ్చు. సాయంత్రానికి తిరిగి వచ్చాము. ఇక్కడ ఏమీ వార్తలు లేవు.

**నవంబరు 23**

మేము ఉండే చిన్న ఇంటిపైన పహరాను ఏర్పాటు చేసుకున్నాము. ఎవరయినా మమ్మల్ని గమనిస్తున్నా, లేక అవాంఛనీయ వ్యక్తులు ఎవరైనా వచ్చినా హెచ్చరించడానికి ఆ ఏర్పాటు. ఇద్దరు అన్వేషణ కోసం వెళ్లారు. మిగతా వాళ్లు మూడు గంటల పాటు పహరాలో ఉన్నారు. మా శిబిరం చుట్టూ ప్రవాహం వరకు నేలను పోంబో, మార్కొస్‌లు పరిశీలించారు. ఆ ప్రాంతం ఇంకా వరదలోనే ఉంది.

**నవంబరు 24**

ప్రవాహాన్ని పరిశీలించడానికి పాచో, రోలాండోలు వెళ్లారు. వాళ్లు రేపుకాని రారు.

ఈ సాయంత్రం అరగనారజ్ మనుషులు ఇద్దరు అనుకోకుండా 'చూడటానికి' వచ్చారు. అనుకోనిదేమీ జరగలేదు. కాని స్కాట్స్‌తో ఉన్న ఆంటోనియో, ఆ ఇంటికి అధికారికంగా బాధ్యత వహిస్తున్న టుమాలు కనిపించడం లేదు. వారికి సాకు వేటకు పోవడం. ఇవ్వాళ ఆల్యూచా పుట్టిన రోజు.

**నవంబరు 25**

ఇద్దరు, ముగ్గురు మనుషులతో ఒక జీపు వచ్చిందని, పహరానుండి మాకు సమాచారం అందింది. వాళ్లు మలేరియా వైద్య సిబ్బంది అని తేలింది. రక్తపు నమూనాలు తీసుకుని వాళ్లు వెళ్లిపోయారు. పాచో, రోలాండోలు రాత్రి చాల పొద్దుపోయిన తర్వాత తిరిగి వచ్చారు. ఆ ప్రవాహం మ్యాపులో ఉన్న విషయాన్ని కనుగొని దాని వెంట వెళ్లారు. వాళ్లు ప్రధాన నది వెంట కూడ కొంత దూరం వెళ్లారు. ఖాళీగా ఉన్న పొలాలు కొన్ని వారికి కనిపించాయి.

**నవంబరు 26**

శనివారం కావడంతో మేము స్థావరంలోనే ఉండిపోయాము. జోర్గ్‌ను ప్రవాహం వెంట వెళ్లిరమ్మని చెప్పాను. కాని గుర్రం అందుబాటులో లేదు. అందుచేత ఒక గుర్రాన్ని అడగడానికి 20–25 కిలోమీటర్ల దూరంలో ఉన్న డాన్ రెంబెర్రో వద్దకు కాలినడకన బయలు దేరాడు. రాత్రి అయిన తర్వాత కూడ అతను తిరిగి రాలేదు. లాపాజ్ నుండి వార్తలేమీ లేవు.

**నవంబరు 27**

జోర్గ్ జాడ ఇప్పటికీ తెలియలేదు. రాత్రి అంతటికీ అమల్లో ఆదేశాలు జారీ చేశాను. కాని 9 గంటలకు లాపాజ్ నుండి మొదటి జీపు వచ్చింది. కోకోతో పాటు జాక్విన్, అర్బానో, ఒక బొలీవియా దేశస్థుడైన మెడికల్ విద్యార్థి ఎర్నెస్టో కూడ ఉన్నారు. కోకో తిరిగివెళ్లి రికార్డోతోపాటు బ్రాలియో, మిగుయెల్, మరో బొలీవియా దేశస్తుడు ఇంతిని కూడ తీసుకు వచ్చాడు. ఇప్పుడు మేము 12 మందిమి అయ్యాము. జోగ్ బాస్‌గా వ్యవహరిస్తాడు. కోకో, రొడోల్ఫోలు సంబంధాల ఇన్‌చార్జీలుగా ఉంటారు. రికార్డో ఆందోళనకరమైన వార్తనొక దాన్ని తెచ్చాడు. ఎల్ చినో బొలీవియాలో ఉన్నాడని, నన్ను కలుసుకోవాలనుకుంటున్నాడని, 20 మంది మనుషులను పంపుతున్నాడన్నది ఆ వార్త. ఇది అనుకూలమైనది కాదు. మేము ఎస్టాన్సియాల్సోతో సమస్యలను చక్కబెట్టుకోక ముందే ప్రయాణం అంతర్జాతీయం అయిపోతుంది. అతనిని శాంటాక్రజ్ పంపడానికి ఏర్పాటు చేశాము. అక్కడ కోకో వాళ్లను రిసీవ్ చేసుకుని ఇక్కడకు తీసుకు వస్తాడు. మరో జీపును తీసుకుని రికార్డోతో పాటు కోకో లాపాజ్‌కు బయలుదేరాడు. కోకో రింబెరిట్టో వద్ద జోర్గ్‌ను కనుగొనడానికి దిగిపోతాడు. ఇంటితో ప్రాధమిక చర్చలు జరిపినపుడు ఎస్టానిస్లావో మాతో కలవ బోవడం లేదని, తనంత తానుగా పోరాటం చేసే ఉద్దేశంతో ఉన్నట్లు అర్థమయింది.

**నవంబరు 28**

ఉదయానికి జోర్గ్ రాలేదు. కోకో కూడ రాలేదు. వాళ్లు తర్వాత వచ్చారు. రెంబెర్టోస్ వద్దనే వాళ్లు ఉన్నారని తెలిసింది. అది ఒకింత బాధ్యతా రాహిత్యం.

మధ్యాహ్నం బొలీవియా బృందంతో మాట్లాడాను. 20 మందిని పంపమని పెరూ నుండి వచ్చిన అభ్యర్థనను వారికి తెలియచేశాను. వాళ్లు తమల్నందరినీ పంపించడానికి అంగీకరించారు. అయితే మేము పోరాటం ప్రారంభించిన తర్వాత.

**నవంబరు 29**

నది పరిస్థితిని అంచనా వేయడానికి మేము బయలు దేరాము. మా తర్వాత శిబిరం ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలన్నదాన్ని నిర్ణయించుకోవాలి. టుమాయిని, అర్బానో, ఇంతి, నేను ఒక బృందంగా ఏర్పడ్డాము. ప్రవాహం చాల సురక్షితంగా ఉంది. అయితే చాల చీకటిగా ఉంది. మేము ఇక్కడ నుండి ఒక గంట ప్రయాణ దూరంలో ఉన్న మరొక ప్రదేశం కోసం ప్రయత్నించాము. టుమాయిని కింద పడ్డాడు. చీలమడమలో ఎముక విరిగినట్టుగా ఉంది. నది మ్యాపును తయారుచేసుకుని రాత్రికి క్యాంపుకు చేరుకున్నాము. ఇక్కడ వార్తలేమీ లేవు. ఎల్‌చినో కోసం ఎదురు చూడటానికి కోకో శాంటాక్రజ్ వెళ్లాడు.

**నవంబరు 30**

ప్రవాహాన్ని మరింత దూరం పరిశీలించాలన్న ఆదేశాల ప్రకారం మార్కోస్, పాచో, మిగుయెల్, పోంబోలు బయటకు వెళ్లారు. రెండు రోజలపాటు వారు తిరిగేసి వస్తారు. వర్షం బాగా పడింది. ఇంటిలో ఏమీ వార్తలు లేవు.

**ఈ నెల విశ్లేషణ**

ప్రతిదీ మంచిగానే ఉంది. నేను ఎలాంటి ఇబ్బందులు లేకుండానే చేరుకున్నాను. ఇక్కడకు వచ్చిన సగం మంది ఎలాంటి ఇబ్బంది పడలేదు. అయితే వాళ్లు కొంత ఆలశ్యంగా చేరారు. రికార్డో ప్రధాన సహచరులు అందరూ పోరాటం చేస్తారు. ఏం జరిగినప్పటికీ. ఈ సుదూర ప్రాంతంలో అంతా బాగానే అనిపిస్తున్నది. మేము ఎంత కాలం అవసరం అనుకుంటే అంతకాలం ఇక్కడ ఉండగలం అని అనిపిస్తున్నది. మిగతా వారి కోసం ఎదురు చూడటం, బొలీవియన్ దేశస్తుల సంఖ్యను కనీసం 20కి పెంచుకోవడం మా ప్రణాళిక. మోంజే స్పందన ఎలా ఉంటుంది, మోయిజెస్, గువేరాలు ఎలా ప్రవర్తిస్తారో చూడాల్సి ఉంది.

# డిసెంబరు 1966

**డిసెంబరు 1**

ఈ రోజంతా విశేషాలేమీ లేకుండానే గడించింది. రాత్రికల్లా మార్కస్, ఇతర కామ్రేడ్స్ చేరుకున్నారు. వారు చిన్న గుట్టను చూసుకుంటూ చెప్పిన దారికి బదులు, మరింత చుట్టుదారిలో వచ్చారు. ఉదయం 2 గంటల సమయంలో కోకో, మరి కొందరు కామ్రేడ్స్ వచ్చారన్న వర్తమానం నాకు అందింది. దాని గురించి రేపు చూస్తాను.

**డిసెంబరు 2**

ఎల్ చినో త్వరగానే వచ్చాడు. చాల ఎక్కువగా మాట్లాడతాడు. రోజంతా మాట్లాడుతూనే ఉన్నాము. ముఖ్యమైన అంశాలు: స్వయంగా అతను క్యూబా వెళతాడు. ఇక్కడి పరిస్థితి గురించి వారికి వివరిస్తాడు. మరో రెండు మాసాల్లో అంటే మేము కార్యాచరణ మొదలు పెట్టిన తర్వాత ఐదుగురు పెరువియన్లు మాతో చేరతారు. ప్రస్తుతానికి ఇద్దరు మాత్రమే వస్తారు. ఒకరు డాక్టరు, మరొకరు రేడియో టెక్నీషియన్. వారు కొంత కాలం పాటు మాతో ఉంటారు. అతను ఆయుధాలు కావాలని అడిగాడు. ఒక బిజడ్, కొన్ని మాజర్లు, గ్రెనేడ్లు ఇచ్చేందుకు, వారికోసం ఒక ఎం1 ను కొనేందుకు అంగీకరించాను. టిటికాకా సరస్సుకు అవలి ఒడ్డున పూనోకు సమీపంలోని ఒక ప్రాంతానికి ఆయుధాలను చేరవేసేలా లింకు ఏర్పాటు చేసుకునేందుకు ఐదుగురు పెరువియన్లను సహాయం కోసం ఇచ్చేందుకు కూడ నిర్ణయించాను. పెరులో తాను పడ్డ ఇబ్బందుల గురించి ఎల్‌చినో వివరించాడు. కాలిక్టోను విముక్తం చేసే తన ప్రణాళిక గురించి కూడ చెప్పాడు. అయితే అది సాధ్యపడేదని నాకు అనిపించలేదు. బ్రతికి బయటపడ్డ గెరిల్లాలు కొందరు ఆ జోన్లో  ఉన్నారని అతను విశ్వసిస్తున్నాడు. అయితే అది కచ్చితంగా ఎవరికీ తెలియదు. ఎందువల్లనంటే  ఆ జోన్‌కు వెళ్లివచ్చిన వారెవరూ లేరు.

మిగతా రోజంతా పాతజ్ఞాపకాలను ఒకరి కొకరం తెలియచేసుకుంటూ గడిపాం. అదే ఉత్సాహంతో అతను లాపాజ్‌కు బయలు దేరాడు. మా ఫోటోలు కూడ కొన్ని తీసుకెళ్లాడు. శాంఖెజ్‌తో కాంటాక్టు ఏర్పాటు చేసుకోమని కూడ కోకోకు ఆదేశాలు ఉన్నాయి. (శాంఖేజ్‌ను నేను తర్వాత చూస్తాను.) అధ్యక్షుని సమాచార అధిపతితో కూడ సంబంధాలు పెట్టుకోవలసి ఉంది. ఆయన ఇంతికి బావగారు. తాను మాకు విషయాలను తెలియచేస్తానని మాట ఇచ్చాడు. నెట్‌వర్క్ ఇంకా శైశవ దశలోనే ఉంది.

**డిసెంబరు 3**

వార్తలేమీ లేవు. శనివారం కావడంతో అన్వేషణ ఏమీ జరపలేదు. ముగ్గురు సేవకులు సరుకులు కొని తేవడానికి లాగినిలాస్ వెళ్ళారు.

**డిసెంబరు 4**

వార్తలు లేవు. ఆదివారం కావడంతో అంతా ప్రశాంతంగా ఉన్నారు. నేను మావారికి యుద్ధం గురించి వైఖరిని తెలియచేయడానికి, త్వరలో వచ్చిచేరబోయే బొలీవియన్ల  పట్ల వైఖరి గురించి ఉపన్యాసం ఇస్తున్నాను.

**డిసెంబరు 5**

వార్తలు లేవు. బయటకు వెళదామనుకున్నాము. కాని రోజంతా విపరీతంగా వర్షం పడటంతో సాధ్యం కాలేదు. ఏ విధమైన హెచ్చరిక లేకుండా లోరో తుపాకి పేల్చడంతో పొరబాటున అప్రమత్తమయ్యాం.

**డిసెంబరు 6**

మొదటి ప్రవాహం వద్ద రెండో గుహను తవ్వే పని ప్రారంభించడానికి వెళ్లాము. ఈ బృందంలో అపోలినార్, ఇంతి, అర్బానో, మిగ్యుయెల్, నేను ఉన్నాము. టుమాకు క్రిందపడిన గాయం ఇంకా  మానక పోవడంతో, ఆ స్థానాన్ని మిగుయెల్ భర్తీ చేస్తున్నాడు. గెరిల్లాలతో చేరుతున్నట్లు అపోలినార్ చెప్పాడు. అతనికి అనుమతి ఇచ్చాము. అయితే లాపాజ్‌లో కొన్ని వ్యక్తిగతమైన విషయాల్ని అతను  చక్కపెట్టుకోవాల్సి ఉందన్నాడు. అతను కొంత కాలం వేచి ఉండాల్సి ఉంది. పదకొండు గంటలకు ప్రవాహం వద్దకు చేరుకున్నాము. మేము ప్రయాణించిన అనవాళ్లు కనిపించని రీతిలో ముందుకు సాగుతూ గుహకు అనుకూలమైన ప్రదేశం కోసం అన్వేషించాము. కాని అక్కడ అంతా రాళ్లమయం. ప్రవాహం కూడ గుట్టల మధ్యకు వెళ్లి అంతరించిపోయింది. మా అన్వేషణను మరుసటి

రోజుకు వాయిదా వేసుకున్నాము. మా ఆహార నిల్వలు చాల తక్కువగా ఉండటం, అవి వచ్చే శుక్రవారం వరకు మాత్రమే సరిపోతాయి కాబట్టి, ఇంతి, అర్బనోలు లేళ్లను వేటాడడానికి బయలుదేరారు.

**డిసెంబరు 7**

మిగ్యుయెల్, ఎపొలినార్‌లు అనువైన ప్రదేశాన్ని కనుగొని సొరంగం తవ్వకాన్ని ఆరంభించారు. పరికరాలు సరిగ్గా లేవు. ఇంతి, అర్బనోలు వట్టిచేతుల్తో తిరిగొచ్చారు. కాని సాయంత్రానికల్లా తన ఎం1తో ఒక టర్కీని వేటాడి తెచ్చాడు. ఆ రాత్రి తినడానికి ఏదో ఒకటి ఉండటంతో, దాన్ని మరుసటి రోజు ఉదయం కోసం అట్టిపెట్టాము. ఈ రోజుతో మేము ఇక్కడికి వచ్చి కచ్చితంగా నెల రోజులయింది. కాని అనువుగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రతి క్యాలెండరు నెల తర్వాతనే విశ్లేషణ ఇస్తాను.

**డిసెంబరు 8**

ప్రవాహం ఎగువన గట్టి ప్రదేశం వద్దకు ఇంతితో కలిసి చేరుకున్నాము. మిగ్యుయెల్, అర్బనోలు సొరంగాన్ని తవ్వుతూనే ఉన్నారు. మధ్యాహ్నానికి మిగ్యుయెల్ స్థానంలో అపొలినార్ వెళ్లాడు. సాయంత్రానికల్లా పోంబో, పాచోలతో మార్కస్ వచ్చాడు. ఆ ఇద్దరిలో పాచో వెనకబడిపోయాడు, చాల అలసి పోయిఉన్నాడు. అతను ఏమీ మెరుగుపడకపోతే అగ్రభాగాన ఉండే దళం నుండి తప్పించమని మార్కొస్ నన్ను కోరాడు. ప్లాన్ 2 మీద గుహ మార్గాన్ని గుర్తించాను. వారు ఇక్కడ ఉన్న కాలంలో చేయాల్సిన అతి ముఖ్యమైన పనులు వారికి వదిలి వేశాను. మిగుయెల్ వారితోనే ఉంటాడు. మేము రేపు మళ్లీ వస్తాము.

**డిసెంబరు 9**

మేము ఉదయాన్నే బయలు దేరి నెమ్మదిగా మధ్యాహ్నానికి చేరుకున్నాము. బృందం తిరిగి వచ్చేవరకు అక్కడే ఉండమని పోచోకు ఆదేశాలు ఉన్నాయి. రెండో క్యాంప్‌తో కాంటాక్టు పెట్టుకోవడానికి ప్రయత్నించాము. సాధ్యం కాలేదు. ఇంకా ఇతర వార్తలేమీ లేవు.

**డిసెంబరు 10**

ఇంట్లో తయారు చేసిన మొదటి బ్రెడ్ తినడం మినహా ఈ రోజు వార్తలేమీ లేవు. కొన్ని అత్యవసర పనుల గురించి జోర్గ్, ఇంతిలతో మాట్లాడాను. లాపాజ్ నుండి వార్తలేమీ రాలేదు.

**డిసెంబరు 11**

ఈ రోజు వార్తలేమీ లేవు. కాని సాయంత్రానికల్లా కోకో, పాపీతో వచ్చాడు. అలెజాంద్రో, ఆర్టురో, కార్లస్ అనే ఒక బొలీవియన్‌ను అతను తీసుకొచ్చాడు. మరో జీపు యథా ప్రకారం రోడ్డుమీదే ఉంది. తర్వాత వారు డాక్టరును, బనింగోను తీసుకొచ్చారు. ఇద్దరు బొలీవియన్లను కూడ వారు తీసుకొచ్చారు. వారిద్దరు కాంబాలు. కార్నవి ఫార్మ్ నుండి వచ్చారు. మామూలుగానే వారి ప్రయాణ విశేషాలు తెలుసుకుంటూ ఆ రాత్రి గడిపాము. ఆంటోనియా, ఫెలిక్స్‌లు ఇక్కడ లేకుండానే ఇవన్నీ మాట్లాడుకుంటున్నాము. వారిరువురు ఈ పాటికి ఇక్కడ ఉండాల్సింది. రీనన్, టానియాలను ఇక్కడికి తీసుకు వచ్చేందుకు మరో రెండు ట్రిప్పులు వేయాలని పాపీకి చెప్పాము. మేము ఇళ్లను, డిపోలను అమ్మేసి, శాంఖెజ్‌కు సహాయపడేందుకు వెయ్యి డాలర్లు ఇస్తాము. వ్యాన్‌ను అతను ఉంచుకుంటాడు. ఒక జీపును మేము ఉంచుకుంటాము. మరో జీపును టానియాకు అమ్మేస్తాము. ఆయుధాల కోసం ఇంకో ట్రిప్పు వేయాల్సి ఉంది. మొత్తం అంతా ఒకే జీపులో ఎక్కించాలని ఆదేశించాను. ఎందువల్లనంటే మధ్యలో ఒక జీపులోనుండి, మరో జీపులోకి మారుస్తుంటే తేలిగ్గా గుర్తించబడే ప్రమాదం ఉంది. ఎల్‌చినో క్యూబాకు బయలు దేరాడు. చాల హుషారుగా కనిపిస్తున్నాడు. అతను తిరిగి వచ్చిన తర్వాత మాతో చేరాల్సి ఉంది. కోకో మాతో ఉండిపోయాడు. కామిరిలో ఆహారం కోసం అతను వెళతాడు. పాపి లాపాజ్‌కు బయలు దేరాడు.

ఒక ప్రమాదకర ఘటన జరిగింది. వెలగ్రాండెకు చెందిన ఒక వేటగాడికి మా ఆనవాళ్లు కొన్ని కనిపించాయి. కొందరిని చూసినట్లుగా కూడ అనిపించింది. పాపో పోగొట్టుకున్న గ్లోవ్ అతనికి కనిపించింది. దీనితో మా ప్లాన్‌లు మార్చుకోవాల్సి వచ్చింది. మేము చాల అప్రమత్తంగా ఉండాలి. వెలగ్రాండెకు చెందిన వ్యక్తి తాను ఎక్కడెక్కడ ఏదు పందులు కోసం ఉచ్చులు పెట్టాడో చూపడానికి ఆంటోనియాతో రేపు బయటకు వెళతాడు. కార్లస్ పట్ల తనకున్న మినహాయింపుల గురించి ఇంతి చెప్పాడు. కార్లస్ ఒక మెడికల్ విద్యార్థి. వచ్చీరావడంతోనే క్యూబన్లు నిర్వహిస్తున్న పాత్ర గురించి తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. పార్టీ పోరాటం చేయకపోతే తాను పోరాటం చేయనని అంతకు ముందు చెప్పాడు. ఇదంతా పొరపాటుగా అర్థం చేసుకోవడం వల్లనే అని రొడోల్ఫో కొట్టి పారేశాడు.

**డిసెంబరు 12**

ఆదేశాల మానువల్‌లోని విషయాలను బిగ్గరగా చదువుతూ, యుద్ధం వాస్తవంగా ఎలా ఉంటుందో నేను బృందానికి వివరించాను. కమాండ్, క్రమశిక్షణల ఐక్యత ఆవశ్యతను

నొక్కిచెప్పాను. వేరే మార్గాన్ని అనుసరించాల్సి ఉన్నపుడు తమ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించాల్సిన కర్తవ్యం గురించి బొలీవియన్లకు హెచ్చరించాను. ఈ క్రింది విధంగా బృందంలోని వారి హోదాలను  నిర్ణయించాను: ఉపఅధినేతగా జోక్విన్ ఉంటాడు, రోలాండో, ఇంతీలు కమిస్సార్‌లు, ఆపరేషన్ల అధిపతిగా అలెజాండ్రో ఉంటాడు, సర్వీసుల అధిపతిగా పోంబో ఉంటాడు, ఫైనాన్స్ విషయాలను ఇంతి చూస్తాడు, ప్రస్తుతానికి నాటో సరఫరాలు, ఆయుధాలను చూస్తాడు, మోడో మెడికల్ సర్వీసుల బాధ్యత చూస్తాడు.

వాలెగ్రాండోకు చెందిన వ్యక్తి వుచ్చులు పెట్టడం పూర్తయేదాకా ఉన్నచోటనే ఉండమని, లేదంటే ఆంటోనియాతో వెళ్లమని బృందానికి చెప్పడానికి రోలాండో, బ్రాలియోలు వెళ్లారు. రాత్రికల్లా తిరిగొచ్చారు, ఉచ్చు ఎంతో దూరంలో లేదు. వాలెగ్రాండే నుండి వచ్చిన వ్యక్తికి వారు బాగా తాగబోయించారు. పింగాణి బాటిల్ లోనబడటంతో అతను చాల ఖుషీగా ఉన్నాడు. రాత్రికి అతను వెళ్లి పోయాడు. సరుకులు కొనడానికి కోకో కోర్నవి వెళ్లాడు. కాని అతనిని లాంగినాస్‌కు చెందిన కొందరు చూశారు. అతను కొన్న సరుకుల పరిమాణాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు.

తర్వాత మార్కొస్, పాంబోతో కలిసి వచ్చాడు. కొయ్య  ముక్క ఒకదానిని నరుకుతూ కనుబొమల వద్ద గాయం చేసుకున్నాడు. రెండు కుట్లుపడ్డాయి.

**డిసెంబరు 13**

జాక్విన్, కార్లస్, డాక్టర్లు రోలాండో, బ్రౌవులియోలను కలుసుకోవడానికి వెళ్లారు. పాంబో కూడ వాళ్లతో వెళ్లాడు. అతను ఈ రోజు రావాలని ఆదేశాలున్నాయి. దారిని మూసెయ్యమని ఆదేశించాను. అదే స్థలం నుండి ప్రవాహం వైపుకు మరో దారి తయారు చేయమని చెప్పాను. మేము దాన్ని ఎంత బాగా చేశామంటే, పోంబో, మిగ్యుయెల్, పోచోలు తిరిగి వస్తూ దారి తప్పిపోయారు.

వయాచోలోని తన ఇంటికి కొద్దిరోజుల పాటు వెళుతున్న అపోలినార్‌తో మేము మాట్లాడాము. తన కుటుంబానికి అందించేందుకు కొంత డబ్బు కూడ ఇచ్చాము. కచ్చితమైన విచక్షణ ఆవశ్యకతను అతనికి గుర్తుచేశాము. సాయంత్రం కోకో వీడ్కోలు చెప్పాడు. కాని తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఒక హెచ్చరిక వచ్చింది. శబ్దాలు, ఈలలు, కుక్క మొరగడం విన్నాము. విషయమేమంటే కోకో అడవిలో దారితప్పాడు.

**డిసెంబరు 14**

ఈ రోజు వార్తలు ఏమీ లేవు. వాలెగ్రాండె నుండి వచ్చిన వ్యక్తి తాను ఉచ్చు పెట్టిన ఇంటి వద్దకు వెళ్లి వచ్చాడు. అంతకు ముందు చెప్పినట్లు కాకుండా ఉచ్చును నిన్న పెట్టాడు. కొత్త అడవి దారిని అంటోనియాకు చూపెట్టాము. వాలెగ్రాండె నుండి వచ్చిన వ్యక్తిని ఎవరికి తెలియకుండా తీసుకు వెళ్లేందుకు ఆ దారిని అతనికి చూపాము.

**డిసెంబరు 15**

వార్తలేమీ లేవు. మాలో ఎనిమిదిమందిమి వెళ్లి క్యాంప్ నెం. 2లో పర్మినెంటుగా ఉండేందుకు సన్నాహాలు చేస్తున్నాము.

**డిసెంబరు 16**

ఉదయాన్నే పాంబో, అర్బానో, టుమా, అలజాండ్రో, మోరో, అర్టోరో, ఇంతి, నేను విపరీతమైన బరువులతో క్యాంపుకు చేరుకున్నాము. ప్రయాణం మూడుగంటల పాటు సాగింది.

రోలాండో మాతోనే ఉన్నాడు. జాక్విన్, బ్రాలియో, కార్లస్, డాక్టరు తిరిగి వెళ్లిపోయారు. కార్లస్ బాగా నడవగలడని, మంచి పనివాడని రుజువు చేసుకున్నాడు. మోరో, టుమాలు నదికి దగ్గరలో ఒక సొరంగాన్ని కనిపెట్టారు. దానిలో మంచి చేపలు కూడ ఉన్నాయి. పదిహేడు చేపల్ని వారు పట్టారు. అది మాకు మంచి ఆహారం. క్యాట్‌ఫిష్ మూలంగా మోరో చేతికి గాయం చేసుకున్నాడు. ఒక గుహ ఎలాగూ ఉంది కాబట్టి, రెండో గుహను అన్వేషించడానికి మేము పూనుకున్నాము. రేపటి వరకు పనులకు కట్టిపెట్టాము. మోరో, ఇంతీలు ఓ ఏదుపందిని వేటాడాలని బయలు దేరారు. వారు రాత్రంతా ఆ పనిలోనే ఉంటారు.

**డిసెంబరు 17**

మోరో, ఇంతీలు ఒక టర్కీని మాత్రం వేటాడగలిగారు. టుమా, రోలాండో, నేను రెండో గుహను తవ్వడంలో నిమగ్నమయ్యాము. అది రేపటికల్లా పూర్తి కావచ్చు. ఆర్టోరో, పోంబోలు రేడియో సెట్ పెట్టాల్సిన ప్రదేశాన్ని ఎంపిక చేశారు. ప్రవేశ మార్గాన్ని కూడ బాగు చేశారు. రాత్రంతా ఉదయం వరకూ విపరీతంగా వర్షం పడుతూనే ఉంది.

**డిసెంబరు 18**

రోజంతా వర్షం పడుతూనే ఉంది. అయినా మేము గుహను తవ్వడం ఆపుచేయలేదు. దాదాపు రెండున్నర మీటర్లు పూర్తయింది. అది మాకు సరిపోతుంది. ఒక గుట్ట మీద రేడియో సెట్టు పెట్టడానికి నిర్ణయించాము. సెట్ బాగానే ఉంది. అయినా దాన్ని టెస్ట్ చేయాలి.

**డిసెంబరు 19**

వర్షం పడింది. మేము బయటకు వెళ్లలేదు. పదకొండు గంటలకనుకుంటాను బ్రాలియో, నాటోలు వచ్చారు, నది లోతుగా ఉన్నప్పటికీ దాటవచ్చని వారు చెప్పారు. మేము బయటకొచ్చిన తర్వాత, మార్కోస్‌ను, ఆయన ఎడ్వాన్స్ పార్టీని కలుసుకున్నాము. వారు తాము స్థిరంగా ఒక చోట ఉండే ఏర్పాటు చేసుకుంటున్నారు. మార్కస్ ఆ బృందానికి నాయకత్వం వహిస్తాడు. పరిస్థితులను బట్టి ముగ్గురు నుండి ఐదుగుర్ని పంపించాలని ఆయనకు ఆదేశాలున్నాయి. అక్కడికి మేము చేరడానికి మూడు గంటలు పట్టింది.

అర్థరాత్రికి ఆంటోనియో, ఎల్ రూబియోలను తీసుకొని రికార్డో, కోకోలు వచ్చారు. (గత గురువారం వారికి  టికెట్లు దొరక లేదు.) మాతో కచ్చితంగా కలియ వలసిన అపోలినార్ కూడ వారితో వచ్చాడు. కొన్ని విషయాలను చూడటానికి ఇవాన్ వచ్చాడు.

రాత్రంతా చిన్నకునుకయినా లేకుండా మేలుకునే ఉన్నాను.

**డిసెంబరు 20**

మేము అనేక విషయాలు చర్చించాము. క్యాంపు నంబరు 2నుండి అలెజాండ్రో నాయకత్వంలో బృందం వచ్చిన తర్వాత మాకు ప్రతిదీ సూటిగా తెలుస్తున్నది. క్యాంపుకు సమీపంలో రోడ్డు మీద తుపాకితో కాల్చిచంపిన లేడి పడి ఉందని, దాని కాలికి తీగ ఒకటి ఉందని అలెజాండ్రో బృందం చెప్పింది. ఓ గంటకు ముందే జాక్విన్ ఆ ప్రాంతానికి వెళ్లి వచ్చాడు. కాని అతను ఈ విషయం ఏమీ చెప్పలేదు. వాలెగ్రాండె నుండి వచ్చిన వ్యక్తి దాన్ని అక్కడికి తెచ్చాడని, ఎందుకోసమో తెలియక పోయినా దాన్ని అక్కడ వదిలి పారిపోయాడని మేము భావించాము. మా వెనక భాగంలో సెంట్రీలను ఏర్పాటుచేయాలని నిర్ణయించాము. వేటగాడు దొరికితే పట్టుకోమని ఇద్దరు మనుషులను పురమాయించాము. కొద్ది సేపటి తర్వాత ఆ లేడి ఎప్పుడో చనిపోయిందని, దాని మృత దేహం పురుగులు

పట్టి ఉందని వార్త వచ్చింది. ఆ తర్వాత జాక్విన్ వచ్చి తాను కూడ ఆ లేడి కళేబరాన్ని చూశానని ధృవీకరించాడు. కోకో, ఎల్ లోరోలు వాలెగ్రాండె నుండి వచ్చిన వ్యక్తిని పట్టుకొచ్చారు. తానే ఆ లేడిని కొన్ని రోజుల క్రితం గాయపర్చానని అతను చెప్పాడు. దీనితో ఆ విషయం ముగిసింది.

సమాచార బ్యూరోలోని వ్యక్తితో కాంటాక్టు ఏర్పాటు చేసుకునే ప్రయత్నాన్ని వేగవంతం చేయాలని నిర్ణయించాము. ఈ విషయాన్ని కోకో నిర్లక్ష్యం చేశాడు. మాగియాతో మాట్లాడి, ఇవాన్ ద్వారా సమాచార బ్యూరో లోని వ్యక్తితో సంబంధం ఏర్పాటుచేసుకోవాల్సి ఉంది. అతను మాగియా, శాంఖెజ్, టానియా, పార్టీ నిర్దేశించే వ్యక్తితో (ఆ వ్యక్తిని పార్టీ ఇంకా నియమించలేదు.) సంబంధంలో ఉండాలి. బహుశా విల్లమోంటిస్‌కు చెందిన వ్యక్తిని పార్టీ కేటాయించవచ్చు. అయితే దానిపై ఇంకా నిర్ణయం జరగలేదు. దక్షిణం మీదుగా మోంజె వస్తున్నాడని మాకు టెలిగ్రాం అదింది.

వారు ఒక కాంటాక్టు సిస్టమ్‌ను కనిపెట్టారు. కాని అది నాకేమీ సంతోషం కలిగించలేదు. మోంజె పట్ల అతని స్వంత కామ్రేడ్స్‌కే అపనమ్మకం ఉన్నట్లు వ్యక్తమయింది.

వారు మోంజెను తీసుకు రావడానికే వెళ్లినట్లయితే ఉదయం 1 గంటకల్లా మాకు లాపాజ్ నుండి సమాచారం అందుతుంది.

ఇవాన్ ఏదైనా వ్యాపారం చేయడానికి అవకాశం ఉంది. కాని అతని ఫోర్జరీ పాస్‌పోర్టు దానికి అవకాశం కలగనీయదు. తర్వాతి దశ ఆ డాక్యుమెంటును మెరుగుపరచడం. దానిని వేగవంతం చేయమని మనిలాలోని మా మిత్రులకు అతను లేఖ రాయాల్సి ఉంది.

ఆదేశాలు స్వీకరించడానికి టానియా రావాల్సి ఉంది. బహుశా నేను ఆమెను బ్యూనస్ ఎయిర్స్‌కు పంపవచ్చు.

రికార్డో, ఇవాన్, కోకోలు విమానం ద్వారా కామిరి నుండి వెళ్లి పోవాలని మేము కచ్చితంగా నిశ్చయించాము. జీపు ఇక్కడే వదిలేస్తారు. వారు తిరిగి వెళ్లిన తర్వాత లాగినిలాస్‌కు ఫోన్ చేసి తాము చేరుకున్నామని చెపుతారు. జోర్గ్ రాత్రికి వార్తల కోసం వెళతాడు, సానుకూల వార్తలేమైనా ఉంటే తెలియచేస్తాడు. ఉదయం ఒంటి గంట వరకు మేము లాపాజ్ నుండి ఎలాంటి వార్తను సేకరించలేకపోయాము. సూర్యోదయాన వారు కామిరికి బయలు దేరారు.

**డిసెంబరు 21**

స్కౌట్లు తయారు చేసిన ఎలాంటి మ్యాపును ఎల్ లోరో నాకు ఇవ్వలేదు. దానితో ఇక్కడి నుండి ఏ రోడ్డు మీదుగా యాకి వెళ్లవచ్చునో నాకు తెలియకుండా ఉంది. ఉదయాన్నే బయటకు వెళ్లాము. ఎలాంటి సంఘటనలు లేకుండానే మేము దారిలో పయనించసాగాము. 24 కల్లా ప్రతిదీ ఇక్కడ ఉండేలా మేము ప్రయత్నిస్తున్నాము. ఆ రోజున పార్టీకి ప్లాన్ చేశాము.

దారిలో మేము జనరేటర్ కోసం వెళుతున్న పాచో, మిగ్యుయెల్, బెనిన్నో, ఎల్ కాంబాలను కలుసుకున్నాము. సాయంత్రం ఐదు కల్లా పాచో, ఎల్‌కాంబాలు వట్టిచేతులతో తిరిగి వచ్చారు. అడవిలో వారు దాచిపెట్టివచ్చిన జనరేటర్ బాగా బరువుగా ఉండటంతో తీసుకు రాలేకపోయారు. రేపు ఐదుగురు వెళ్లి దాన్ని పట్టుకు వస్తారు. సరుకుల కోసం గుహను మేము పూర్తి చేశాము. రేపు రేడియో కోసం మరో దాన్ని మేము మొదలు పెడతాము.

**డిసెంబరు 22**

ఉదయాన్నే మేము రేడియో కోసం సొరంగం తవ్వడం మొదలు పెట్టాము. తొలుత అదంతా చాల తేలిక నేల కావడంతో చాల సులభంగా పని సాగిపోయింది. కాని తర్వాత గట్టి రాయి తగలడంతో మేము ముందుకు సాగలేకపోయాము.

వాళ్లు జనరేటర్‌ను పట్టుకొచ్చారు. అది చాల బరువుగా ఉంది. అయినా దాన్ని మేము టెస్ట్ చేయాలి. కాని మావద్ద పెట్రోలు లేదు. మౌఖిక సమాచారం ఉండటంతో తాను ఎలాంటి మ్యాపులు పంపడం లేదని ఎల్ లోరో ప్రకటించాడు. దాన్ని ఇవ్వడానికి తాను రేపు వస్తున్నట్లు తెలియచేశాడు.

**డిసెంబరు 23**

ఎడమ వైపున కొండకనుమను అన్వేషించడానికి పాంబో, అలెజాంద్రోలతో కలిసి మేము బయటకు వెళ్లాము. దానిగుండా మేమొక దారిని కనుగొనాలి. దాన్ని తేలిగ్గానే దాటగలమని తొలుత మాకనిపించింది. ఇద్దరు కామ్రేడ్స్‌తో జాక్విన్ తిరిగి వచ్చాడు. ఎల్ లోరో మాత్రం రావడం లేదని, ఒక పంది తప్పించుకు పోవడంతో దానికోసం తాను వెళ్లాడని తెలిపాడు.

లాగినిలాస్ నుండి వచ్చిన వ్యక్తి ఏం చేస్తున్నాడన్నదాని గురించిన సమాచారం ఏమీ లేదు.

సాయంత్రానికల్లా పంది వచ్చింది. అది చాల పెద్దది. కాని మా వద్ద తాగడానికి ఏమీలేదు. ఎల్ లోరో ఈ వస్తువులను సైతం తీసుకు రాలేకపోయాడు. పద్ధతి లేని వ్యక్తిలా అనిపించాడు.

**డిసెంబరు 24**

ఇది క్రిస్మస్ ముందు రోజు. కొందరు రెండు ట్రిప్పులు వెళ్లారు. అందుకే కొంత ఆలశ్యమయింది. రాత్రికి మాత్రం అంతా కలిసి మంచిగా గడిపాము. మాలో కొందరు చాల ఎక్కువగా తాగారు. లాగినిలాస్ నుండి వచ్చిన వ్యక్తి ప్రయాణం విజయవంతం కాలేదని ఎల్ లోరో వివరించాడు. నోట్‌లో ఉన్నట్లుగా కొద్ది, అవి కూడ అస్పష్టమైన ఫలితాలను మాత్రమే సాధించాడు.

**డిసెంబరు 25**

పని ప్రారంభించాము. మొదటి క్యాంపు నుండి ఎలాంటి ట్రిప్పులు లేవు. బొలీవియన్ డాక్టరు ప్రతిపాదించినట్లుగా దానిని సి26 అనాలని మేము నిర్ణయించాము. మార్కొస్, బెనిన్యో, ఎల్ కాంబాలు బయటకు వెళ్లారు. కొండ కనుమకు కుడివైపునుండి దారి చూశారు. మధ్యాహ్నానికి వారు తిరిగి వచ్చారు. ఇక్కడికి రెండు గంటల ప్రయాణం దూరంలో ఒక మైదానాన్ని చూశామన్న వార్తను వారు తెచ్చారు. రేపు వాళ్లు అక్కడకు వెళతారు. ఎల్ కాంబా జ్వరంతో తిరిగి వచ్చాడు. నదికి ఎడమ గట్టున మిగుయెల్, పాచోలు దొంగదారులు వేశారు. రేడియో గుహ వద్దకు వెళ్లే మార్గాన్ని కూడ తయారు చేశారు. ఇంతి, ఆంటోనియో, టుమాలలు, నేను రేడియో గుహను తవ్వుతూనే ఉన్నాము. కాని రాయి పడటంతో చాల కష్టంగా ఉంది. వెనుక బృందం తమ క్యాంపును తయారు చేసుకున్నారు. నదికి ఇరువైపులా గమనించి చూడటానికి ఏర్పాటుచేసుకున్నారు. అది చాల మంచి ప్రదేశం.

**డిసెంబరు 26**

మ్యాప్ మీద యాకి అని గుర్తించిన ప్రదేశాన్ని కనుగొనడానికి ఇంతి, కార్లస్‌లు బయలు దేరారు. వారి ప్రయాణం రెండు రోజుల పాటు ఉంటుందని అనుకుంటున్నాము. రోలాండో, అలెజాంద్రో, కాంబోలు సొరంగం తవ్వే కష్టమైన పనిని కొనసాగిస్తున్నారు.

మిగుయెల్ వేసిన దారుల వెంట పాచో, నేను వెళ్లాము. కాని గుట్ట వెంట దారిలో వెళ్లడం అనవసరం అనిపించింది. సొరంగానికి వెళ్లే దారి మంచిగానూ ఉంది, దాన్ని కనిపెట్టడమూ కష్టమే. ఈ రోజు రెండు విషపు పాములను చంపాము. నిన్న ఒక దాన్ని చంపాము. ఇక్కడ అలాంటి పాములు చాల ఎక్కువగానే ఉన్నట్లున్నాయి. టుమా, అర్టురో, ఎల్ రూబియో, అంటోనియాలు వేట కోసం వెళ్లారు. బ్రౌవులియో, ఎల్ నాటోలు రెండో క్యాంపు వద్ద కాపలా కోసం ఉండిపోయారు. ఎల్ జోరో జీపు బోల్తా పడిందన్న వార్తను వారు తెచ్చారు. మోంజె వచ్చాడని కూడ వారు చెప్పారు. మార్కస్, మిగ్యుయెల్, బెనిన్నోలు గుట్ట పక్క దారిని బాగుచేయడానికి వెళ్లారు. రాత్రంతా వారు తిరిగి రాలేదు.

**డిసెంబరు 27**

మార్కస్‌ను వెదకడానికి టుమాతో కలిసి బయటకు వెళ్లాము. రెండున్న గంటల పాటు నడుస్తూనే వన్నాము. మాకు ఎడమ వైపు పడమర దిశగా ఒక లోయ వద్దకు వచ్చాము. అక్కడ మాకు అడుగు జాడలు కనిపించాయి. నిట్టనిలువుగా ఉండే రాళ్ల వద్దకు వచ్చాము. ఆ మార్గాన వెళితే క్యాంపు వస్తుంది అనుకున్నాము. కాని గంటల తరబడి నిడిచినా దాని చాయలు కనిపించలేదు. సాయంత్రం ఐదు గంటలు దాటిన తర్వాత నకాహయసు చేరుకున్నాము. అది మొదటి క్యాంపుకు ఐదు కిలోమీటర్ల దిగువన ఉంది. 7 గంటలకు క్యాంపుకు చేరుకున్నాము. అంతకు ముందు రాత్రి మార్కస్ అక్కడే గడిపాడని తెలుసుకున్నాము. హెచ్చరిస్తూ నేనెవరినీ పంపలేదు. బహుశా మార్కస్ నేనెక్కడ ఉన్నానో చెప్పి ఉంటాడని అనుకున్నాను. బాగా దెబ్బతిన్న జీపును మేము చూశాము. ఎల్ లోరో స్పేరు పార్టులు కొన్ని తీసుకు రావడానికి కామిరో వెళ్లాడు. ఎల్ నాటో చెప్పిన దాని ప్రకారం అతను డ్రైవ్ చేస్తూ నిద్ర పోయాడు.

**డిసెంబరు 28**

క్యాంపు నుండి బయలు దేరే సమయానికి, అర్బానో, ఆంటోనియోలు నన్ను వెదుక్కుంటూ వచ్చారు. గుట్ట వెంట క్యాంపుకు దారి చేస్తూ మార్కస్ మిగ్యుయెల్ వెంట వెళ్లి ఇంకా తిరిగి రాలేదు. మేము వెళ్లిన దారిలోనే బెనిన్నో, పాంబోలు నా కోసం వెళ్లారు. నేను క్యాంపుకు వెళ్లే సరికి, మిగ్యుయెల్, మార్కస్‌లు క్యాంపుకు దారికనుక్కోలేక గుట్ట మీదనే నిద్రపోయారని తెలిసింది. తనను సరిగా చూడలేదని మిగ్యుయెల్ మీద మార్కస్ మీద ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు జాక్విన్, అలెజాండ్రో, డాక్టర్ల మీద అన్నట్లుగా ఉంది. ఇంతి, కార్లస్‌లు ఎవరిని కలుసుకోకుండానే తిరిగి వచ్చారు. ఒక పాడుబడిన ఇంటిని వారు చూశారు. అది మ్యాపు మీద యాకి అని గుర్తించిన ప్రదేశం లాగా లేదు.

**డిసెంబరు 29**

మార్కస్, మిగ్యుయెల్, అలెజాంద్రోలతో పాటు మేము మరోసారి సరిగ్గా చూసేందుకు గుట్టమీదకు వెళ్లాము. 1500 మీటర్ల పైభాగాన మీద ఒకే ఎత్తులో ఉన్న పంపా డెల్ టిగర్ కొండల వరుసలో అది మొదటిదని మాకు అనిపించింది. ఎడమవెపున ఉన్న గుట్టను వదిలి వేయాలి, ఎందువల్లనంటే అది నకాహుయసు వైపుకు వంగి ఉంది. మేము క్రిందికి దిగి ఓ గంట ఇరవై నిముషాలలో క్యాంపుకు చేరుకున్నాము. సరుకులు తీసుకు రావడానికి ఎనిమిది మందిని పంపాము. కాని వారు అన్నింటిని తీసుకురాలేక పోయారు. బ్రౌవులియో, నాటోల స్థానాన్ని ఎల్ రూబియో, డాక్టర్లు భర్తీ చేశారు. ఎల్ రూబియో ఇక్కడికి రావడానికి ఒక కొత్తదారిని కనుగొన్నాడు. నది ప్రక్క కొన్ని రాళ్ల మీదుగా ఇది మొదలవుతుంది. నదికి ఆవలివైపున కూడ రాళ్లతో అది ముగుస్తుంది. అంటే ఆ దారిలో కాలిజాడలు ఏమీ కనిపించవు. సొరంగంపై ఏమీ పని జరగలేదు. ఎల్ లోరో కామిరోకు వెళ్లాడు.

**డిసెంబరు 30**

వర్షం వచ్చి నదికి వరదలు వచ్చినప్పటికీ మొదటి క్యాంపులో మిగిలిపోయిన సామానులను అమ్మివేసి రావడానికి నలుగురిని పంపాము. అది ఇప్పుడు పూర్తయింది. బయటనుండి వార్తలు ఏమీ లేవు. ఆరుగురు మనుషులు రెండు సార్లు సొరంగం వద్దకు వెళ్లారు. అక్కడ దాయాల్సిన అన్నింటిని దాచిపెట్టి వచ్చారు.

మట్టి చాల మెత్తగా ఉండటంతో మేము పొయ్యిని తయారు చేయలేకపోయాము.

**డిసెంబరు 31**

మోంజె వచ్చాశాడన్న వార్తను ఉదయం ఏడున్నరకు డాక్టరు తెచ్చాడు. 'ఇంతి , టుమ, అర్బనో, ఆర్టోరోలతో నేను వెళ్లాను. స్నేహపూర్వకంగానే రిసీవ్ చేసుకున్నారు కాని, పరిస్థితి టెన్షన్‌తో ఉంది. మీరెందుకు వచ్చారు? అన్న ప్రశ్న మా మధ్య కనిపించింది. కొత్తగా రిక్రూట్ చేసుకున్న పాన్ డివినో అతనితో ఉన్నాడు. అలాగే ఆదేశాలు స్వీకరించడానికి టానియా కూడ వచ్చారు. ఇక్కడే ఉంటున్న రికార్డో కూడ ఉన్నాడు.

మోంజేతో సంభాషణ సాధారణ విషయాలతో మొదలయింది. ఆ తర్వాత ఆయనకు సంబంధించిన మౌలిక అంశాలపై సాగింది. ఆ సంభాషణ ప్రధానాంశాలు:

1, ఆయన పార్టీ నాయకత్వ బాధ్యతలకు రాజీనామా చేస్తారు. పార్టీని కనీసం తటస్థంగా అయినా ఉండేట్లు చేసి, పోరాటానికి అవసరమైన కేడరును సమీకరిస్తారు.

2, విప్లవం బొలీవియాకే పరిమితమవుతుంది. పోరాటం రాజకీయ, మిలిటరీ నాయకత్వం అతనికి వెళుతుంది.

3, దక్షిణ అమెరికాలోని ఇతర కమ్యూనిస్టు పార్టీలతో సంబంధాలు నిర్వహిస్తూ, విముక్తి పోరాటానికి వాటి మద్ధతును సంపాదించేందుకు కృషి చేస్తాడు. (దీనికి డగ్లస్ బావోను ఉదాహరణగా చెప్పాడు.)

మొదటి విషయానికి సంబంధించి ఆయన వైఖరి పూర్తిగా తప్పుఅని నేను భావించినప్పటికీ, ఆయన పార్టీ కార్యదర్శి కాబట్టి ఆయన నిర్ణయానికే వదిలివేశాను. అది వూగిసలాటతో కూడుకున్నది. ఇది తమ బలహీన వైఖరిని ఖండించవలసిన వారిని, ఏదో విధంగా ఇముడ్చుకొని, చరిత్రలో వారి ప్రతిష్టను కాపాడటం. నా అభిప్రాయం సరైందని కాలమే నిర్ధారిస్తుంది.

మూడో అంశానికి సంబంధించి కాని, దాని కోసం ప్రయత్నించడం పట్ల కాని నాకు అభ్యంతరం లేదు. అయితే అయిది తప్పక విఫలమవుతుంది. డగ్లస్ బ్రావోకు మద్దతు ఇవ్వమని కోడోవిలాను కోరడం అంటే, అయన స్వంత పార్టీలోనే అంతర్గత తిరుగుబాటును పట్టించుకోకుండా వదిలివేయమనడమే. దీనిపై కూడ కాలమే తీర్పు చెబుతుంది.

రెండో అంశాన్ని మాత్రం నేను ఏ విధంగాను అంగీకరించను. మిలిటరీ కమాండరుగా నేనే ఉంటాను. ఆ విషయంలో ఎలాంటి అస్పష్టతను నేను అంగీకరించను. ఇక్కడితో సంభాషణ ముగిసింది. ఒక విషవలయం లాంటి మార్గంలో మా చర్చ నడిచింది. ఆయన దాని గురించి ఆలోచించి, బొలీవియా కామ్రేడ్స్‌తో మాట్లాడాలని మేము నిర్ణయించాము. కొత్త క్యాంపుకు మేము వెళ్లాము. అక్కడి వారితో ఆయన మాట్లాడాడు. ఇక్కడే ఉండిపోవడం, లేదా పార్టీకి మద్దతు ఇవ్వడం – ఈ రెండింటిలో దేన్నైనా ఎంచుకోవచ్చని ఆయన వారికి చెప్పాడు. కాని వారంతా ఇక్కడే ఉండి పోతామని చెప్పారు. ఇది ఆయనకు పెద్ద దెబ్బలా అనిపించింది.

మధ్యాహ్నం ఈ చారిత్రాత్మక సంఘటనకు గుర్తుగా పార్టీ చేసుకున్నాము. ఆయన మాటలనే వాడుతూ నేను సమాధానం చెప్పాను. ఇది దక్షిణ అమెరికా ఖండంలో

విప్లవానికి నూతన గ్రెటో డి మురిల్లా లాంటిదని అన్నాను. విప్లవం అనే వాస్తవంతో పోల్చుకున్నపుడు మా ప్రాణాలకు ప్రాధాన్యత లేదని నొక్కి చెప్పాను.

ఫైడల్ కొన్ని సందేశాల కవర్‌ను పంపించాడు.

**నెలసరి సమీక్ష**

క్యూబన్లతో బృందాన్ని మేము పూర్తి చేశాము. ఆత్మ స్థైర్యం బాగా ఉంది. సమస్యలు చిన్న చిన్నవి మాత్రమే. బొలీవియన్లు సంఖ్యరీత్యా తక్కువే అయినప్పటికీ వారు బావున్నారు. మోంజె వైఖరి ఒక వైపునుండి పరిణామాలను నెమ్మది చేస్తుంది, మరొక వైపు నుండి నేను రాజకీయంగా ఎలాంటి రాజీ పడకుండా చేయడం ద్వారా సానుకూల పాత్ర వహిస్తుంది. తదుపరి చర్యలు- ఇంకా బొలీవియన్ల కోసం వేచిచూడటంతో పాటు, మోయిజెస్ గువేరాతోను, అర్జెంటీనియన్లు అయిన మారిసియో, జొజామి (మాసెట్టి మరియు అసమ్మతివాద పార్టీ) లతో మాట్లాడటం.

# జనవరి 1967

**జనవరి 1**

నాతో ముందుగా చర్చించకుండానే ఉదయాన్నే మోంజె వెళ్లిపోతున్నట్లు తెలియ చేశాడు. 8వ తేదీన పార్టీ నాయకత్వానికి తన రాజీనామా అందచేస్తానని చెప్పాడు. తన మిషన్ పూర్తయిందన్న భావన ఆయనలో వ్యక్తమయింది. అతన్ని చూస్తుంటే ఉరికంబం ఎక్కడానికి వెళ్లే వ్యక్తిలా అనిపించాడు. వ్యూహాత్మక ఆధిపత్యాన్ని నేను వదులుకోవడానికి సిద్ధంగా లేనన్న నిర్ణయాన్ని కోకో నుండి తెలుసుకున్న మోంజె, అక్కడే పట్టుకు కూర్చున్నట్లు నాకు అర్థమయింది. దానికోసం ఆయన చెప్పే వాదనలే అసంబద్ధంగా ఉన్నాయి.

మధ్యాహ్నం నేను అందరినీ సమావేశ పరిచి మోంజె వైఖరిని వివరించాను. విప్లవం కావాలని కోరుకునే ప్రతి ఒక్కరితోను మనం కలిసి పనిచేయాలని నేను చెప్పాను. బొలీవియన్లు ముందు ముందు ఎన్నెన్నో ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని, నైతికంగా బాధలకు గురికావలసి వస్తుందని వూహిస్తున్నట్లు తెలిపాను. వాటిని సమిష్టి చర్చల ద్వారాను, కమిస్సార్ల ద్వారాను పరిష్కరించుకోవాలని చెప్పాను.

టానియా అర్జెంటినా వెళ్లడానికి ఏర్పాటు చేశాను. అక్కడ ఆమె మారిసియో, జొజామిలను ఇంటర్వ్యూ చేసి ఇక్కడకు తీసుకు వస్తుంది. శాంఖెజ్ నిర్వర్తించాల్సిన విధులను మేము రూపొందించాము. రొడోల్ఫో, లయోలా, హంబెర్టోలను ప్రస్తుతానికి లాపాజ్‌లోనే ఉంచాలని, లయోలా చెల్లెళ్లలో ఒకరిని కామిరిలోను, కాల్విమోంటెను శాంటాక్రజ్‌లోను ఉంచాలని నిర్ణయించాము. మిటో తాను ఎక్కడ స్థావరం ఏర్పాటుచేసుకోవాలో చూసుకునేందుకు సుక్రె జోన్ వెంట పయనిస్తాడు. ఆర్థిక వ్యవహారాలను లయోలా చూస్తాడు. ఆయనకు 80 వేల పెసోలు పంపించ బడ్డాయి. వాటిలో 20 వేలు ట్రక్కును కొనుగోలు చేసేందుకు కాల్విమోంటెకు ఇవ్వాలి. మోయిజెస్ గువేరాను ఇంటర్వ్యూ చేసేందుకు శాంఖెజ్ కాంటాక్టు చేస్తారు. కార్లస్ సోదరుడు ఒకరిని

ఇంటర్వ్యూ చేసేందుకు కోకో శాంటాక్రజ్ వెళతాడు. హవానా నుండి వచ్చే ముగ్గురు వ్యక్తులను కలుసుకునే బాధ్యతను అతనికి అప్పగిస్తాడు. ఫైడల్‌కు నేనొక సందేశం రాశాను. అది డాక్యుమెంటు సిజడ్‌ఓ. నెం.2 లో ఉంది.

**జనవరి 2**

మేము ఉదయం అంతా లెటర్‌ను కోడ్ చేస్తూ గడిపాము. ఇతరులు (శాంఖెజ్, కోకో, టానియా) ఫైడెల్ ఉపన్యాసం అయిన వెనువెంటనే మధ్యాహ్నం వెళ్లిపోయారు. సాధ్యమయితే మరింత కష్టతరమైన కర్తవ్యాన్ని నిర్వహించాలన్న ధోరణిలో ఆయన ప్రసంగం సాగింది.

క్యాంపులో మేము సొరంగం మీదనే పనిచేశాము. మిగతా వారు మొదటి క్యాంపులో మిగిలిపోయిన పనులు పూర్తిచేయడానికి వెళ్లారు. మార్కస్, మిగ్యుయెల్, బెనిన్నోలు ఉత్తర దిశ అన్వేషణకు బయలుదేరారు. ఇంతి, కార్లస్‌లు కొంతమంది మనుషులు కనిపించేవరకు నకాహుయసును అన్వేషిస్తూ వెళ్లారు. వారికి మనుషులు తారసపడింది బహుశా యాకివద్ద అనుకుంటాను. జాక్విన్, డాక్టర్లు నదిని అన్వేషిస్తూ దాని జన్మస్థానం వద్దకు, లేదా మనుషులు ఎవరైనా కనిపించే వరకు వెళ్లాలి. మహాఅయితే వారికింకా ఐదురోజులు మిగిలి ఉంటాయి.

మోంజెను వదిలిపెట్టిన తర్వాత ఎల్‌లోరో తిరిగి రాలేదని క్యాంపునుండి వచ్చిన కొందరు చెప్పారు.

**జనవరి 3**

సొరంగానికి పైకప్పు తయారు చేయడానికి మేము విఫల యత్నం చేశాము. దాన్ని రేపటికల్లా పూర్తిచేయాలి. లోడు తీసుకు రావడానికి ఇద్దరు మాత్రమే వెళ్లారు. అంతా రాత్రి వెళ్లిపోయారన్న వార్తను తెచ్చారు. మిగతా కామ్రేడ్స్ కిచెన్‌కు పైకప్పు వేయడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికి ఆ పని పూర్తయింది.

**జనవరి 6**

ఉదయాన్న మార్కస్, జాక్విన్, అలెజాండ్రో, ఇంతి, నేను జనసంచారం లేని కొండచరియ మీదకు వెళ్లాము. అక్కడ నేను ఈ క్రింది నిర్ణయం తీసుకున్నాను: ఎల్ కాంబా, పాచోలతో కలిసి మార్కస్, కుడివైపునుండి కాంటాక్టు ఏమీ లేకుండా నకాహుయసును చేరుకోవడానికి ప్రయత్నిస్తాడు. బ్రౌవులియో, అనిసెటోలతో కలిసి మిగ్యుయెల్ కొండచరియ మీదుగా మధ్య దారిని ఏర్పాటుచేయడానికి వెళతాడు. బెనిన్నో, ఇంతీలతో కలిసి జాక్విన్, ఫ్రియాస్ నదికి మార్గాన్ని కనుగొనేందుకు బయలు దేరతాడు.

మ్యాపు ప్రకారం అది నచాసుకు సమాంతరంగా కొండచరియకు ఆవలి వైపున ప్రవహిస్తూ ఉంటుంది. అది కచ్చితంగా పంపా డెల్ టిగ్రె.

మధ్యాహ్నానికల్లా ఎల్ లోరో రెండు గుర్రాలను కొనుక్కొని వచ్చాడు. 2000 పెసోలు వెచ్చించాడు. మంచి బేరమే. అవి బలంగా ఉన్నాయి. బాగ మచ్చిక అయినవాటిగా కనపడుతున్నాయి. బ్రౌవులియో, పాచోలను తీసుకు రావడానికి ఒకరిని పంపాము. అతను రేపు వెళ్లిపోవలసి ఉంది. వారి స్థానంలో కార్లస్, డాక్టర్లను ఉంచాము.

క్లాస్ ముగిసిన తర్వాత, గెరిల్లాకు ఉండాల్సిన లక్షణాల గురించి, కచ్చితమైన క్రమశిక్షణ ఆవశ్యకత గురించి నేను కొద్ది సేపు ప్రసంగించాను. ఉక్కు లాంటి ఒక బలమైన కేంద్రాన్ని తయారు చేయడం మన మిషన్ అని నేను చెప్పాను. దాని కోసం అధ్యయనం ప్రాధాన్యతను, భవిష్యత్తును రూపుదిద్దుకోవడంలో దాని పాత్రను వివరించాను. ఆ తర్వాత బృందాల నాయకులు– జాక్విన్, మార్కస్, అలెజాండ్రో, ఇంతి, రొలోండో, పోంబో, డాక్టర్, ఎల్ నాటో, రికార్డోలను సమావేశపరిచాను. మార్కస్ కొన్ని తప్పులను పదేపదే చేయడం వల్ల, జాక్విన్‌ను ఉపఅధిపతిగా ఎంపిక చేసినట్లుగా వివరించాను. నూతన సంవత్సరం రోజు మిగ్యుయెల్‌తో జాక్విన్‌కు జరిగిన సంఘటనను కూడ నేను విమర్శించాను. ఆ తర్వాత మన నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలంటే తీసుకోవలసిన కొన్ని చర్యల గురించి వివరించాను. నేను పూర్తి చేయగానే, టానియా ఎదుట తనకు ఇవాన్‌కు మధ్య జరిగిన సంఘటన గురించి రికార్డో నాకు చెప్పాడు. ఈ ఘటనలో ఒకరిని మరొకరు బెదిరించుకున్నారు. జీపులోనుండి దిగివెళ్లిపొమ్మని ఇవాన్‌ను రికార్డో ఆదేశించాడు. కామ్రేడ్స్ మధ్య ఈ విచారకరమైన ఘటనలు చాల హాని కలుగ చేశాయి.

**జనవరి 7**

అన్వేషకులు వెళ్లిపోయారు. ఎల్ నాటో, అలెజాండ్రోలు మాత్రమే సరఫరాల కోసం కేటాయించబడ్డారు. మిగతా వారంతా క్యాంప్ డ్యూటీల్లోనే ఉన్నారు. జనరేటర్‌ను, అర్గురోకు చెందిన అన్ని వస్తువులను మేము తీసుకు వెళ్లాము. గుహకు అదనపు పైకప్పును తయారు చేశాము. బావిని బాగుచేశాము. ప్రవాహం ఆవలికి పోవడానికి ఒక చిన్న బ్రిడ్జిని కూడ తయారు చేశాము.

**జనవరి 10**

పాత క్యాంపులో పర్మినెంటు వాచ్‌ని మార్పుచేశాము. కార్లస్, డాక్టర్ల స్థానాలను ఎల్ రూబియో, అపొలినార్‌లు భర్తీ చేశారు. నదిలో ఇంకా వరద పరిస్థితి కొనసాగుతున్నది. అయితే కొద్దిగా తగ్గుముఖం పట్టింది. ఎల్ లోరో శాంతాక్రజ్ వెళ్లి ఇంకా తిరిగి రాలేదు.

ఆంటోనియాతో కలిసి డాక్టరు (మోరో). టూమా, నేను పంపా డెల్ టిగ్రెకు వెళ్లాము. ఆంటోనియో అక్కడ క్యాంపు బాధ్యత చూడాల్సి ఉంది. అక్కడ నేను ఆంటోనియాకు రేపు తన బాధ్యతల గురించి వివరించాను. క్యాంపుకు పశ్చిమాన ఉంటుందనుకుంటున్న ప్రవాహాన్ని అతను కనిపెట్టాలి. అక్కడి నుండి మేము మార్కస్ పయనించిన పాత రోడ్డుకు కనెక్షన్ కనిపెట్టేందుకు పూనుకున్నాము. అది తేలిగ్గానే మాకు సాధ్యమైంది. మా అన్వేషకుల్లో ఆరుగురు ఉదయానికల్లా తిరిగి వచ్చారు. బ్రౌవులియో, అనిసెటిలతో మిగ్యుయెల్, బెనిన్హో, ఇంతిలతో జాక్విన్‌లు వచ్చారు. మిగ్యుయెల్, బ్రౌవులియోలు నదికి కొండచరియ మీదుగా వెళ్లే మార్గాన్ని కనుగొన్నారు. తర్వాత మరో దారిని కూడ కనిపెట్టారు, అది నకాహుయసు కావచ్చు. జాక్విన్ నది వెంట వెళ్లి పోయాడు. బహుశా అది ఫ్రియాస్ కావచ్చు. ఇది మరో బృందం వెళ్లినదే అనిపిస్తున్నది. దీన్ని బట్టి మా మ్యాపులు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో అర్థమవుతుంది. ఆ మ్యాపుల ప్రకారం రెండు నదుల మధ్య కొంత భూభాగం ఉంటుంది. అవి విడివిడిగా గ్రాండెలో కలుస్తాయని మ్యాపుల్లో ఉంది. మార్కస్ ఇంకా తిరిగి రాలేదు.

హవానా నుండి సందేశం వచ్చింది. దాని ప్రకారం ఎల్ చినో, డాక్టర్లు 12న బయలు దేరుతున్నారు. రేడియో టెక్నీషియన్ రియో నుండి 14న బయలు దేరతాడు. మిగతా ఇద్దరు కామ్రేడ్స్ గురించి ఆ సందేశంలో ఏమీ లేదు.

**జనవరి 11**

కార్లస్, అర్టురోలతో కలిసి పక్కనే ఉన్న ప్రవాహాన్ని పరిశీలించడానికి ఆంటోనియో వెళ్లాడు. ఆ ప్రవాహం వేట స్థలం మీదుగా నకాహుయసు చేరుతుందన్న సమాచారంతో రాత్రికి తిరిగి వచ్చాడు. ఆర్టురో గుహలో అలెజాండ్రో, పోంబోలు మ్యాపులపై పనిచేయడానికి పూనుకున్నారు. నా పుస్తకాలన్నీ తడితడిగా తయారయ్యారని, వాటిలో కొన్ని పాడయిపోయాయని, వాకీ టాకీ పరికరాలు, రేడియో పరికరాలు కూడ తడిగా అయ్యాయని, తుప్పు పట్టినట్టుగా తయారయ్యాయని వారు వార్త తీసుకొచ్చారు. వీటన్నింటికి మించి రెండు రేడియో సెట్లు పగిలిపోయాయన్న వార్త బాధ కలిగించింది. ఆర్టురో పనితీరు ఎలా ఉంటుందో దీన్ని బట్టి అర్థమయింది.

రాత్రికి మార్కస్ తిరిగొచ్చాడు. నకాహుయసు వెంట చాల దూరం వెళ్లాడు. అయినా మేము అనుకున్నట్లు నది చీలిన ప్రదేశం ఫ్రియాస్‌ను కనుగొనలేకపోయాడు. ఈ మ్యాపుల విశ్వసనీయత పట్ల కాని, కొత్తగా కనిపించిన ప్రవాహం ఏమిటి అన్న విషయం కాని నాకు అర్థం కాలేదు.

అనీసెటో, పెడ్రోల ద్వారా క్వెచువా భాషను నేర్చుకోవడం ఆరంభించాము.

ఈ రోజు బోరోలది. మార్కస్, కార్లస్, పోంబో, ఆంటోనియో, మోరో, జాక్విన్‌ల శరీరాల నుండి బోరో కీటకపు లార్వాలను తీశాము.

**జనవరి 12**

చివరి వస్తువులను తీసుకు రావడానికి సరఫరా బృందాన్ని పంపాము. ఎల్ లోరో ఇంకా తిరిగి రాలేదు. మేము ఉంటున్న ప్రవాహం చుట్టు ఉన్న కొండలను ఎక్కడానికి అనేక ఎక్సర్‌సైజులు చేశాము. ఇరువైపుల నుండి వెళ్లడానికి ఒక్కో వైపు నుండి రెండు గంటల పైగా పట్టింది. సెంటరు నుండి అయితే ఏడు నిముషాలు మాత్రమే పట్టింది. మా రక్షణకు స్థావరంగా చేసుకోవలసిని చోటు ఇదే. మార్కస్ పొరపాట్ల గురించి సమావేశంలో నేను చెప్పటం పట్ల అతను బాధపడ్డాడని జాక్విన్ తదుపరి సమావేశంలో చెప్పాడు. నేను అతనితో మాట్లాడాలి.

**జనవరి 13**

నేను మార్కస్‌తో మాట్లాడాను. ఆయన అభ్యంతరం నేను బొలీవియన్ల ముందు చెప్పడం. అతని వాదనకు ఎలాంటి ప్రాతిపదిక లేదు. అతని భావోద్వేగం తప్పు. దాని గురించే ఆలోచించాలి. మిగతా దాన్ని పట్టించుకోవలసిన అవసరం లేదు.

అలెజాండ్రో తనను దెబ్బతీయడానికి చేసిన ప్రయత్నాల గురించి కూడ మార్కస్ చెప్పాడు. ఈ విషయాన్ని కూడ అలెజాండ్రో మాట్లాడి పరిష్కరించాను. అది కొంత మట్టుకు పుకారు అని అనిపించింది. ఆ తర్వాత మార్కస్ కొంత శాంతపడ్డాడు.

ఇంతి, మోరోలు వేటకు వెళ్లారు, కాని ఏం పట్టుకు రాలేక పోయారు. గుర్రాలు ఉండేలా ఓ గుహను తవ్వమని బృందాలను పంపించాము. కాని అది సాధ్యం కాలేదు. వాటికోసం మట్టితో ఒక గుడిసెను తయారు చేయాలని నిర్ణయించాము. అలెజాండ్రో, పోంబోలు ప్రవేశ ద్వారం వద్ద రక్షణను పరిశీలించారు. కందకాలు తవ్వడానికి మార్క్ చేశారు. రేపు వారు ఆ పనిని కొనసాగిస్తారు.

ఎల్ రూబియో, అపోలినార్‌లు తిరిగి వచ్చారు. బ్రౌవులియో, పాచోలు పాత క్యాంపుకు వెళ్లారు. ఎల్ లోరో నుండి వార్తలేమీ లేవు.

**జనవరి 14**

మార్కస్, బెనిన్నో మినహా తన ఎడ్వాన్స్ పార్టీతో కలిసి ప్రవాహం దిగువకు గుడిసెను నిర్మించేందుకు వెళ్లాడు. రాత్రికి లోపు అతను వచ్చే అవకాశం లేదు. కాని

వర్షం రావడంతో మధ్యాహ్నానికే గుడిసె పూర్తి కాకుండానే క్యాంపుకు తిరిగి రావలసి వచ్చింది.

కందకాలు తవ్వడం ఆరంభించిన బృందానికి జాక్విన్ సూచనలు చేశారు. మోరో, అర్బానో, ఇంతి, నేను కలిసి ప్రవాహానికి కుడివైపునుండి కొండ చరియ పక్కగా మా క్యాంపు పరిమితి చుట్టూ ఒక రోడ్డును తయారు చేయాలని వెళ్లాము. కాని మేము తప్పుదారిలో వెళ్లాము. ఫలితంగా కొంత ప్రమాదకరమైన నిటారు శిలలు మమ్మల్ని నిరోధించాయి. మధ్యాహ్నానికి వర్షం మొదలయింది. పనులన్నీ కట్టిపెట్టాము. ఎల్ లోరో నుండి వార్త లేమీ రాలేదు.

**జనవరి 15**

సిటీలోని క్యాడర్‌కు కొన్ని ఆదేశాలు రాస్తూ నేను క్యాంపులోనే ఉండి పోయాను. ఆదివారం కావడంతో మేము సగం రోజే పనిచేశాము. అగ్రభాగాన ఉండే దళం గుడిసె పనిలోను, వెనుక, మధ్య భాగాన ఉండే దళాలు కందకాలు తవ్వడంలోను ఉన్నారు. నిన్నటి రోడ్డును మెరుగుపరచడానికి రికార్డో, అర్బానో, ఆంటోనియాలు వెళ్లారు. కాని వాళ్లు ఆ పని పూర్తి చేయలేకపోయారు. నదీ ప్రవాహం వైపుగా గుట్టకు, కొండచరియకు మధ్య నిటారుగా ఉండే ఎత్తయిన రాయి అడ్డుపడటంతో వారు ఆగిపోవలసి వచ్చింది.

పాత క్యాంపుకు ప్రయాణం చేయలేదు.

**జనవరి 16**

కందకాలపై పనిని కొనసాగించాము. ఇంకా పూర్తి కాలేదు. మార్కస్ ఒక చిన్నపాటి గుడిసెను నిర్మించడాన్ని దాదాపు పూర్తి చేశాడు. బ్రౌవులియో, పెడ్రోల స్థానంలో డాక్టర్, కార్లస్‌లు వచ్చారు. గుర్రాలతో ఎల్ లోరో తిరిగి వచ్చాడన్న వార్తను కూడ వారు తెచ్చారు. కాని అనీసెటో అతన్ని తీసుకు రావడానికి వెళ్లినప్పటికీ కలుసుకోలేదు.

అలెజాంద్రోకు మలేరియా సోకిన సూచనలు కనిపిస్తున్నాయి.

**జనవరి 17**

ఈ రోజు దాదాపు ఎక్కడికి కదలలేదు. కందకాలను, గుడిసెను పూర్తి చేశాము.

ఎల్ లోరో తన ప్రయాణం గురించి నివేదించేందుకు వచ్చాడు. ఎందుకు వెళ్లావని నేను అతడిని ప్రశ్నించాను. తన ప్రయాణాన్ని అంగీకరిస్తారన్న ఉద్దేశంతో వెళ్లానని అన్నాడు. తనకు తెలిసిన ఒక స్త్రీ కోసం వెళ్లానని తెలిపాడు. గుర్రానికి కళ్లెం తెచ్చాడు. కాని అతడు దాన్ని నదిలో నడిచేలా చేయలేకపోయాడు.

కోకో నుండి ఎలాంటి వార్తలు లేవు. ఇప్పుడు దాని గురించి కొంత ఆందోళన చెందాల్సి వచ్చేట్టుగా ఉంది.

**జనవరి 18**

ఉదయం మబ్బులతో ఉంది. అందుచేత నేను కందకాల తనిఖీకి వెళ్లలేదు. అర్బానో, నాటో, డాక్టర్ (మోరో), ఇంతి, అనిసెటో, బ్రౌవులియోలు సరఫరాలు తీసుకు రావడానికి వెళ్లారు. అలెజాండ్రోకు సుస్తీగా ఉండటంతో పనిచేయలేకపోయాడు.

కొద్ది సేపటికే భారీ వర్షం మొదలయింది. ఎల్ లోరో పూర్తిగా వర్షంలో ముద్దముద్దయి వచ్చాడు. ఆంటోనియోతో అనగనారజ్ మాట్లాడన్న వార్త తెచ్చాడు. అతను కొకాయిన్‌తో పాటు 'మరేదానిలో' అయినా సహకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పాడని అన్నాడు. 'మరేదయినా' అని అన్నాడంటే ఇంకా ఏదో ఉన్నదని అతను అనుమానిస్తున్నాడని అర్థం. పెద్దగా డబ్బు ఇవ్వకుండా అతనితో ఒప్పందం కుదర్చుకోమని ఎల్ లోరోకు ఆదేశమిచ్చాను. జీపులో అతను ఏమి తీసుకొచ్చినా దానికి నగదు రూపంలో మాత్రమే చెల్లించాలి. ద్రోహం చేస్తే ప్రాణాలు పోతాయని కూడ హెచ్చరించాలి. వర్షం బాగా ఎక్కువవుతుండటంతో ఆలశ్యం చేస్తే నదిని దాటడం కష్టం అవుతుందని ఎల్ లోరో అప్పటికప్పుడే బయలు దేరి వెళ్లాడు.

సరఫరాల టీము 8 గంటలు అయినా రాకపోవడంతో రేషన్ తినేయమని దళ సభ్యులకు అనుమతిచ్చాను. కొద్ది నిముషాల తర్వాత బ్రౌవులియో, ఎల్ నాటోలు కొంత ఇబ్బంది నెదుర్కొని చేరుకున్నారు. బృందం అంతా తిరిగి రావడానికి ప్రయత్నించామని, నది పొంగడంతో సాధ్యం కాలేదని వారు చెప్పారు. నదిని దాటే ప్రయత్నంలో ఇంతి తన తుపాకిని నీటిలో జార్చుకున్నాడని, వంటికి దెబ్బలు కూడ తగిలాయని వారు తెలిపారు. దీనితో మిగిలిన వారు రాత్రికి అక్కడే ఆగి పోవాలని నిర్ణయించుకున్నారని వారు చెప్పారు.

**జనవరి 19**

రొటీన్‌గానే రోజు మొదలయింది. రక్షణ ఏర్పాట్లు చేసుకోవడం, క్యాంపును మెరుగుపరుచుకోవడం చేశాము. మిగ్యుయెల్ తీవ్రమైన జ్వరంతో పడిపోయాడు. అది కచ్చితంగా మలేరియానే. నేను కూడ రోజంతా చాల ఇబ్బంది పడ్డాను, అయినా జ్వరం బయటపడలేదు.

ఉదయం 8గంటలకు నలుగురు సాహసికులు తిరిగి వచ్చారు. మొక్కజొన్నలు, మొక్కజొన్న పొత్తులు పట్టుకొచ్చారు. రాత్రంతా వారు నది ఒడ్డునే నెగడు ముందు కూర్చున్నామని చెప్పారు. నదిలో వరద తగ్గేవరకు ఉండి తుపాకిని వెదికి తీసుకు రావాలని ప్రయత్నించామని తెలిపారు.

సాయంత్రం నాలుగు గంటలకు ఎల్ రూబియో, పెడ్రోలు, రెండో క్యాంపులో గస్తీ ఉన్న ఇద్దరిని రిలీవ్ చేసేందుకు వెళ్లారు. రెండో క్యాంపు వద్దకు పోలీసులు వచ్చారని డాక్టరు తెలియ చేశాడు. లెఫ్టినెంట్ ఫెర్నాండెజ్, మరో నలుగురు పోలీసులతో కలిసి సివిల్ డ్రస్‌లో ఒక అద్దె జీపులో కొకాయిన్ ఫ్యాక్టరీని కనుగొనేందుకు అక్కడికి వచ్చాడని చెప్పాడు. అక్కడి ఇంటిలో వారికి అలాంటి ఆనవాళ్లు ఏమీ కనిపించలేదు. కార్బయిడ్ లాంటి కొన్ని అస్తవ్యస్తమయిన వస్తువులు మాత్రమే ఉన్నాయి. క్యాంపులో దీపాలు వెలిగించడానికి ఆ కార్బయిడ్‌ను తీసుకొచ్చాము. దాన్ని గుహవరకు తీసుకెళ్లలేదు. ఎల్ లోరో పిస్టల్‌ను వారు తీసుకెళ్లారు. మాజర్‌ను, .22ను వదిలి వేశారు. అరగనారజ్ నుండి .22ను తీసుకు వెళుతున్నట్లు వారు 'నటించారు'. దాన్ని వారు ఎల్ లోరోకు చూపించారు. తమకు అంతా తెలుసునని హెచ్చరిస్తూ వాళ్లు వెళ్లిపోయారు. కామిరి వచ్చి తన పిస్టల్‌ను ఎల్ లోరో తిరిగి తీసుకెళ్లవచ్చునని, ఇక్కడ ఎక్కువ మాట్లాడవద్దని చెబుతూ ఫెర్నాండెజ్ వెళ్లిపోయాడు. అతను 'బ్రెజీలియన్' కోసం అడిగాడు. వాలెగ్రాండె నుండి వచ్చిన వ్యక్తిని, అరగనారజ్‌ను బెదిరించమని నేను ఆదేశించాను. వాళ్లిద్దరే ఇన్‌ఫార్మర్లు, లేదా గూఢచారులు. పిస్టల్‌ను తీసుకొచ్చుకునే సాకుతో కామిరి వెళ్లమని చెప్పాను. అక్కడికి వెళ్లిన తర్వాత కోకోతో కాంటాక్టు పెట్టుకోవచ్చని తెలిపాను.(కోకో అప్పటికీ స్వేచ్ఛగానే ఉన్నాడని నేను అనుకున్నాను.) ఎంతవరకు సాధ్యమయితే ఆంతవరకు వారు అడవిలో నివసించాలి.

**జనవరి 20**

పరిస్థితిని తనిఖీ చేశాను. గత రాత్రి వివరించిన రక్షణ పథకాన్ని అమలు చేయమని ఆదేశించాను. అది నదిని ఆనుకుని ఉన్న జోనుకు త్వరిత రక్షణ ప్రాతిపదికన ఉంది. మాకు వెనక భాగాన మొదలయ్యే సమాంతర క్యాంపు వద్ద ఉన్న అగ్రదళంలో కొందరు ఎదురుదాడి జరిపిన దానిపై ఇది ఆధారపడుతుంది.

పరీక్ష కోసం కొన్ని ఎక్సర్‌సైజులు చేద్దామని అనుకున్నాము. కాని పాత క్యాంపులో పరిస్థితి మరింత రాజీపూర్వకంగా ఉంది. ప్రత్యేకించి గ్రింగో తన ఎం–2తో కొన్ని సార్లు పేల్చిన తర్వాత పరిస్థితి మారింది. అతను అరగనారజ్‌కు స్నేహితుడట. కొన్ని

రోజుల పాటు అరగనారజ్ ఇంటి వద్ద  పదిరోజులపాటు శెలవులు గడపడానికి వచ్చాడని చెబుతున్నారు. దళాన్ని అక్కడ పరిశీలించడానికి పంపుతాము. వారు అరగనారజ్ ఇంటి వరకు వెళతారు. మేము వెళ్లిపోయే లోగా అది పేలితే మా ప్రభావం ఏమిటో అతనికి తెలిసి  వస్తుంది.

మిగ్యుయెల్ జ్వర తీవ్రత ఇంకా తగ్గలేదు.

**జనవరి 21**

మాక్ పోరాటాన్ని నిర్వహించాము. కొన్ని చోట్ల అది విఫలమయింది. మొత్తం మీద సంతృప్తికరంగా ఉంది. వెనక్కి ఎలా తగ్గడం అన్నదాన్ని నేర్చుకోవడంపై మరింత కష్టపడాలి. అదే పెద్ద బలహీనతగా ఉంది. ఆ తర్వాత మిషన్ బయలు దేరింది. ఒకటి బ్రౌవులియోతో పాటు పశ్చిమంగా నదికి సమాంతరంగా వెళుతుంది. రెండవది, రోలాండోతో కలిసి నదికి సమాంతరంగానే తూర్పువైపుగా వెళుతుంది. వాకీటాకీని పరీక్షించేందుకు పోచో జనసంచారం లేని కొండపైకి వెళ్లాడు. అరగనారజ్‌ను దగ్గరగా ఉండి పరిశీలించేందుకు వీలుగా మార్గాన్ని చూసేందుకు అనిసెటోతో కలిసి మార్కస్ వెళ్లాడు. మార్కస్ మినహా మిగతా వారంతా 2 గంటల లోపు తిరిగి రావాలి. దారులు తయారయ్యాయి. అలాగే రేడియో పరీక్షలు కూడ సానుకూలంగా పూర్తయ్యాయి. వర్షం మూలంగా వెలుతురు లేకపోవడంతో మార్కస్ త్వరగానే తిరిగొచ్చాడు. వర్షంలోనే పెడ్రో వచ్చాడు. కోకోతో పాటు ముగ్గురు కొత్తగా రిక్రూట్ చేసుకున్న వారు– బెంజమన్, ఒసోబియో, వాల్టర్‌లను తీసుకొచ్చాడు. మొదటి వ్యక్తి క్యూబా నుండి వచ్చాడు. తుపాకి పేల్చడం తెలుసు. అగ్ర భాగాన ఉండే దళంతో పాటు వెళతాడు. మిగిలిన ఇద్దరు వెనుక భాగాన ఉండే దళంలో ఉంటారు. క్యూబా నుండి వస్తున్న ఈ ముగ్గురితో మేరియో మాంజో మాట్లాడాడు. వారిని గెరిల్లాలతో కలవ వద్దని ఒప్పించేందుకు ప్రయత్నించాడు. అతను ఇంతకు ముందు చెప్పిన విధంగా పార్టీ పదవికి రాజీనామా ఇవ్వలేదు. అంతేకాకుండా జతచేసిన డాక్యుమెంటు4ను ఫైడల్‌కు పంపించాడు. టానియా వెళ్లిపోతున్నట్లు వర్తమానం పంపింది. ఇవాన్ అనారోగ్యం గురించి కూడ తెలిపింది. ఇవాన్ నుండి ఒక నోట్ కూడ ఆమె ఇచ్చింది. దాన్ని డాక్యుమెంట్ 5గా జతచేస్తున్నాను. బృందం అంతటినీ రాత్రి సమావేశపరిచాను. డాక్యుమెంటును చదివి వినిపించాను. దానిలో కార్యాచరణకు సంబంధించిన ఎ, బి అంశాలలోని పొరపాట్లను ఎత్తిచూపాను. వారితో పాటు నేను గట్టి లైను తీసుకున్నాను. వారి ప్రతిస్పందన బాగా ఉంది. కొత్తగా చేరిన ముగ్గురిలో ఇద్దరు గట్టిగా ఉన్నట్లు, చైతన్యపూరితంగా ఉన్నట్లు అనిపించింది. మూడవ వ్యక్తి అందరికంటే చిన్నవాడు. అయమారి రైతు. చాల ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు.

**జనవరి 22**

పెడ్రో, ఎల్ రూబియోలను రిలీవ్ చేయడానికి 13 మంది సరఫరా బృందం బ్రౌవులియో, వాల్టర్‌లతో కలిసి బయలు దేరింది. వారు కొన్ని సామాన్లను అక్కడ ఉంచి సాయంత్రానికి చేరుకున్నారు. అక్కడ అంతా ప్రశాంతంగా ఉంది. వెనక్కి తిరిగి వచ్చేటపుడు ఎల్ రూబియో అకస్మాత్తుగా క్రింద పడ్డాడు. అయితే దెబ్బలేమీ తగల లేదు.

పరిస్థితిని వివరించేందుకు, మా కమ్యూనికేషన్ తెలియచేసేందుకు ఫైడల్‌కు నేనొక డాక్యుమెంటును # 3ని తయారు చేస్తున్నాను. కామిరిలో 25న జరగబోయే సమావేశానికి మోయిజెస్ గువేరా వచ్చినట్లయితే దాన్ని అతనితో శాంటాక్రజ్‌కు పంపాలి.

పట్టణ ప్రాంతాలలోని క్యాడర్ కోసం ఆదేశాలతో డాక్యుమెంటు4ను తయారు చేస్తున్నాను. సరఫరాల యూనిట్ వెళ్లిపోవడంతో క్యాంపులో కార్యకలాపాలేమీ లేవు. మిగ్యుయెల్ పరిస్థితి మెరుగవుతున్నది. కాన ఇప్పుడు కార్లస్‌కు తీవ్రంగా జ్వరం వచ్చింది.

ఈ రోజు మేము క్షయ వ్యాధి పరీక్షలు చేశాము. రెండు టర్కీలను కొట్టాము. ఒక జంతువు కూడ వుచ్చులో పడింది. కాని అది ఒక కాలిని కొరుక్కొని పారిపోయింది.

**జనవరి 23**

క్యాంపు డ్యూటీని కొందరికి అప్పగించాము. మరికొందరిని బృందాలుగా పరిశీలన కోసం పంపించాము. ఇంతి, ఆర్టురో, రోలోండోలు మదుగైన మంచి ప్రదేశాన్ని వెదికేందుకు వెళ్లారు. దానిలో డాక్టరు గాయపడ్డ వ్యక్తితో పాటు ఉంటాడు. మార్కస్, అర్బానో, నేను మాకు ఎదురుగా ఉన్న కొండపై పరిశీలనకు వెళ్లాము. అరగనారజ్ ఇంటిపై నిఘా వేసి ఉంచేందుకు అనువైన ప్రదేశాన్ని వెదకడం మా ఉద్దేశం. అలాంటి ప్రదేశాన్ని మేము కనిపెట్టాము. అక్కడి నుండి ఆ ఇల్లు చక్కగా కనిపిస్తున్నది.

కార్లస్ ఇంకా మలేరియాతో బాధపడుతూనే ఉన్నాడు.

**జనవరి 24**

ఏడుగురితో వెళ్లిన సరఫరా బృందం త్వరగానే తిరిగొచ్చింది. అన్ని సామానులతో పాటు, కొంత మొక్కజొన్నలు కూడ తెచ్చింది. నది లోకి దూకడం ఈ సారి జాక్విన్ వంతు. నదిలో పోగొట్టుకున్న గరాండ్‌ను తిరిగి సంపాదించ కలిగాడు. ఎల్ లోరో వచ్చాడు. రహస్య ప్రదేశంలోకి వెళ్లిపోయాడు. కోకో, ఆంటోనియోలు ఇంకా బయటనే ఉన్నారు. రేపు, కాని ఎల్లుండి కాని మోయిజెస్ గువేరాతో పాటు వస్తారు.

ఈ ప్రదేశంపై శత్రువులు దాడి చేసినపుడు రక్షణ చర్యగా శత్రువును చుట్టుముట్టడానికి ఉపయోగపడే దారులను బాగుచేశాము. సాయంత్రం నిన్న జరిపిన విన్యాసం గురించి, దానిలో జరిగిన పొరపాట్ల గురించి చర్చించాము.

**జనవరి 25**

శత్రువు వెనుకభాగానికి వెళ్లడానికి ఉపయోగపడే దారిని అన్వేషించడానికి మార్కస్‌తో పాటు వెళ్లాము. అక్కడికి వెళ్లడానికి మాకు గంట పట్టింది. కాని లొకేషన్ అద్భుతంగా ఉంది.

అనిసెటో, బెంజిమెన్‌లు రేడియో ట్రాన్సిమిటర్‌ను పరీక్షించడానికి అరగనారజ్ ఇంటికి ఎదురుగా ఉన్న కొండపైకి వెళ్లారు. కాని వారు దారితప్పి కమ్యూనికేషన్‌ను ఏర్పాటు చేయలేకపోయారు. ఆ ఎక్సర్‌సైజ్‌ను మరోసారి చేయాల్సి ఉంది. మా వ్యక్తిగత వస్తువులను దాచిపెట్టడానికి మరో సొరంగాన్ని ప్రారంభించాము. ఎల్ లోరో వచ్చి అగ్రగామి దళంతో చేరాడు. అరగనారజ్‌తో అతను మాట్లాడాడు. నేను చెప్పమన్న మాటలను అతనికి చెప్పేశాడు. వాలెగ్రాండె నుండి వచ్చిన వ్యక్తిని మాపై నిఘా కోసమే పంపానని అంగీకరించాడు. అయితే మమ్మల్ని వ్యతిరేకిస్తున్నట్లు ఒప్పుకోలేదు. అరగానరజ్ మాపై నిఘా కోసం పంపాడు కాబట్టి వాలెగ్రాండె నుండి వచ్చిన వ్యక్తిని కోకో భయపెట్టి తరిమేశాడు. అన్నీ వచ్చేశాయని మనీలా నుండి మాకు సందేశం వచ్చింది. తన కోసం సైమన్ రేయస్ ఎదురు చూస్తున్న చోటుకు కోల్లే వెళుతున్నాడు. వారేమి చెబితే దాన్ని వింటానని ఫైడల్ చెప్పాడు. ఫైడల్ వారితో కఠినంగా ఉంటాడు.

**జనవరి 26**

మేము కొత్త గుహపై పని మొదలు పెట్టేసరికి, లయోలాతో పాటు మోయిజస్ గువేరా వచ్చాడన్న వార్త అందింది. మధ్య క్యాంపులోని చిన్న ఇంటికి మేము వెళ్లాము. మధ్యాహ్నానికి వారు అక్కడికి చేరుకున్నారు. నా షరతులను మోయిజస్ గువేరాకు చెప్పాను. అవి: బృందాన్ని రద్దు చేయాలి, ఎవరికి ర్యాంకులు ఉండవు, ఇంకా ఎలాంటి రాజకీయ సంస్థ ఏర్పాటూ ఉండదు, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఏ వివాదాస్పద సమస్యపైనా వాగ్వివాదాలు ఉండవు. అన్నింటిని అతడు అంగీకరించాడు. తొలుత ఇబ్బందికరంగా మొదలయినప్పటికీ బొలీవియన్లతో సంబంధాలు స్నేహపూర్వకంగా మారాయి.

లయోలా చాల మంచి వ్యక్తిలా నాకు కనిపించింది. ఆమె నవ యువతి, నెమ్మదిగా మాట్లాడుతుంది, కాని ఆమెలో దృఢమైన విశ్వాసాన్ని స్పష్టంగా గమనించవచ్చు.

యంగ్ కమ్యూనిస్టుల నుండి ఆమె బహిష్కరించబడవలసి ఉంది, కాని ఆమె తనంత తానుగా రాజీనామా చేసేలా చేయడానికి వారు ప్రయత్నిస్తున్నారు. క్యాడర్‌కు ఆదేశాలు జారీ చేశాను. అలాగే ఒక డాక్యుమెంటును కూడ విడుదల చేశాను. ఇప్పటివరకు ఖర్చుపెట్టిన దాని వివరాలను వెల్లడించాను. 70 వేల పెసోలు ఖర్చు అయింది. మావద్ద ఉన్న డబ్బు అయిపోవచ్చింది.

డాక్టర్ పరేజా నెట్‌వర్క్ అధిపతిగా నియమించబడతాడు. రోడోల్ఫో ఒక పక్షం రోజుల్లో వచ్చి మాతో కలుస్తాడు.

ఇవాన్‌కు నేను ఆదేశాలతో కూడిన ఒక లెటరును (డాక్యుమెంటు 4) పంపాను.

ఫార్మ్‌తో సంబంధాలు కొనసాగిస్తూనే, జీపును అమ్మేయాల్సిందిగా కోకోను ఆదేశించాను.

చీకటిపడిన తర్వాత సాయంత్రం 7 గంటలకు మేము వీడ్కోలు తీసుకున్నాము. వాళ్లు రేపు రాత్రికి బయలు దేరతారు. మోయిజస్ గువేరా ఫిబ్రవరి 4-14 తేదీల మధ్యలో మొదటి బృందాన్ని తీసుకు వస్తాడు. కమ్యూనికేషన్స్ సరిగా లేకపోవడం, అంతా కార్నివాల్‌కు వెళ్లిపోవడం వల్ల అంతకన్నా ముందు రాలేనని తాను  చెప్పాడు.

మేము మరింత శక్తివంతమైన రేడియో ట్రాన్స్‌మీటర్లను మరికొన్ని సమకూర్చు కుంటాము.

**జనవరి 27**

దాదాపు అన్నింటిని తీసుకురాగలిగిన  శక్తివంతమైన సరఫరాల బృందాన్ని మేము పంపాము. కోకో, వార్తాహరులు రాత్రికి బయలు దేరతారు. వార్తాహరులు కామిరిలో ఉండిపోతారు. కోకో జీపు అమ్మడానికి ఏర్పాట్లు చేయడానికి శాంతాక్రజ్ వెళతాడు. దాన్ని వచ్చేనెల 15 తర్వాత అమ్మాల్సి ఉంది.

మేము గుహను తవ్వుతూనే ఉన్నాము. ఉచ్చులో ఒక ఆర్మడిల్లా చిక్కింది. ప్రయాణంలో సరఫరాల కోసం ఏర్పాట్లను పూర్తిచేస్తున్నాము. సూత్రరీత్యా మేము కోకో తిరిగి రావడంతోనే బయలు దేరాల్సి  ఉంది.

**జనవరి 28**

సరఫరా బృందం మొదటి క్యాంపును పూర్తిగా శుభ్రం చేసింది. వాలెగ్రాండె నుండి వచ్చిన వ్యక్తి మొక్కజొన్న తోటల్లో తిరుగుతున్నాడని వార్తలందాయి. కాని అతన్ని

చూడటంతో పారిపోయాడు. ఫార్మ్‌కు సంబంధించి ఒక నిర్ణయం తీసుకోవలసిన సమయం ఆసన్నమయిందని ప్రతిదీ సూచిస్తున్నది.

పది రోజుల యాత్రకు సరిపడా సరఫరాలు సమకూరాయి. కోకో తిరిగి వచ్చిన తర్వాత ఒకటి రెండు రోజులకు ఫిబ్రవరి 2న తేదీన బయలు దేరాలని కూడ నిర్ణయించబడింది.

**జనవరి 29**

వంటగాళ్లు, వేటగాళ్లు, సెంట్రీలు తప్ప మిగతావారమంతా రోజంతా పూర్తిగా ఖాళీగా ఉన్నాము.

మధ్యాహ్నానికి కోకో వచ్చాడు. అతను కామిరికి మాత్రమే వెళ్లాడు, శాంతాక్రజ్ వెళ్లలేదు. విమానంపై లాపాజ్ వెళ్లేందుకు లయోలాను దిగబెట్టాడు. మోయిజస్ సూక్రెకు బస్సు మీద వెళతాడు. కాంటాక్టులు ఏర్పాటు చేసుకోవడానికి ఆదివారాన్ని కేటాయించాము.

ఫిబ్రవరి 1న మేము బయలు దేరాలని నిర్ణయించాము.

**జనవరి 30**

12 మందితో కూడిన సరఫరాల బృందం దాదాపు అన్ని సామాన్లను తెచ్చింది. అయినా మరో ఐదుగురు మోసుకురావలసిన సామాన్లు మిగిలి పోయాయి. వేటగాళ్లు ఏమీ వేటాడ లేకపోయారు.

మా వ్యక్తిగత సామాన్ల కోసం గుహను పూర్తి చేశాము. అయితే అది అంత బాగా లేదు.

**జనవరి 31**

క్యాంపులో చివరి రోజు. పాత క్యాంపును సరఫరాల బృందం పూర్తిగా ఖాళీ చేశారు. డ్యూటీలో ఉన్న ఇద్దరు గార్డులు రిలీవ్ చేయబడ్డారు. ఆంటోనియో, ఎల్ నాటో, కాంబా, ఆర్టురోలు అక్కడే ఉండారు. వారు ఈ క్రింది ఆదేశాలు అమలు చేయాల్సి ఉంటుంది: కనీసం మూడురోజులకొకసారయినా కాంటాక్టులోకి రావాలి, వారి నలుగురులో ఇద్దరు ఆయుధాలు కలిగి ఉంటారు, ఒక క్షణం కూడ నిఘా పోస్టును వదిలి పెట్టకూడదు, కొత్తగా రిక్రూట్ చేసుకున్న వారికి సాధారణ ఆదేశాలు మాత్రమే తెలియచేయబడతాయి, కచ్చితంగా అవసరమైనవి తప్ప మిగతావేవీ వారికి తెలియకూడదు, క్యాంపులో వ్యక్తిగతమైన వస్తువులు ఏమీ ఉండకూడదు, ఆయుధాలను కాన్వాసుతో

కప్పి అడవిలో దాచేయాలి,  రిజర్వు డబ్బు ఎప్పుడూ క్యాంపులోనే ఒకరి వద్ద ఉండాలి, ఇప్పటికే ఆరంభించిన మార్గాలు, సమీపంలోని ప్రవాహాలపై పెట్రోలింగ్ జరగాలి, త్వరితంగా వెనక్కితగ్గాల్సి వస్తే ఆంటోనియో, ఆర్టురో గుహకు వెళ్లాలి, ఎల్ నాటో, కాంబాలు ప్రవాహం ద్వారా వెనక్కి తగ్గాలి, వారిలో ఒకరు పరుగెత్తి కెళ్లి రేపు మేము ఎంపిక చేసే స్థలంలో సందేశం ఉంచాలి. నలుగురి కన్నా ఎక్కువ ఉంటే ఒక బృందం సరఫరాల గుహను కాపలా కాస్తుంది.

బృందంతో నేను మాట్లాడి, యాత్ర కోసం చివరి ఆదేశాలు ఇచ్చాను. కోకోకు కూడ నేను చివరి ఆదేశాలు (డాక్యుమెంటు 7) పంపుతాను.

**నెలసరి సమీక్ష**

నేను అనుకున్న విధంగానే మోంజె వైఖరి తొలుత తప్పుకునే ధోరణితోను, తర్వాత ద్రోహపూరితంగాను మారింది.

మాకు వ్యతిరేకంగా పార్టీ ఆయుధాలు చేబడుతున్నది. అది ఎక్కడికి దారితీస్తుందో నాకు తెలియదు, అది మమ్మల్ని నిరోధించలేదు, దీర్ఘకాలంలో అది బహుశా మాకు మంచిగానే పరిణమిస్తుంది (దీనిపట్ల నాకు గట్టి నమ్మకం ఉంది.). అత్యంత విశ్వాసపాత్రమైన, పోరాటశీలత కలిగిన వ్యక్తులు చైతన్యపరంగా కొంత తీవ్రమైన సంక్షోభానికి గురయినప్పటికీ– మాతోనే ఉంటారు.

ఇప్పటికి మోయిజెస్ గువేరా చక్కగా స్పందించాడు. అతను, అతని మనుషులు భవిష్యత్తులో ఎలా వ్యవహరిస్తారో చూడాల్సి ఉంది.

టానియా వెళ్లిపోయింది, అయితే ఆమె గురించి కాని, అర్జెంటీనియన్ల గురించి కాని సమాచారం ఏమీ లేదు. ఇప్పుడు వాస్తవంగా గెరిల్లా దశ మొదలవుతుంది. బృందాన్ని పరీక్షకు పెట్టాల్సి ఉంది. బొలీవియన్ విప్లవం భవిష్యత్తు ఏమిటన్న దాన్ని కాలమే చెబుతుంది.

బొలీవియా యోధులను ఇముడ్చుకోవడం, మా ఇతర కార్యక్రమాలకన్నా కష్టతరం అయింది.

# ఫిబ్రవరి 1967

**ఫిబ్రవరి 1**

మొదటి దశ పూర్తయింది. మా వాళ్లు కొంత అలసి పోయారు. అయినా మొత్తం మీద ప్రతిదీ సక్రమంగా జరిగినట్లే. అంటోనియో, ఎల్ నాటోలు పాస్‌వర్డ్‌ను అంగీకరించారు. నా వీపు సంచిని, మలేరియా బారినపడి కోలుకుంటున్న మోరో వీపు సంచిని తీసుకొచ్చారు.

ఒక బాటిల్‌లో అలారం సిస్టమ్‌ను తయారు చేశాము. దాన్ని దారికి సమీపంలోని ఒక పొదలో పెట్టి ఉంచాము.

వెనుక ఉండే బృందంలోని జాక్విన్ బరువు మోయలేక నీరుకారి పోయాడు. మొత్తం బృందం అంతా వేగం తగ్గించుకోవాల్సి వచ్చింది.

**ఫిబ్రవరి 2**

ఈ రోజు కష్టంగా నెమ్మదిగా గడిచింది. మా నడక ఇప్పటికే మందగించినప్పటికీ, డాక్టరు మూలంగా మరింత నెమ్మదయింది. సాయంత్రం 4 గంటలకు నీరు లభించే చివరి ప్రదేశానికి చేరుకుని అక్కడ క్యాంపు ఏర్పాటు చేశాము. నది వెంట (బహుశా ఫ్రియాస్ కావచ్చు) ఎంత దూరం వెళ్లగలిగితే అంత దూరం వెళ్లమని ముందుగా వెళుతున్న బృందానికి ఆదేశాలిచ్చాము. అయినా వారు కూడ అంత వేగంగా ఏమీ కదలడం లేదు. రాత్రి వర్షం పడింది.

**ఫిబ్రవరి 3**

ఉదయం వర్షం పడుతున్నది. అందుచేత మేము బయలు దేరడం 8 గంటల వరకు ఆలస్యం అయింది. మేము నడక ఆరంభించేసరికల్లా ఆనిసెటో తాడుతో వచ్చాడు.

కష్టమైన కొండ కనుమలు దాటడానికి దాన్ని వినియోగించాలి. కొద్ది సేపటికే వర్షం మళ్లీ మొదలయింది. పదిగంటలకు మేము ప్రవాహం వద్దకు వచ్చాము. పూర్తిగా తడిసి పోయాము. ఈ రోజుకు ఇక ముందుకు వెళ్లకూడదని నిశ్చయించాము. ప్రవాహం ఫ్రియాస్ నది కాకపోవచ్చు. అది మ్యాప్‌పై గుర్తించి లేదు.

రేపు ముందు వెళుతున్న బృందం పోచోతో పాటు బయలు దేరుతుంది. వారితో గంట గంటకు సంబంధం పెట్టుకుంటూ ఉంటాము.

**ఫిబ్రవరి 4**

మేము ఉదయం నుండి సాయంత్రం నాలుగు వరకు నడుస్తూనే ఉన్నాము. సూప్ తీసుకునేందుకు మధ్యాహ్నం మాత్రం రెండు గంటలు ఆగాము. రోడ్డు నకాహుయాస్ వెంట సాగింది. రోడ్డు బాగానే ఉన్నట్లు లెక్క. కాని మా షూలు మాత్రం అక్కడ పూర్తిగా దెబ్బతిన్నాయి. కొందరు కాళ్లకు దాదాపు ఏమీ లేకుండానే నడవాల్సి వచ్చింది.

బృందం బాగా అలసి పోయింది. అయినా ఇప్పటిదాకా బాగానే స్పందించింది. నేను సుమారు 15 పౌండ్ల బరువు తగ్గాను. ఇప్పుడు చాలా తేలిగ్గా నడవ గలుగుతున్నాను. అయినా నా భుజాలలో నొప్పి కొన్నిసార్లు భరించ లేనంతగా ఉంది.

నది వెంట ఎలాంటి కాలిదార్లు కాని, కొద్ది సేపటి క్రితం మనుషులు తిరిగిన కాలి జాడలు కాని కనిపించలేదు. కాని మా మ్యాపు ప్రకారం ఈ సరికే మాకు మనుషులు నివసించే ప్రదేశాలు తగలాల్సి ఉంది.

**ఫిబ్రవరి 5**

ఉదయం ఐదు గంటలు 12 నుండి 14 కిలోమీటర్లు నడిచిన తర్వాత వూహించని విధంగా కొన్ని జంతవులు కనిపించాయని ముందు వెళ్లే బృందం చెప్పింది. అవి ఒక గుర్రమూ, దాని పిల్ల అని తెలుసుకున్నాము. జనావాస ప్రదేశాల్ని తప్పుకొని వెళ్లేందుకు మేము ముందుగానే స్కౌట్లను పంపాము. మ్యాపులో గుర్తించిన ఇరిపిడి వద్ద ఉన్నామా, సెలడిల్లా కనుమ వద్ద ఉన్నామా అని మాలో చర్చ సాగింది. పాచో వచ్చి నకాహుయాసు కన్నా కొన్ని రెట్లు పెద్దదైన నదిని చూశానని చెప్పాడు. దానిని దాటడం అసాధ్యం అని కూడ అన్నాడు. మేము ఇంకా పైకి వెళ్లి గ్రాండె నదిని చూశాము. వరదనీటితో రెండు అంచులు ఒరుసుకొని ప్రవహిస్తున్నది. జనజీవనం సాగినట్లు అక్కడ కొన్ని ఆనవాళ్లు కనిపించాయి. అయితే అది చాల కాలం క్రింద అన్నట్లుగా ఉంది. రోడ్లు అంతగా అభివృద్ధి చెంది లేవు. వాటి వెంట మనుషులు నడిచిన జాడలు కనిపించలేదు.

నకాహుయాసు సమీపంలో దారిలో నీటిని వినియోగించుకోవడానికి అనువుగా లేని ఒక ప్రదేశంలో క్యాంపు చేశాము. రేపు మేము నది రెండు తీరాలను ఆ ప్రదేశాన్ని తెలుసుకునేందుకు (తూర్పు, పశ్చిమ) అన్వేషిస్తాము. మరొక బృందం నదిని దాటడానికి ప్రయత్నిస్తుంది.

**ఫిబ్రవరి 6**

ఈ రోజు ప్రశాంతంగా గడిచింది. శక్తిని కూడగట్టుకున్నాము. వాల్టర్‌తో పాటు జాక్విన్, డాక్టరు గ్రాండె నది ప్రవాహాన్ని పరిశీలించేందుకు బయలు దేరారు. ఎనిమిది కిలోమీటర్లు నడిచినా వారికి రేవు లాంటిదేమీ కనిపించలేదు. కేవలం ఉప్పునీటితో కూడిన ప్రవాహం మాత్రమే వారు చూడగలిగారు. నదీ ప్రవాహానికి ఎదురుగా మార్కొస్ కొంత దూరం వెళ్లాడు. అయినా అతను ఫ్రియాస్‌ను చేరుకోలేకపోయాడు. అనీసెటో, ఎల్ లోరోలు ఆయనతో పాటు ఉన్నారు. అలెజాండ్రో, ఇంతి, పాచోలు నదికి అడ్డంగా ఈదడానికి ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోయింది. మెరుగయిన ప్రదేశాన్ని కనుగొనేందుకు మేము ఒక కిలోమీటరు వెనక్కి వెళ్లాము. పోంబో జబ్బు పడ్డాడు.

రేపు మేము నదిని దాటేందుకు ఒక తెప్పను తయారు చేయడానికి పూనుకుంటాము.

**ఫిబ్రవరి 7**

మార్కొస్ సూచనల మేరకు తెప్ప తయారయింది. అది చాల పెద్దగా ఉంది. దాన్ని కదిలించడం కష్టంగా ఉంది. ఒకటిన్నరకు మేము నది వైపుకు బయలు దేరాము. రెండున్నరకు నదిని దాటడానికి మొదలు పెట్టాము. రెండు ట్రిప్పుల్లో ముందుండే బృందం నదిని దాటింది. మూడో ట్రిప్పులో సెంటర్ పార్టీ సగం నదిని దాటారు. వారు వీపుబ్యాగు మినహా నా సామానంతా తీసుకెళ్లారు. బృందంలో మిగతా వారిని తీసుకెళ్లేటపుడు ఎల్‌రూబియో పొరపాటు అంచనా వేశాడు. ఫలితంగా తెప్ప నదీ ప్రవాహంలో క్రిందికి కొట్టుకు పోయింది. దాన్ని మేము తిరిగి బయటకు తీసుకు రాలేకపోయాము. అది ధ్వంసమయింది. జాక్విన్ మరో తెప్పను తయారు చేయడానికి పూనుకున్నాడు. రాత్రి 9 గంటలకు కాని అది పూర్తికాలేదు. రాత్రిపూట నదిని దాటడం అవసరం లేదు. నది పోటులో ఉంది. సెంటర్ పార్టీతో నదిని దాటడానికి మిగిలిన వారు, టుమా, అర్బానో, ఇంతి, అలెజాండ్రో, నేను. టుమా, నేను నేలమీదనే పడుకున్నాము.

**ఫిబ్రవరి 10**

ఇంతి సహాయకునిగా నటిస్తూ, రైతులతో మాట్లాడటానికి వెళ్లాను. ఇంతి లాంటి బిడియపడే వ్యక్తితో మేము వారిని నమ్మించగలమని అనుకోలేదు.

రైతులు ఒక తరహాకు చెందిన వారు. వారు మాకు సహాయం చేయడానికి సిద్ధంగానే ఉన్నారు. అయితే దాని వల్ల వచ్చే ప్రమాదాలు వారికి తెలియవు. అందువల్ల వారు ప్రమాదం కల్గించే అవకాశం కూడ ఉంది. రైతుల గురించి ఇంతి అనేక విషయాలు చెప్పాడు. అయితే నిర్దిష్టంగా ఏమీ చెప్పలేకపోయాడు. ఎందువల్లనంటే అతను అభద్రతా భావంతో ఉన్నాడు.

డాక్టరు పిల్లలకు చికిత్స చేశాడు. కొందరికి నత్తలున్నాయి. మరొకరు గుర్రం తన్నులకు గురయ్యాడు. అప్పుడు మేము అక్కడి నుండి వీడ్కోలు తీసుకున్నాము.

మధ్యాహ్నం, సాయంత్రం హుమింటా (మొక్కజొన్న పిండితో తయారు చేసే ఓ రకమైన బ్రెడ్డు)ను తయారు చేస్తూ బిజీగా ఉన్నాము. కాని అది అంతగా రుచిగా లేదు. రాత్రిపూట అందరు కామ్రేడ్స్‌తో రాబోయే పదిరోజుల గురించి మాట్లాడాను. సూత్రరీత్యా మరో పదిరోజులపాటు మాసిక్యూరి వెంట నడవాలనుకున్నాను. కామ్రేడ్స్‌ను సైనికులను చూసేలా చేయడం ఉద్దేశం. ఆ తర్వాత మేము మరో దారిని కనుగొనడానికి ఫ్రియాస్ వెంట వెళతాము.

(రైతు పేరు రోజస్).

**ఫిబ్రవరి 11**

నా తండ్రి 67వ పుట్టిన రోజు

నదీ తీరం వెంట స్పష్టంగా కనిపిస్తున్న దారి వెంట నడుచుకుంటూ వెళ్లాము. చివరికి అది అస్పష్టంగా, అసలు కనిపించకుండా పోయే వరకు వెళ్లాము. అంటే అక్కడ చాలకాలంగా మనుషులెవరూ సంచరించలేదన్న మాట. మధ్యాహ్నానికల్లా మేము ఒక పెద్ద నదిని చేరుకున్నాము. అది మసిక్యురి నది కాదా అని మాకు అనిపించింది. మేము ఒక ప్రవాహం వద్ద నిలిచిపోయాము. కార్లస్‌తో కలిసి ఇంతి నదీ ప్రవాహం ఎగువకు బయలు దేరారు. పెడ్రో నది దిగువకు నదీ ముఖద్వారానికి కనుగునేందుకు బయలు దేరాడు. వారు అలా వెళ్లి అది మసిక్యురి నదేనని ప్రకటించారు. ఆ నదిలో రేవు కొంచెం దిగువకు ఉందని, దానిలో రైతులు తమ గుర్రాలపై సామాన్లు ఎత్తుతున్నారని చెప్పారు.

వాళ్లు మా కాలిజాడలు గుర్తించే అవకాశం ఉంది. ఇప్పటి నుండి మేము చాల జాగ్రత్తగా ఉండాలి. అరినాల్స్ నుండి మేము ఒకటి రెండు లీగుల దూరంలో ఉన్నామని రైతు చెప్పాడు.

ఎత్తు = 760 మీటర్లు

**ఫిబ్రవరి 12**

ముందుండే బృందం నిన్న నడిచిన 2 కిలోమీటర్లను మేము త్వరగా పూర్తిచేశాము. ఆ తర్వాత దారి ఎటో తెలియలేదు. సాయంత్రం దాదాపు 4 గంటలకు మేము ఒక మెయిన్ రోడ్డుకు చేరుకున్నాము. బహుశా మేము వెదుకుతున్నది దానికోసమే అనుకుంటాను. మాకు ఎదురుగా నదికి ఆవలి ఒడ్డున ఒక ఇల్లు కనిపించింది. అయితే దానిలోకి మేము వెళ్లలేదు. ఇటువైపునే రోజాస్ చెప్పిన మోంటోనా ఇంటి వద్దకు వెళ్లాలని నిర్ణయించుకున్నాము. ఇంతి, ఎల్ లోరోలు పైకి  వెళ్లారు. మేము వెళ్లాలనుకుంటున్న ఇల్లు అదే అయినప్పటికీ అక్కడ ఎవరూ లేరని చెప్పారు.

ఏడున్నరకు మేము రాత్రిపూట మార్చి చేస్తున్నాము. మేమింకా ఎంత నేర్చుకోవలసిందీ అప్పుడు మాకు అర్థమయింది. సుమారు పది గంటలకు ఇంతి, ఎల్ లోరోలు మళ్లీ ఆ ఇంటికి వెళ్లారు. అయినా శుభవార్త ఏమీ తీసుకు రాలేకపోయారు. ఆ ఇంటిలోని వ్యక్తి తాగి ఉన్నాడని, అంత స్నేహపూర్వకంగా ఏమీ లేడని తెలిపారు. అతని వద్ద మొక్కజొన్న పొత్తులు మాత్రమే ఉన్నాయి. అతను నదికి అవతలి వైపున ఉన్న కాబలెరో ఇంటిలోకి తాగి వచ్చాడు. అటు ఇటు వెళ్లడానికి, రావడానికి రేవు ఉంది. సమీపంలోని తుప్పల్లో పడుకోవడానికి మేము నిర్ణయించుకున్నాము. నేను విపరీతంగా అలసిపోయాను. హుమింటా నాకు నచ్చకపోవడంతో  రోజంతా ఏమీ తినకుండానే ఉండాల్సి వచ్చింది.

**ఫిబ్రవరి 13**

సూర్యోదయసమయానికి వర్షం మొదలయింది. ఉదయం అంతా విపరీతంగా నదికి వరద వచ్చేంత వరకు వర్షంపడుతూనే ఉంది. కొద్దిగా మంచి వార్త లభించింది. పదహారేళ్ల మోంటానో యజమాని కుమారుడు. అతని తండ్రి ఇంటి వద్ద లేడు. వారం తర్వాత వస్తాడు. నదిని దాటే రేవు ఒక లీగు దూరం తర్వాత ఉంటుందని కచ్చితమైన క్లుప్తమైన సమాచారాన్ని అతడు అందించాడు. నదికి ఎడమ గట్టుమీదుగా ఒక రోడ్డు

వెళుతుంది. అయితే అది చాల కొద్ది దూరం మాత్రమే. నదికి ఈవలి ఒడ్డున పెరెజ్ అనే రైతు సోదరుడు మాత్రమే ఉన్నాడు. అతని కుమార్తెకు ఒక సైనికునితో నిశ్చితార్థమయింది.

మొక్కజొన్న తోట సమీపంలోని ప్రవాహం వద్ద ఉన్న నూతన క్యాంపుకు మేము వెళ్లాము. మార్కొస్, మిగ్యుయెల్‌లు మెయిన్ రోడ్డుకు దారి తయారు చేశారు.

ఎత్తు = 650 మీటర్లు (తుపాను వాతావరణం)

**ఫిబ్రవరి 14**

అదే క్యాంపులో ప్రశాంతమైన రోజు. ఆ ఇంటిలో పిల్లాడు మూడు సార్లు మా వద్దకు వచ్చాడు. నదికి ఆవల వైపునుండి కొందరు ఇటువైపుకు వచ్చారని, వాళ్లు పందులకోసం వెదుకుతున్నారని చెప్పాడు. అయితే వాళ్లు మా సమీపంలోకి రాలేదు. మొక్కజొన్న తోట పాడయినందుకు మేము అతనికి మరికొంత డబ్బు ఇచ్చాము.

పట్టా కత్తులతో వెళ్లిన వారు రోజంతా ప్రయత్నించినా ఇల్లు సంపాదించలేక పోయారు. వాళ్లు ఆరు కిలోమీటర్ల మేర బాగు చేశామని, రేపు చేయాల్సిన పనిలో సగం పూర్తి చేశామని చెప్పారు. హవానా నుండి వచ్చిన సుదీర్ఘమైన వర్తమానాన్ని మేము డీకోడ్ చేశాము. దానిలో ప్రధానాంశం కోల్లెతో ఇంటర్వ్యూ గురించే. మొత్తం మా కార్యకలాపాల విస్తృతి దక్షిణమెరికా ఖండం అంతటిలో ఉంటుందని తనకు చెప్పలేదని ఆ ఇంటర్వ్యూలో అన్నాడు. అలా అయినట్లయితే తాము ఒక పథకం ద్వారా సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. వాళ్లు వివరాలు నాతో చర్చించాలని అనుకుంటున్నారు. కోల్లె, అతనితో పాటు సైమన్ రోడ్రిగెజ్, రామిరెజ్‌లు వస్తారు. పార్టీ ఏమీ నిర్ణయించినా తాను మాత్రం మాకు సహకరించనున్నట్లు సైమన్ తెలియ చేశాడు.

తన స్వంత పాస్‌పోర్ట్‌తో పర్యటిస్తున్న ఫ్రెంచిదేశీయుడు 23కల్లా లాపాజ్‌కు చేరుకుంటాడని తెలిపారు. అతనిని పెరెజా ఇంటిలో కాని, రియా ఇంటిలో కాని పెడతారు. ఇంకా ఆ వర్తమానంలో మేము ప్రస్తుతానికి డీకోడ్ చేయలేని భాగం కొంత మిగిలిపోయింది. ఈ కొత్త శాంతి దాడిని ఎలా ఎదుర్కొనాలో మేము ఆలోచించుకోవాలి. ఇతర వార్తలు: మెర్సి డబ్బు లేకుండా వట్టిచేతుల్తో తిరిగొచ్చాడు. తనవద్దనుండి సొమ్ము దొంగిలించబడిందని చెప్పాడు. అయితే ఆ డబ్బును అతడు దుర్వినియోగం చేశాడని మేము సందేహించాము. అది మరింత చెడ్డ విషయం. డబ్బుకోసం, శిక్షణ కోసం లెచిన్ అడుగుతాడు.

**ఫిబ్రవరి 15**

హిల్డిటా 11వ పుట్టిన రోజు

ఈ రోజు తేలిగ్గా నడిచాము. ఉదయం పది గంటలకు కాలిజాడలు కనిపించని చోటుకు చేరుకున్నాము. ఆ తర్వాత ప్రతిదీ నెమ్మదిగా సాగింది. సాయంత్రం ఐదు గంటకు సాగుచేసిన చేను ఒకటి కనిపించిందన్న వార్త వచ్చింది. ఆరుగంటల కల్లా ఆ వార్త ధృవీకరించబడింది. ఇంతి, ఎల్ లోరో, అనీసెటోలను ఆ చేను సాగుచేసే రైతుతో మాట్లాడేందుకు పంపించాము. ఆ రైతు పేరు మిగుయెల్ పెరెజ్ అని, నికొలస్ అనే ధనిక రైతుకు సోదరుడు అని వారు తెలుసుకొచ్చారు. కాని ఈ రైతు పేదవాడు, తన సోదరునిచేత దోపిడీకి గురి అవుతున్నాడు. మాతో సహకరించేందుకు అతను అంగీకరించాడు. రాత్రి పొద్దుపోవడంతో ఏమీ తినలేదు.

**ఫిబ్రవరి 16**

మేము సోదరుని ఆసక్తినుండి రక్షించుకునేందుకు ఓ గుట్టపై క్యాంపు చేశాము. 50 అడుగుల దిగువన నది కనిపిస్తూ ఉంది. అనుకోని పరిస్థితి ఎదురవకుండా ఉండేందుకు ఆ ప్రదేశం అనుకూలంగానే ఉన్నప్పటికీ కొద్దిగా అసౌకర్యంగా ఉంది. ట్రిప్పులో ఉపయోగపడేందుకు పెద్ద పరిమాణంలో ఆహారం తయారుచేసుకునేందుకు పూనుకున్నాము. రోసిటా వైపుగా సియెరాను మేము దాటుతాము.

మద్యాహ్నం నుండి గట్టిగా వర్షం మొదలయింది. రాత్రంతా కురుస్తూనే ఉంది. నదికి వరద వచ్చింది. దీనితో మళ్లీ మేము వేరు పడాల్సి వచ్చింది. మా పథకాలు ఆలశ్యం అయ్యాయి. ఆ రైతుకు మేము 1000 పెసోలు అప్పుగా ఇస్తాము. వాటితో అతను పందులను కొని మేపుతాడు. అతనికి పెట్టుబడిదారీ ఆశ ఎక్కువగానే ఉంది.

**17 ఫిబ్రవరి**

ఉదయం అంతా వర్షం పడుతూనే ఉంది. వరుసగా 18 గంటల పాటు వర్షం పడింది. ప్రతిదీ తడిసిపోయింది. నదికి వరద విపరీతంగా వచ్చింది. రోసిటాకు దారి కనుక్కోమని మిగ్యుయెల్, బ్రౌవులియోలతో పాటు మార్కొస్‌ను పంపాను. నాలుగు కిలోమీటర్ల దూరం దారి బాగుచేసి మద్యాహ్నానికి మార్కొస్ తిరిగొచ్చాడు. మేము మరికొంతసేపు ఆలశ్యం అయ్యాము. పంపా డెల్ టిగ్రె అని మనం పిలిచే లాంటి ఒక నిర్మానుష్యమైన కొండచరియ కనిపించిందని అతను చెప్పాడు. బాగా వేడిచేయడంతో ఇంటి నలతగా ఉన్నాడు.

ఎత్తు = 720 మీటర్లు (అసాధారణ వాతావరణం)

**ఫిబ్రవరి 18**

జోస్‌ఫినా 33వ పుట్టిన రోజు

పాక్షిక వైఫల్యం. కత్తులతో దారి చేసుకుంటూ వెళుతున్న వారివెంట నెమ్మదిగా నడుస్తున్నాము. మధ్యాహ్నం రెండు గంటలకు బయలు ప్రదేశంగా ఉన్న కొండచరియ మీదకి చేరుకున్నాము. అక్కడ దారిచేయడానికి కత్తిలాంటిదేమీ అవసరం లేదు. మేము కొద్దిగా ఆలశ్యం అయ్యాము. మూడుగంటలకు నీరు దొరికే ప్రదేశానికి చేరుకున్నాము. అక్కడే మేము క్యాంపు చేశాము. రేపు ఉదయం చరియను దాటాలని అనుకుంటున్నాము. మార్కొస్, టుమాలు దారి చూసేందుకు వెళ్లారు. అయితే వారు తెచ్చింది శుభవార్త కాదు. కొండ ఆవలి వైపు అంతా నిట్టనిలువుగా ఉందని, దాని మీదుగా ఆవలివైపుకు దిగడం అసాధ్యం అని వారు చెప్పారు. అక్కడి నుండి వెనక్కి వెళ్లడం తప్ప వేరే మార్గం లేదు.

ఎత్తు = 980 మీటర్లు

**19 ఫిబ్రవరి**

రోజంతా వృధా అయింది. కొండ దిగువకు ప్రవాహం వరకు దిగిపోయాము. దాని వెంట పైకి వెళ్లడానికి ప్రయత్నించాము. కాని సాధ్యం కాలేదు. మరో వైపు నుండి పైకి వెళ్లేందుకు మిగ్యుయెల్, అనిసెటోలను పంపాను. కాని వారు విజయవంతం కాలేకపోయారు. రోజంతా వారి కోసం ఎదురు చూస్తూ గడిపాము. తీరా వారు తిరిగి వచ్చి కొండ ఇక్కడ కూడ అదే మాదిరి కోసుగా ఉందని, దిగడం అసాధ్యం అని చెప్పారు. రేపు ప్రవాహానికి ఆవల పశ్చిమం వైపుకు ఉన్న చివరి కొండచరియను ఎక్కడానికి ప్రయత్నిస్తాము. (మిగతావి దక్షిణం వైపుకు ఉన్నాయి. అక్కడ కొండ చీలిపోతుంది.)

ఎత్తు = 720 మీటర్లు

**ఫిబ్రవరి 20**

నింపాదిగా గడిచిన రోజు. అంతా ప్రమాదాలమయం. మిగ్యుయెల్, బ్రౌవులియోలు మొక్కజొన్న తోట సమీపంలోని ప్రవాహం వద్దకు వెళ్లేందుకు పాతదారిలో బయలు దేరారు. కాని వాళ్లు దారితప్పి సాయంత్రానికల్లా ప్రవాహం వద్దకు తిరిగొచ్చారు. మేము తర్వాతి ప్రవాహం వద్దకు వెళ్లిన తర్వాత కోసుగా ఉండే కొండ వచ్చేవరకు వెళ్లమని రోలాండో, పోంబోలను పంపాను. మధ్యాహ్నం మూడుగంటల వరకు వాళ్లు

రాకపోవడంతో మార్కొస్ బాగుచేసిన దారివెంట బయలు దేరాము. పెడ్రో, ఎల్ రూబియోలను వారి కోసం ఎదురుచూసేందుకు ఉంచాము. మొక్కజొన్నతోట వద్ద ఉన్న ప్రవాహానికి సాయంత్రం నాలుగు గంటలకు చేరుకున్నాము. అక్కడ క్యాంపు ఏర్పాటు చేసుకున్నాము. దారి వెదికేందుకు వెళ్లిన వారు తిరిగి రాలేదు.

ఎత్తు = 720 మీటర్లు

**ఫిబ్రవరి 21**

ప్రవాహం ఎగువకు నెమ్మదిగా నడుస్తున్నాము. పోంబో, రోలాండోలు మరో ప్రవాహాన్ని దాటవచ్చునన్న వార్తను తీసుకొచ్చారు. కాని మార్కొస్ దీనిని కనుగొన్నాడు. అది కూడ అచ్చం ఇతరులు కనుగొన్న దాని మాదిరిగానే ఉంది. ఉదయం 11 గంటలకు బయలు దేరాము. మద్యాహ్నం ఒకటిన్నరకు మంచులాంటి నీరున్న మడుగులవద్దకు చేరాము. వాటిలోనుండి నడవలేము. దారి వెదికేందుకు ఎల్‌లారోను పంపాము. కాని అతను తిరిగి రావడానికి బాగా ఆలశ్యం అయింది. అందుకని, వెనకఉన్న బృందం నుండి బ్రౌవులియో, జాక్విన్‌లను పంపాము. ప్రవాహం కొంత వెడల్పుగా ఉందని, దాటడం సాధ్యమవుతుందని ఎల్ లోరో చెప్పాడు. అందుచేత మేము జాక్విన్ ఏమి వార్త తెస్తాడో అని ఎదురు చూడకుండానే బయలు దేరడానికి నిశ్చయించుకున్నాము. సాయంత్రం ఆరుగంటలకు మేము క్యాంపు చేశాము. కొండను దాటడానికి మంచి దారి ఉందని అప్పటికి మాకు సమాచారం అందింది. ఇంతి ఇంకా పూర్తిగా బాగుపడలేదు. ఈ వారంలో అతనికి రెండోసారి కడుపునొప్పి వచ్చింది.

ఎత్తు = 860 మీటర్లు

**ఫిబ్రవరి 22**

నేలంతా చాల దట్టంగా ఉన్న కష్టమైన కొండచరియలను ఎక్కుతూనే రోజంతా గడిచింది. బాగా అలసిపోయిన ఈ రోజు కొండశిఖరం చేరకుండానే క్యాంపు చేశాము. అందుచేత జోయాక్విన్, పెడ్రోలను పంపాను. మా లక్ష్యాన్ని చేరుకోవడానికి కనీసం మూడు గంటలు పడుతుందని వారు తిరిగివచ్చి చెప్పారు. మేము ప్రవాహం ఆరంభం వద్ద ఉన్నాము. అది దక్షిణం దిశగా ప్రవహించి మసిక్యురీలో కలుస్తుంది.

ఎత్తు = 1,180 మీటర్లు

**ఫిబ్రవరి 23**

నాకు విషాదకరమైన రోజు. లక్ష్యాన్ని చేరుకున్నాను కాని బాగా అలసి పోయాను. ఉదయాన మార్కోస్, బ్రౌవులియో, టుమాలు దారి బాగుచేయడానికి వెళ్లారు. మేము క్యాంపు వద్దనే వేచిఉన్నాము. అక్కడ మేము ఒక వర్తమానాన్ని డీకోడ్ చేశాము. నేను ఫ్రెంచి లెటర్ బాక్స్ ద్వారా పంపిన వర్తమానం అందిందని అది తెలియ చేసింది. రోళ్లు బద్దలయ్యే ఎండలో 12 గంటలకు బయలుదేరాము. కొద్దిసేపటి తర్వాత శిఖరానికి చేరతామని అనగా నేను దాదాపు స్పృహతప్పిపోయే పరిస్థితికి చేరుకున్నాము. అక్కడి నుండి నేను కేవలం వాంఛాబలంతో మాత్రమే నడిచాను. ఆ ప్రాంతం గరిష్ట ఎత్తు 1420 మీటర్లు. అక్కడి నుండి చూస్తే విశాలమైన ప్రాంతం– గ్రాండె నది, నకహుయాసు ముఖద్వారం, పాక్షికంగా రోసిటా కనిపిస్తాయి. మ్యాపులో చూపిన దానికి, ఇక్కడి పరిసరాలకు తేడా ఉంది. స్పష్టమైన విభజన రేఖ తర్వాత, అది ఒక్కసారిగా క్రిందకు వెళుతుంది. అది చెట్లు నిండి ఉండిన ఎనిమిది, పది కిలోమీటర్ల మేర ఉండే మైదానం. ఆ మైదానం రోసిటా వెంట ముగుస్తుంది. ఆ తర్వాత ఇంతే ఎత్తులో ఉండే మరో పర్వత సముదాయం మొదలవుతుంది. దూరంగా మైదాన ప్రాంతం కనిపిస్తుంది.

మేము చాల నిటారుగా ఉండే ప్రాంతం నుండి దిగాలని నిర్ణయించుకున్నాము. అలా దిగడం సాధ్యమే. మేము గ్రాండె నది వైపుకు వెళ్లే ప్రవాహం వెంట వెళతాము. అక్కడనుండి రోసిటాకు వెళతాము. మ్యాపులో చూపిన విధంగా అక్కడ ఏమీ ఇళ్లు ఉన్నట్లు కనిపించలేదు. మేము సూర్యోదయాన నీరుకూడ లేకుండా ప్రాణాంతకమైన పరిస్థితిలో 900 మీటర్లు క్రిందకు దిగాము.

నిన్న ఉదయాన మార్కోస్ ఒక కామ్రేడ్‌తో దురుసుగా మాట్లాడటం విన్నాను. ఆ రోజు తర్వాత కూడ అలా మాట్లాడటం గమనించాను. రేపు అతనితో మాట్లాడాలి.

**ఫిబ్రవరి 24**

ఎర్నెస్టికో రెండో పుట్టిన రోజు

బాధాకరమైన, నిరుత్సాహకరమైన రోజు. మేము కొంచెం దూరం మాత్రమే ముందుకు సాగగలిగాము. మేము వెళుతున్న ప్రవాహమార్గం ఎండిపోవడంతో నీరు కూడ లేదు. కత్తులు ఉపయోగించేవారు అలసిపోవడంతో 12 గంటలకు వేరే వారికి ఆ పని అప్పగించాము. రెండు గంటలకు కొంచెం వర్షం పడింది. అప్పుడే మా క్యాన్‌లను నింపుకున్నాము. కొద్దిసేపటి తర్వాత ఒక బావి కనిపించింది. సాయంత్రం 5 గంటలకు నీటితో శుభ్రపడ్డ ప్రదేశంలో క్యాంపు ఏర్పాటు చేసుకున్నాము. మార్కోస్, అర్బానోలు

అన్వేషణలోనే ఉన్నారు. నది కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉందన్న వార్తతో మార్కోస్ తిరిగొచ్చాడు. అయితే ప్రవాహం వెంట ఉన్న మార్గం ఏంబావుండలేదు. ఒక చోటు మడుగు కూడ ఉంది.

ఎత్తు = 680 మీటర్లు

**ఫిబ్రవరి 25**

విచారకరమైన రోజు. మేం కొంచెం పురోగతి సాధించగలిగాము. వీటన్నింటిని మించి మార్కోస్ దారి తప్పిపోయాడు. మిగ్యుయెల్, ఎల్ లోరోలతో కలిసి అతను వెళ్లాడు. మద్యాహ్నానికి అతను ఈ సమాచారం అందించి తనను రిలీవ్ చేయాల్సిందిగా కోరాడు. కమ్యూనికేషన్ సామగ్రిని కూడ అడిగాడు. బ్రౌవులియో, టుమా, పాచోలు అక్కడికి వెళ్లారు. మద్యాహ్నం 2 గంటలకు పోచో తిరిగి వచ్చాడు. తాను చెప్పేది సరిగ్గా వినిపించడం లేదని మార్కోస్‌ను వెనక్కి పంపాడు. సాయంత్రం నాలుగున్నరకు బెనిన్నోను మార్కోస్ వద్దకు పంపి, అతను నదిని కనుగొనలేకపోతే సాయంత్రం ఆరు గంటలకల్లా తిరిగి రావలసిందిగా హెచ్చరించాను. బెనిన్నో బయలుదేరిన తర్వాత పోచో నాతో మాట్లాడాడు. మార్కోస్‌తో మాటామాట పెరిగిందని, మార్కోస్ విచక్షణారహితమైన ఆదేశాలు ఇచ్చాడని, దాన్ని తప్పుపట్టినందుకు తనను కత్తితో బెదిరించాడని, కత్తిపిడితో ముఖంమీద మోదడానికి ప్రయత్నించాడని చెప్పాడు. పాచో మళ్లీ మార్కోస్ దగ్గరకు వెళ్లగా ఈ సారికూడ కత్తితో బెదిరించాడని, తనను పట్టుకొని కుదిపి, బట్టలు చించేశాడని తెలియ చేశాడు.

ఇలాంటి సీరియస్ విషయం ఎదురుకావడంతో ఇంతి, రోలాండోలను పిలిపించాను. మార్కోస్ ఉద్రేకపూరిత ప్రవర్తన వల్ల అడ్వాన్స్ పార్టీలో వాతావరణం సరిగా లేదని వారూ చెప్పారు. అయితే పాచో చేసిన కొన్ని పొరపాట్లను కూడ వారు చెప్పారు.

**ఫిబ్రవరి 26**

ఉదయం మార్కోస్, పాచోలతో మాట్లాడాను. ఇలాంటి పొరపాటు ప్రవర్తనకు, కత్తితో బెదిరించినందుకు కూడ మార్కోస్‌ను నిందించాలని నేను నిర్ణయానికొచ్చాను. అయితే కత్తి పిడితో కొట్టినందుకు మాత్రం కాదు. పాచో కూడ అవమానించే రీతిలో సమాధానం చెప్పాడు. అతనికి దురుసుగా ప్రవర్తించే లక్షణం ఉంది. అది ఇంతకు ముందు తెలిసిందే. ప్రతి ఒక్కరు చేరుకునేవరకు వేచి ఉండి, రోసిటాకు వెళ్లవలసిన

అవసరం గురించి వివరించాను. ముందు ముందు మనం ఎదుర్కోబోయే కష్టాలకు ఇది సిద్ధం చేస్తుందని కూడ చెప్పాను. ఈ జీవితానికి మనం అలవాటు పడలేదని, అందుచేతనే ఇప్పుడు ఇద్దరు క్యూబన్ల మధ్య జరిగిన విచారకరమైన ఘటన లాంటివి జరుగుతాయని అన్నాను. మార్కోస్ వైఖరిని నేను విమర్శించాను. గెరిల్లా విధులు నిర్వహించే సమయంలో ఇలాంటివి జరగకూడదని పాచోను కూడ హెచ్చరించాను. పాచో రేడియో సెట్‌ను ఉపయోగించేందుకు నిరాకరించడమే కాకుండా, దాని గురించి నాకు చెప్పకుండానే వెనక్కి తిరిగి వచ్చాడు. బహుశా మార్కోస్ తనను కొట్టాడని పాచో అబద్ధం ఆడి ఉండవచ్చు.

ఈ రకమైన పద్ధతులను అనుసరించలేకపోతే వాటినుండి తప్పుకోవద్దని, ముందుగా తనకు చెబితే వారు స్వేచ్ఛగా వెళ్లిపోవచ్చునని కూడ తెలిపాను.

గ్రాండె నదిని చేరుకోవడానికి మా నడకను కొనసాగించాము. దాని వద్దకు మేము వెళ్లాము. దాని వెంట ఒక కిలోమీటరు దూరం ప్రయాణం చేశాము. మళ్లీ మేము కొండపైకి ఎగబాకాల్సి వచ్చింది. అక్కడ నది కోసుగా ఉండే కొండల వెంట ప్రవహిస్తున్నది. బెంజెమన్ తన వీపు సంచీ మోయలేకపోవడం, అలసిపోవడం వల్ల వెనకబడిపోయాడు. అతను మమ్మల్ని చేరుకున్న తర్వాత ముందుకు సాగమని ఆదేశించాను. అలాగే చేశాడు. 50 మీటర్లు నడిచిన తర్వాత దారి తప్పాడు. దారి కోసం అతను వెదుక్కుంటున్న సమయంలోనే నేను దారి చూపమని అర్బానోను ఆదేశిస్తున్నాను. ఈ లోగానే అతను అకస్మాత్తుగా మలుపు తిరిగి నీళ్లలో పడిపోయాడు. అతనికి ఈత రాదు. ప్రవాహం చాల వడిగా ఉంది. దానిలో అతను కొట్టుకు పోతున్నాడు. అతనిని రక్షించేందుకు మేము వురికాము. మేము మా సామాను క్రింద పడేస్తుండగానే, సుడిగుండంలో చిక్కుకొని అదృశ్యం అయ్యాడు. రోలాండో అక్కడికి ఈదుకుంటూ వెళ్లి దూకడానికి ప్రయత్నించాడు. కాని ప్రవాహం అతనిని వెనక్కి నెట్టేసింది. ఐదు నిముషాల తర్వాత బెంజెమన్‌పై మేము ఆశ వదులుకున్నాము. అతను చాల బలహీనుడు, ఈ పనికి పనికిరాడు. అయినప్పటికీ మనో బలం చాల ఎక్కువ. పరీక్ష అతని కంటే బలమైనది, అతని శారీరక లక్షణాలు దానికి సరిపోలేదు. ఇప్పుడు మేము గ్రాండె నదీ తీరంలో చావుకు సంబంధించిన బాప్తిజంను పూర్తి అర్థరహితమైన రీతిలో జరుపుకోవలసి వచ్చింది. రోసిటాను చేరుకోకుండానే సాయంత్రం ఐదు గంటలకు మేము క్యాంపు చేయాల్సి వచ్చింది. మావద్ద మిగిలిన చివరి కిడ్నీ బీన్స్ రేషన్‌ను తిన్నాము.

**ఫిబ్రవరి 27**

మరో రోజు బాగా నదీ ప్రవాహం వెంట, కొండలు ఎక్కుతూ దిగుతూ అలసిపోయేవరకు ప్రయాణం చేసి రోసిటా నదిని చేరుకున్నాము. అది నకాహుయాసు కన్నా పెద్దది. మసిక్యురి కన్నా చిన్నది. దానిలో నీరు ఎరుపు వర్ణంలో ఉంది. మా వద్ద రిజర్వులో ఉంచుకున్న రేషను కూడ తినేశాము. మెయిన్‌రోడ్లకు, జనావాసాలకు చాల దగ్గరగానే ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం జనసంచారం ఉన్న జాడలేమీ కనిపించలేదు.

ఎత్తు = 600 మీటర్లు

**ఫిబ్రవరి 28**

ఓ పూట విశ్రాంతి. బ్రేక్ ఫాస్ట్ (టీ) తర్వాత బెంజిమన్ మరణం ఎలా సంభవించిందో క్లుప్తంగా వివరించాను. సియెరా మాయెస్ట్రాలో ఇలాంటి ఘటనలు కొన్నింటి గురించి కూడ చెప్పాను. ఆ తర్వాత దారి చూపేవారు బయలు దేరారు. మిగ్యుయెల్, ఇంతి, ఎల్ లోరోలు రోసిటా పైకి వెళ్లారు. మూడున్నర గంటల పాటు నడవాలని వారిని ఆదేశించాను. ఆ సమయంలో వారు అబపోసిటా నదిని చేరుకుంటారన్నది నా అంచనా. కాని దాని కనుగొనలేక వారు ఆ సమయానికి వెళ్లలేకపోయారు. ఇటీవల కాలంలో అక్కడ మనుషులు సంచరించిన జాడలేమీ వారికి కనిపించలేదు. జాక్విన్, పెడ్రోలు మాకు ఎదురుగా ఉన్న కొండ ఎక్కడానికి పూనుకున్నారు. కాని వాళ్లు అక్కడ ఏదైనా దారి కాని, దాని ఛాయలు కాని కనుగొనలేకపోయారు. అలెజాండ్రో, ఎల్ రూబియోలు నదిని దాటారు అయినా వారికీ ఎలాంటి దారీ కనిపించ లేదు. అసలు వారు అటువైపుకు వెళ్లడమే అనవసరం. తెప్పను తయారుచేయడాన్ని మార్కోస్ పర్యవేక్షించాడు. అది తయారు కావడంతోనే నదిని దాటనారంభించాము. రోసిటా, అబాపోసిటాను కలిసే దగ్గర నది ఒంపు తిరిగిన చోట మేము నదిని దాటాము. మిగ్యుయెల్‌తో సహా ఐదుగురి వీపు సంచులను తీసుకెళ్లాము. బెనిన్హో వీపు సంచి మాత్రం పోయింది. బెనిన్హో తన షూస్ కూడ వదిలి పెట్టాడు.

తెప్పను మళ్లీ ఉపయోగించలేకపోయాము. రెండోది ఇంకా తయారు కాలేదు. అందుచేత మేము నదిని దాటడాన్ని ఉదయం వరకు వాయిదా వేశాము.

**నెలసరి సమీక్ష**

క్యాంపులో ఏమి జరిగిందీ నాకు వార్తలందనప్పటికీ, కొన్ని మినహాయింపులు, ఈ సందర్భంలో కొన్ని ప్రమాదకరమైన మినహాయింపులు ఉన్నప్పటికీ, ప్రతిదీ సాధ్యమైన మేరకు పద్ధతిగానే జరుగుతున్నది.

బయటనుండి బృందాన్ని సంపూర్ణం చేయడం కోసం పంపుతానన్న ఇద్దరు నావద్దకు చేరనే లేదు. ఫ్రెంచి దేశీయుడు ఈ సరికి కచ్చితంగా లాపాజ్‌లో ఉండిఉండవచ్చు. అతను ఏదో ఒక రోజు క్యాంపుకు చేరుకోవచ్చు. అర్జెంటీనియన్ల నుండి కాని, ఎల్ చినో నుండి కాని సమాచారం ఏమీ లేదు. వర్తమానాల రాకపోకలు సజావుగానే సాగుతున్నాయి. పార్టీ వైఖరి ద్వైదీభావంతోను, సాగతీతగానే ఉంది. పార్టీ వైఖరి గురించి ఇది చాల తక్కువ చెప్పినట్లే. అయినప్పటికీ నూతన ప్రతినిధి బృందం నావద్దకు వచ్చినపుడు నిర్ణయాత్మకమైన కొన్ని విషయాలను స్పష్టం చేసుకోవలసి ఉంది.

బెంజిమన్ ప్రాణాలు కోల్పోయిన ప్రమాదం మినహా, మా నడక సజావుగానే సాగింది. సభ్యులంతా బలహీనంగా ఉన్నారు. బొలీవియన్లు చివరిదాకా వస్తారన్న నమ్మకం లేదు. గత కొద్ది రోజులుగా ఆకలికి గురవడంతో వారిలో ఉత్సాహం తగ్గినట్లు కనిపిస్తున్నది. మేము చీలిపోయిన తర్వాత ఇది మరీ స్పష్టం అయింది.

క్యూబా దేశీయులు పాచో, ఎల్ రూబియోలలో ఒకరు అనుభవం లేని వ్యక్తి. ఇంకా సరిగ్గా స్పందించడం లేదు. కాని అలెజాండ్రో మాత్రం చాల బాగా ఉంటున్నాడు. పెద్ద వాళ్లలో మార్కోస్ నాకు బాగా ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాడు. రికార్డో తాను చేయగలిగినంత చేయడం లేదు. మిగతా వాళ్లు బాగానే ఉన్నారు.

తదుపరి దశ పోరాట దశ. అది కచ్చితంగా నిర్ణయాత్మకమైనది.

# మార్చి 1967

**మార్చి 1**

ఉదయం ఆరు గంటల నుండే వాన మొదలయింది. నదిని దాటాలనుకున్నది వాయిదా వేసాం. వాన ఎప్పుడు తెరపి ఇస్తుందా అని ఎదురు చూస్తూ ఉండిపోయాం. నది పొంగుతా ఉంది. ప్రస్తుతానికి నదిని దాటే ఆలోచన విరమించుకోవడమే ఉత్తమం అని భావించాం. ఇప్పుడు నదిపొంగు ఇంకా పెరిగింది. ఎక్కడా తగ్గే సూచనలు కనిపించడం లేదు. వానకు తడవకుండా ఉండడానికి పాడుపడ్డ గుడిసెలోకి దూరాం. అక్కడే మకాం. జోయాక్విన్ కూడా అక్కడే ఉన్నాడు. సాయం కాలం అయ్యేసరికి పోలో తన వంతు పాలడబ్బాని, యూసెబియా పాలడబ్బాతో పాటు, ఎండు చేపల కూర డబ్బాని కూడా కూడా ఖాళీ చేసేసారని జోయాక్విన్ నాతో చెప్పాడు. అంటే మిగతా వాళ్ళంతా తిండికి కూచున్నపుడు వీళ్ళు నోళ్ళు తెరుచుకు కూచుంటారన్నమాట. అదే వాళ్ళకు శిక్షా? ఏమైనా వాళ్ళు చేసింది మాత్రం బాగోలేదు అనిపించింది.

**మార్చి 2**

తెల్లవారింది. వర్షం ఇంకా పడుతూనే ఉంది. అందరం బయటికి వచ్చాం. నది ఇంకా ఉధృతంగా ప్రవహిస్తూ ఉంది. మబ్బులు తెరిపి ఇవ్వగానే, అక్కడ నుండి బయలుదేరాలని వచ్చిన దోవనే నది వెంబడి వెనక్కి పోవాలని నిర్ణయించాం. మధ్యాహ్నానికి తిరుగుదారి పట్టాం. నాలుగున్నరకి ఆగిపోవాల్సి వచ్చింది. దారితప్పినట్లున్నాం. ముందుకు పోవడానికి తోవలేని చోటకు వచ్చి చేరాం. 'అడ్వాన్సు పార్టీ' నుంచి మాకు ఇంకా ఏ సమాచారమూ అందలేదు.

**మార్చి 3**

హుషారుగా నడక మొదలు పెట్టాం. చురుగ్గా ముందుకు సాగుతున్నాం. కానీ సమయం మా ప్రయాణాన్ని నిదానింపచేస్తుంది. నది ఒంపు నుండి మేం దగ్గర

దారిలోకి మళ్ళాం. ఇంతకు ముందు బెంజిమిన్ పడిపోయిన చోట ప్రమాదానికి ఆస్కారం ఉంటుందని అనిపించింది. మైదానంలో అరగంట పట్టే ప్రయాణానికి ఇక్కడ నాలుగు గంటలు పట్టింది. సాయంత్రం ఆరు గంటలకు మేం నది ఒడ్డున ఏర్పాటు చేసుకున్న మకాంకు తిరిగి వచ్చాం. తినడానికి రెండు దుంపమొక్కలు మాత్రమే మిగిలాయి. మిగ్యుయెల్, అర్బానో, ఆ వరసన బ్రౌవులియో – ముగ్గురూ అలా ముందుకు వెళ్ళి వచ్చారు.వాళ్ళు తిరిగి వచ్చేటప్పటికి రాత్రి తొమ్మిది గంటలు అయింది. అర్ధరాత్రి పూట కడుపుకు ఇంత తిన్నాం.

– సముద్ర మట్టానికి 600 మీటర్ల ఎత్తు.

**మార్చి 4**

మిగ్యుయెల్, అర్బానోలు ఇరువురూ తెల్లారగట్టే లేచివెళ్ళారు. పట్టాకత్తి వెంట తీసుకువెళ్ళారు. పొద్దంతా దారి వెతుకుతూ గడిపేసారు. మునిమాపు వేళకు తిరిగి వచ్చారు. ఐదు కిలోమీటర్ల అవతల మైదాన ప్రాంతం ఉందని కనిపెట్టుకు వచ్చారు. అటుగా అయితే మా ప్రయాణం సులువుగా సాగుతుంది. కానీ మకాం చెయ్యడానికి అనువైన ప్రదేశం చిక్కడం లేదు. కాబట్టి వెసులుబాటు దొరికేదాకా ఇక్కడే మకాం అని నిర్ణయించాం. వేటకు వెళ్ళిన వాళ్ళు రెండు కోతులు, ఒక రామచిలుక, ఒక పావురం కొట్టుకుతెచ్చారు. అవీ పక్కన ఉన్న నది ఒడ్డున విస్తారంగా దొరికే దుంప మొక్కలూ – ఇవే ఆ రాత్రికి మాకు ఆహారం.

కుర్రాళ్ళు శారీరకంగా, మానసికంగా నీరసించి పోయారు. రోజు రోజుకీ పరిస్థితి దిగజారిపోతుంది. నా కాళ్ళు చూస్తే 'ఎడిమా' వ్యాధి లక్షణాలు బయటపడినట్లున్నాయి.

**మార్చి 5**

జోయాక్విన్, బ్రౌవులియోలు ఇరువురూ దారులు కనుక్కోవడానికి వెళ్ళారు. వర్షం పడుతూ ఉంది. వాళ్ళా నీరసపడిపోయి ఉన్నారు. పెద్దగా పురోగతి సాధించలేకపోయారు. ఒక డజను దుంప మొక్కలు తోటి, చిన్న చిన్న పక్షుల్ని కొట్టుకుని ఆ పూటకి మేం కడుపు నింపేసుకున్నాం. డబ్బాలో ఉన్న ఆహారం ఇంకో రోజున వాడుకోవడానికి వీలుగా మిగుల్చుకున్నాం. ఎందుకన్నా మంచిదని మరో రెండు రోజులకు సరిపడా దుంప మొక్కల్ని పోగేసుకున్నాం.

**మార్చి 6**

ఈ రోజున మా ప్రయాణం ఆగాగి సాయంత్రం ఐదు గంటల వరకూ సాగింది. మిగ్యుయెల్, అర్బానో, ట్యూమాలు 'కత్తి పార్టీగా ముందుండి నడిచారు. కొంత దూరం పోయాక నకాహుయాసు ప్రాంతం మాదిరి ఒంగ్రుసేల కనిపించింది. ఆ పూటకి రామచిలకల్ని కొట్టి 'రియర్ పార్టీ'కి అందించాం. దుంప మొక్కలు మాంసంతో నంజుకు తిన్నాం. మూడు డబ్బాల ఆహారమే మిగిలింది ఇంకను మాతో.

– సముద్ర మట్టానికి 600 మీటర్ల ఎత్తు.

**మార్చి 7**

నాలుగు నెలలు గడిచిపోయాయి. ఆహార నిల్వలు అడుగంటి పోతూ ఉండడం, మా ప్రయాణం కొస కానరాకుండా పోవడంతో దళం మానసికంగా నీరసించిపోయింది. ఈ రోజున మేం నది ఒడ్డు వెంబడే నాలుగైదు కిలోమీటర్లు నడిచాం. ఎట్టకేలకు కొసకనబడింది. దుంపమొక్కలు, మూడున్నర పక్షి మాంసం ఆ రోజుకి మా ఆహారం. రేపటి నుండి డబ్బా తిండే. మనిషికి, రెండు రోజులకి డబ్బాలో మూడోవంతు మాత్రమే ఆహారం. ఇహ ఆ తర్వాతి నుండి డబ్బా పాలు. అవే మాకు మిగిలింది. నకాహుయాసుకు మేం ఇంకా రెండు మూడు రోజుల దూరంలో ఉన్నట్లు ఉన్నాం.

– సముద్ర మట్టానికి – 610 మీటర్ల ఎత్తు.

**మార్చి 8**

ఈ రోజున కొంత పురోగతి కనిపించింది. అనుకోని పరిణామాలు కొన్ని, ఒకింత సస్పెన్సుతో రోజు గడిచింది. వేటకు పోయిన రోలాండో కోసం ఎదురు చూడకుండా సరిగ్గా ఉదయం పది గంటలకు మేం మకాం నుండి బయలుదేరాం. ఓ గంటన్నర నడిచేసరికి కత్తిపార్టీ, వేటకు వెళ్ళిన వాళ్ళను కలుసుకున్నాం. (అర్బానో, మిగ్యుయెల్, ట్యూమా కత్తి పార్టీ – డాక్టరు, చిన్చు వేటకు పోయినవాళ్ళు). రామచిలకలని కొట్టి కుప్పపోసారు. నదీముఖద్వారం కనిపించే సరికి అక్కడే ఆగిపోయారు. ఈ రోజుకి మకాం ఇక్కడే అని ఆర్డరు వేసా. నేనలా ముందుకు పోయి వచ్చా. దూరాన ఏదో పెట్రోలు బంకు కనిపించింది. ఇంతి, రికార్డోలు నీళ్ళలోకి దూకారు. ఎవరన్నా ఎదురుబడితే వేటగాళ్ళమని చెప్పాలని సూచించాం. ఒంటిన ఉన్న బట్టలు తోనే నదిని రెండంచెలుగా దాటడానికి ప్రయత్నించారు. కాని ఇంతి దాదాపు నీళ్ళలో మునిగినంత

పనయింది.. రికార్డో అతన్ని కాపాడాడు. మొత్తానికి ఇద్దరు కలిసి నది అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. కానీ అందరి దృష్టినీ ఆకర్షించారు. మాకు ఎలాంటి ప్రమాద సూచిక ఇవ్వలేదు. అటునుండి అటే అంతర్ధానం అయిపోయారు.  మిట్ట మధ్యాహ్నం పూట వాళ్ళు నదిని దాటారు. మూడున్నర అయినా గానీ వాళ్ళవైపు నుండి ఎలాంటి సమాచారమూ, సంకేతమూ లేదు. దాంతో నేను వెనుదిరిగాను. పొద్దు వాలిపోయింది. వెళ్ళిన వాళ్ళ అజలేకుండా పోయింది. సెంట్రీగా వెళ్ళిన మనిషి రాత్రి తొమ్మిది గంటలకు తిరిగివచ్చేసారు. అప్పటికీ వాళ్ళ నుండి ఎలాంటి 'సిగ్నల్' అందలేదు మాకు.

నేను తీవ్రమైన ఆందోళనకు లోనయ్యాను.  ఇద్దరు మెరికల్లాంటి కామ్రేడ్స్ ప్రమాదంలో చిక్కుకుపోయారా? ఏంజరిగి ఉంటుంది వాళ్ళకు– అనేది తెలియకుండా పోయింది. దళంలో ఉన్న ఇద్దరు గజ ఈతగాళ్ళు - అలెజాండ్రీ, రోలాండోలు - మరుసటిరోజు సూర్యోదయానే నది దాటి వెళ్ళి పరిస్థితి ఏమిటో వాకబు చెయ్యాలని నిర్ణయించాం.

మా దగ్గర దుంపమొక్కలు అయిపోయాయి. చిలకలు, రోలాండో కాల్చి తెచ్చిన రెండు కోతులతో పూర్తి మాంసాహార భోజనం కావడం మూలాన ఇంతకు ముందుకన్నా బాగానే తిన్నాం అనిపించింది.

**మార్చి 9**

పొద్దు పోవడంతోటే నదిని దాటాలని సన్నాహాలు చేసుకున్నాం. అయితే తెప్ప తయారు చేసుకోవాల్సి రావడం తోటి కాస్త ఆలస్యం అయ్యింది. ఇంతలో సెంట్రీడ్యూటీ చేస్తున్న కామ్రేడ్ వచ్చి నది అవతలి ఒడ్డున అర్థనగ్నంగా ఉన్న మనుషులు కదలికను గమనించినట్లు చెప్పాడు. అప్పటికి ఉదయం 8:30 అయింది. మేం నదిని దాటాలనే ప్రయత్నాన్ని విరమించాం. ఇంకో ఒడ్డు నుండి నదిని దాటేందుకు అవకాశం ఉన్నా అంతా బంగరుబయలుగా కనబడే అవకాశం ఉన్నందున మరుసటి రోజు పొద్దు తెల్లవారక ముందే పొగమంచులో నదిని దాటాలని నిర్ణయించుకున్నాం.  ఉదయం 10.30 నుండి సాయంత్రం 4 గంటల వరకూ ఎదురుచూసీ చూసీ విసుగెత్తి పోయాం. ఆహార బాధ్యతలు చూసే కామ్రేడ్స్ (ఇంతి, చిన్చు) నదిలోకి దూకి మాకు బాగా దిగువన ఒడ్డుకెక్కారు.  సీమ పంది మాంసం, రొట్టె, బియ్యం, పంచదార, కాఫీ, జొన్న పొత్తులు డబ్బా తిళ్ళు తెచ్చారు.  కాఫీ కాచుకుని రొట్టె – కాఫీ తో పండగ చేసుకున్నాం.

'రిజర్వు'గా ఉంచుకున్న డబ్బాపాలు తీసి ఏదన్నా స్వీటు చేసుకోవడానికి అనుమతించాను. గంట గంటకీ వాళ్ళు ఇద్దరూ మాకు కనబడే ప్రయత్నం చేసినా మేం అది గమనించలేదని వాళ్ళు చెప్పుకొచ్చారు మార్కోస్, అతని దళ సభ్యులు మూడు రోజుల క్రితమే ఇటుగా దాటి వెళ్ళారట. అలవాటుగానే వాళ్ళు చేతి వాటం ప్రదర్శించి తుపాకులకు పని చెప్పినట్టున్నారు. పెట్రోలు బంకులో ఉండే ఇంజనీర్లు నకాహుయాసు ఎంత దూరం అని స్పష్టంగా చెప్పలేకపోయారుగానీ సుమారు ఐదారు రోజుల ప్రయాణం ఉండొచ్చు అన్నారు. అప్పటిదాకా ఆహారానికి ఇబ్బంది పడనక్కరలేదనిపించింది. అక్కడ నిర్మిస్తున్న ప్లాంట్‌కు అనుబంధంగా ఆ పెట్రోలు బంకును ఏర్పాటు చేసారల్లే ఉంది.

**మార్చి 10**

మేం ఆరున్నరకి బయల్దేరాం. మరో గంటన్నరకి అంటే ఉదయం 8 గంటలకు పట్టా కత్తి పార్టీని కలుసుకున్నాం. వర్షం మొదలయింది. 11 గంటలవరకూ సాగింది. అంతా చేసి మేం మరో మూడు గంటలపాటు నడిచాం. సాయంత్రం 5 గంటలకు మకాం వేసాం. దూరాన కొండలు అగుపించాయి. నకాహుయాసు అక్కడే కావచ్చు అనిపించింది. బ్రౌవులియో తోవ వెతుక్కుంటూ వెళ్ళి తిరిగివచ్చాడు. దాపునే నది ఒడ్డు ఉందని నది సీదాగా పశ్చిమ దిక్కుకు ప్రవహిస్తుందని చెప్పాడు.

– సముద్ర మట్టానికి – 600 మీటర్లు

**మార్చి 11**

ఈ రోజు మంచిగా మొదలయింది. గంటన్నర పాటు తిన్నటి మార్గంలో సాగింది మా ప్రయాణం. హఠాత్తుగా దారి మాయం అయిపోయింది. బ్రౌవులియో తన వేటకత్తితో అడ్డంగా ఉన్న చెట్లు పొదలు నరుకుతూ తీవ్రంగా శ్రమించి నది ఒడ్డుకు తోవ చేసాడు. అప్పటి దాకా మేం వేచి ఉన్నాం. అర్బానో ముందు నడుస్తుండగా మేం అనుసరించాం. ఇక నదిని దాటాలనుకుంటూ ఉండగా హఠాత్తుగా వరదనీరు క్షణాల్లో తోవను కోత వేసి కూల్చేసింది. నది నీరు కొన్ని మీటర్లు పైకి పెరిగిపోయింది.

పట్టాకత్తి పార్టీతో మేం వేరు పడిపోయాం. మళ్ళీ అడవుల గుండా పడి పోవాల్సిన పరిస్థితికి నెట్టబడ్డాం. అపర్ణాహం వేళకి మా ప్రయాణాన్ని ఆపాం. అడ్వాన్సు పార్టీని కలుసుకుని వెనక్కి తిరిగి రావల్సిందిగా చెప్పి తీసుకురమ్మని మిగ్యుయెల్,

ట్యూమాలకు పురమాయించాను. నకాహుయాసు కాకపోతే ఇంకో మంచి చోటును గుర్తించలేకపోతే వెనక్కి వచ్చేయవలసిందిగా ఆదేశించాను.

సాయంత్రం ఆరు గంటలకు వాళ్ళు వెనక్కి తిరిగివచ్చారు. వాళ్ళు మూడు కిలోమీటర్లు ప్రయాణించి ఒక ఏటవాలు కొండ కొమ్మదాకా వెళ్ళారు. బహుశా మేం దగ్గర్లో ఉన్నాం అనుకుంటూన్నా. అయితే రాబోయే రోజులు క్లిష్టంగా ఉండొచ్చు. నది వరదపోటు తగ్గకపోతే ఇబ్బందే. చూస్తే వరద ఇప్పట్లో తీసేలా లేదు. మేం నాలుగైదు మైళ్ళు నడిచాం. 'రియర్‌పార్టీ'కి ఇచ్చిన పంచదార కోటా అయిపోవచ్చింది. బహుశా తమకు రేషను తక్కువ ఇచ్చి ఉండొచ్చని, లేదు బ్రౌవులియో తనకోసం దాచి పెట్టుకున్నాడేమో అన్న సందేహం వెలిబుచ్చారు. ఇలాంటిది జరిగి ఉండాల్సింది కాదు. నేను ఈ విషయమై బ్రౌవులీయోతో మాట్లాడాలి.

సముద్ర మట్టానికి – 610 మీటర్ల ఎత్తు

**మార్చి 12**

నిన్న ఏర్పాటు చేసిన తోవను గంటా పదినిమిషాల్లో నడిచి మిగ్యుయెల్, ట్యూమాలను కలిసాం. వాళ్ళు ముందుగానే అక్కడికి చేరుకుని కొండ కొమ్మును దాటేందుకు చుట్టు దారుల కోసం వెతుకుతున్నారు. రోజంతా మాకు అదేపని సరిపోయింది. మధ్యలో నాలుగైదు పిట్టల్ని కొట్టుకున్నాం. అన్నంలో నంజుడు కూర అదే. మొత్తానికి మిగ్యుయెల్ అవతలకి చేరుకున్నాడు. నకాహుయాసు పోవడానికి తోవ దొరికినట్లుంది. మా ప్రయాణం మరో మూడు నాలుగు కిలో మీటర్లు సాగింది.

**మార్చి 13**

ఉదయం ఆరున్నర నుండి మధ్యాహ్నం వరకూ మేం నరకప్రాయమైన గుట్టలు ఎక్కిదిగడంతోటే సరిపోయింది. మిగ్యుయేల్ కనుగొన్న తోవనపడి నడవడం దుస్సాధ్యం అయింది. ఇంక నకాహుయాసు చేరుకున్నట్లే అనుకుంటూ ఉండగా నడుమకొన్ని దుర్గమ కనుమలు ఎదురయ్యాయి. ఐదుగంటల ప్రయాణంలో మేం అట్టే ముందుకు సాగలేకపోయాం. ఒక పెద్ద జలపాతం కింద మకాం వేసాం. సాయంత్రం ఐదు గంటలకు అక్కణ్ణించి బయల్దేరాం. ఒక్క భోజనం మాత్రమే మిగిలిఉంది. దారీ తెన్నూ లేకుండా ఆరు కిలోమీటర్లు నడిచాం.

**మార్చి 15**

సెంటర్‌పార్టీగా ఉన్న మేం ఎల్‌రుబియో, డాక్టర్‌ల సాయంతో నదిని దాటాం. ఆ రోజుకి నకాహుయాసు ముఖద్వారానికి చేరుకోవాలని అనుకున్నాం. కాని దళంలో ముగ్గురు సభ్యులు ఈత కొట్టలేకపోయారు. మేం విపరీతంగా అలిసిపోయాం. నది వాలున మమ్మల్ని ఒక కిలోమీటరు దాకా ఈడ్చుకు పోయింది. తెప్పను వాడుకుందాం అనుకున్నాం. కానీ వీలుకాలేదు. ఎల్‌రుబియో మళ్ళీ నది దాటిరావాలి. నాలుగు గద్దల్ని కొట్టాం. మేం ఏదేదో ఊహించుకున్నాం గానీ మొత్తానికి తినడానికి రుచిగానే అన్పించాయి. నిలువెల్లా తడిసి ముద్దయిపోయాం. వాతావరణం చాలా తేమగా ఉంది. దళ సభ్యుల స్థైర్యం సడలి పోయినట్లుంది. మిగ్యుయెల్ తో పాటు ఇంకొందరి పాదాలు వాచిపోయి ఉన్నాయి.

సముద్ర మట్టానికి – 580 మీటర్ల ఎత్తు

**మార్చి 16**

కాళ్ళ వాపుల బాధ అధికం అయ్యింది. అయినా ఆ రోజుకి గుర్రాన్ని చంపి తినాలని నిర్ణయించుకున్నాం. మిగ్యుయెల్, ఇంతి, ఆర్బానో, అలెజాండ్రీ రకరకాల ఆనారోగ్య లక్షణాలతో కనిపిస్తున్నారు. నేను చాలా బలహీనపడ్డాను. మా లెక్కలు ఎక్కడోగాని తప్పాయి. జోయాక్విన్ మమ్మల్ని గట్టెక్కిస్తాడని ఆశించాంకానీ నెరవేరిందికాదు. డాక్టరు, ఎల్‌రుబియోలు ఇద్దరూ అతనికి సాయంగా నదిలోకి దిగారు. కానీ నీటి వాలుకు కొట్టుకుపోయి కనిపించకుండా పోయారు. ఆ పని తనకు అప్పచెప్పమని జోయాక్విన్ ముందుకు వచ్చాడు. పర్మిషను ఇచ్చాను. అయితే అతని దళంకూడా నీటి వాలున కొట్టుకుపోయింది. పోంబో, ట్యూమాలను పంపించా వాళ్ళ జాడ కనిపెట్టుక రమ్మని. రాత్రి తొమ్మిది గంటలకు ఉత్త చేతులతో తిరిగి వచ్చారు వాళ్ళు. సాయంత్రం ఐదుగంటలకే గుర్రపు మాంసంతో విందు మొదలయింది. రేపటి పరిణామాలకు సిద్ధంగా ఉండాలి. నా లెక్క ప్రకారం రోలాండో ఈ రోజుకి స్థావరానికి చేరి ఉండాలి.

సందేశం నెంబరు 32ను డీకోడ్ చేసాం. ఒక బొలీవియా దేశస్థుడు మమ్మల్ని కలుసుకున్నాడు. గ్లూకోటిన్, యాంటీ–పారసైట్ మందులు తీసుకువస్తున్నాడని సందేశం. ఇప్పటిదాకా ఆ మందులు వాడాల్సిన అవసరంపడలేదు.

**మార్చి 17**

అసలైన పోరు మొదలుకాకముందే మరో వివాదం మాకు ఎదురయింది. మిడిమేలపు వేళకు జోయాక్విన్ కనిపించాడు. మిగ్యుయేల్, ట్యూమాలు ఇద్దరూ అతనికి పసందైన మాంసం ముక్కలు తినడానికి ఇచ్చారు. నదిలో వాళ్ళ ప్రయాణం కడుప్రమాదకరంగా సాగింది. తెప్పను కాచుకోలేకపోవడంతో నకాహుయాసు దిగువకు కొట్టుకుపోయారు. సుడిగుండం పాలబడి అగచాట్లుపడ్డారు. మొత్తానికి ఆ సుడిలోపడి ఆరు తుపాకులు, బుల్లెట్లు మొత్తం చేజారిపోయాయట. దళ సభ్యుడు కార్లోస్ కూడా నీటపడి మరణించాడు. అతనూ, బ్రౌవులియోలు కూడా సుడిలో పడి చిక్కుకున్నారు కానీ ఎలాగో బయటపడ్డారు. ఒడ్డుకు చేరిన బ్రౌవులియో కళ్ళ ముందరే కార్లోస్ సుడిలో నిస్సహాయంగా మునిగిపోయాడట. జోయాక్విన్, అతని సహచరులు ఇంకాస్త ఎగువనే ఉన్నారట కానీ ఈ దుర్ఘటన చూడలేదట. రియర్ పార్టీలో ఉన్న బోలివియా వాళ్ళలో కెల్లా కార్లోస్ శ్రేష్ఠుడయినవాడు. అతనిలో క్రమశిక్షణా, ఉత్సాహం, కట్టుబాటు అలాంటివి.

బ్రౌవులీయోకు చెందిన ఒక బ్రోనో, కార్లోస్, పెడ్రోల ఎమ్.ఐలు రెండు ఎల్‌చినో, యూసెబియో, పోలోల మ్యూసర్లు మూడు నీటిపాలయ్యాయి. డాక్టరు, ఎల్‌రుబియోలు ఇరువురూ ఆవలి ఒడ్డున ఉండడం చూసి ఒక తెప్పచేసుకుని నదిదాటి ఇవతలకు రమ్మని ఆదేశాలు ఇచ్చినట్లు జోయాక్విన్ చెప్పాడు. మధ్యాహ్నం 2 గంటలకు వాళ్ళు ప్రత్యక్షమయ్యారు. వాళ్ళ బాధలు గాధలు వాళ్ళవి. ఇద్దరి ఒంటినా బట్టల్లేవు. ఎల్‌రుబియో బూడ్సులు కూడా పోయాయి. వాళ్ళ తెప్పకూడా మొదటి సుడిగుండం దగ్గరే పగిలిపోయింది. మేం ఎక్కడ ఉన్నామో ఆ ఒడ్డుకే వచ్చి చేరారు ఇద్దరూ.

మరుసటి రోజు ఉదయానే మా ప్రయాణం, జోయాక్విన్ మాత్రం మధ్యాహ్నం బయల్దేరాలి అనుకున్నాం. రేపు ఏదో ఒక సమాచారం అందే అవకాశం ఉంది. జోయాక్విన్ దళంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంది.

**మార్చి 18**

మేం ఉదయాన్నే బయలుదేరాం. సగందాకా మిగిలిన గుర్రం మాంసాన్ని తిని శుభ్రంగా హరాయించుకుని కాస్త ఓపిక వచ్చాకే బయల్దేరమని సూచించాం. కొద్దో గొప్పో మాంసం నిల్వ చేసుకుని తీసుకెళ్ళడానికి దళ సభ్యులతో నేను యుద్ధమే చెయ్యాల్సి వచ్చింది. వాళ్ళేమో అంతా తినేసి పోదాం అని భీష్మించారు. మధ్యాహ్నం వేళకి

రికార్డో, ఇంతి, అర్బానో వెనుకబడిపోయారు. వాళ్ళకోసం ఆగాల్సి వచ్చింది. తొందరగా వెళ్తే స్థావరంలో విశ్రాంతి తీసుకోవచ్చనేది నాప్లాన్. కాని ఆ విశ్రాంతి ఏదో సగం దార్లోనే తీసుకోవాల్సి వచ్చింది. ఏదేమైనా ఇవాళ ప్రయాణం ఈడికగా సాగింది.

మధ్యాహ్నం 2.30కి రికార్టో కాల్చి చంపిన దుప్పిని తీసుకొచ్చాడు అర్బానో. దాంతో మాకు తిండికి కాస్త వెసులుబాటు కలిగింది. గుర్రపు డొక్కలు దాచిపెట్టాం. సాయంత్రం నాలుగున్నరకి మేం చేరాలనుకున్న చోటుకి సగం దూరంలో ఉన్నాం. అక్కడే పడి నిద్రపోయాం. చిన్చు, అర్బానో, అలెజాండ్రోలు గొణుగుళ్ళు మొదలుపెట్టారు. కాస్త తిక్కమీద ఉన్నారు వాళ్ళు.

**మార్చి 19**

ఉదయాన్నే ప్రయాణం మొదలు పెట్టాం. అనుకున్న ప్రకారం పదకొండుగంటలకు ఆగాం. రికార్డో, అర్బానో, అలెజాండ్రోలు వెనుకబడ్డారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చి చేరారు మమ్మల్ని. ఈ సారీ రికార్డో చంపిన దుప్పిని ఇంకోదాన్ని మోసుకొచ్చారు. వాళ్ళతో పాటే జోయాక్విన్ దళం కూడా వచ్చి కలిసింది. జోయాక్విన్, ఎల్‌రుబియోల మధ్య మాటామాటా పెరిగింది. రుబియోది తప్పు అనిపించకపోయినా మధ్యలో నేను జోక్యం చేసుకుని అతనికే సర్ది చెప్పా.

ఏదో ఒక రకంగా జలపాతం దగ్గరకు చేరుకోవాలని నిర్ణయించా. ఈ లోగా మా నెత్తిన ఒక చిన్న విమానం ఆకాశంలో చక్కర్లు కొట్టింది. ఇదంత మంచి విషయం కాదు. 'బేస్‌క్యాంప్' (ప్రధాన స్థావరం) నుండి ఇప్పటిదాకా ఎలాంటి సమాచారం లేకపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఇదే పరిస్థితి ఇంకొంత కాలం కొనసాగేలా ఉందని అనిపించింది నాకు. దళ సభ్యులు చికాకు పడుతున్నా మళ్ళీ నడక సాగించాం. సాయంత్రం ఏడున్నరకి అనుకున్న చోటుకుచేరుకున్నాం. అక్కడ మా కోసం ఎల్‌నీగ్రో అనే పెరూ దేశపు డాక్టరు, ఎల్‌చినో అనే రేడియో ఆపరేటరు ఎదురుచూస్తున్నారు. బెనినో మాకోసం ఆహారం సిద్ధం చేసి ఉంచాడని చెప్పారు. మోసెస్ గువేరా మనుషులు ఇద్దరు వచ్చారు గానీ వెళ్ళిపోయారట. పోలీసులు వ్యవసాయక్షేత్రం దగ్గర ఉన్నారని కూడా చెప్పాడు. 'సప్లై'లు తీసుకుని మూడు రోజుల క్రితమే బయల్దేరా, మధ్యలో రోలాండో కూడా కలిసాడని బెనినో వివరించాడు. ముందుకు కదలడానికి ఇది అనువైన సమయం కాదు, మూడు రోజుల నుండి పైన ఆకాశంలో హెలికాప్టరు చక్కర్లు కొడుతుంది, దిగువన నది ఒడ్డున సైన్యం ఏ క్షణానైనా ముందుకు కదలే అవకాశం

ఉన్నందున రెండు రోజులుగా ఎటూ కదలకుండా అక్కడే ఉండిపోయానని బెనినో చెప్పుకొచ్చాడు. వ్యవసాయక్షేత్రం మీద ఆరుగురు మనుషులు దాడిచెయ్యడం తన కళ్ళారా చూసానని ఎల్‌నీగ్రో చెప్పాడు. అంటోనియో, కోకోలు ఇద్దరూ అక్కడలేరట. మోసెస్ గువేరా గ్రూపుకు చెందిన దళ సభ్యులను కలుసుకునే దానికి కోకో కామిరికు వెళ్ళాడు. దళం నుండి జారుకున్న వాళ్ళ గురించి రిపోర్టు చెయ్యడానికి అంటోనియో వెళ్ళాడు.

మార్కోస్ దగ్గర నుండి సుదీర్ఘమైన సందేశం వచ్చింది. (డాక్యుమెంట్ నెం. 8). అందులో అతను చేపట్టిన కార్యక్రమాలను తనదైన ధోరణిలో వివరించాడు. వద్దని నేను స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ అతను వ్యవసాయ క్షేత్రానికి వెళ్ళాడు. పరిస్థితుల గురించి వివరిస్తూ ఆంటోనియో రెండు నివేదికలు పంపించాడు.

(డాక్యుమెంట్ నెం9,10)

ప్రధాన స్థావరంలో ఫ్రెంచి దేశస్థులు ఉన్నారు. ఎల్‌చినో అతని దళసభ్యులు, ఎల్‌పెలాడో, టానియా, మోసెస్ గువేరా అతని అర్థదళ భాగం – వీళ్ళూ అక్కడ ఉన్నది. బియ్యం, బీన్స్ పులుసు, దుప్పిమాంసంతో పసందైన విందు భోజనం తిన్నాం. జోయాక్విన్, చిన్‌చుల జాడ తెలుసుకు రావడానికి మిగ్యుయెల్ వెళ్ళాడు. చిన్‌చు మళ్ళీ వెనుకబడిపోయాడు. రికార్డో, జోయాక్విన్‌లతో కలిసి తెల్లవారుజామున తిరిగి వచ్చాడు. అందరం జట్టు కట్టాం ఇక్కడ.

**మార్చి 20**

పది గంటలకు మా ప్రయాణం మొదలయింది. చురుగ్గా సాగింది. మార్కోస్‌కు సందేశం అందించడానికి బెనినో, ఎల్‌నీగ్రోలు ఇద్దరూ ముందుగానే బయల్దేరారు. మార్కోస్‌ను సైనిక వ్యవహారాలు చూసుకోమనీ, అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలన్నీ ఆంటోనియోకు వదిలి పెట్టమని ఆదేశాలు పంపించా. మా తోవను పర్యవేక్షిస్తూ నది ఒంపుదాకా వెళ్ళివచ్చాడు జోయాక్విన్. అతని దళంలో ముగ్గురు సభ్యులకు కాళ్ళకు తొడుక్కొను ఏమీలేవు. మధ్యాహ్నం ఒంటి గంటకు మా ప్రయాణానికి సుదీర్ఘ విరామం. మార్కోస్ నుండి పాచో ఒక సందేశం తీసుకువచ్చాడు. బెనినో నుండి వచ్చిన సందేశంతో పాచో ఇచ్చిన రిపోర్టు సరిపోయింది. కాని ఇప్పుడు పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. దాదాపు 60 మంది సైనికులు వాలెగ్రాండె నుండి వేట మొదలు పెట్టి మొత్తానికి మా

వార్తాహరులలో ఒకతన్ని బంధించారు. మోసెస్ గువేరా దళానికి చెందిన అతని పేరు సాల్యుస్టియో. కంచరగాడిదను స్వాధీనం కూడా చేసుకున్నారు. జీపు మాత్రం పత్తాలేకుండా పోయింది. గుడిసె దగ్గర కాపలాగా ఉన్న ఎల్‌లోరో దగ్గర నుండి కూడా మాకు ఎలాంటి సమాచారం లేదు. ఏదేమైనా మేము ఎలుగుబంటి స్థావరానికి చేరుకోవాలని నిర్ణయించుకున్నాం. అక్కడ మేం ఒక ఎలుగుబంటిని చంపిన కారణాన ఆ స్థావరాన్ని అలా పిలుచుకోవడం అలవాటయింది. మిగ్యుయేల్, ఆర్బాన్‌లు ఇద్దరూ ముందుగా వెళ్ళి భోజనం ఏర్పాట్లు చూడమని పంపించాం. సాయం కాలానికి మేం అక్కడకు చేరుకున్నాం. డాంటన్, రెగిస్‌డెబ్రే, ఎల్‌పీలో, ఎల్‌చినో, టానియాలు స్థావరంలో ఉన్నారు. బొలీవియా దళం 'సప్లై'ల పని చూస్తుంది కాబట్టి మేం రాగానే వాళ్ళు వెళ్ళిపోయారు. పూర్తిగా వెనక్కి తగ్గాలనే సందేశం రోలాండోతో దళాలకు పంపించాం.

ఓటమి వాతావరణం నెలకొని ఉంది. మరి కాసేపటికి ఈ మధ్యనే దళంలోకి 'రిక్రూట్' అయిన బొలీవియా డాక్టరు రోలాండ్ పంపిన సందేశంతో వచ్చి మమ్మల్ని కలిసాడు. మార్కోస్, ఆంటోనియోలు నీటి చెలమ దగ్గర వేచి ఉన్నారు. నాతో కలసి మాట్లాడాలని అనుకుంటున్నారు అనేది సందేశం. 'యుద్ధాన్ని బులెట్లతోనే గెలవాలని, తక్షణం వాళ్ళను వెనక్కి తగ్గి స్థావరానికి వచ్చి చేరుకోవాలని, నేను వచ్చి కలిసే వరకు వేచి ఉండాలని' అతనితోనే తిరుగు సందేశం పంపించాను. పరిస్థితి పూర్తిగా గందరగోళంగా ఉంది. ఏం చెయ్యాలో వాళ్ళకేం పాలుపోతున్నట్లు లేదు.

నేను ఎల్‌చినొతో ప్రాథమిక చర్చలు నడిపా. నెలకు 5000 డాలర్ల చొప్పున పది నెలలకు గ్రాసం కావాలని. ఈ విషయమై నాతో మాట్లాడమని హవానా నుండి తనకు కబురు వచ్చిందని చెప్పాడు. తను వెంట ఒక సందేశం కూడా తెచ్చాడు. అది చాలా సుదీర్ఘంగా ఉండడంతో ఆర్టురో దాన్ని డీకోడ్ చెయ్యలేక పోయాడు. సూత్రప్రాయంగా అతని ప్రతిపాదనలకు నా ఆమోదం తెలిపాను. రాబోయే ఆర్నెల్లలో వాళ్ళు పోరాటం ప్రారంభించాలని చెప్పాను. పదిహేను మంది దళ సభ్యులతో ఆయకుచో ఏరియాలో తను ఆ పని మొదలు పెట్టగలనని నమ్మకంగా చెప్పాడు. ప్రస్థుతానికి ఐదుగురు సభ్యుల్ని తనవెంట తీసుకు వెళతానన్నాడు. ఇంకో పదిహేను మందిని తరువాత పంపాలని అడిగాడు. అందరూ సుశిక్షితులై, సాయుధలైన దళ సభ్యులయి ఉండాలని కోరాడు. మీడియం తరహా (40 మైళ్ళ విస్తీర్ణంలో పనిచేసే) ట్రాన్స్‌మీటర్లు కొన్ని కావాలని అడిగాడు. నిరంతరం సంబంధాల్లో ఉండడానికి 'కోడ్' ఒకటి

రూపొందించుకుందాం అని చెప్పాడు. మొత్తానికి గెరిల్లా పోరాటం పట్ల అతను చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

రోడాల్ఫో నుండి చాలా నివేదికలు తెచ్చాడు కానీ, అది అంతా పాత సమాచారం. ఎల్‌లోరో తిరిగి వచ్చాడు. ఒక సైనికుడిని సఫా చేసి వచ్చినట్లు తెలిసింది.

**మార్చి 21**

ఈ రోజు ఎల్‌చినో, ఫ్రెంచి మనిషి, ఏల్‌పీలో, టానియాలతో కలిసి మాట్లాడి కొన్ని అంశాలు స్పష్టం చేసుకున్నా, మాంజె, సైమన్ రెయెస్‌ల గురించి ఫ్రెంచి మనిషి చద్దివార్తలు చెప్పాడు. అతనుమాతో పాటు ఉండాలని వచ్చాడు. అయితే అతను ఫ్రాన్స్‌కు తిరిగి వెళ్ళిపోయి అక్కడ మాకు సహాయంగా ఉండేందుకు 'నెట్‌వర్క్'ను ఏర్పాటు చేసేదానికి కృషి చెయ్యమని అడిగాను. దారిలో క్యూబాకు వెళ్ళి అక్కడ తన సహచరుని పెళ్ళాడి, బిడ్డను కనాలనే కోరికా నెరవేర్చుకోవచ్చని చెప్పా. సార్త్రే, బెర్ట్రాండ్ రస్సెల్‌లకు నేను ఉత్తరాలురాయాల్సి ఉంది. బొలీవియా విముక్తి పోరాటానికి నిధులు సేకరించడానికి ఒక అంతర్జాతీయ నిధిని ఏర్పాటు చేసేలా చూడాలి. అలాగే అతను నా స్నేహితుడిని కలిసి నిధులు, మందులు, ఎలక్ట్రానిక్ సామాగ్రి - దాన్ని చూసుకునేందుకు ఒక ఇంజనీరును పంపించే ఏర్పాటు చూడాలని చెప్పాను.

ఎల్‌పీలో నా దళంలో పని చెయ్యడానికి సిద్ధపడ్డాడు. ప్రస్తుతానికి జోజమీ, జెల్‌మన్, స్టాంపోనీ దళాలకు మాకు మధ్య సమన్వయకర్తగా పనిచెయ్యాలని అడిగా. శిక్షణ ఇప్పించడం కోసం వాళ్ళ వాళ్ళు ఐదుగురిని పంపించమన్నారు. మారియా రోసా అలివర్‌ను, మా తండ్రిగారిని కలిసి శుభాకాంక్షలు తెలియచెయ్యమని అడిగా. దారి బత్తెంగా 500 పెసోలు ప్రయాణపు ఖర్చులుగా 1000 పెసోలు అతనికి ఇవ్వాలి. వాళ్ళు అంగీకారం అయితే ఉత్తర అర్జెంటీనాకు వెళ్ళి అక్కడ ఉన్న పరిస్థితుల మీద నాకు నివేదిక పంపించాలి.

టానియా కబురు పంపిన మీదట తన మనుషులు వచ్చారు. తను ఇక్కడికి వాళ్ళ జీపులోనే వచ్చినట్లు చెప్పింది. ఒక రోజు ఉండాలని అనుకుంది కానీ పరిస్థితులు క్లిష్టంగా మారాయి. జోజమీ కూడా మొదటి దఫా మాకు కూడా అందలేదు. టానియా ఇక్కడ ఉండిపోయింది కాబట్టి రెండవ దఫా అసలు మా 'కాంట్రాక్టు'లోకే రాలేదు. ఇవాన్ గురించి ముభావంగా ఎత్తుకొచ్చింది. పైపై మాటకు ఏంగానీ అసలు వీళ్ళ

మనస్సుల్లో ఏముందో నాకు అర్థం కాలేదు. ఫిబ్రవరి 9 వరకు లయోల లెక్క (1500 డాలర్లు) అప్ప చెప్పాం.

ఇవాన్ నుంచి రెండు నివేదికలు అందాయి. అందులో ఒకటి మిలిటరీ అకాడమీ ఫొటోలు, రెండవ దాన్లో చాలా వివరాలు ఉన్నాయి గానీ అంతగా పనికి వచ్చేవి కావు.

డాక్యుమెంట్ నెంబర్ 13లో సమాచారాన్ని డీకోడ్ చెయ్యడం మా వల్ల కాలేదు. ఆంటోనియో పంపిన నివేదిక (డాక్యుమెంట్ నెం. 12) తన ధోరణిని సమర్థించుకునేదిగా ఉంది. రేడియోలో సైనికుడి మరణవార్త ప్రసారమైంది. ఆ వెంటనే ఖండన వార్త వెలువడింది. కాబట్టి ఎల్‌లోరో చెప్పింది నిజమని తేలింది.

**మార్చి 22**

మా మకాం (సరిగా కనిపించడం లేదు) ఆనవాళ్ళు అన్నీ ధ్వంసం చేసి సరిగ్గా (సరిగా కనిపించడం లేదు) లకు మేం బయల్దేరాం. ఆహారం సరిగ్గా నిల్వ ( సరిగా కనిపించడం లేదు) చెయ్యలేక పోయాం. మధ్యాహ్నానికి కిందకు దిగాం. మమ్మల్ని కలవ వచ్చిన వాళ్ళ సహా మొత్తం నలభై ఏడు మంది ఒక దళంగా ఏర్పడ్డాం.

మేం అనుకున్న చోటుకు చేరుకోగానే మార్కోస్‌ను లెక్కలోకి తీసుకోకూడదని ఇంతి వెయ్యినొక్క విధాలుగా చెప్పుకొచ్చాడు. నేను కోపం పట్టలేక పోయాను. ఇట్లా అయితే గెరిల్లా దళం నుండి బహిష్కరించాల్సి వస్తుందని మార్కోస్‌ను హెచ్చరించాను. అంతకన్నా తనని కాల్చి చంపమన్నాడు కార్లోస్.

ఐదుగురు సభ్యులను మెరుపుదాడి కోసం ముందుకు పంపించాం. నది వెంటదారి కనుక్కోవడానికి మరో ముగ్గుర్ని పంపించాం. ఆంటోనియో దళ నాయకుడు. మిగ్యుయల్, ఎల్‌లోరోలు ఇద్దరూ ఉపనాయకులు అర్గనారాజ్ ఇంటి మీద నిఘాపెట్టడానికి పాచో వెళ్ళాడు. అయితే ఏమీ కనిపెట్టలేక పోయాడు. దారి కనుక్కోవడానికి వెళ్ళిన వాళ్ళు రాత్రికి తిరిగి వచ్చారు. గట్టిగా చివాట్లు పెట్టావాళ్ళని. ఓలో తీవ్ర భావోద్వేగంతో స్పందించాడు. నా ఆరోపణలను తిరస్కరించాడు. మీటింగ్ వేడివేడిగా జరిగింది. కానీ తిన్నగా నడవలేదు. మార్కోస్ ఏం చెప్పాడనే దానిమీద స్పష్టత లేదు. దళ సభ్యుల సంఖ్య కొత్త రిక్రూట్ల భర్తీ, పంపిణీల విషయమై అన్నీ

ఫైసలా చేసుకురమ్మని రోలాండ్‌ను పంపించాను. ఎందుకంటే సెంటర్ పార్టీలో ఇప్పటికే 30 మంది దళ సభ్యులు ఉన్నారు. ఆకలికి అలమటించి పోతున్నారు.

**మార్చి 23**

నిజమైన యుద్ధం వచ్చేసింది. పోంబో కొంత ఆహారాన్ని కొండ మీదకు చేర్చడానికి సన్నాహాలు చేసాడు. అయితే మార్కోస్ దగ్గర పరిస్థితులు ఏమిటో స్పష్టం అయ్యేదాకా ఆ పని చెయ్యవద్దని నే వారించాను. ఎనిమిదీ ఆ ప్రాంతంలో కోకో దూకుడుగా వచ్చాడు. సైనిక పటాలం ఒకటి మా మెరుపుదాడి వలయంలో చిక్కుకుందని కబురు తెచ్చాడు. ఫలితంగా గిట్టుబాటు అయినవి 60 ఎంఎం మోర్టార్లు మూడు, 16 మౌజర్లు, రెండు బిజడ్‌లు, మూడు యుఎస్‌ఐఎస్‌లు, ఒక పాయింట్ త్రీజీరో గన్ను, రెండు రేడియోలు, బూట్లు, ఏడుగురు చనిపోయారు. నలుగురు గాయపడ్డారు. పద్నాలుగు మంది ఖైదీలుగా చిక్కారు. కానీ మేం వాళ్ళ ఆహార నిల్వల్ని చేజిక్కించుకోలేక పోయాం. వాళ్ళు వేసిన ఎత్తు ఏంటో తెలుసుకున్నాం. నకాహుయాసు రెండు కొసల నుండి గాలింపు మొదలు పెట్టి ఒక పాయింట్ దగ్గర కలుసుకోవాలని బయల్దేరారు. దాంతో మా దళం చురుగ్గా కదిలి రెండో వైపున కాపు వేసాం. మార్కోస్ పాటు మొత్తం అడ్వాన్సు పార్టీ అంతా రోడ్డు కొసన ఉండేలా, సెంటర్ పార్టీ – రియర్‌పార్టీ డిఫెన్సు పొజిషనులో ఉండేలా బ్రవులియా దళం రోడ్డు రెండో కొసన మెరుపుదాడి చేసేదానికి పొజిషన్లు తీసుకున్నాం. రాత్రి అంతా ఇలానే గడపాలనేది నిర్ణయం. చూద్దాం. గొప్పలుగా చెప్పుకునే రేంజర్లు రేపు మా పాలబడక పోతారా. బందీలుగా చిక్కిన మేజరు, కెప్టెను చిలకపలుకులు వల్లించారు.

ఎల్‌చినో తీసుకువచ్చిన సందేశాన్ని డీకోడ్ చేశాం. డెబ్రీ ప్రయాణం గురించి, ఎల్‌చినో అడిగిన 60,000 డాలర్లు పంపిన సంగతి, ఇవాన్‌తో రాతకోతలు నిలిపివేసిన కారణాలు అందులో వివరించారు. సాంచెజ్ దగ్గర నుండి కూడా సమాచారం అందింది. మిటోను ఏయే ప్రాంతాలలో నిలిపేందుకు అవకాశాలు ఉన్నాయో తెలియచేసాడు అతను.

**మార్చి 24**

పూర్తి లెక్క తీసాం. పదహారు మౌజర్లు, మూడు మోర్టార్లు, 64 బాంబులు, రెండు బిజెడ్‌లు, 2000 రౌండ్ల మౌజర్ బుల్లెట్లు, మూడు యుఎస్‌ఐఎస్‌లు, ఒక్కోదానికీ

రెండేసి తూటా క్లిప్పులు, ఒక పాయింట్ త్రీజీరో రివాల్వర్లు రెండు బెల్టుల తుటాలు, ఏడుగురి మరణం, నలుగురికి గాయాలు, పద్నాలుగు మంది బందీలు, వేగుల పనిమీద మార్కోస్‌ను పంపించాం. మేం విడిచి వచ్చిన ఇంటి దగ్గర విమానాలు బాంబులు కురిపించడం మినహా ప్రత్యేకం ఏమీలేదని రిపోర్టు చేశాడు.

బందీలతో చివరిసారిగా మాట్లాడి వాళ్ళకు స్వేచ్ఛ ప్రసాదించే బాధ్యత ఇంతికు అప్పచెప్పా. వాళ్ళ దగ్గర మాకు పనికి వచ్చేవన్నీ ఒలిచేసుకోమని చెప్పా. ఆఫీసర్లతో విడిగా మాట్లాడి వాళ్ళ సరుకు సరంజామాతో సహా వదలిపెట్టాం. 27వ తేదీ మధ్యాహ్నం లోపు చనిపోయిన వారి శవాలను తీసుకు వెళ్ళవచ్చని గడువు ఇచ్చాం. వాళ్ళు ఈ చుట్టు పక్కల ఉండదలిస్తే లాంగ్యునిల్లాస్ ఏరియా ప్రాంతంలో మొత్తంగా నిర్యుద్ధ సంధి పాటిస్తామని చెప్పాం. అయితే సైనిక మేజర్ తాను సైన్యం నుండి రిటైర్ అవ్వాలను కుంటున్నానని చెప్పాడు. కెప్టెన్ ఏమో ఒక ఏడాదిక్రితమే తాను సైన్యంలో చేరాననీ, పార్టీ వాళ్ళు చెప్పబట్టి తాను ఆ పని చేసాననీ, తన సోదరుడు ఒకతను క్యూబాలో చదువుకుంటున్నాడని, అలాగే మరో ఇద్దరు ఆఫీసర్లు మా దళాలకు సహకరించాలని అనుకుంటున్నట్లు వాళ్ళ పేర్లు సహా చెప్పాడు. ఇంతలో విమానాల నుండి బాంబుల వర్షం కురవడంతో హఠాత్తుగా భయాందోళనలు చెలరేగాయి వారిలో. దళ సభ్యులతో ఇద్దరు – రావుల్, వాల్టర్ భీతిల్లిపోయారు. మెరుపుదాడిలో పాల్గొనేటప్పుడు కూడా వాల్టర్‌లో వొణుకుడు నే గమనించాను.

మార్కోస్ మళ్ళీ వేగుల పనిమీద వెళ్ళాడు. నాటో, కోకోలు ఇద్దరూ పైన ఆహార సరఫరాలు చేరవేయ్యడానికి సాయంగా వెళ్ళారు. అయితే వీళ్ళిద్దరూ ముందుకు సాగడానికి మొండికేసారు. ఇద్దరినీ దళం నుండి సాగనంపాలి.

**మార్చి 25**

ఈ రోజు కొత్తగా జరిగింది ఏం లేదు. నదికి వెళ్ళే రెండు దారులలో ఏది మెరుగ్గా ఉందో ఆరా తీసి రావడానికి లియోన్, అర్బానో, ఆర్టురోలు వెళ్ళారు. మధ్యాహ్నానికి మార్కోస్‘ఆంబుష్’ (మెరుపుదాడి) పొజిషను నుండి వెనక్కి మరలివచ్చాడు. అందరం ప్రధానమైన ‘ఆంబుష్’ మీద కేంద్రీకరించాం. సాయంత్రం ఆరున్నరకి నేను ఇప్పటి దాకా సాగిన సాహసయాత్ర గురించి విశ్లేషించి దానికున్న ప్రాధాన్యతలు ఏమిటో దళానికి వివరించాను. మార్కోస్ చేసిన తప్పులు ఎత్తిచూపాను. అతన్ని దళ నాయక

బాధ్యతల నుండి తప్పించాను. మిగ్యుయెల్‌ను అడ్వాన్‌పార్టీ నాయకుడిగా ప్రకటించాను. పాకో, పెపె, చింగోల్, యూసెబియోలను దళం నుండి తొలగిస్తున్నట్లు ప్రకటించా. వాళ్ళు పని చెయ్యందే తిండి దక్కదని చెప్పా. సిగరెట్ల కోటా రద్దు చేసా. వాళ్ళ దగ్గర ఉన్న సరుకు సరంజామా దళంలో అవసరం ఉన్న కామ్రేడ్లకు సర్దుబాటు చేసా. ఇక్కడకు రావడానికి 'కొల్లే' ప్రాజెక్టుకు ఉన్న సంబంధం ఏమిటో ఉదహరించాను. మాతో ఉన్న కమ్యూనిస్టు యువజన సంఘ సభ్యులను దళం నుండి బహిష్కరించిన మీదట ఏం చెయ్యాలో చర్చించాను. ఇక్కడ వాస్తవాలే ప్రాతిపదిక.వాస్తవాలతో పొసగని మాటలు సరకు చెయ్యనక్కర్లేదు. అధ్యయనం మళ్ళీ మొదలుపెట్టాలని ప్రకటించాను. ఆవును వెతికిరావాలని చెప్పా.

పెడ్రోతోను, డాక్టర్‌తోను మాట్లాడాను. గెరిల్లా యుద్ధ తంత్రంలో పూర్తి ప్రావీణ్యం సాధించినందుకు వారిని అభినందించాను. ఎవోలినార్ కూడా వాళ్ళ స్థాయికి చేరుకుంటాడని ఉత్సాహపరిచాను. వాల్టర్‌లో జంకును, దాడులు చేసే సమయంలో సంకోచాన్ని, శతృదాడులు జరిగేటపుడు ప్రదర్శించిన భయాలను ఎత్తిచూపి విమర్శించాను. కాని అతను ప్రతిస్పందించలేదు. ఎల్‌చినో, ఎల్‌పెడోలతో వివరంగా మాట్లాడి సందేహాల నివృత్తి చేసాను. పరిస్థితుల మీద ఫ్రెంచి అతనికి సుదీర్ఘ వివరణ ఇచ్చా. సమావేశం సందర్భంగానే దళానికి బొలీవియా జాతీయ విముక్తి సైన్యం (నేషనల్ లిబరేషన్ ఆర్మీ ఆఫ్ బొలీవియా) అని పేరు పెట్టాం.

**మార్చి 26**

ఇంతి, ఆంటోనియో, రావుల్, పెడ్రోలు టికూచా ప్రాంతంలో ఆవును వెతకడానికి పెందళాడే బయల్దేరారు. మా బస నుండి మూడు గంటల దూరంలో సైనిక బలగాల సంచారాన్ని గమనించి వాళ్ళ కంట పడకుండా వెనక్కి వచ్చేసారు. మొండికొండ మీద నుండి నిఘా వేసారని, రేకుల షెడ్డు ఇంట్లోంచి ఎనిమిది మంది వెళ్ళడం గమనించామని రిపోర్టు చేసారు. యాక్యుయి అనిమేం పిలుచుకునే ఈ నది పరిసర ప్రాంతాల్లోనే సైనిక బలగాలు ఉన్నాయి. మార్కోస్‌తో మాట్లాడి అతన్ని 'రియర్ పార్టీ' వైపుకు పంపాను. అతను తన నడవడిక మెరుగుపరుచుకునేట్లు కనిపించడంలా.

'సప్లై'ల కోసం చిన్న దళాన్ని, గార్డుల సహా పంపించాం. ఆర్గనారాజ్ దగ్గర నేలకు దించిన హెలికాప్టర్ ఒకటి, 30–40 మంది సైనికులు కనిపించారు.

## మార్చి 27

ఆ రోజు రేడియోలో మిగతా కార్యక్రమాలన్నీ రద్దు చేసి బారియాంటోస్ నిర్వహించిన పత్రికా సమావేశం సహా సైనిక ప్రకటనలు అనేకం విరివిగా ప్రసారం చేశారు. మొత్తానికి విషయం వార్తలకు ఎక్కింది. మా లెక్క కన్నా ఒక అంకెను ఎక్కువ చేసి అధికారికంగా సైనిక మరణాల గురించి ప్రకటించింది. గాయపడిన సైనికులను బంధించి కాల్చిచంపారనే వాదన వినిపించింది. మాలో పదిహేను మందిమి మరణించినట్లు, నలుగురు బందీలుగా చిక్కినట్లు అందులో ఇద్దరు విదేశీయులు అయినట్లూ వార్తలు వెలువరించారు. అందులో ఒక విదేశీయుడు ఆత్మహత్య చేసుకున్నాడనీ, మా దళంలో ఎంతెంత మంది సభ్యులు ఉన్నారనే కథనాలు వినిపించింది. అంటే మా దళాన్ని విడిచిపెట్టి వెళ్ళిన వారిని ఎవరినో బంధించి ఉండొచ్చు లేదా మేం బందీలుగా ఉంచి విడుదల చేసిన సైనికులు ఎవరైనా సమాచారం ఇచ్చి ఉండొచ్చు. వాళ్ళేం చెప్పారో వీళ్ళెలా అర్థం చేసుకున్నారో మాకు తెలీదు. అయితే పరిస్థితులను బట్టి చూస్తే టానియాను గుర్తించినట్లు రూఢీ అవుతుంది. అంటే రెండేళ్ళ పాటు ఓరిమితో చేసిన కృషి మొత్తం తుడిచిపెట్టుకు పోయింది. ఇక్కడ నుంచి మేం తప్పించుకోవడం కష్టతరం కావచ్చు. కాని డాంటన్ నా మాటలను ఇచ్ఛగించనట్లు కనిపించాడు. చూద్దాం భవిష్యత్తులో ఏం జరగనున్నదో.

పిరిరెండా వైపు వెళ్ళడానికి దారి కనుక్కొచ్చే పని మీద వెళ్ళారు బెనిపో, ఎల్‌లోరో, జూలియోలు ముగ్గురూ. ఆ పనికి రెండు మూడు రోజులు పట్టొచ్చు. కాని పిరిరెండాలో ఎవరి కంటా పడకూడదని, అలా అయితేనే తరువాత గుయాటిరైజ్ వైపుకు కదిలేందుకు వీలువుతుందని సూచించాం. శబ్దరహిత విమానం లోంచి గుట్టు చప్పుడు కాకుండా పారాచూట్లు పడినట్లు సెంట్రీలు వచ్చి చెప్పారు. ఆంటోనియోని, మరో ఇద్దరిని పోయి చూసి రమ్మని వీలయితే వాళ్ళని బంధించి తీసుకు రమ్మని ఆదేశాలు ఇచ్చాం. కాని వాళ్ళు ఒట్టి చేతులతో వచ్చారు.

సాయంకాలం సమావేశం వేసాం. మా భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించాం. గుడిసెలో దాచి ఉంచిన మొక్కజొన్నలు తీసుకు రావడానికి ఒకరు, గుయాటిరైజ్‌కు వెళ్ళి అవసరమైనవి కొనుక్కు వచ్చేందుకు ఒకర్ని పంపించాలని అనుకున్నాం. చివరికి శత్రుబలగాలను దారి మళ్ళించేందుకు తేలికపాటి వ్యూహాత్మక దాడి చెయ్యాలని నిర్ణయించాం. పింకాల్, లాంగ్యునిల్లాస్ మధ్య అడవిదారిలో నడిచే వాహనాలు టార్గెట్‌గా

దాడి జరపాలని అనుకున్నాం.

మేం కూడా ఒక పత్రికా ప్రకటనను రూపొందించాం. (డాక్యుమెంట్ నెంబరు 17). కామిరిలో ఉన్న విలేకరుల ద్వారా ఆ ప్రకటన వెలుగులోకి వచ్చేలా చూడాలను కున్నాం.

**మార్చి 28**

ఈ రోజు కూడా రేడియోలో గెరిల్లాలకు సంబంధించిన వార్తలతో హోరెత్తి పోయింది. 2000 మంది సైనికులు 120 కిలోమీటర్ల వ్యాసార్థంలో మమ్మల్ని చుట్టుముట్టారట. విమానాల నుండి 'నాపాం' బాంబులు కురిపించడానికి అంతా సిద్ధంగా ఉందట. మాదళాల్లో పది, పదిహేను మంది గాయపడినట్లు వార్తలు.

బ్రౌవులియోను మరో తొమ్మిది మందిని మొక్కజొన్న గింజలు పోగేసుకు వచ్చేందుకు పంపించాను. వాళ్ళు రాత్రికి గాని తిరిగి వచ్చారు కాదు. వస్తూ వస్తూ బోలెడంత చిత్రమైన సమాచారం మోసుకు వచ్చారు. (1) ముందస్తుగా బయల్దేరి ఏదన్నా ప్రమాదం ఉంటే మాకు హెచ్చరికలు అందించాల్సిన కోకో కనబడకుండా పోయాడు. (2) నాలుగు గంటలకు వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు అప్పటికే గుహ అంతా ఎవరో వెతుకులాడినట్లు ఉందట. దాంతో అక్కడ నుండి వెనక్కు తగ్గుదాం అనుకుంటూ ఉండగా రెడ్‌క్రాస్ తరపున ఏడుగురు సిబ్బంది, ఇద్దరు డాక్టర్లు, ఇంకొంత మంది నిరాయుధులైన సైనికులు కనిపించారు. (3) లారీడు సైనిక బలం కూడా వచ్చిందట, మావాళ్ళు కాల్పులు జరపకుండా వాళ్ళు వెనక్కి తిరిగి పోవడానికి సమ్మతించారు. (4) సైనికులు బాగా వెనక్కి తగ్గాక మా వాళ్ళు వైద్య బృందాన్ని 'డీకంపోజ్' అవుతున్న సైనికుల మృతదేహాల దగ్గరకి తీసుకువెళ్ళారు. వాళ్ళు ఆ శవాలను తరలించుకు పోవడానికి సిద్ధంగా లేమని, మర్నాడు వచ్చి అక్కడే దహనం చేస్తామని చెప్పారు. ఆర్గనారాజ్ గుర్రాలు రెంటిని జప్తు చేసుకు పోయారుట. ఆంటోనియో, ఎల్‌రూబియో, ఆనిసెటోలను జంతువుల కూడా ప్రయాణించలేని ఒక కాలిదోవ కడ దిగవిడిచి వెళ్ళారు. ఇంతిలో కోకో ప్రత్యక్షమయ్యాడట. బహుశా ఎక్కడో పడి నిద్రపోయి ఉంటాడని వాళ్ళ అంచనా. బెవినో దగ్గర నుండి ఎలాంటి సమాచారమూ లేదు. ఫ్రెంచి మనిషి ఆ రోజు కాస్త జోరుమీద ఉన్నాడు. తను బయట ఉండి ఉంటే ఎంత ఉపయోగంగా ఉండేదో వర్ణించి చెప్పాడు.

**మార్చి 29**

స్వల్ప సంఘటన మినహా చెప్పుకోదగింది ఏమీ లేదు. కానీ వార్తలు చూస్తే అసాధారణమైన సంఘటనలు ఎన్నో జరిగినట్లు సమాచారం. ఈ సమాచారం అంతా యదార్థమే అయితే అది మాకు ఎంతో విలువైనది కింద లెక్కే. రేడియో హవానా నుండి కూడా ఇటువంటి సమాచారమే ప్రసారమైంది. అమెరికా రాష్ట్రాల సంస్థలో క్యూబా అంశాన్ని లేవనెత్తాలనే వెనిజులా ప్రభుత్వ నిర్ణయాన్ని క్యూబా ప్రభుత్వం బలపరుస్తుందనే ప్రకటన వెలువడింది. ఒక వార్త మాత్రం నన్ను ఆందోళనకు గురిచేసింది. టిరాబాయ్ కనుమల్లో జరిగిన తేలికపాటి యుద్ధంలో ఇద్దరు గెరిల్లా యోధులు మరణించారనేదే ఆ వార్త. పిరిరెండాకు వెళ్ళే దారిలో ఆ కనుమలు ఉన్నాయి. వేగుల పనిమీద బెనినో వెళ్ళింది కూడా అటుకేసే. నిజానికి అతను నిన్నటికే తిరిగి రావాలి. కాని రాలేదు. ఎట్టి పరిస్థితులలోనూ ఆ కనుమల్లోకి కాలు పెట్టవద్దని నేను 'ఆర్డరు' వేసా. కానీ గత కొన్ని రోజులుగా తరచూ నా ఆదేశాలను పాటించకపోవడం నే గమనిస్తునే వున్నాను.

మోసెస్ గువేరాకు అప్పచెప్పిన పని చాలా ఈడికగా సాగుతుంది. అతనికి ఓ డైనమెట్ కూడా ఇచ్చాం కాని దాన్ని వాళ్ళు పేల్చనేలేదు. తిండి కోసం ఒక గుర్రాన్ని చంపి దాని మాంసం తో కడుపు నింపుకున్నాం. నిజానికి అది మాకు నాలుగురోజులకు సరిపడే ఆహారం. ఇంకోదాన్ని తెచ్చుకోవాల్సిందే రేపటి అవసరాల కోసం. కాని వీలయ్యేలా లేదు. ఆకాశంలో చక్కర్లు కొడుతున్న రాబందులను బట్టి శవాల దహన కార్యక్రమం ఇంకా జరగలేదని అర్థం అవుతా ఉంది. కొండ గుహ సిద్ధం అవడంతోటే మేం ఇక్కడి నుండి మకాం మార్చె య్యాలనుకుంటున్నాం. రాత్రానూ ఈ మకాం అసౌకర్యంగానూ ఇబ్బందిగానూ తయారయింది. ఎలుగుబంటి మకాం దగ్గర డాక్టర్, జోయాక్విన్, లతీపాలు అలెజాండ్రో ప్రధాన బాధ్యుడుగా ఉండాలని చెప్పాను. రోలాండ్పూర్తిగా డస్సిపోయాడు.

అర్బానో, ట్యూమాలతో చర్చించాను. ట్యూమా నా విమర్శలకు హేతువు ఏమిటో కూడా అర్థం చేసుకోలేకుండా ఉన్నాడు.

**మార్చి 30**

అంతా ప్రశాంతంగా ఉంది. బెనినో, అతనితో పాటు సహచర కామ్రేడ్లు మిట్టమధ్యాహ్నం వేళకి తిరిగి వచ్చారు. నిజానికి వాళ్ళు టిరాబాయ్ కనుమల్లోకి వెళ్ళారు

కాని అప్పటికే వేరే మనుషుల జాడ ఉంది ఆ కనుమల్లో, రైతులు వాళ్ళని చూసారు. అయినా వాళ్ళు గమ్యం చేరుకుని మరీ తిరిగివచ్చారు. పిరిరెండా వెళ్ళడానికి నాలుగు గంటలు పట్టవచ్చని, ప్రమాదం ఏమీ లేదని నివేదించారు. విమానాల నుండి వూరిపాక మీదకు గుళ్ళవర్షం కురిపించారు. నది ఎగువన పరిస్థితి ఏమిటో ఆరా తీసి రమ్మని నేను ఆంటోనియోను పంపాను. సైనిక బలగాలు అలానే తిష్టవేసి ఉన్నాయి. నదివెంబడి పహారా కూడా సాగుతుంది. అక్కడక్కడా కందకాలు కూడా తవ్వి ఉన్నాయని చెప్పాడు.

తప్పిపోయింది అనుకున్న ఆడగుర్రం దొరికింది. కాబట్టి దరిద్రాతి దరిద్రపు పరిస్థితులు ఎదురయినా నాలుగు రోజుల పాటు తిండికి ఇబ్బంది లేకుండా పోయింది. రేపటి రోజున పూర్తి విశ్రాంతి. ఆ మరుసటి రోజున అడ్వాన్సు పార్టీ తరువాతి రెండు ఆపరేషన్‌లు చేపట్టడానికి బయలుదేరుతుంది. 1. గుయాటి బ్రెజ్‌ను స్వాధీనం చేసుకోవడం 2. అర్గనారాజ్, లాంగ్యునిల్లాస్‌ల మధ్య ఉన్న రోడ్డు మార్గంలో మెరుపు దాడి ('ఆంబుష్') జరపడం.

**మార్చి 31**

పెద్దగా సమాచారం ఏమీ లేదు. మరుసటి రోజుకు గుహ సిద్ధంగా ఉంటుందని మోజెస్ గువేరా ప్రకటించారు. మోర్టార్లదాడి, విమానాల మీద నుండి బాంబులు కురిపిస్తూ సైనిక బలగాలు మరోమారు వ్యవసాయక్షేత్రంమీద దాడికి పూనుకున్నారని ఇంతి, రికార్డో 'రిపోర్టు' చేసారు. దాంతో 'సప్లై' ల కోసం 'పిరిరెండా' వెళ్ళాలనే మా ప్రణాళిక దెబ్బతిన్నది. మాన్యుయెల్ దళం మేం వదిలివచ్చిన ఇంటికేసి 'అడ్వాన్సు' అవాలని ఆదేశించా. అది ఖాళీగా ఉంటే స్వాధీనంలోకి తీసుకోవాలని, అక్కడినుండి ఊహించని రీతిలో సైనికుల మీద దెబ్బ తియ్యాలని, అలా సాధ్యం కాకపోతే వెనక్కివచ్చి పింకీల్, లాగ్యునిల్లాస్‌ల మధ్యన మెరుపుదాడి చెయ్యాలని వ్యూహం రూపొందించాం. వాళ్ళు ఆ ఇంటిని స్వాధీనం చేసుకుని సమాచారం అందిస్తే ఇక్కడ నుండి మరుసటి రోజున బయటపడేందుకు అవకాశం ఉంటుంది. రేడియోలో కథనాలు షరామామూలే. కొత్తగా మరిన్ని సైనిక బలగాలను యుద్ధం లోకి దించినట్లు అధికారిక ప్రకటనలు. యాక్యుయి నది, నకాహుయాసుల మధ్య వాళ్ళు మమ్మల్ని దిగ్బంధించారు. మమ్మల్ని చుట్టుముట్టే ప్రయత్నం చెయ్యవచ్చు. మేం బయట పడేదానికి తగిన మార్గం అన్వేషించడంలో బెనినో వైఫల్యం గురించి, మార్కోస్ గురించి వివరించి చెప్పా బాగానే స్పందించాడు.

ఆరోజు రాత్రి నేను ఎల్‌లోరో, అనీసెటోలతో చర్చించా. చర్చ దరిద్రంగా నడిచింది. దళం ముక్కలయిపోతుందని ఎల్‌లోరో అన్నాడు. దాని అర్థం ఏమిటని నేను అడిగా. మార్కోస్, బెనినోలను అడిగితే తెలుస్తుందని చెప్పాడు. అనీసెటో కూడా సగం సగం వాదనలు చేసాడు. అవి కూడా లోరో మాట్లాడిన ధోరణిలోనే ఉన్నాయి. అయితే ఆ తరువాత కోకోతో మాట్లాడుతూ ఇదేదో గెరిల్లా దళానికి సంబంధించి అన్న మాటలు కాదని చెప్పుకొచ్చాడట. ఎల్‌లోరో తో కలిసి తోడు దొంగల మాదిరి కొన్ని టిన్నులు కాజేసినా ఆది, ఇంతి, బెనినో, పోంబోలకు వీటితో సంబంధం లేదని చెప్పాడలా.

**నెలసరి సమీక్ష**

ఈ నెలంతా రకరకాల ఘటనలు చోటు చేసుకున్నాయి. జనరల్ పరిస్థితిని గురించి ఇలా చెప్పుకోవచ్చు. గెరిల్లా దళం ప్రక్షాళనకు, సంఘటితం చేసేందుకు తగిన ప్రాతిపదిక ఏర్పడింది. కొద్దిమంది క్యూబన్లను, మోజెస్‌గువేరా దళ సభ్యులను చేర్చుకోవడంతో దళం క్రమంగా బలపడతా వుంది. క్యూబన్లు ఫరవాలేదుగానీ మోజెస్ గువేరాతో కలిసి వచ్చి చేరిన వాళ్ళు మాత్రం అంచనాలకు తగినట్లులేరు (ఇద్దరు దళం విడిచి పారిపోయారు, ఒకతను ఖైదీ ముగ్గురు బహిష్కరణకు గురయ్యారు, మరో ఇద్దరు బలహీనంగా ఉన్నారు). గెరిల్లా యుద్ధం తొలి అంకంగా పకడ్బందీగా, అద్భుతమైనదాడే జరిగింది కానీ దాడికి ముందూ తరువాత కంగాళీతనం, నిర్ణయాత్మకంగా ఉండకపోవడం అనే ధోరణులు ప్రస్ఫుటమయ్యాయి. (మార్కోస్ వెనుకంజ, బ్రౌవులియా పనులు ఈ కోవలోకే వస్తాయి), శత్రువు ప్రతిదాడి కూడా మొదలయింది. ఈ ప్రతిదాడి లక్షణాలు ఇవి –(అ). పట్టు బిగించి మమ్మల్ని ఒంటరి పాటు చెయ్యడం (ఆ). జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గగ్గోలు రేకెత్తించడం (ఇ). ఇప్పటిదాకా ఏ మాత్రం చురుకుగా లేకపోవడం (ఈ). రైతులను సమీకరించడం.

ఈ పరిణామాల రీత్యా మేం అనుకున్నదాని కన్నా ముందే ఇక్కడ నుండి బయలుదేరాలి. కొద్దిపాటి దళాన్ని 'రిజర్వుదళంగా' ఇక్కడే దిగ విడవాలి. నలుగురు ఇన్‌ఫార్మర్లుగా పనిచేస్తున్నారేమో అనే బలహీనత ఉండనే ఉంది. పరిస్థితి గొప్పగా ఉందని చెప్పలేం. కాని ఈ మలి విడత దళ గెరిల్లాలకు పరీక్షగా మారనుంది. ఈ దశగడిస్తే ఇహ దళ సభ్యులు రాటు దేలినట్లే.

అడ్వాన్స్ పార్టీ – కమాండర్‌గా మిగ్యుయెల్. దళ సభ్యులుగా బెనినో, పాచో, లోరో, అనిసెటో, కాంబా, కోకో, డారియో, జూలియో, పాబ్లో, రావుల్‌లు ఉంటారు.

రియర్ పార్టీ – కమాండర్‌గా జోయాక్విన్, రెండవ కమాండర్‌గా బ్రౌవులియో ఉంటారు. దళ సభ్యులు – రుబియో, మార్కోస్, పెడ్రో, డాక్టరు, వోలో, వాల్టర్, విక్టర్. (పెపె, పాకో, యూసెబియో, చింగోలో)

సెంటర్ పార్టీ – నేను, అలెజాండ్రో, రోలాండో, ఇంతి, పొంబో, నాటో, ట్యూమా, అర్బానో, మోరో, నీగ్రో, రికార్టో, ఆర్టురో, యూస్టేక్వియో, మోజెస్ గువేరా, విల్లీ, లూయిస్, ఆంటోనియో, లియోన్ (టానియా, పీలాడో, డాంటన్, ఎల్‌చినో – విజిటర్లు) (సెర్పియో – శరణార్థి)

+ తరువాత తరువాత 'చపాకో' పేరిట తారసిల్లుతాడు.

# ఏప్రియల్ 1967

**ఏప్రియల్ 1**

అడ్వాన్సు పార్టీ ఈ రోజు ఉదయం ఏడు గంటలకు బయల్దేరింది, అనుకున్న సమయాని కన్నా ఆలస్యంగా. కాంబా కనబడకుండా పోయాడు. ఎల్‌నాటోతో కలిసి ఎలుగుబంటి గుహలో తుపాకులు దాచిపెట్టి రావడానికి వెళ్ళినవాడు ఇంకా తిరిగిరాలేదు. గస్తీకి వెళ్ళిన ట్యూమా పదిగంటలకు తిరిగివచ్చాడు. మా వేట ప్రాంతంలో ముగ్గురు, నలుగురు సైనికులను చూసినట్లు చెప్పాడు. దాంతో మేం 'పొజిషన్లు' తీసుకున్నాం. మరోవైపు గస్తీ కాస్తున్న వాల్టర్ మమ్మల్ని హెచ్చరించాడు. ముగ్గురు సైనికులు, ఒక కంచరగాడిదో, గాడిదో అగుపించారని, వాళ్ళు ఏదో ఆయుధాల్ని 'పొజిషన్'లో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పాడు. అటుకేసి చూపించాడు. కాని నాకు ఏం కనబడలా. సాయంత్రం నాలుగు గంటలకు వెనక్కి తగ్గాలని నిర్ణయించాం. అవతలి వైపు నుండి దాడి జరిగే అవకాశం లేనందున మేం అక్కడ కాపుకాసి ఉపయోగం లేదని అలాంటి నిర్ణయానికి వచ్చాం. వాల్టర్ చిత్తభ్రమకు లోనయి ఉంటాడని అనిపించింది.

రేపటికల్లా ఈ ప్రదేశం నుంచి ఖాళీ చెయ్యాలని నిర్ణయించాను. జోయాక్విన్ లేనందున 'రియల్ పార్టీ'కు రోలాండోను బాధ్యుడుగా అనుకున్నాం. ఎల్‌నాటో, కాంబాలు ఇద్దరు రాత్రి 10 గంటలకు వచ్చి చేరారు. అక్కడ కాపలాగా ఉండాల్సిన ఆరుగురు దళ సభ్యులకు అవసరమైన తిండి మినహా మిగతావన్నీ వదిలేశాం. రాత్రి 11 గంటలకు ఆంటోనియా మొక్కజొన్నల సంచి ఒకటి వేసుకొచ్చాడు. అంతా సజావుగా సాగిందని చెప్పాడు.

తెల్లవారుజామున నాలుగు గంటలకి రోలాండో నలుగురు బక్క ప్రాణులని – చింగాలీ, యూసెబియో, పాకీ, పెపె – తీసుకుని బయల్దేరాడు. పెపెకు ఒక తుపాకి ఇచ్చి అక్కడే ఉంచాలని చివరి నిమిషంలో అనుకోవడంతో అతని బదులుగా కాంబా వెళ్ళాడు.

ఐదు గంటల ప్రాంతంలో కోకో వచ్చాడు. ఒక ఆవు దొరికితే వేటు వేసి మాకోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పాడు. ఎల్లుండి మధ్యాహ్నం విందుకు ఏర్పాట్లు చెయ్యమన్నాం. అడవిలో నుండి దిగువనున్న పశువులపాక పక్కగా పారే నదిపాయ దగ్గర కలవాలనుకున్నాం.

**ఏప్రిల్ 2**

మా దగ్గర పాడుబడి పోయిన వస్తువులను ఆయా గుహల్లో దాచిపెట్టడానికే రోజంతా సరిపోయింది. సాయంత్రం ఐదింటివరకూ ఆ పని సాగుతానే ఉంది. నలుగురు సభ్యులకు సెంట్రీ పని పురమాయించాం. ఈ రోజు ఎందుకోగానీ ఎక్కడా విమానం మోత వినబడలా. రోజంతా నిశ్శబ్దంగా గడిచిపోయింది. రేడియోలో వస్తున్న వ్యాఖ్యానాలను బట్టి చూస్తే సైన్యం మమ్మల్ని చాలా దగ్గరిగా చుట్టుముట్టేసిందట, నకాహుయాసు కనుమ దగ్గర గెరిల్లా దళాలు ఆత్మరక్షణ కోసం పోరుకు సిద్ధపడుతున్నాయట. కోకోకు పశువుల కొట్టాన్ని అమ్మిన డాన్ రెంబెర్టోను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. అతను అమ్మినతీరు గురించి కథనాలు వెలువరించారు.

సమయం మించిపోతుంది. ఇహ ఇప్పుడు బయల్దేరడం వీలు కాదనుకున్నాం. తెల్లవారుజామున మూడు గంటలకు బయల్దేరి తిన్నగా నకాహుయాసు వెంబడి పోతే ఒక రోజు కలిసి వస్తుందని నిర్ణయించుకున్నాం. మేం ఎంచుకున్న దారి విందు ఏర్పాటు కోసం అనుకున్న ప్రాంతానికి సరిగ్గా వ్యతిరేక దిశలో ఉంది. ఆ రోజు మోరోతో మాట్లాడాను. తిండియావ, వెటకారాలతో సహచర కామ్రేడ్స్‌కు కోపం తెప్పించే బలహీనతల మూలంగా అతనికి దళంలో మెరికల్లాంటి వాళ్ళ సరసన స్థానం దక్కకుండా పోతుందని ఎత్తిచూపా. ఈ విషయాల మీదే కాసేపు ఇద్దరం చర్చించుకున్నాం.

**ఏప్రిల్ 3**

మా కార్యక్రమం ఎలాంటి సమస్యలు లేకుండా సాగింది. తెల్లారగట్ల మూడున్నరకు మా ప్రయాణం మొదలయింది. దగ్గర దారి వొంపు దాటేదాకా నిదానంగా సాగాం. ఆ మలుపు తిరిగే సరికి ఆరున్నర అయ్యింది. ఎనిమిదిన్నరకి పశువుల కొట్టం హద్దులకు చేరుకున్నాం. మేం మెరుపు దాడికి దిగిన ప్రాంతానికి చేరుకునే సరికి అస్థిపంజరాలు తప్ప శవాల అనవాళ్ళు మచ్చుకైనా లేవు. రాబందులు వాటి పని సుబ్బరం చేసాయి. రోలాండోను 'కాంటాక్టు'లోకి తెచ్చుకోవడానికి అర్బానో, నాటోలను పంపాను. మధ్యాహ్నం దాటాక టిరాబాయ్ నది ఒంపు కేసి బయల్దేరాం. జొన్నలు, ఆవుమాంసం తిని అక్కడే నిద్రలకు పడ్డాం.

డాంటన్, కార్లోస్‌లతో మాట్లాడి వాళ్ళ ముందు మూడు ప్రత్యామ్నాయాలు ఉంచారు. ఒకటి మాతోపాటే ఉండడం, రెండు వాళ్ళు వేరే దారి చూసుకోవడం, మూడు గుయాట్రిజ్‌కు వెళ్ళి అక్కడ నుండి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం. వాళ్ళు మూడో ప్రత్యామ్నాయాన్ని ఎంచుకున్నారు. మా అదృష్టాన్ని మేం రేపు పరీక్షించుకుంటాం.

**ఏప్రిల్ 6**

ఈ రోజంతా 'టెన్షన్'గా గడిచింది. నకాహుయాసు నదిని తెల్లవారుజామున నాలుగు గంటలకు దాటాం. సూర్యోదయం అయ్యాక మళ్ళీ ప్రయాణం మొదలెడదాం అనుకున్నాం. వేగుల పని మిగ్యుయెల్‌కు అప్పచెప్పాం. కాని అతను రెండుసార్లువెనక్కి వచ్చేసాడు. అతను చేసిన తప్పుల మూలంగా మేం సైనికులకు దగ్గరిగా అయ్యాం. మేం ఖాళీ చేసి వచ్చిన చోటుకి పది మంది సైనికులు వచ్చారని ఎనిమిదింటికి వచ్చిన రోలాండో చెప్పాడు. అక్కణ్ణించి నిమ్మళంగా జారుకున్నాం. పదకొండు గంటలకు ప్రమాదరహిత ప్రాంతానికి చేరుకున్నాం. నది ఒడ్డు వెంబడి దాదాపు వంద మందికి పైగా సైనికులను దించారనే సమాచారం తీసుకొచ్చాడు రోలాండో.

ఆ రాత్రి మేం ఇంకా నది కాడికి చేరుకోక ముందే నదివైపు నుండి పశువుల కాపర్ల మాటలు వినవచ్చాయి. మేం తుప్పల్లోంచి బయటికి వచ్చి నలుగురు కాపర్లను మా అధీనంలోకి తీసుకున్నాం. వాళ్ళు రైతులు. కొన్ని ఆవులు కూడా ఉన్నాయి. దారి తప్పిన పన్నెండు ఆవులను వెతుక్కుంటూ వచ్చిన వాళ్ళ నుండి ఎలాంటి ప్రమాదం ఉండదని సైన్యం గ్రహించాకే ఇటు వదిలినట్లు ఉన్నారు. కొన్ని ఆవులు దారితప్పిపోయాయి. వాటిని వెతికి పట్టుకోవడం అసాధ్యం. వాళ్ళతో ఉన్న రెండు ఆవులను మేం అట్టే పెట్టుకుని నది వెంబడే తిరిగిపొమ్మని వారికి పురమాయించాం. ఆ నలుగురు పౌరులలో ఒకరు కాంట్రాక్టరు, ఇంకొకతను అతని కొడుకు. చుక్వినాకాకు చెందిన రైతు ఒకరు, మరొకతను కామిరి ప్రాంతానికి చెందినవాడు. మేం ఇచ్చిన కరపత్రాన్ని పంపిణీ చేస్తామని వాగ్దానం చేసారు.

కొంత సేపు మా అధీనంలో ఉంచుకుని ఆనక వదిలిపెట్టాం. మా విషయమై ఎక్కడా నోరెత్తవద్దని చెప్పాం. అలాగే అని ఒట్టేసి చెప్పారు. ఆ రాత్రి అంతా మేం కడుపారా తిన్నాం.

## ఏప్రిల్ 7

మేం నదికి బాగా ఎగువకి పోయి తిష్టవేశాం. మాతో పాటు ఆవును తోలుకు పోయాం. అక్కడ దాన్ని కోసి, కొంత ఉప్పురాసి ఎండబెట్టి ఇంకొంత వండుకు తిన్నాం. రోలాండో నదివైపు కాపుకాసాడు. కనబడితే కాల్చివేత ఉత్తర్వులు ఇచ్చాం అతనికి. అయితే ఆ రోజు ఏం జరగలేదు. బెనినో, కాంబాలు ఇద్దరు పిరిరెండాకు వెళ్ళే కాలి తోవ వెంబడి వెళ్ళివచ్చారు. నది దాపున కనుమలో అడితీలో వాడే కోత మిషను లాంటి మోటారు శబ్దం వినబడిందని చెప్పారు.

జోయాక్విన్‌కు సందేశం ఇచ్చిరావడానికి అర్బానో, జూలియోలను పంపాను. వాళ్ళింకా తిరిగి రాలేదు.

## ఏప్రిల్ 8

ఈరోజు చెప్పుకోదగ్గది ఏం జరగలేదు. బెనినోను పనిమీద పంపించాం. అతడు వెళ్ళడం, రావడం అయిందిగానీ పని పూర్తి చేసుకురాలేదు. మరుసటి రోజుకు కూడా పూర్తి అయ్యేలా లేదు. కొండ కొస మీద నుండి బెనివో చూసానని చెబుతున్న ఫిరంగి ఉందో లేదో తేల్చుకురావడానికి వెళ్ళిన మిగ్యుయెల్ తిరిగిరాలేదు. అర్బానో, జూలియోలు పోలోతో కలిసి వెనక్కి వచ్చారు. సైనికులు మకాం వేసారు. కొండల్లోకి జట్లు జట్లుగా సైనికులని పంపుతున్నారు. కొండకొస నుండి కిందకి వచ్చేటపుడు మా 'అతిథి గృహాన్ని' దాటుకుంటూనే వెళ్ళారు. ఈ సమస్యలు, ఇంకా ఇతరత్రా సమస్యల గురించి జోయాక్విన్ ఒక నివేదిక తయారు చేసాడు. అదే డాక్యుమెంట్ నెంబరు 19. మా దగ్గర మూడు ఆవులు, దూడల సహా ఉన్నాయి. అయితే ఒక జట్టు ఆవు దూడా తప్పిపోయాయి. మా దగ్గర నాలుగే మిగిలాయి. మా దగ్గర ఉప్పు సరిపడా ఉంది కాబట్టి ఎండు మాంసం ఊరబెట్టకోవచ్చు.

## ఏప్రిల్ 9

పోలో, లూయిస్, విల్లీలకు అప్పచెప్పిన పనిమీద వెళ్ళారు. జోయాక్విన్ కు ఒక సందేశం తీసుకు వెళ్ళారు. నది ఎగువ తట్టున రహస్యంగా దాగి ఉండేందుకు అనువైన స్థలానికి జోయాక్విన్ దళం వెనుతిరిగి రావడానికి ఆ ముగ్గురూ సహకరించాలనేది వాళ్ళకు అప్పచెప్పిన పని. నాటో, మోసెస్ గువేరాలకు అలాంటి చోటు వెతికే పని ఒప్పగించబడింది. మిగ్యుయెల్ వేగుల పని మీద వెళ్ళి వచ్చాడు.

పిరిరెండాకు దారి తీసే కనుమ దారి దొరికిందనీ, అక్కడికి చేరడానికి ఇంకోరోజు పడుతుందని చెప్పాడు. కాబట్టి బెనినోను ముందుకు వెళ్ళొద్దని వారించాను. నా అంచనా ప్రకారం ఒక రోజు కాదు ఇంకో రోజు కూడా పడుతుంది ఆ కనుమ దాటడానికి.

**ఏప్రిల్ 10**

తెల్లవారుజామున, ఉదయంపూటా ఏ హడావుడీ లేకుండా గడిచిపోయింది. మేం అక్కడ నుండి బయల్దేరి మిగ్యుయెల్ చెప్పిన కనుమగుండా పిరిరెండా–గుయాట్రిజ్ లను దాటాలని అనుకున్నాం. ఇంతిలో ఎల్‌నిగ్రో వచ్చాడు. చాలాఆందోళనగా ఉన్నాడు. పదిహేను మంది దాకా సైనికులు నది వెంబడి వస్తున్నట్లు చెప్పాడు. మాటు వేసి ఉన్న రోలాండోను హెచ్చరించడానికి ఇంతి వెళ్ళాడు. మాకు వేచి ఉండడం తప్ప మరో మార్గం లేదు, కాబట్టి వేచి ఉండిపోయాం. ట్యూమాను కూడా ఏం జరుగుతుందో చూసి రమ్మని పంపించా. ఆ తరువాత కొద్ది సేపటికే మేం దుర్వార్త వినాల్సి వచ్చింది. ఎల్‌రుబియో జీసస్ సూరెజ్ గయోల్‌లు ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారని తెలియవచ్చింది. వాళ్ళను 'కేంప్' దగ్గరకు తెచ్చేలోపు తలకు తగిలిన బుల్లెట్ గాయంతో ఒకరు చనిపోయారు. ఇదెలా జరిగిందంటే – 'రియర్‌పార్టీ' నుండి ఎనిమిది మంది సభ్యులతో మెరుపు దాడికి వ్యూహం వేసారు.  తరువాత 'అడ్వాన్సు పార్టీ' నుండి మరో ముగ్గురుని కూడా ఈ దళానికి కలిపారు. నది రెండు ఒడ్డులా కాపు కాసారు. పదిహేను మంది సైనికులు ఉన్నారన్న వార్త చేరడంతో ఇంతి ఎల్‌రుబియో 'పోజిషను'లోకి వెళ్ళాడు. అది సరైన చోటు కాదని అక్కడ నుండి తాను సైనికులకు స్పష్టంగా కనబడతా ఉంటానని అర్థం చేసుకున్నాడు. సైనికులు గెరిల్లా దళాల జాడ వెతుక్కుంటూ బేపర్వాగా నది వెంబడి వెతుకులాడుతూ బయల్దేరారు. అలా తిన్నగా వచ్చి ఉచ్చులో చిక్కడానికి ముందే బ్రవులియో పెడ్రోలకు తారసపడ్డారు. కాల్పులు నిమిషాల్లో జరిగి ఆగిపోయాయి. సైనికులలో ఒకరు చనిపోయారు.  ముగ్గురు గాయాల పాలయ్యారు. ఆరుగురు బందీలుగా చిక్కారు. ఆ తరువాత కొంత సేపటికి ఒక సబ్–లెఫ్టినెంట్ నేలకొరిగాడు. నలుగురు సైనికులు తప్పించుకున్నారని–ఎల్‌రుబియో తీవ్రమైన వేదనతో ఒక గాయపడిన సైనికుడి పక్కన పడి ఉన్నాడు. అతని తుపాకి 'జామ్' అయిపోయి ఉంది. పిన్ను తీసినా పేలకుండా ఉన్న గ్రెనేడ్ ఒకటి కూడా అతని పక్కనే పడిఉంది.  గాయపడిన శత్రుసైనికుడి పరిస్థితి క్లిష్టంగా ఉండడంతో అతన్ని 'ఇంటరాగేట్' చెయ్యడం కుదరలేదు. తరువాత అతను చనిపోయాడు. సబ్ – లెఫ్టినెంట్ కూడా అదే పరిస్థితుల్లో మరణించాడు.

బందీలుగా చిక్కిన వాళ్ళని 'ఇంటరాగేట్' చేసిన మీదట మాకు పరిస్థితి అర్థమయ్యింది. నకాహుయాసు నది దగ్గర తిష్ట వేసిన సైనిక కంపెనీలోని వాళ్ళే వీళ్ళు. కొండ కనుమలో మిగిలిన మృతసైనికుల అవశేషాలను సేకరించుకుని అక్కడ మకాం వేసారు. అక్కడ కొన్ని డాక్యుమెంట్లు, ఫొటోలు దొరికినట్లు రేడియోలో వార్తలు వచ్చాయిగానీ వాళ్ళ చేతికి అలాంటివేమీ చిక్కలేదని చెప్పారు. కంపెనీలో మొత్తం వందమంది సైనికులు ఉన్నారు. ఒక పదిహేను మంది ఘటనాస్థలికి వచ్చిన జర్నలిస్టులకు రక్షణగా వెళ్ళారు. మిగతా వాళ్ళను జట్లు జట్లుగా చుట్టు పక్కల గాలించి సాయంత్రం 5 గంటలకల్లా తిరిగి రమ్మనమని పంపించారు. ఉన్నంతలో ఎక్కువమంది పింకాల్ దగ్గర ఉన్నారు. లాంగ్యునిల్లాస్ దగ్గర ముప్ఫై మంది సైనికులు ఉన్నారు. టిరాబాయ్ నది ఒంపుదగ్గర కనిపించిన జట్టు గుయాట్రెజ్‌కు తిరిగి వెళ్ళాల్సి ఉంది. ఇంకొంత మంది ఖర్మం కాలి అడవుల్లో దారి తప్పాం. తాగునీరుకూడా లేదు, వాళ్ళ కోసం వెతుకులాడాలి అని చెప్పారు. దాన్ని బట్టే తప్పించుకుపోయిన సైనికులు తిరిగి ఆలస్యంగానయినా అదే త్రోవన వెనక్కిరావాల్సిందే అన్న అంచనా తో మా 'ఆంబుష్ పార్టీ'ని అక్కడే మాటు వేసి ఉండమని చెప్పా. అడ్వాన్స్ పార్టీ సహకారంతో రోలాండో ఇప్పటికే ఒక ఐదు వందల మీటర్లు ముందుకు పోగలిగాడు. ముందు వాళ్ళని వెనక్కి మళ్ళమని ఆదేశాలిద్దాం అనుకున్నాం. తర్వాత ఆలోచించి వాళ్ళని అక్కడే ఉంచడం మంచిదనిపించింది. సాయంత్రం ఐదుగంటలకు సైనికులు పెద్ద సంఖ్యలో ముందుకు దూసుకు వస్తున్నట్లు మాకు సమాచారం అందింది. వేచి ఉండడం తప్ప మేం చెయ్యగలిగింది ఏం లేదు. పరిస్థితి ఎలా ఉందో చూసే రమ్మనమని పోంబోను పంపాను. తర్వాత కాసేపటికి ఆగాగి తుపాకి కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఇంకాసేపటికి పోంబో తిరిగివచ్చాడు. సైనికులు మా ఉచ్చులో మళ్ళా పడ్డారని, చాలా మంది చనిపోయారని, అంతకన్నా ఎక్కువ మంది బందీలుగా చిక్కారని చెప్పాడు. ఇప్పుడు జరిగిన సంఘటన గురించి ఇలా చెప్పుకోవచ్చు – వాళ్ళు నది వెంబడి గాలింపు జరపాలనుకున్నారు. కానీ ఎటువంటి జాగ్రత్తలూ పాటించకపోవడంతో దిమ్మ తిరిగిపోయింది మొత్తానికి. ఈ సారి ఐదుగురు చనిపోయారు, ఏడుగురు గాయపడ్డారు. ఇరవైరెండు మంది బందీలుగా చిక్కారు. తుది ఫలితం ఇదీ (మొత్తం). (పూర్తి వివరాలు లేనందున ఈ సమాచారం ఇవ్వడం లేదు).

**ఏప్రిల్ 11**

తెల్లవారు జామునే మేం మా వస్తువులన్నీ అక్కణ్ణించి తరలించే పని మొదలు పెట్టాం. ఎల్ రుబియోను అక్కడే చిన్నగొయ్యి తీసి ఖననం చేసాం. మాకు తగిన పరికరాలు కూడా లేకుండా పోయాయి. ఇంతిని 'రియర్‌పార్టీ'తో ఉండమన్నాం.

బందీలను విడిచిపెట్టి రావడానికి 'ఎస్కార్టు'గా ఉండమన్నాం. చుట్టు పక్కల ఏమన్నా ఆయుధాలు పడి ఉంటే ఎత్తుకు రమ్మన్నాం. ఆయుధాల కోసం వెతుకు లాడుతుంటే మరో ఇద్దరు బందీలు చిక్కారు. వారి దగ్గర తపంచాలు ఉన్నాయి. మేం ఒక నివేదికను రెండు భాగాలుగా ఒక మేజరుకు ఇచ్చాం. దాన్ని అతను పత్రికలకు అందచేస్తా అన్నాడు. మొత్తం నష్టం వివరాలు ఇవీ – పది మంది చనిపోయారు. అందులో ఇద్దరు లెఫ్టినెంటులు కూడా ఉన్నారు. 30 మంది బందీలుగా చిక్కారు. అందులో ఒక మేజరు, కొంత మంది ఆఫీసర్లు కొంత మంది సైనికులు. ఆరుగురు గాయపడ్డారు. తొలిదాడిలో ఒకరు, మలిదాడిలో ఐదుగురు. వీరంతా నాల్గవ డివిజన్ సైనిక కమాండ్ కింద పనిచేస్తున్నారు. ఇందులో ఇతర రెజిమెంట్ల సైనికులూ ఉన్నారు. వారిలో రేంజర్లు, పారాట్రూపర్లతో పాటు స్థానిక సైనికులూ ఉన్నారు. స్థానిక సైనికుల్లో ఎక్కువ మంది పిల్లలు.

మా సామాను భద్రపరిచేందుకు దాపునే ఒక గుహదొరికింది. దాన్ని అన్ని విధాలా అనుకూలంగా మలిచే పని పూర్తికాకుండానే మా వస్తువులు మధ్యాహ్నాని కల్లా అక్కడికి చేర్చాం. చివర్లో రెండు ఆవులూ బెదిరి తప్పించుకుపోయాయి. ఒక దూడ మిగిలింది.

అంతకు ముందే, మేం కొత్త క్యాంప్‌ను చేరుకోవడానికి ముందే జోయాక్విన్, అలెజాండ్రీలను కలుసుకున్నాం. మొత్తం దళ సభ్యులంతా ఉన్నారు వాళ్ళతో. వాళ్ళు చెప్పినదాని ప్రకారమయితే యూస్టెక్వియో సైనికులను చూసాననేది చిత్తభ్రమే. మేం మా వస్తువులన్నీ ఇక్కడికి చేర్చింది వృధా ప్రయాసే. రేడియో వార్తల్లో 'రక్తపాత పోరాటం' జరిగిందని, అందులో తొమ్మిది మంది సైనికులు, ఖాయంగా నలుగురు గెరిల్లాలు చనిపోయారని చెప్పారు.

చిలీ విలేకరి ఒకతను మా 'క్యాంపు'కు సంబంధించిన వివరాలు అనేకం రాసాడు. గడ్డం, నానోట్లో సిగరెట్‌పైపు లేకుండా ఉన్న ఒక ఫొటో సంపాదించాడు. అతనికి ఆ ఫోటో ఎలా దొరికిందో మేం ఇంకా 'ఇన్వెస్టిగేట్ చెయ్యాలి. అయితే పైన ఉన్న కొండ గుహను వాళ్ళు కనిపెట్టిన ఆధారాలు ఏమీ కనిపించలా కానీ వాళ్ళకు తెలిసే ఉంటుందనే సంకేతాలు కనిపించాయి.

**ఏప్రిల్ 12**

ఉదయం ఆరున్నరకే నలతగా ఉన్న నలుగురిని తప్ప మిగతా అందరినీ 'పెరేడ్' కామన్నా. ఎల్ రుబియోకు నివాళి అర్పించాం తొలుతగా. తొలిగా చిందిన

రక్తం క్యూబన్‌ది. నేను ఆ విషయాన్నే ప్రస్తావించా మొదటిగా. ఎందుకంటే అడ్వాన్సు పార్టీలో క్యూబన్‌ల గురించి చులకనగా మాట్లాడే ధోరణిని నే గమనించాను. రికార్డోతో ఏదో విషయమై వాదులాటకు దిగిన ఎల్ కాంబా నిన్నటి రోజున 'రోజు రోజుకీ మీ క్యూబా వాళ్ళ మీద నమ్మకం సడలిపోతుంది' అనడం నేవిన్నాను. అందుకే నేను దళంలో ఐక్యత పెంపొందించుకోవాలని, గెరిల్లా సైన్యం అభివృద్ధి చెందడానికి ఐక్యత ఒక్కటే మార్గమని తద్వారా దాడి చేసేశక్తీ, అనుభవం పెరుగుతుందని విజ్ఞప్తి చేసా. కానీ ఈ రోజున పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని, మన సంఖ్య పెరగక పోగా తగ్గిందని గుర్తుంచుకోవాలని హెచ్చరించాను.

ఎల్‌నాటో శుభ్రంగా తయారు చేసిన ఒక కొండ గుహలో మాకు బరువుగా తోచిన సామాన్లు పడేసాం. మధ్యాహ్నం రెండు గంటలకు బయల్దేరాం. నత్తనడకన సాగింది మా ప్రయాణం. ఎంత నత్తనడకన అంటే మేం బయల్దేరిన చోటుకు దాపునే ఉన్న నీటి మడుగు ప్రాంతంలో పడి నిద్దర్లు పోయాం.

మృతుల సంఖ్య పదకొండు అని సైన్యం ప్రకటించింది. బహుశా ఇంకొక శవం వారికి దొరికి ఉండొచ్చు. లేదూ గాయపడిన వాళ్ళలో ఎవరన్నా చనిపోయి ఉండొచ్చు. రెజిడెబ్రే పుస్తకం కోసం 'ఇంటర్వ్యూ' ఇచ్చాను.

మాకు అందిన సమాచారాన్ని డీకోడ్ చేసాం. అంత ముఖ్యమైన విషయం ఏమీ కాదు.

**ఏప్రిల్ 13**

మా ప్రయాణం చురుగ్గా సాగాలనే ఉద్దేశంతో మేం దళాన్ని సమాన భాగాలు చేసాం. అయినా మేం నిమ్మళంగా ప్రయాణం సాగించినట్టే లెక్క. సాయంత్రం నాలుగు గంటలకు క్యాంప్‌కు చేరుకున్నాం. నింపాదిగా నడిచినవాళ్ళు వచ్చి చేరుకునేసరికి ఆరున్నర అయింది. మిగ్యుయెల్ తెల్లారకట్టనే అక్కడికి చేరుకుని ఉన్నాడు. దగ్గరలో గుహలవీ ఏం లేవు. మా సామాన్లు, జొన్న పొత్తుల సహా అన్నీ యధావిధిగా ఉన్నాయి.

అనీసెటో, రావుల్‌లు చుట్టుపక్కల దారికోసం వెతుకులాడడానికి వెళ్ళారు కానీ ఆ పని తీరుగా చేసుకురాలేదు. మరుసటి రోజున ఇక్యురి నది వరకూ వెళ్ళిరావాలని చెప్పాం.

ఉత్తర అమెరికా ఒక ప్రకటన విడుదల చేసింది. బొలీవియాకు సైనిక సలహాదారులను పంపడంలో కొత్త ఏమీ లేదనీ, అది గతంలో అనుకున్న

కార్యక్రమమే–ఇందులో గెరిల్లాల ఊసే లేదనేది ఆ ప్రకటన సారాంశం. అంటే బహుశా మేం వియాత్నాం మొదటి అంకానికి చేరువలో ఉన్నాం అన్నమాట.

**ఏప్రిల్ 14**

గాయపడిన వాళ్ళకోసమని షెల్టర్ నుండి 'సప్లై'లు తెచ్చాం. దాంతో మాకు ఐదు రోజులకు సరిపడా ఆహారం అమరింది. పైన ఉన్న గుహలోంచి పాలడబ్బాలు తీసుకువచ్చేటపుడు 23 టన్నులు మాయమైపోయినట్లు లెక్క తేలింది. నమ్మశక్యంకాలా మాకు. మోరో మొత్తం 48 డబ్బాలు దాచివచ్చాడు. ఎవరూ వెళ్ళి తెచ్చుకున్నట్లు కూడా లేదు. మొత్తానికి పాలడబ్బాలు ఇట్టే మోసం చేస్తాయని అర్థమైంది. జోయాక్విన్ తిరిగి వచ్చేంత వరకూ మేం 'పొజిషన్'లో ఉండడానికి అవసరం పడుతుందని ఒక మోర్టారు, ఒక మిషనుగన్ తీసుకువచ్చాం. ఇప్పుడు చేపట్టబోయే 'ఆపరేషన్'కు సంబంధించి ఎత్తుగడలు ఏమిటి అనేదాని మీద మాకు స్పష్టత లేదు. ఉన్నంతలో మెరుగైన ప్లాన్ ఏమిటంటే – అందరం బయల్దేరి ముయుపాంపాజోన్‌లో ఆపరేట్ అవడం, అక్కడ నుండి ఉత్తరదిశగా వెనక్కి తగ్గడం సరైనదని అనిపించింది. వీలయితే పరిస్థితుల ఆధారంగా డాంటన్, కార్లోస్‌లను సుక్రే – కోచబాంబా దారిన వదిలెయ్యాలని అనుకున్నాం. బొలీవియా ప్రజలను ఉద్దేశించి రెండవ సందేశం (డాక్యుమెంట్ నెం. 21), మనీలాకు పంపించడానికి నివేదిక నెంబరు 4 సిద్ధం చేసాం. డెబ్రేకు వీటిని అందించే బాధ్యత అప్పచెప్పాం.

**ఏప్రిల్ 15**

మొత్తం 'రియర్ పార్టీ' దళంతో జోయాక్విన్ తిరిగివచ్చాడు. మరుసటి రోజున అక్కడనుండి వెళ్ళిపోవాలని నిర్ణయించాం. జోన్ మీద యుద్ధ విమానాలు చక్కర్లు కొడుతున్నాయని, అడవుల్లోకి ఫిరంగులు పేల్చారని రిపోర్టు చేసాడు అతను. ఈ రోజు కూడా మామూలుగానే గడిచిపోయింది. దళాన్ని సాయుధం చేసాం. పాయింట్ త్రీ జోన్ మిషన్ గన్ రియర్‌పార్టీ (మార్కోస్)కు అప్పచెప్పాం.

మేం ప్రయాణించాల్సిన మార్గం గురించి అందర్నీ కూచోపెట్టి మరీ ఆ రాత్రి పూట వివరించాను. పాల టిన్నులు మాయం అయిన విషయాన్ని ప్రస్థావించి ఇహ ముందు ఇలాంటి పొరబాట్లు జరగకూడదని హెచ్చరించాను.

క్యూబా నుండి వచ్చిన సుదీర్ఘ సందేశాన్ని డీకోడ్ చేసాం. ఆ సారాంశం మొత్తాన్ని ఒక్కముక్కలో చెప్పాలంటే మా ప్రణాళిక ఏమిటోపూర్తిగా అవగాహన ఉన్న

లెచిన్ మాకు మద్దతుగా ఒక విధాన ప్రకటన రాస్తానన్నాడు. మరో ఇరవై రోజుల్లో దేశంలోకి పునఃప్రవేశిస్తానన్నాడు.

నేను ఫైడల్‌కు ఒక నోట్ రాసి పంపాను. అందులో తాజా పరిణామాలు వివరించాను. కోడ్ భాషలో అది కూడా పైకి కనిపించని ఇంకు ఉపయోగించి రాసాను.

**ఏప్రిల్ 16**

అడ్వాన్స్ పార్టీ ఆరుంపావుకి బయల్దేరింది. మేం ఏడుంపావుకి బయల్దేరాం. ఇక్యురి నది వరకు ప్రయాణం బాగానే సాగింది. టానియా, అలెజాండ్రోలు కాస్త వెనుకపడ్డారు. జ్వరపడినట్లు ఉన్నారు. టెంపరేచర్ చూస్తే టానియాకు 102. అలెజాండ్రకు 101 డిగ్రీల జ్వరం ఉంది. వాళ్ళ మూలాన జరిగిన ఆలస్యం మా ప్రయాణపు షెడ్యూలుకు ఇబ్బంది కలిగించింది. ఇక్యురి నదికి ఒక కిలో మీటరు ఇవతల ఎల్‌నీగ్రో, సెర్పియోలను వాళ్ళిద్దరికీ తోడుగా ఇచ్చి అక్కడే ఉండమన్నాం. మేం ముందుకు కొనసాగాం. దాంతో బెల్లావిస్టా అనే శివారు గ్రామం తగిలింది. అంతా చేసి ఊళ్ళో ఉన్నది నలుగురే రైతులు. మాకు బంగాళదుంపలు జొన్నలు, ఒక సీంపందిని అమ్మారు. కడు పేదరైతులు వాళ్ళు. మమ్మల్ని చూసి తారెత్తుకున్నారు. ఆరోజుకి అక్కడే వండుకుని తిన్నాం. ఆ రాత్రి అక్కడే పండుకున్నాం. మరుసటి రోజున మమ్మల్ని ఎవరూ ఆనవాలు పట్టకుండా ఉండడానికి రాత్రిపూట బయల్దేరాలని నిర్ణయించుకున్నాం.

**ఏప్రిల్ 17**

మా దగ్గర ఉన్న సమాచారం కలగాపులగంగా ఉంది. అందుకే నిర్ణయాలూ అలానే ఉన్నాయి. రైతులు చెప్పిన దాని ప్రకారం అయితే టికూచాకు వెళ్ళడం దండగమారి పని. ముయుపాంపాకు ఇక్కడ నుండి సరాసరి దారి ఉంది. అది దగ్గరదారి, పైపెచ్చు కాస్త కడాకి వెళితే అక్కడ నుండి ఏదో ఒక వాహనం పట్టుకోవచ్చు. ఏం చెయ్యాలి అనే విషయమై నాలో ఊగిసలాటలు ఉన్నా చివరికి తిన్నగా ముయుపాంపాకేసి బయల్దేరాలని నిర్ణయించాం. సెంట్రీలు నలుగురినీ వెళ్ళి జోయాక్విన్‌తో జతకలిపి అక్కడే ఉండమనే ఆదేశాలు పంపించాను ఒకరితో. ఆ 'జోన్'లో మేం బలంగా ఉన్నామని తెలియచెప్పడానికి, శత్రువుల కదలికలను అరికట్టడానికి ఆ నిర్ణయం తీసుకున్నాం. అతను మూడు రోజుల పాటు మా కోసం అక్కడే వేచి ఉండాలి. ఆ తర్వాత జోన్‌లోకి రావాలి. కాని శత్రువులతో తలపడకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుని మేం వెనక్కి తిరిగి వచ్చేవరకు వేచి ఉండాలి.

ఆ రోజు రాత్రే రైతు కొడుకు ఒకతను కనబడకుండా పోయాడని, బహుశా సైనికులకు ఉప్పందించడానికి వెళ్ళి ఉంటాడని తెలియవచ్చింది. అయితే మేం అక్కణ్ణించి కదలడానికే నిర్ణయించుకున్నాం. కార్లోస్‌ను, ఫ్రెంచి మనిషిని శాశ్వతంగా వదిలించుకోవచ్చు. మోసెస్ కూడా వెళ్ళి సెంట్రీలతో కలిసాడు. గాల్‌బ్లాడర్‌లో నొప్పి మూలంగా అతన్ని వాళ్ళతోనే ఉండిపొమ్మన్నాం. మా పరిస్థితి ఇదీ.

పోనీ వెనక్కి తిరిగి వెళ్దాం అనుకుంటే లాంగ్యునిల్లాస్‌లో మకాంవేసి ఉన్న సైన్యంతో కానీ, టికూచా నుండి వస్తున్న సైనిక బలగంతో కాని కోరి యుద్ధం తెచ్చుకోవడమే. ఏదో ఒకటి చెయ్యక తప్పదు. ఏం చేసినా 'రియర్‌పార్టీ'తో మాకు సంబంధం తెగిపోకుండా చూసుకోవాలి.

రాత్రి పదిగంటలకు బయల్దేరాం. ఆగాగి ప్రయాణించాం. తెల్లవారుజామున నాలుగున్నరకి ఆగాం. కాసేపు కునుకు తీద్దామని. దాదాపు పదికిలో మీటర్ల మేర నడిచాం. మేం కలిసిన రైతులు అందర్లోకీ కాస్త భయపడినట్లు కనబడగా సైమన్ అనే అతను మాత్రం మాకు సహకరించాడు. 'వీడెస్' అనే అతను మాత్రం మహా ప్రమాదకరంగా అనిపించాడు. ఆ ప్రాంతంలో ఉన్న ధనికుడు అతను ఒక్కడే. కార్లోస్ రోడాస్ కొడుకును కూడా మేం లెక్కలోకి తీసుకోవాలి. (ఆ ప్రాంతంలో డబ్బుతో ప్రభావితం చెయ్యగల 'వీడెస్' హస్తం ఇందులో ఉండి ఉండొచ్చు).

**ఏప్రిల్ 18**

తెల్లవారుఝాముదాకా ప్రయాణిస్తూనే ఉన్నాం. మంచు వొణికించేసింది. చివరిగంటలో అయితే మగతకమ్మేసింది. అడ్వాన్స్ పార్టీ వేగుల పనిమీద వెళ్ళింది. గుయారాని తెగ ఇండియన్ల ఇళ్ళు కనిపించాయట కానీ వాళ్ళ దగ్గర నుండి కావాల్సిన సమాచారం ఏదీ దొరకలేదు. మా సెంట్రీలు గుర్రం మీద వెళుతున్న ఒకతన్ని నిలేసారు. తను కార్లోస్ రోడాస్ రెండో కొడుకు అని తేలింది. యాకుండే వెళ్తున్నాని చెప్పాడు. కానీ మేం అతన్ని మా బందీగా తీసుకున్నాం. మా ప్రయాణం నెమ్మదిగా సాగింది. తెల్లవారు ఝాము మూడు గంటలకు మటగళ్ చేరుకున్నాం. పడిల్లా అనే అతని ఇంటి దగ్గర ఆగాం. అతను అంతకు ముందే మేం దాటి వచ్చిన ఇంటి అతని సోదరుడే. మమ్మల్ని చూసి భయంతో కంపించిపోయాడు. అక్కణ్ణించి వెళ్ళిపొమ్మని నానారకాలుగా మాకు నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. ఇంతలో వర్షం మొదలయింది. దాంతో అతని ఇంట్లో తలదాచుకోక తప్పిందికాదు.

**ఏప్రిల్ 19**

రోజంతా అక్కడే గడిపేసాం. అటూ ఇటూ వచ్చేపోయే రైతునల్లా మా ఆధీనంలో ఉంచుకున్నాం. బందీలతో ఇల్లు నిండిపోయింది ఒంటి గంటకు సెంట్రీ ఒక మేకవన్నె పులిని తెచ్చాడు. వచ్చింది ఒక ఇంగ్లీషు జర్నలిస్టు. పేరు రూత్. లాంగ్యునిల్లాస్ నుండి మా జాడ కనిపెడుతూ వచ్చిన కొంత మంది పిల్లల సాయంతో అతను వచ్చాడు. అతను చూపించిన కాయితాలన్నీ సరిగానే ఉన్నాయి కానీ కొన్ని విషయాలు అనుమానాస్పదంగా అనిపించాయి. పాస్‌పోర్ట్‌లో స్టూడెంట్ అని ఉన్నచోట కొట్టేసి 'జర్నలిస్టు' అని మార్చి ఉంది. (నిజానికి తను ఒక ఫొటోగ్రాఫర్‌ని అని చెప్పాడు) ప్యూర్టోరికా వెళ్ళడానికి వీసాఉంది. బ్యూనస్‌ఎయిర్స్‌లో ఉండే 'శాంతి సైనిక సంస్థ'కు చెందిన పోస్టుకార్డు ఉంది అతని దగ్గర దాని గురించి అడిగితే – ఆ సంస్థలో పని చేసే అమెరికా సైనికులకు స్పానిష్ భాష నేర్పే టీచరు ఉద్యోగం చేస్తున్నానని చెప్పాడు. అతను మా 'బేస్ క్యాంప్'కు కూడా వెళ్ళి వచ్చినట్లు చెప్పాడు. మా ప్రయాణాలు, మా అనుభవాలకు సంబంధించి బ్రౌవులియో డైరీని కూడా పైపైన చూసానన్నాడు. క్రమశిక్షణా రాహిత్యం, బాధ్యతా రాహిత్యం మమ్మల్ని కట్టి కుడుతుంది. జర్నలిస్టుకు దారి చూపిస్తూ వచ్చిన పిల్లలు చెప్పిన దాని ప్రకారమయితే మేం ఇక్కడకు చేరుకున్న రాత్రే ఆ సమాచారం లాంగ్యునిల్లాస్‌లో వాళ్లకు తెలిసిపోయింది. ముక్కూ మొహం తెలియని వాళ్ళు తెచ్చిన ఈ సమాచారానికి కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిందే. దాంతో రోడాస్ కొడుకు మీద మేం ఒత్తిడిపెంచాం. తన అన్న, వీడేస్ నౌకరు. ఇద్దరూ మా గురించి సమాచారం ఇచ్చి ఐదొందల డాలర్లు, వెయ్యి డాలర్లు నజరానాగా వుచ్చుకున్నారన్ని నిజం కక్కేసాడు. అక్కడ ఉన్న రైతుల సహా అందరికీ హెచ్చరికగా అతను ఎక్కి వచ్చిన గుర్రాన్ని మా పరం చేసుకున్నాం.

ఇంగ్లీష్ మనిషితో నేను మాట్లాడవచ్చా అనడిగాడు ఫ్రెంచి మనిషి. తనని తాను పరిశుద్ధుడిగా నిరూపించుకోవడానికి కార్లోస్‌కి, తనకి అక్కడనుండి బయటపడేందుకు తోడ్పడగలడేమో అడిగాడు. ఈప్రతిపాదనకు కార్లోస్ అన్యమనస్కంగానే అంగీకరించాడు. అక్కడితో నా బాధ్యత తీరిపోయిందని చేతులు దులిపేసుకున్నాను. రాత్రి తొమ్మిది గంటలకు మేం చేరుకున్నాం. అక్కడ నుండి ముయుపాంపా కేసి ముందుకు సాగాం. రైతులు చెప్పినదాని ప్రకారం అక్కడ అంతా ప్రశాంతంగా ఉండి ఉండాలి. ఇంగ్లీష్ అతను ఇంతి పెట్టిన షరతులకు ఒప్పుకున్నాడు. నేను రాసిచ్చిన చిరు సందేశాన్ని తీసుకువెళ్తానన్నాడు. రాత్రి పదకొండూ ముప్పావుకి ఆ ముగ్గురితో కరచాలనం చేసి

మా దళం అక్కడ నుండి టౌనుకేసి బయల్దేరింది. నేనూ, పోంబో, ట్యూమా, అర్బానో అక్కడే ఉండిపోయాం. ఎముకల్లోంచి చలి పుడతా ఉంది. అందుకే చిన్న మంట వేసాం. ఒంటిగంటకు ఎల్‌నాటో తిరిగివచ్చాడు. టౌన్లో సైన్యం 'అలర్ట్' అయిందని దాదాపు ఇరవై పటాలాల సైన్యం అక్కడ తిష్టవేసి ఉందని, సైన్యం 'పెట్రోల్' చేస్తుందని చెప్పాడు. ఇది ఊహించని మా దళ సభ్యులు రెండు 4.3 తుపాకులు, రెండు రివాల్వర్‌లతో ఏం చేసేది లేక లొంగిపోయారు. ఇప్పుడేం చెయ్యాలో ఆదేశించమని అడిగారు నన్ను. ఇప్పటికే ఆలస్యం అయ్యింది కాబట్టి వెంటనే తిరిగి వచ్చెయ్యమన్నాను. ఇంగ్లీష్ జర్నలిస్టు, కార్లోస్, ఫ్రెంచి అతను – ఆ ముగ్గురుకీ ఎలా తోస్తే అలా చెయ్యమనే సందేశం ఇచ్చా. తెల్లవారు ఝాము నాలుగు గంటలకు మా ఉపసంహరణ మొదలయింది. లక్ష్యం నెరవేరకుండా మేం వెనక్కి తిరిగాం. కార్లోస్ కూడా వెనక్కి వచ్చి మాతో చేరిపోయాడు. ఫ్రెంచి మనిషి అన్యమనస్కంగానే కార్లోస్‌తో కలిసి వెనక్కివచ్చాడు.

**ఏప్రిల్ 20**

తెల్లవారు జామున ఏడు గంటలకు అంతకు ముందు రాత్రి కలిసిన రైతు నెమిసియో కారబల్లో ఇంటికి చేరుకున్నాం. అతను మమ్మల్ని లోనికి ఆహ్వానించి కాఫీ కలిపి ఇచ్చాడు. భయపడిపోతున్న నౌకర్లను పెరళ్ళో ఉంచి మమ్మల్ని లోపలే ఉండమని బయటనుండి తాళం వేసుకు వెళ్ళిపోయాడు అతను. మేం భోజనం వండుకు తిన్నాం. కావల్సిన సరుకులు నౌకర్ల దగ్గర కొనుకున్నాం. మధ్యాహ్నం ఒంటిగంటకు చిన్న లారీ, పైన తెల్ల జెండా ఎగరేసుకుంటూ వచ్చింది. ఒక డాక్టరు, ఒక ఫాదరు (జర్మన్ అతను), ముయుపాంపా సబ్‌డివిజనల్ అధికారీ ఆ లారీలో వచ్చారు. వాళ్ళతో ఇంతి మాట్లాడాడు. వాళ్ళు శాంతి ప్రతిపాదనతో వచ్చారు. అది కూడా దేశ శాంతి కోసం, వాళ్ళది మధ్యవర్తిత్వం వరకేనట. 'ముయుపాంపా శాంతికి వచ్చిన ఢోకా ఏం లేదు. కాకపోతే రాత్రి ఆరున్నర లోగా మాకు కావాల్సిన సరుకులు తెచ్చి ఇవ్వమని' ఇంతి ప్రతిపాదించాడు. అయితే వాళ్ళు వెంటనే ఒప్పుకోలేదు. టౌను మొత్తం సైన్యం స్వాధీనంలో ఉందిట కాబట్టి మరుసటి రోజు తెల్లవారు జామున ఆరుగంటల వరకు గడువు కావాలని అడిగారు. దానికి మేం ఒప్పుకోలేదు.

శాంతి 'దూతలు' మా మెప్పుకోసం రెండు 'కార్టన్ల' సిగరెట్లు తెచ్చారు. పారిపోతున్న మా వాళ్ళు ముగ్గురు ముయుపాంపాలో దొరికిపోయారని, ఇద్దరు రాజీపడిపోయారనే వార్త కూడా చెప్పారు. కార్లోస్ చిక్కుల్లో పడినట్లు ఉన్నాడు. డాంటన్ ఎలాగోలా బయటపడతాడు.

సాయంత్రం ఐదున్నరకి ఎటి–6 బాంబర్లు ఎగురుతా వచ్చి మేం వంట చేసుకు తిన్న ఇంటి మీద బాంబులు కురిపించాయి. ఒక బాంబు మాకు పదిహాను మీటర్ల దాపులో పేలింది. రికార్డో స్వల్పంగా గాయపడ్డాడు. సైన్యం సమాధానం ఇది. వాళ్ళ గొప్పలు గప్పాలని తేల్చి చెప్పడం ద్వారా వాళ్ళ సైన్యం మానసిక స్థైర్యాన్ని దెబ్బతియ్యాలని నిర్ణయించుకున్నాం.

రాత్రి పదకొండున్నరకి రెండు గుర్రాలను – ఒకటి లోడాన్ కొడుకుది, ఇంకోటి జర్నలిస్టుది – తీసుకుని అక్కడినుండి బయల్దేరాం. అర్ధరాత్రి ఒకటిన్నర ప్రాంతంలో టికూచా వెళ్ళే మార్గంలో ఆగి నిద్రపోయాం.

**ఏప్రిల్ 21**

మేం కొంతదూరం ప్రయాణించి రోసా కరాన్కో ఇంటికి చేరుకున్నాం. ఇంతకుముందు అతను మాకు కావల్సినవన్నీ అమ్మి మమ్మల్ని బాగా చూసుకున్నాడు. రాత్రి పూట మా ప్రయాణం సాగించి ముయుపాంపా–మాంటెగుడో హైవే కలిసే దారి గుండా టాపరిల్లాస్ అనే ఊరు చేరుకున్నాం. నీళ్ళు దొరికే చోట మకాం వేసి చుట్టుపక్కల ఎక్కడన్నా 'అంబుష్' ప్లాన్ చెయ్యడానికి ఉందేమో పరిశీలించాలి అనేది మా ఆలోచన. డబ్బుకోసం పనిచెయ్యడానికి విదేశీయులు (మెర్సినరీస్) ముగ్గురూ–ఫ్రెంచి అతను, ఇంగ్లీష్ అతను, అర్జెంటీనా అతను–మరణించినట్లు రేడియోలో రావడం కూడా అక్కడ ఆగడానికి ఇంకో కారణం. మేం వాళ్ళకు తగిన గుణపాఠం చెప్పాలి.

రాత్రి భోయనానికి ముందు మేం వర్గాస్ మారుటి తండ్రి రోడాస్ ఇంటికి వెళ్ళాం. వర్గాస్ నకాహుయాసు దగ్గర చనిపోయాడు. అతనికి సంజాయిషీ చెప్పాం. ఆయన సంతృప్తి చెందినట్లే కనిపించాడు. అడ్వాన్సు పార్టీకి ఏం జరుగుతుందీ సరిగా బోధపడినట్లులేదు. దార్లో ఉన్న కుక్కలు లేచి ఇంతింత నోరేసుకుని అరిచేలాగున నడక సాగించారు వాళ్ళు.

**ఏప్రిల్ 22**

పొరబాట్లతో పొద్దు పొడిచింది. 'ఆంబుష్' ఎక్కడ వేద్దావో చూసి రావడానికి రోలాండో, మిగ్యుయెల్, ఆంటోనియోలు వెళ్ళారు. మేం దట్టమైన అడవుల్లోకి చోరబడ్డాం. వెళ్ళిన వాళ్ళకి కొంతమంది సైనికులు ఫెడరల్ బ్యూరో ట్రక్కులో మా అడుగుల జాడ బట్టి వస్తూ కనిపించారు. ఒకరైతు రాత్రి మేం ఎటువైపుగా వెళ్ళిందీ చూపిస్తున్నాడు. వాళ్ళందరినీ బందీలుగా పట్టుకోవాలని మా వాళ్ళు నిర్ణయించేసుకున్నారు. దాంతో

మా ప్లాన్ వరస తప్పింది. పగటిపూటే మెరుపు దాడి (అంబుష్) చేసేద్దామని, సప్లై ట్రక్కులు వచ్చినా, సైన్యం వచ్చినా వదలకూడదని నిర్ణయించాం. ఒక ట్రక్కునిండా అరటిపళ్ళగెలలు, రైతులతో వచ్చింది. దాన్ని మా స్వాధీనంలోకి తీసుకున్నాం. కానీ ఆ తర్వాత మా జాడ వెతుక్కుంటూ బయల్దేరి వచ్చిన ట్రక్కును వదిలేసాం. అలాగే ఆయిల్ కంపెనీ ట్రక్కులూ వదిలిపెట్టేసాం. ఎంతకూ రాని ఆహార సప్లై కోసం, అందులోనూ రొట్టె కోసం జిహ్వా రుచితో చచ్చిపోతున్న మూలాన, ఎదురుచూసాం. దాంతో ఆలస్యం అయింది అక్కడే.

ఆయిల్ కంపెనీకి చెందిన చిన్న ట్రక్కులో తిండిపదార్థాలు సదిరేసి అడ్వాన్సు పార్టీ సహా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న టికూచా క్రాస్‌రోడ్స్ వరకూ వెళ్ళాలని అనుకున్నాం. ఆ సాయంత్రం సరిగ్గా మేం ఉన్న ప్రాంతం మీద ఒక చిన్న విమానం చక్కర్లుకొడతా ఉంది. దగ్గర్లో ఉన్న ఇళ్ళచుట్టు ప్రక్కల నుండి అదేపనిగా కుక్కల మొరుగుళ్ళు వినవస్తూ ఉన్నాయి. రాత్రి పదిగంటలకు, మా ఉనికిని శతృవు కనిపెట్టేసాడని తెలిసినా, అక్కణ్ణించి ముందుకు కదిలాం. కాసేపటికే మామీద స్వల్పదాడి జరిగింది. మమ్మల్ని లొంగిపొమ్మనే హెచ్చరికలు వినిపించాయి. మేమంతా ఆశ్చర్యానికి లోనయ్యాం. ఏం జరుగుతుందీ నాకు అర్థంకాలేదు. అయితే అదృష్టం కొద్దీ మా సామానంతా ట్రక్కులో ఉంది. కాసేపటికీ అంతా సర్దుకుంది. ఎల్‌లోరా మాత్రం కనిపించకుండా పోయాడు. ప్రస్తుతానికి అతనికి ఏం కాలేదని క్షేమంగానే ఉండి ఉంటాడని అనిపిస్తుంది. మిట్టను చుట్టుముట్టి పైకి రావడానికి ప్రయత్నిస్తున్న సైనికులకు గైడ్‌గా పనిచేస్తున్న అతని మీద రికార్టో కాల్పులు జరపడంతో వాళ్ళు ముందుకు వచ్చే సాహసం చెయ్యలేదు. బహుశా ఆ 'గైడ్' గాయపడి ఉంటాడు.

ఆ చిన్న ట్రక్కు, గుర్రాల మీద మొత్తం ఆరుగురం అక్కణ్ణించి బయల్దేరాం. మిగతా వాళ్ళు కాసేపు నడక, కాసేపు గాడీ–ఘోడా సవారీ చేస్తూ మూడున్నరకు టికూచా చేరుకున్నాం. అక్కడ నుండి ఎల్‌మేసన్ చేరుకున్నాం. ఆరున్నరకి.

మొత్తం మీద ఇవాళ ప్రతికూల ఫలితమే అని చెప్పుకోవాలి. క్రమశిక్షణా రాహిత్యం,ప్రణాళికా లోపం, ఒక దళ సభ్యుడి జాడ తెలియకుండా పోవడం (బహుశా ఇది తాత్కాలికమే అని భావిస్తున్నా) – నష్టాలేగా. వ్యాపారస్థులకు డబ్బులిచ్చాం కానీ సరుకులు అందలేదు. దీనికి తోడు ఇవాళ్టి హడావుడిలో పోంబో జేబులో ఉన్న డాలర్ల కట్ట ఎక్కడో జారిపడిపోయింది. మేం ఊహించని రీతిలో చుట్టుముట్టబడి, అక్కణ్ణించి పారిపోయేలా చేసిన ఘటన పెద్దది అని నే భావించడం లేదు. మా దళం సాయుధ

ప్రతిఘటనా శక్తిగా తయారవడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. ఆ విశ్వాసం మెండుగా ఉంది.

**ఏప్రిల్ 23**

ఈ రోజు విశ్రాంతి. ఏం విశేషాలు లేవు. మధ్యాహ్నం మాత్రం ఎటి-6 విమానం ఒకటి మేం ఉన్న ప్రాంతం మీదుగా ఎగురుతూ వెళ్ళింది. దాంతో సెంట్రీలను పెట్టాం కానీ ఏం జరగలేదు. రేపటి రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రాత్రి పూట మాట్లాడుకున్నాం. బెనినో, అనీసెట్‌లు ఇద్దరూ జోయాక్విన్ కోసం నాలుగు రోజులు వెతకాలి. వచ్చే నాలుగు రోజుల్లో కోకో, కాంబాలు ఇద్దరూ గ్రాండే నదికి వెళ్ళే దారికోసం అన్వేషించాలి. సరైన దారి ఏర్పాటు చేసే బాధ్యత వాళ్ళది. మేం దాపునున్న మొక్కజొన్న పొలాల్లో మాటు వెయ్యాలి. సైన్యం అటుకేసి వస్తే వాళ్ళని కాచుకోవాలి. జోయాక్విన్ మమ్మల్ని వచ్చి కలుసుకునే వరకూ మాపని అది. జోయాక్విన్ మొత్తం దళంతో వచ్చి మాతో చేరాలని ఆదేశాలు పంపాం. అనారోగ్యంతో ఉన్న అతనికి అవసరమైతే మినహాయింపు ఇవ్వమని చెప్పాం.

డాంటన్, ఎల్‌పీలాడే, ఇంగ్లీషు జర్నలిస్టులకు ఏం జరిగింది అనేది ఇంకా మిస్టరీగానే ఉంది. పత్రికల మీద సెన్సార్‌షిప్ కొనసాగుతుంది. వేర్వేరు ఘటనలలో ముగ్గురు నుండి ఐదుగురు దాకా బందీలుగా తీసుకున్నట్లు ప్రకటన వెలువడింది.

**ఏప్రిల్ 24**

వేగులు బయల్దేరారు. మేం ఒక కిలోమీటరు ఎగువకు నడిచి చిన్న మిట్టమీదకు చేరుకున్నాం. అక్కడ నుండి ఊరి శివారులో ఉన్న రైతు ఇంటిదాకా కనబడుతుంది. 'ఫాదర్ ఇంటికి ఐదు వందల మీటర్ల దూరంలోఉంది ఆ ఇల్లు. (పొలాల్లో మార్జువానా పంటను గమనించాం). రైతులు వచ్చారు. మమ్మల్ని ఆసక్తిగా గమనించారు. మధ్యాహ్నం ఎటి6 విమానం వచ్చి దాపునే ఉన్న ఇంటి మీద రెండుసార్లు బాంబులు కురిపించి ధ్వంసం చేసింది. పాచో అనూహ్యంగా అదృశ్యమయిపోయాడు. అతను అనారోగ్యంతో ఉన్న మూలాన వెనకనే ఉండిపోయాడు. ఆంటోనియో చూపించిన తోవ వెంబడి బయల్దేరిన అతను ఐదుగంటల్లో వచ్చి చేరాలి. కాని రాలేదు. రేపు తన గురించి వెతకాలి.

**ఏప్రిల్ 25**

ఈరోజు చాలా దుర్దినం. ఉదయం పదిగంటలకు పాంబో వెను దిరిగివచ్చాడు. ముప్పై మంది సైనికులు 'ఫాదర్' ఇంటికేసి వస్తున్నట్లు చెప్పాడు. ఆంటోనియో ఇంకా గస్తీ కాస్తానే ఉన్నాడు. మేం రెడీ అవుతుండగా అతనూ వచ్చాడు. అరవై మంది సైనికులు ముందుకు చొచ్చుకు వస్తున్నట్లు చెప్పాడు. గస్తీ కాసి ఉపయోగం లేకపోయింది. ముందస్తుగా హెచ్చరించలేకపోయారు. మేం మకాం చేసిన చోటుకి దారితీసే మూలమలుపులో 'స్పాట్' పెట్టాలని నిర్ణయించుకున్నాం. అనుకున్నదే తడవుగా 50 మీటర్ల పరిధిలో అంతా కనిపించే ఓ మిట్టమీదకి చేరుకున్నాం నేను, అర్బానో, మిగ్యుయెల్ ఒక మిషనుగన్‌తో అక్కడే ఉండి పోయాం. డాక్టరు, ఆర్టురీ, రావుల్‌లు కుడిచేతి వైపు కాపుకాసారు. రోలాండ్, పోంబో, అంటోనియో, రికార్డో, జూలియో, పాబ్లిటో, డారియో, విల్లీ, లియోన్‌లు సైనిక పటాలం మీద విరుచుకుపడడానికి నది రెండో ఒడ్డున మాటు వేసారు. ఇంతి ఏటి మొగదల కాపు కాసాడు, వెనుదిరిగిన సైనికుల పని పట్టడానికి. నాటో, యూస్టెక్వియోలు గస్తీ కాయడానికి వెళ్ళారు. కాల్పుల మోత వినబడగానే వెనక వేపున మాటు వేయ్యడానికి వెళ్ళిపొమ్మని చెప్పా. ఎల్ చీనో వెనకవైపున కాపు కాస్తున్నాడు. దళంలో ముగ్గురు సభ్యులు తగ్గారు. పాచో కనబడకుండా పోయాడు. అతన్ని వెతికి తీసుకురావడానికి ట్యూమా, లూయిస్‌లు వెళ్ళారు.

మరికాసేపటికే ఒక సైనికుడు మాకు ఎదురువచ్చాడు. అతనితోపాటు మూడు జర్మన్ వేటకుక్కలు, ట్రెయినరు కూడా ఉండడంతో మేం నివ్వరపోయాం. వాళ్ళు మమ్మల్ని వదలరని అర్థమైపోయింది. ముందుకు మీదకు వస్తున్నారు. నేను ముందుగా వస్తున్న కుక్క మీదకు గుండు పేల్చా. గురితప్పింది. ట్రెయినర్ మీద గన్ను గురిపెట్టా. తుపాకి 'జామ్' అయిపోయింది. మిగ్యుయెల్ ఒక కుక్కని చంపాడు. ఇంకెవరూ ఉచ్చులో పడలేదు. సైనిక పటాలం మీద ఆగాగి తుపాకులు పేలాయి. కాల్పుల శబ్దం ఆగిపోగానే మన వాళ్ళను వెనక్కి వచ్చెయ్యమని పిలుచుకు రావడానికి అర్బానోను పంపాను. తను వెళ్ళి వచ్చి రోలాండో గాయపడ్డాడనే వార్త చెప్పాడు. మరికాసేపటికి అతన్ని తీసుకువచ్చారు. అప్పటికే అతని ఒంట్లోంచి చాలా రక్తం పోయింది. మనిషి చాలా వేగంగా కృశించిపోతున్నాడు. మేం అతనికి ప్లాస్మా ఇవ్వనారంభించాం. అంతలోనే అతను మరణించాడు. తుపాకి గుండు అతని తొడ ఎముకని, నరాలు, కండరాల వ్యవస్థని ఛిన్నా భిన్నం చేసింది. మేం ఏదన్నా చేసేలోపే అతను రక్తమోడుతూనే అలా కన్ను మూసాడు. మా దళంలో మెరికలాంటి గెరిల్లాను కోల్పోయాం. సహజంగానే

మా ఉద్యమానికి మూలస్తంభం లాంటి ఒకరిని పోగొట్టుకున్నాం. అతను బాల్యం నుండి నా సహచరుడు. తొలుత అతను వార్తాహరుడిగా పనిచేసాడు. ఆ తరువాత గెరిల్లా వీరుడిగా రాటుదేలాడు. ఇప్పుడు ఈ విప్లవకర సాహసకృత్యంలో భాగస్వామి అయ్యాడు.

అగామి భవిష్యత్తు కోసం అతను చేసిన ఈ బలిదానం సాకారం అవుతుందని మాత్రమే నే చెప్పగలను.

ఆ తరువాత పరిణామాలు అంతా ఈడికగా సాగాయి. రోలాండ్ పార్థివశరీరం సహా అక్కడ మా ఆనవాళ్ళన్నీ చెరిపేసి నిమ్మళంగా వెనక్కి తగ్గాం. పాచో ఆ తరువాత వచ్చి కలిసాడు మమ్మల్ని. మధ్యలో దారి తప్పిపోయాడట. కోకోను కలిసాడట. వెనక్కి తిరిగి వస్తుంటే చీకటి పడిపోయిందట. మధ్యాహ్నం మూడు గంటలకి రోలాండ్ మృతదేహాన్ని ఖననం చేసాం. నాలుగు గంటలకు బెనినో, అనీసెటోలు వచ్చి వాళ్ళు సైన్యం వలలో పడినట్లు చెప్పారు. వీపునున్న బ్యాగులు పోయాయట. కాకపోతే ఏ గాయాలూ తగలకుండా తప్పించుకు వచ్చారు. బెనీనో అంచనాల ప్రకారం వాళ్ళు నకాహుయాసుకు దాపులో ఉండగా ఆ దాడి జరిగింది. గ్రాండే నదివైపుగా దాటుకు వెళ్ళడం రెండిందాలా ఇబ్బంది మాకు. అది అందరూ ఉపయోగించే దారి కావడం ఒక కారణం అయితే, మేం ఆ మార్గాన వెడితే, ఇప్పటికీ అజాపజా లేని జోయాక్విన్ దళంతో కలవడం సాధ్యం కానేకాదు. ఇది రెండో కారణం.ఇక మిగిలింది కొండల మీదుగా పోవడం. నకాహుయాసు, గ్రాండేనదికి వెళ్ళే దారులు కలిసేచోటుకు చేరుకున్నాం ఆ రాత్రికి. అక్కడే నిద్రపోయాం. కోకో, కాంబాల కోసం అక్కడే వేచి ఉండాలనుకున్నాం. మా బలం ఆ మేరకయినా పెరిగినట్లే కదా. ఇవాళ జరిగిన ఆపరేషన్‌లో తీరని నష్టం వాటిల్లింది మాకు. రోలాండ్‌ను కోల్పోయాం. మేం సైన్యాన్ని భారీగా దెబ్బ తియ్యలేకపోయాం. ఇద్దరు జవాన్లు, ఒక జీవాన్ని గాయపరిచాం అంతే. సెంట్రీలు ముందుగా శత్రువు ఉనికి పసికట్టలేకపోవడం మూలాన మేం పక్కా ప్రణాళికతో దాడికి పూనుకోలేకపోయాం. అలాగే మేం గస్తీ పెట్టడంలో కూడా లోపాలు ఉన్న మూలంగా సమయానికి మేం సన్నద్ధం కాలేక పోయాం.

'ఫాదర్' ఇంటి దగ్గర ఒక హెలికాప్టర్ రెండుసార్లు 'ల్యాండ్' అయ్యింది. గాయపడిన సైనికులను అక్కడ నుండి తప్పించారో లేదో మాకు తెలీదు. కానీ మేం వదిలి వచ్చిన ప్రదేశం మీద విమానాలు బాంబులు వర్షం కురిపించాయి. అంటే వాళ్ళు ఇంకా ముందుకు చొచ్చుకురాలేదు.

**ఏప్రిల్ 26**

మేం ఇంకొన్ని మీటర్లు మీదకి నడిచాం. మకాం వెయ్యడానికి తగిన చోటు చూడమని మిగ్యుయెల్‌కు పురమాయించాను. కోకో, కాంబాలను వెతుక్కురమ్మని మరొకరిని పంపించాను. ఆ మధ్యాహ్నానికి ఇద్దరినీ వెంటబెట్టుకు తెచ్చాడు అతను. భారమైన బ్యాగేజీ మోస్తూ దాదాపు నాలుగు గంటల పాటు 'ట్రయల్' వేసామనీ, కనుమ ఎక్కడానికి అవకాశాలు ఉన్నాయని వాళ్ళిద్దరూ చెప్పారు. నకాహుయాసుకు ప్రవహించే నది దగ్గర ఉన్న పర్వతపాద ప్రాంతంలో కనుమ మీదకు వెళ్ళడానికి ఏదన్నా వీలు దారి ఉందేమో చూసి రమ్మనమని బెనినో, అర్బానోలకు పురమాయించాను. వాళ్ళిద్దరూ వెళ్ళివచ్చి అస్సలు అటుగా కుదిరేపని కాదని చెప్పారు. ఇక్యురికు వెళ్ళడానికి మరోదారి ఏదన్నా వెతికేపని కోకోకు అప్పచెప్పాం.

ఏడాది లోపు వయసున్న దుప్పిపిల్ల దొరికింది. చూడాలి అది బతుకుతుందో లేదో.

**ఏప్రిల్ 27**

కోకోకు నాలుగు గంటలు టైం ఇచ్చాం. రెండున్నర గంటల్లో వచ్చాడు. మ్యాప్‌లో 'మాసికో' అనే ప్రాంతంగా గుర్తు పెట్టిన చోటు. గుబురు బత్తాయితోటలు ఉన్నట్లు గమనించాం. అర్బానో, బెనినోలు తమకు అప్పచెప్పిన పనిలో ఉన్నారు. మొత్తానికి ఒక గంట ప్రయోణించే తోవను సిద్ధం చేసారు. రాత్రిపూట చలి తీవ్రంగా ఉంది.

బొలీవియో రేడియో సైనిక ప్రకటన ప్రసారం చేసింది. సైనికులకు గైడ్‌గా వ్యవహరిస్తున్న పౌరుడు, వేటకుక్కల ట్రెయినరు, ఒక వేటకుక్క (పేరు రాయో) చనిపోయినట్లూ, మావైపున ఇద్దరు చనిపోయినట్లూ– ఎల్ రూబియో అనే మారుపేరుతో ఉన్న క్యూబా దేశస్థుడు, ఒక బొలీవియన్ అతను – వాళ్ళు ప్రకటించారు. కామిరి దగ్గర డాంటన్‌ను నిర్బంధంలోకి తీసుకుని ఖైదు చేసినట్లు కూడా ప్రకటించాడు. కాబట్టి అతనితో ఉన్న ఇతరులూ సజీవంగా ఉన్నట్లు రూఢీ అయింది.

ఎత్తు – 950 మీటర్లు.

**ఏప్రిల్ 28**

మధ్యాహ్నం మూడు గంటల దాకా చిన్నగా నడిచాం. ఏరు ఎండిపోయి వేరే దిశకు మళ్ళింది కాబట్టి మేం అక్కడ ఆగిపోయాం. ఇహ ఇప్పుడు దారిని అన్వేషించలేం.

నీటి మడుగు దగ్గర మకాం వెయ్యాలనుకున్నాం. మా దగ్గర మిగిలిన ఆహారం మహా అయితే ఇంకో నాలుగు రోజులకు సరిపోతుంది. కొండలకు అడ్డం పడి ఇక్యురి వెంబడే మర్నాడు నకాహుయాసుకు వెళ్ళే ప్రయత్నం చెయ్యాలని అనుకున్నాం.

**ఏప్రిల్ 29**

ఇంకొన్ని కనుమల గుండా మార్గం ఏమన్నా ఉందేమో అని వెతుకులాడాం. ఫలితం లేకపోయింది. ప్రస్తుతం ఇక్కడ ఏ బాదరబందీ లేకుండా ఉన్నాం. దగ్గరలోనే ఎక్కడో నడకదారిన వెళ్ళగలిగే కనుమ ఏదో చూసిన గుర్తుందని కోకో చెప్పాడు. కాబట్టి మర్నాడు దళం అంతా కలసి ఆ దారికోసం వెతుకులాడాలని అనుకున్నాం.

35వ నెంబరు సందేశాన్ని చాలా ఆలస్యంగా డీకోడ్ చేసాం. బెర్ట్రాండ్ రస్సెల్ అధ్యక్షతన వియత్నాంకు మద్దతుగా చేసిన విజ్ఞప్తిలో నా చేవ్రాలు ఉండేలా అనుమతి ఇవ్వమని ఒక పేరాలో అడిగారు.

**ఏప్రిల్ 30**

కొండ మీదకు దారి మొదలుపెట్టాం. ఏటవాలు కనుమలు ఉంటాయేమో అని వెతికిన కొద్దీ నిటారు కనుమలే ఎదురవుతూ ఉన్నాయి. చివరికి ఒక దారి వెతికి పట్టుకున్నాం. పైకి ఎక్కి చేరుకున్నాం. అంత పైన ఉన్నాగానీ ఆశ్చర్యంగా మేం మకాం వేసిన చోట ఆరోజు అంత చలి అనిపించలేదు.

అర్బానో దూకుడు మూలంగా అతని తుపాకి తలకు తగిలి పాపం దుప్పిపిల్ల చచ్చిపోయింది.

చిలీ జర్నలిస్టుల కథనాలను రేడియో హవానా ప్రసారం చేసింది. గెరిల్లా దళాల బలానికి జడిసి ముందస్తు జాగ్రత్తగా నగరాలలో రక్షణ చర్యలు చేపట్టారని, ఆహార పదార్థాలతో నిండుగా ఉన్న రెండు సైనిక ట్రక్కులను గెరిల్లాలు స్వాధీనం చేసుకున్నారనీ జర్నలిస్టులు చెప్పారు. 'సియంప్రే' పత్రిక బారియాంటోస్‌ను ఇంటర్వ్యూ చేసింది. ఇతరత్రా అంశాలతో పాటు తమకు అమెరికన్ సైనిక సలహాదారుల సహాయ సహకారాలు ఉన్నాయని, బొలీవియాలో నెలకొని ఉన్న సామాజిక పరిస్థితుల మూలంగా గెరిల్లా యుద్ధం తలెత్తింది అని అంగీకరించాడు అతను ఆ ఇంటర్వ్యూలో.

**నెలసరి సమీక్ష**

జరిగినవన్నీ సాధారణ సంఘటనలే, కాని రెండు తీరని నష్టాలకు ప్రాయశ్చిత పడాల్సిందే. ఎల్‌రుబియో, రోలాండో. రోలాండో మరణం ఊహించని దెబ్బే. రెండో

‘కమాండ్’ను ఏర్పాటు చెయ్యాల్సివస్తే ఆ బాధ్యతలు రోలాండోకు అప్పజెప్పాలని మొదటనుంచీ ఆలోచిస్తున్నారు. నాలుగు దాడులు చేసాం. అన్నీ సానుకూల ఫలితాలే ఇచ్చాయి. ఒకటి మాత్రం అన్నింటికన్నా సంతృప్తి నిచ్చింది. ఆ ‘ఆంబుష్’ లోనే ఎల్‌రుబియో చనిపోయాడు.

మరో పక్కన మేం పూర్తిగా ఒంటరిపాటుగా ఉన్నాం. రకరకాల అనారోగ్యాలు కొంత మంది కామ్రేడ్స్‌ను కుంగదీసాయి. దాంతో మా దళాన్ని విభజించాల్సి వచ్చింది. ఫలితంగా అనూహ్య ఫలితాలు సాధించే సత్తా ఆ మేరకు తగ్గింది. ఇప్పటిదాకా జోయాక్విన్‌తో మళ్ళీ ‘కాంటాక్టు’ ఏర్పాటు చేసుకోలేకపోయాం. రైతులతో మాకు ఇంకా పునాది ఏర్పడలేదు. ప్రణాళిక బద్ధమైన భయోత్పాతం సృష్టించే కార్యక్రమాలతో ముందు రైతులను తటస్థం చెయ్యగలిగితే తర్వాత వారి నుండి మద్దతు కూడగట్టవచ్చు. కొత్తగా దళంలోకి ఒక్కడిని కూడా రిక్రూట్ చేసుకోలేదు. ఇద్దరు చనిపోగా, టాపెరిల్లాస్ దగ్గర జరిపిన దాడి తరువాత ఎల్‌లోరో కనిపించకుండా పోయాడు.

**మిలిటరీ వ్యూహంలో కొన్ని అంశాలు ప్రత్యేకం పేర్కొనాలి.**

1. ఇప్పటిదాకా వాళ్ళు (సైన్యం) మా మీద పట్టు సాధించలేదు. మమ్మల్ని చికాకు పెడుతున్నారు గానీ మా కదలికలను నియంత్రించలేకపోయారు. అది వాళ్ళ బలహీనత కావచ్చు, చురుగ్గా కదలలేక పోవడం కావచ్చు. అదీగాక చివరిసారి దాడిలో దెబ్బ తిన్నమూలాన అటవీప్రాంతంలో అడుగుపెట్టాలంటే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవచ్చు.

2. గందరగోళం కొనసాగుతుంది ఇరువైపులా. నేను రాసిన వ్యాసం హవానా ప్రచురించాక నేను ఇక్కడ ఉన్నానే విషయమై ఎవరికీ ఇక అనుమానం ఉండక పోవచ్చు.

ఉత్తర అమెరికా ఇక్కడ పెద్ద ఎత్తున, బలంగా జోక్యం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వాళ్ళు ఇప్పటికే హెలికాప్టరు పంపారు. ‘గ్రీన్ బారెట్స్’ను (అమెరికా సైన్యంలో ఒకవిభాగం) కూడా దించినట్లు ఉన్నారు. కానీ మాకు ఇంత వరకూ తారసపడలేదు.

3. సైన్యం (కనీసంగా ఒకటి, రెండు కంపెనీలు) కూడా మెళుకువలు నేర్చింది. టాపరిల్లాస్ దగ్గర మమ్మల్ని ఆశ్చర్యపరిచింది. ఎల్‌మీసన్ దాడి తర్వాత కూడా వాళ్ళ స్థైర్యం అడుగుజారలేదు.

4. రైతుల సమీకరణ అస్సలు జరగలేదు. పైపెచ్చు వాళ్ళే ఇన్ఫార్మర్లుగా వ్యవహరించడం మాకు కాస్త ఆందోళన కలిగిస్తుంది. అయితే అలాంటి వాళ్ళు అంత చురుకైన వాళ్ళూ, సమర్థులూకారు. వాళ్ళను దారిలోకి తెచ్చుకోగలం.

రెండవ దళమో, మూడవ దళమో ఏర్పాటయ్యేదాకా ఎల్‌చినో దాడుల్లో పాల్గొంటాడు. డాంటన్, కార్లోస్‌లు వాళ్ళ తొందరపాటుకు వాళ్ళే బలయ్యారు. ఎలాగోలా బయటపడాలనే ఆరాటం వాళ్ళది. కాని వాళ్ళ తొందరపాటును నిలవరించడంలో నేనూ విఫలమయ్యా. ఫలితంగా క్యూబాతో (డాంటన్) కమ్యూనికేషన్లు లేకుండా పోయాయి. అర్జెంటీనా (కార్లోస్)లో మా ప్రణాళిక అమలు చేసే అవకాశమూ చేజారింది.

ఏతావాతా, గెరిల్లా యుద్ధాన్ని కనీస స్థాయిలో అభివృద్ధి చెయ్యడం వరకు ఈ నెల రోజులూ సాధారణంగా గడిచాయి. దళ సభ్యుల నైతిక స్థైర్యం బాగానే ఉంది, గెరిల్లా యోధులుగా తొలి పరీక్షలో వారు విజయం సాధించారు కదా.

# మే 1967

**మే 1**

దారుల అన్వేషణతో మేడే ఉత్సవాన్ని జరుపుకున్నాం. పెద్దగా పురోగతి సాధించలేకపోయాం. నది వేరు పడే చోటుకు ఇంకా చేరుకోలేదు.

హవానాలో అల్మీదా నన్ను, గెరిల్లా యోధులను పొగుడుతూ ఉపన్యాసం ఇచ్చింది. చిన్న ఉపన్యాసమే కానీ బాగుంది. ఇంకో మూడు రోజులకు సరిపడే తిండి ఉంది. నాటో కత్తితో ఒక చిన్న పక్షిని వేటాడాడు. పక్షిలోకంలోకి ప్రవేశించాం.

**మే 2**

నత్తనడక ప్రయాణం. భౌగోళిక స్వరూపం మీద గందరగోళం. దారి చేసుకుంటూ నడవాల్సి రావడంతో రెండు గంటలు మాత్రమే ప్రయాణించాం. అంత కష్టంగా ఉంది. ఎత్తు మీద ఉన్నాం కాబట్టి నకాహుయాసు నుండి మేం ఉత్తర దిశగా ప్రయాణిస్తున్నట్లు తేల్చుకోగలిగాం. అయితే ఇక్యురి జాడ దగ్గర్లో ఎక్కడా ఉన్నట్లు అనిపించడం లేదు. మిగ్యుయెల్, బెనినోలు ఇద్దరూ కలిసి రోజంతా ఇక్యురి నదికేసి వెళ్ళే దారి వెతికే పనిలో ఉండాలని, కనీసం ఏ నీటి మడుగు దగ్గరకయినా చేరుకునేలా దారి వెతకాలని ఆదేశాలిచ్చా. ఐదు రోజులకు సరిపడా ఆహారం ఉంది కానీ అదీ తక్కువగానే ఉందని చెప్పుకోవాలి.

రేడియో హవానా వార్తలను దట్టించి బొలీవియాకు వ్యతిరేకంగా సమాచారం ఉద్ధృతం చేసింది.

ఎత్తు సముద్ర మట్టానికి 1760 మీటర్లు. 1730 మీటర్ల ఎత్తున నిద్రించాం.

**మే 3**

రోజంతా తుప్పలు, పొదలూ నరుకుతూ మొత్తానికి రెండు గంటల పాటు నడవగలిగే చిన్నదారి చేసుకున్నాం. పుష్కలంగా నీరు దొరికే చోటుకు చేరుకున్నాం.

ఉత్తర దిక్కునుండి ప్రవహిస్తున్నట్లు ఉంది. రేపు కూడా ఇలానే తుప్పలు నరుక్కుంటూ దారి చేసుకు వెళ్ళాలని అనుకున్నాం. 'రేషను'గా వాడుకుంటే మరో రెండు రోజులకు సరిపడా తిండి ఉంది. సముద్ర మట్టానికి 1080 మీటర్ల ఎత్తున ఉన్నాం. నకాహుయాసుకు 200 మీటర్ల ఎత్తు. ఏదో దిక్కు నుండి ఇంజను మోత వినిపించింది.

**మే 4**

ఉదయం పూట దారికోసం అన్వేషణ సాగింది. కోకో, అనీసెటోలు మొత్తానికి నదీ ప్రవాహాన్ని కనుగొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగివచ్చారు. నది తూర్పుకు సాగి దక్షిణానికి మళ్ళింది కాబట్టి అదే ఇక్యురి నది అయి ఉండవచ్చని చెప్పారు. పట్టాకత్తి దళం కాస్త తిండి తిని ఆ ప్రవాహం వెంబడే దిగువకు వెళ్ళి రావాలని ఆదేశించా. ఒకటిన్నరకు బయల్దేరాం. సాయంత్రం ఐదు గంటలకు ఆగాం. ఆగ్నేయం దిశగానే పోతున్నాం కాబట్టి అది ఇక్యురి నదే అయి ఉంటుంది. పట్టాకత్తి దళం వచ్చి నదిజాడ ఎక్కడా కనబడలేదని, అవన్నీ నీటిమడుగులే అని చెప్పారు. అయితే మేం గ్రాండే నది దిశగా వెళ్తున్నాం అనే ఉద్దేశంతో ముందుకే బయల్దేరాం. ఉతీతువు పిట్టను కొట్టి దాన్నే తలా కాస్త తిన్నాం. మా దగ్గర ఉన్న తిండి మరో రెండు రోజులకు వస్తుంది.

ఎల్‌లోరో పట్టుబడినట్లు రేడియోలో వార్తలు వచ్చాయి. కాలికి గాయం అయిందట. ప్రస్తుతానికి బాగానే ఉన్నాట్ట. వర్షపురాత్రి రైతు ఇంట్లో తలదాచుకున్నప్పుడు అతనికి కాలిగాయం ఏదీలేదు. దార్లోకూడా అయ్యే అవకాశం లేదు. బహుశా తప్పించుకునే ప్రయత్నంలో గాయపడి ఉంటాడు.

ఎత్తు : సముద్ర మట్టానికి 980 మీటర్లు.

**మే 5**

చురుగ్గా ఐదు గంటల పాటు నడిచాం. పన్నెండు, పధ్నాలుగు కిలోమీటర్లు నడిచి ఇంతి, బెనినోలు ఏర్పాటు చేసిన మకాంకు చేరుకున్నాం. మ్యాప్‌లో గుర్తు పెట్టిలేదు గానీ మేం ఇప్పుడు కాంగ్రీ కనుమల్లో ఉన్నాం. మా ప్రయాణం కచ్చితంగా ఉత్తర దిక్కుకే సాగుతుంది. కానీ ఇక్యురి నది ఎక్కడుందా బెనినో, అనీసెటోలు చెప్పిందే అయి ఉంటుందా. జోయాక్విన్ దళంలోని వారే పొరబాటున వీళ్ళని శత్రువులనుకుని దాడి చేసి ఉంటారా? ఎలుగుబంటి గుహకేసి వెడితే అక్కడ రెండు రోజులకు సరిపడా అల్పాహారం దొరుకుతుంది. అక్కడనుండి పాత క్యాంప్‌కు పోవచ్చు. అందుకే రెండు పెద్ద పక్షులని ఒక ఉతీతువు పిట్టని కొట్టాం తిండిలేక. ఉన్న ఆహారం ఇంకో రెండు రోజులు వచ్చేలా సర్దుకోవాలి. అది కూడా ఎండు మాంసం, సూపు ప్యాకెట్లు. కోకో,

డాక్టర్లు ఇద్దరూ వేటకు పోయారు. కామిరిలోని మిలిటరీ ట్రిబ్యునల్ డెబ్రేను గెరిల్లా దళం నాయకుడిగా భావించి విచారణ జరపనున్నట్లు రేడియోలు వార్తలు ప్రసారం అయ్యాయి. డెబ్రే తల్లి మరుసటి రోజు కామిరి రానున్నదట. ఈ విషయమై ఆందోళన సాగుతుందని సమాచారం. ఎల్‌లోరో గురించి ఎటువంటి సమాచారం లేదు.

ఎత్తు – 840 మీటర్లు.

**మే 6**

ఎలుగుబంటి గుహకు చేరుకుంటామనే మా లెక్క తప్పింది. నీటి మడుగు దగ్గర నుండి పూరింటికి మేం అనుకున్న దూరం కాస్త ఎక్కువయింది. దానికి తోడు అంతకు ముందు మేం చేసుకున్న కాల్దారి కప్పడిపోయింది. దాంతో మేం మళ్ళీ తోవచేసుకోవాల్సి వచ్చింది. 1400 మీటర్ల ఎత్తుకు నడిచాం. దళ సభ్యులు ఇంకా మా వల్ల కాదని మొరాయించారు. పూరింటికి చేరుకునే సరికి నాలుగున్నర అయింది. తిన్న తిండీ అధ్వాన్నంగా ఉంది. తురాయి పిట్టను కొట్టి, బెనినోకు అతనితో కలిసి దారి వెతుకుతూ నడిచే ఇద్దరికీ పంచాం.

ఆరోజు వార్తలన్నీ డెబ్రే మీదనే

ఎత్తు – సముద్ర మట్టానికి 1100 మీటర్లు.

**మే 7**

వేకువనే ఎలుగుబంటి గుహకు చేరుకున్నాం. ఎనిమిది పాల డబ్బాలు కనిపించాయి. పండగ చేసుకున్నాం. దగ్గర్లో ఉన్న ఆయుధాల గుహ నుండి ఎల్‌నాటోకు ఒక తుపాకి, యుద్ధ ట్యాంకులను ధ్వంసం చేసే బాంబులను ప్రయోగించే బజూకా, ఐదు బాంబులు తీసుకున్నాం. ఎల్‌నాటోకు వాంతులు అయిన మూలాని అనారోగ్యంగా ఉన్నాడు. మేం ఎలుగుబంటి గుహకు చేరుకోగానే బెనినో, అర్బానో, లియోన్, అనీసెటో, పాబ్లిటోలు పశువులు చావడి దగ్గర పరిస్థితి ఎలా ఉందో చూసి రావడానికి వెళ్ళారు. మా దగ్గర మిగిలిన చివరి విడత ఎండు మాంసం సూపుతో కలిపి తిన్నాం. గుహలో రేషను స్టాకు ఉంది. అడుగుల జాడ కనబడింది. నేలమీద. పొదలవీ తొక్కిన జాడలు ఉన్నాయి. అంటే సైనికులు అక్కడికి వచ్చి వెళ్ళారని గ్రహించాం. పొద్దు వాలుతుండగా బెనినో వాళ్ళు ఉత్త చేతులతో తిరిగివచ్చారు. పశువుల చావడిలో దాచిన జొన్నలను సైన్యం ఎందుకూపనికి రాకుండా పాడు చేసేసింది. (గెరిల్లా దళాన్ని అధికారికంగా ప్రారంభించి ఇవాళ్టికి సరిగ్గా ఆరునెలలు)

ఎత్తు – సముద్ర మట్టానికి 880 మీటర్లు.

**మే 8**

పొద్దున లేవగానే కొంతమందికి గుహలకు కావాలసిన మరమ్మతులు చెయ్యమని, ఇంకొంత మందిని లోపల డబ్బాల్లో ఉంచిన సీంపంది మాంసం కూరిన బన్నురొట్టెలు ఖాళీ సీసాల్లో సర్దెయ్యమని పురమాయించాను. మాకు మిగిలిన తిండిదే పదిన్నరా ఆ ప్రాంతంలో ఆగాగి తుపాకి మోతలు వినిపించాయి. నకాహుయాసు నుండి వస్తున్న ఇద్దరు సైనికులు అడ్వాన్సు పార్టీ అయిఉంటారని భావించి పాచో వాళ్ళ మీద కాల్పులు జరిపాడు. ఒకరికి కాలిలో ఇంకొకరికి పొట్టలో స్వల్ప గాయాలు అయ్యాయి. ఇద్దరూ నిరాయుధంగా ఉన్నారు. ఆగమని అరిస్తే ఆగనందున కాల్చాల్సి వచ్చిందని పాచో చెప్పాడు. అసలు మాకు ఆ మాట వినబడనే లేదని సైనికులు అన్నారు. ఏమైనా 'ఆంబుష్' సరైన సమన్వయంతో జరగలేదని అనిపించింది. పాచో లో తొందరపాటు కనిపించింది. ఆంటోనియోను ఇంకొంత మందిని ఎడమవైపుకు వెళ్ళమని పురమాయించా. 'ఆంబుష్'ను బ్యాలన్స్'చెయ్యడానికి అది అవసరం అనిపించింది. నకాహుయాసు దగ్గర మకాం వేసాం అని సైనికులు చెప్పారు కానీ వాళ్ళు అబద్ధం చెప్పారు. మధ్యాహ్నానికి నకాహుయాసు నుండి లగెత్తుతూ వచ్చిన మరో ఇద్దరు సైనికులు బందీలుగా చిక్కారు. వేటకు వెళ్ళి తిరిగి వచ్చేసరికి తోటిసైన్యం కనబడనందున వాళ్ళను కలుసుకోవడానికి ఇక్యురి నది వెంబడే పరిగెడుతూ వచ్చాం అని చెప్పారు. వాళ్ళు చెప్పేది అబద్ధమే. నిజానికి వాళ్ళు వేట ప్రాంతంలో విడిది చేసారు. వాళ్ళకు తిండి చేరవెయ్యాల్సిన హెలికాప్టర్ రానందున మేం చావిడిలో దాచుకున్న తిండికోసం వచ్చారు. తొలుత చిక్కిన ఇద్దరు బందీల దగ్గర ఉన్న ఉడకేసిన జొన్నలు, నాలుగుడబ్బాల ఎండుచేప, కాఫీ, పంచదారతో ఆ పూట మా తిండి సమస్య తీరిపోయింది. బన్ను రొట్టెలు కడుపారా తిన్న మీదట మాలో కొంతమంది అజీర్తితో అడ్డం పడిపోయారు.

పదే పదే సైనికులు సర్వే చెయ్యడానికి వచ్చినట్లు వస్తున్నారని సెంట్రీ వచ్చి మమ్మల్ని హెచ్చరించాడు. అతను నది ఒంపుదాకా వెళ్ళివచ్చాడు. మొత్తం ఇరవై ఏడు మంది సైనికులు ఎదురవగానే ఆశ్చర్యపోవడం మా వంతయింది. ఏదో తేడా పడింది అని గమనించి వాళ్ళ సబ్–లెఫ్టినెంట్ లారెడో ఆదేశాల మీదట ముందుకు చొచ్చుకు వచ్చారు. కాల్పులు జరపమని ఆదేశాలిస్తూ తొలిగా మాపైకి తుపాకి పేల్చిన ఆ సబ్–లెఫ్టినెంటే మా ఎదురు కాల్పుల్లో 'స్పాట్'లోనే చనిపోయారు. ఇంకో ఇద్దరు సైనికులు కూడా నేలకొరిగారు. చీకటి పడింది. దాంతో మా దళం అడ్వాన్సయింది. ఆరుగురు సైనికులను బందీలుగా పట్టుకున్నాం. మిగతా వాళ్ళు వెన్ను చూపారు.

మొత్తం మీద మృతులు ముగ్గురు, బందీలు పదిమంది అందులో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఏడు ఎమ్-ఐలు నాలుగు తుపాకులు, బ్యాగేజి, కొంత అమ్యూనిషన్, కొంత తిండి మాకు చిక్కాయి. మేం అక్కడే నిద్రపోయాం.

**మే 9**

తెల్లవారు జాము నాలుగు గంటలకే నిద్రలేచాం. (నేనయితే నిద్రపోలేదు). బందీలుగా చిక్కిన సైనికులతో మా ఆశయం గురించి చెప్పి ఆనక వాళ్ళను విడిచిపెట్టాం. వాళ్ళ బూట్లు, బట్టలు మా బట్టలు, బూట్లతో మార్చుకున్నాం. అబద్ధాలాడిన సైనికులను లోదుస్తులతోనే పొమ్మనమన్నాం. గాయపడిన వాళ్ళని తీసుకుని గొడ్లచావడి వైపు వెళ్ళారు వాళ్ళు. అక్కడి నుండి మేం కోతి కనుమ కేసి వెనుదిరిగి ఆరున్నర కల్లా అక్కడికి చేరుకున్నాం. అనవసరం అనుకున్న వన్నీ గుహలో పడేసాం. నాకు స్పృహతప్పినంత పనియింది. రెండు గంటలు పడుకుంటేగానీ ముందుకు కదిలే పరిస్థితి లేదు. నాతోపాటు చాలా మంది పరిస్థితి అలానే ఉంది.

అందుకే తొలిగా కనిపించిన నీటి మడుగుదగ్గర ఆగి మాంసం కూరిన బన్ను రొట్టెలు తిని సూపు తాగాం. దళ సభ్యులు బలహీనంగా ఉన్నారు. కొంత మంది 'ఎడిమా' బారిన పడ్డారు. రేడియో ప్రసారంలో సైన్యం ముందు రోజు ఘటన గురించి, అందులో గాయపడిన - చనిపోయిన వాళ్ళ సహా వార్తలు ఇచ్చింది. బందీల సంగతి ప్రస్తావించలేదు. భారీ ఎదురుదాడిలో మావైపున చానా ప్రాణం నష్టం జరిగినట్లు ముక్తాయింపు ఇచ్చింది.

**మే 10**

మా నడక నిమ్మళంగా సాగింది. ఎల్‌రుబియోను ఖననం చేసిన పాత క్యాంప్ దగ్గరకి వచ్చాం. జంతువుల కొవ్వుతో తయారు చేసుకున్న దివిటీలు అక్కడ చెల్లా చెదురుగా పాడయిపోయి పడి ఉన్నాయి. అవన్నీ ఏరుకున్నాం. ఎక్కడా సైనికుల జాడలేదు. అన్ని జాగ్రత్తలు తీసుకుని నకాహుయాసు దాటాం. మిగ్యుయెల్ వెతికి పట్టుకున్న ఒక కొండ పగులు దారి గుండా పిరిరెండాకు బయల్దేరాం. అయితే తోవ కడదాకా లేదు. సాయంత్రం ఐదు గంటలకు ఆగాం. కాస్త ఎండు చేప తిని సరిపెట్టుకున్నాం.

**మే 11**

ముందుగా అడ్వాన్సు పార్టీ బయల్దేరింది. నేను వార్తలు వింటూ ఉండిపోయా. కాసేపటి తర్వాత ఆర్బానో వచ్చాడు. బెనినో ఒక అడవి పందిని చంపాడని దాని తోలు వలిచి, మంట పెట్టి తినడానికి వీలుగా కాల్చడానికి పర్మిషను ఇమ్మని అడిగాడు.

ఆ పూటకు అడవి పంది మాంసం తిని అక్కడే ఉండాలని, బెనినో, అర్బాన్, మిగ్యుయెల్‌లు సముద్రపు కయ్యకేసి వెళ్ళి దారి ఏమన్నా ఉందేమో చూడాలని అనుకున్నాం. సాయంత్రం నాలుగు గంటలకు మా ప్రయాణం తిరిగి మొదలయింది. ఆరు గంటలకు ఒక చోట మకాం వేసాం. మిగ్యుయెల్, మిగతావాళ్ళూ ముందుకు పోయారు.

బెనినో, అర్బానోలు ఇద్దరితోనూ విడిగా మాట్లాడాలి. గొడవ జరిగిన రోజున బెనినో ఎండు మాంసం తినేసి తినలేదని అబద్ధం చెప్పాడు, అర్బానో కూడా అలెన్ ఎల్ రూబియో ఖనన ప్రదేశం దగ్గర ఎండుచేప తినలేదనేశాడు.

మేం ఉన్న 'జోన్ వ్యవహారాలు చూస్తున్న నాల్గవ సైనిక డివిజను కమాండెంట్ కల్నల్ రోచాను ఆ బాధ్యతల నుండి తప్పిస్తున్నట్లు వార్తలు ప్రసారం అయ్యాయి.

ఎత్తు – సముద్ర మట్టానికి 1050మీటర్లు.

**మే 12**

అర్బాన్, బెనినోలు దారి చేసారు. మా నడక నిమ్మళంగా సాగింది. మధ్యాహ్నం మూడు గంటలకు ఉప్పునీటి కయ్యకు ఐదు కిలోమీటర్ల దాపుకు వెళ్ళాం. మరికాసేపటికే పాత దారి ఒకటి కనబడింది. ఇంకో గంట పోయాక జొన్న తోటలు కనిపించాయి. మధ్యన పుచ్చకాయ పాదులు ఉన్నాయి కాని నీళ్ళులేవు. కొన్ని జొన్నలు కాల్చుకుని ఉప్పురాసి మరీ తిన్నాం. కాసేపటికి వేగులపని మీద వెళ్ళిన వాళ్ళు వచ్చి చిచీ ఇల్లు దగ్గర్లోనే ఉందని చెప్పారు. లెఫ్టినెంట్ హెన్రీ లారెడో తన డైరీలో 'నమ్మకమైన స్నేహితుడని' రాసింది ఇతని గురించే. అతను ఇంట్లోలేడు. నలుగురు జవాన్లు, ఒక పని మనిషి ఉన్నారు. పని మనిషికి అన్నంగిన్నె తెచ్చిన ఆమె భర్తను కూడా మా అదుపులో ఉంచుకున్నాం. అన్నం, సీంపంది మాంసం వండుకుని, పుచ్చకాయలు కోసుకు తిన్నాం. పోంబో, అర్టురో, విల్లీ, డారియోలు మా బ్యాగేజికి కాపలాగా ఉండిపోయాడు. ఇంటి బయట ఎక్కడా చుక్క నీళ్ళు లేవు.

తెల్లవారు జాము ఐదున్నరకి మేం తిరుగు ముఖం పట్టాం. దాదాపు అందరూ నలతగా ఉన్నారు. ఇంటి యజమాని రాలేదు అప్పటికి. అతని ఇంట్లో మేం వాడుకున్న సరుకుల లెక్క ఓ చీటీ మీద రాసి పెట్టి మరీ వచ్చాం. జవాన్లకు, పనిమనిషికి మాకు చేసిన సాయానికిగాను తలా పది డాలర్లు ఇచ్చాం.

ఎత్తు – సముద్ర మట్టానికి 950 మీటర్లు.

**మే 13**

రోజంతా ఒకటే పులి తేన్పులు, వికారం, వాంతులు–బేదులు, అంగాంగ అపసవ్య విన్యాసం. కుదేలయిపోయాం. తిన్న పంది మాంసం అరాయించుకునేందుకు

ప్రయత్నించాం. మా దగ్గర ఉన్నది రెండు డబ్బాల నీళ్ళు మాత్రమే. నాకు కూడా చాలా నలతగా అనిపించింది. వమనం అయ్యాక కాస్త తేరుకున్నా. రాత్రికి తినగలిగిన వాళ్ళు పుచ్చకాయ ముక్కలు, మొక్కజొన్న పొత్తులు తిన్నారు. ఈ రోజు రేడియోలో పదే పదే వెలువరించిన వార్తా ప్రసారాల్లో వెనిజులాలో చొరబడిన క్యూబా పౌరుడు చికాకు పెట్టడం, లియోని ప్రభుత్వం బందీలుగా పట్టుకున్న చొరబాటుదార్ల పేర్లు, హోదాలతో సహా ప్రకటించింది. వారు ఎవరైందీ నాకు తెలీదు. ఎక్కడో ఏదో పొరబాటు జరిగిందని మాత్రం అర్థం చేసుకున్నా.

**మే 14**

తెల్లవారు జామునే అనిష్టంగానే పిరిరెండా నీటి మడుగు కేసి నడక సాగించాం. బెనినో, కాంబాలు ఇద్దరూ ముందుగానే తోవ కనుక్కొని వచ్చారు. ప్రయాణం మొదలుకావడానికి ముందే అందరినీ సమావేశ పరిచి మేం ఎదుర్కొన్న సమస్యల గురించి, ముఖ్యంగా తిండి గురించి, సీరియస్‌గా చర్చించా. బెనినో, అర్బానోలు ఎవరూ చూడకుండా నిలవ ఆహారం తిన్నది గాక తినలేదని బుకాయించడం తప్పని హెచ్చరించాను. అనీసెటో తిండి విషయంలో పిలవని పేరంటానికి వచ్చినట్లు జొరబడిపోవడానికి తప్ప ఏ పని బాధ్యతగా తీసుకోకపోవడాన్ని వేలెత్తిచూపా. మేం సమావేశంలో వుండగానే సమీపం నుంచి లారీల మోత వినిపించింది. వెళ్ళి వాటిని అడ్డగించాం. 200 పౌండ్ల పేలాలు, 50 పళ్ళరసం సీసాలు లేపేసి మా భవిష్యత్ అవసరాల కోసం దాచిపెట్టాం.

మేంరోడ్డుదిగి చెట్లకు వేలాడుతున్న చిక్కుళ్ళు తుంచుకుంటూ ఉండగా దగ్గర నుండి తుపాకి కాల్పులు వినవచ్చాయి. మరి కాసేపటికి విమానాలు వచ్చి బాంబులు కురిపించాయి. అప్పటికి మేం ఆ స్థలం వదిలేసి రెండు కిలోమీటర్లు దాటి వచ్చాం మేం కొండకొమ్ము ఎక్కినాక దూరంగా నీటిమడుగు కనిపించింది. సైన్యం కాల్పులు కొనసాగుతున్నాయి. చీకటి పడుతుండగా మేం ఒక ఇల్లు చేరుకున్నాం. ఆ ఇంట్లో ఉన్న వాళ్ళు ఎవరో అంతకు ముందే బయటకు వెళ్ళినట్లుంది. ఇంట్లో తినడానికి తిండి, తాగడానికి నీటికి కొదవ లేదు. అన్నం కోడికూర వేపుడు తిన్నాం. తెల్లవారుఝాము నాలుగు గంటల వరకు అక్కడే ఉన్నాం.

**మే 15**

**ఈ రోజు విశేషాలేం లేవు.**

**మే 16**

మేం ప్రయాణం అలా మొదలు పెట్టామో లేదో నాకు వాంతులు, బేదులు మొదలయ్యాయి. డెమరాల్ బిళ్ళలు వేసారు. కాస్త కట్టాయి. కానీ నాకు స్పృహ తప్పింది. నన్ను కాన్వాస్ గుడ్డ ఉయ్యాల్లో మోసుకు వెళ్లారు. నిద్ర లేచాక కాస్త ఒళ్ళు తేలిక అనిపించింది. కాని పసిపిల్లాడికి మాదిరి గుడ్డలు తడిపేసుకున్నాను. నాకు ఇంకో జత బట్టలు ఇచ్చారు. కాని అక్కడ ఎక్కడా నీరు లేదు. మురిగ్గా ఉన్నా, రోజంతా అక్కడే గడిపాం. మత్తుగా జోగుతూ ఉండిపోయాను నేను. కోకో, నాటోలు ఈశాన్యం దిక్కున దారిని వెతుకుతూ వెళ్ళారు. ఆ రాత్రి ఆ దారి వెంబడే ప్రయాణించాం. వెన్నెలలో కాసేపు విశ్రమించాం. 36వ నంబరు సందేశం అందుకున్నాం. దాన్ని బట్టి మేం పూర్తిగా ఒంటరిపాటయిపోయాం అని అర్థమైంది.

**మే 17**

మధ్యాహ్నం ఒంటి గంట వరకు నడక సాగించాం. రంపం మిల్లు తగిలింది. మూడు నాలుగు రోజుల క్రితమే దాన్ని బందు పెట్టిన ఆనవాళ్ళు అగుపించాయి. లోపల పంచదార, మైదాపిండి, జొన్నలు, బారెళ్ళ కొద్దీ నీళ్ళూ ఉన్నాయి. చాలా దూరం నుండి తీసుకొచ్చినట్లు అనిపించింది. అక్కడే మకాం వేసాం. ఆ మిల్లు దగ్గర నుండి బయటకు తీసిన దారులను అన్వేషించారు. అన్నీ అడవిలోకే పోతున్నాయి. రావుల్‌కి మోకాలి దగ్గర గడ్డ లేచి బాధతో నడవలేకపోతున్నాడు. ఈ రోజుకి యాంటీ బయాటిక్ పెద్దడోసే ఇచ్చాం. వీలయితే రేపు ఆ గడ్డకు శస్త్రచికిత్స చెయ్యాలి. దాదాపు పదిహేను కిలోమీటర్లు నడిచినట్లున్నాం.

ఎత్తు – 920 మీటర్లు.

**మే 18**

రాబర్ట్–జువాన్ మార్టిన్

రోజంతా మాటు వేసాం, సైనికులు గానీ, మిల్లు కార్మికులు గానీ వస్తారేమోనని. కానీ ఏం జరగలేదు. మిగ్యుయెల్, పాబ్లితో కలిసి మేం ఉన్న చోట నుండి రెండు గంటల నడక దూరంలో రోడ్డువారగా నీటి జాడ కనుక్కుని వచ్చారు. రావుల్ మోకాలి దగ్గర గడ్డకు శస్త్ర చికిత్స చేసాం. చీము పిండేసాం. ఇన్‌ఫెక్షన్ కాకుండా ఉండడానికి మందులు ఇచ్చా. నిజానికి ఇప్పుడతను అడుగు తీసి అడుగేసే పరిస్థితిలో లేడు. గెరిల్లాల పోరాటం మొదలుపెట్టిన తరువాత తొలిసారిగా పిప్పి పన్ను పీకాను. తొలి బాధితుడు కాంబా. మొత్తానికి పీకుడు కార్యక్రమం సజావుగానే సాగింది. ఈ రోజు ఓవెన్‌లో ఉడికించిన రొట్టె తిన్నాం. సాయంత్రం ఉడకేసిన పంది మాంసం తిన్నాం. దాంతో నాకు వికారం మొదలయింది.

## మే 19

అడ్వాన్స్ పార్టీ తెల్లవారుఝామునే వెళ్ళి రోడ్డు కూడలిలో మాటు వేసింది. తరువాత మేం అక్కడనుండి కదిలాం. అడ్వాన్సు పార్టీకితోడుగా ఇంకో దళాన్ని పంపా. అడ్వాన్సు పార్టీ రెండు దళాలుగా విడిపోయి ఒక దళం రావుల్‌ను భుజాలకు ఎత్తుకుని తీసుకురావడానికి వెళ్ళింది. మరో దళం నీటి మడుగు దగ్గరకు వెళ్ళి మా సామాన్లు ఉన్న బ్యాగులు అక్కడ పెట్టి రావుల్‌కు తాగడానికి నీళ్లు తీసుకువచ్చారు. రావుల్ నిమ్మళంగా కోలుకుంటున్నాడు. ఆంటోనియో ఆ నీటి మడుగు వెంబడే కిందదాకా పోయి అంతకు ముందు సైనికులు వాడుకుని వెళ్ళిన మకాం ఒకదాన్ని కనిపెట్టుకుని వచ్చాడు. అక్కడ బలమైన సంతులిత ఆహారం కూడా వదిలేసి వెళ్లారు వారు. నకాహుయాసు ఇక్కడ నుండి అట్టే దూరం ఉండకపోవచ్చు. వాతావరణ నిపుణులు కూడా ఆశ్చర్యపోయేలా ఆ రోజు రాత్రి కుంభవృష్టిగా వాన కురిసింది.

మా దగ్గర పదిరోజులకు సరిపడా తిండి ఉంది. దగ్గర్లోనే పుచ్చకాయలు, జొన్నలు అందుబాటులో ఉన్నాయి.

ఎత్తు – 780 మీటర్లు.

## మే 20

కామిలో

ఈ రోజంతా స్తబ్దుగా గడిచింది. తెల్లవారు జామున సెంటర్‌పార్టీ మాటు వేసింది. మధ్యాహ్నం నుండి అడ్వాన్సు పార్టీ పోంబో ఆధీనంలో మాటు వేసింది. మిగ్యుయెల్ ఎంపిక చేసిన ఆ మాటు వేసిన ప్రాంతం క్షేమం కాదని పోంబో అభిప్రాయం. మిగ్యుయెల్ నీటి మడుగు వెంబడే పడి నకాహుయాసుకు దారి కనుక్కురావడానికి వెళ్ళి వచ్చాడు. వీపున బరువులు లేకపోతే రెండు గంటల్లో అక్కడికి చేరుకోవచ్చని చెప్పాడు. ఎవరు కాల్చారో తెలీదుగానీ మొత్తానికి తుపాకి పేల్చిన శబ్దం స్పష్టంగా విన్నాం. నకాహుయాసు ఆవలి ఒడ్డున వేరే చోటనుండి ప్లాటూన్ల కొద్దీ సైన్యం ఆటుగా వచ్చి వెళ్ళిన అడుగుజాడలు కనబడుతున్నాయి. ఈ రోజు లూయిస్ తొలిసారిగా నిరసనగళం విప్పాడు. మాటు వేసే పనిలోకి తనని తీసుకోకుండా అనవసరంగా శిక్షిస్తున్నారని నిరసన తెలిపాడు. అతను అలా స్పందించడం మంచిదే.

డెబ్రీ జర్నలిస్టు కాదని, అతనికి మరణశిక్ష ఖరారు చెయ్యమని చట్టసభను కోరుతానని బారియాంటోస్ విలేకరుల సమావేశంలో ప్రకటించాడు. దాదాపు పత్రికా ప్రతినిధులందరూ ముఖ్యంగా విదేశీ ప్రతినిధులు డెబ్రే గురించి ప్రశ్నల మీద ప్రశ్నలు

సంధించారు. బారియాంటోస్ ఏమాత్రం నిలకడలేని సమాధానాలు చెప్పాడు. దాన్ని బట్టే అతను ఎంత పనికిమాలిన మనిషో ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది.

**మే 21**

ఆదివారం, అడుగు తీసి అడుగు వెయ్యలేదు ఇవాళ. యధావిధిగా మెరుపుదాడికి ప్లాన్ నడుస్తోంది. వరసవారీగా మధ్యాహ్నానికి పదిమంది ఆ పనిలో ఉన్నారు. రావుల్‌కి కాస్త నిదానించినట్లే అనిపించింది. మరోసారి సెగ్గడ్డకి శస్త్ర చికిత్స చేసి చీమదీ పిండేసాం. జర్వం అయితే రాలేదు. కాని నొప్పితో తీసుకున్నాడు. నడవడం మహాకష్టంగా ఉంది. అదే నన్ను ఆందోళన పరిచింది. ఆ రోజు రాత్రి కడుపారా విందు భోజనం తిన్నట్లు తిన్నాం.

**మే 22**

మేం ఊహించినట్లే కోత మిల్లు యజమాని గజ్‌మాన్‌రూబ్లెస్ మిట్టమధ్యాహ్నానికి తన కొడుకుని, డ్రైవర్‌ను వెంట బెట్టుకుని అద్దెజీపులో అక్కడికి వచ్చాడు. ఇక్కడ ఏం జరుగుతుందో కనిపెట్టుకు రమ్మని వేగులపని మీద సైన్యం వాళ్ళని పంపింది అనుకున్నాం మొదట. కాని అతను మాకు అక్కడ నుండి బయటపడే మార్గం చెప్పాడు. ఆ రాత్రికి గుయాట్రజ్ వెళ్ళి అక్కడ పరిస్థితి వాకబు చేసుకురావడానికి, అందాకా తన కొడుకును మా దగ్గర బందీగా వదిలివెళ్ళడానికి ఒప్పుకున్నాడు అతను. అడ్వాన్సు పార్టీ 'అంబుష్'ను కొనసాగించాలని మర్నాడు మధ్యాహ్నం 3 గంటల దాకా మేం అక్కడే వేచి ఉండాలని నిర్ణయమైంది. ఆ తరువాత అక్కడ కొనసాగడం ప్రమాదకరం కాబట్టి అక్కణ్ణించి వెనక్కి తగ్గాలని నిర్ణయమైపోయింది. గజ్‌మాన్ మమ్మల్ని మోసగిస్తాడని అనిపించలేదు కానీ ఎవరికీ అనుమానం రాకుండా సరుకులూ అవీ కొని తెచ్చే తెలివితేటలు ఉన్నాయా అనేది అనుమానమే. మేం అతని మిల్లులో వాడుకున్న వాటికి అన్నింటికీ లెక్కకట్టి డబ్బు చెల్లించాం. అతను తాతిరెండా, లైమాన్, ఇపిటాలలో ఉన్న పరిస్థితినంతా పూసగుచ్చినట్లు మాకు చెప్పాడు. ఇపిటాలో మాత్రం ఒక లెఫ్టినెంటు కనిపించాడని మిగతా ఎక్కడా సైనికుల జాడలేదని చెప్పాడు అతను. తనయితే తాతిరెండాకు వెళ్ళలేదు గానీ వాళ్ళూ వీళ్ళూ చెప్పినదాన్ని బట్టి అక్కడ పరిస్థితి మాకు వివరించాడు.

**మే 23**

రోజంతా టెన్షన్‌గా గడిచింది. మధ్యాహ్నానికి తిరిగి రావల్సిన మనిషి పత్తాలేకుండా పోయాడు. అట్లా అని అనుమానించదగ్గ అలికిడి దగ్గరా దాపున ఏమీ లేవు. అయినా ముందుగా అనుకున్నట్లే ఆ రాత్రి వెనక్కి తగ్గాలని, వెళ్తూ వెళ్తూ బందీగా వున్న ఆ పదిహేడేళ్ళ కుర్రాడిని మాతో తీసుకు వెళ్ళాలని అనుకున్నాం. అలానే

బయల్దేరాం. వెన్నెల వెలుగులో ఒక గంట ప్రయాణం చేసాం. తరువాత రోడ్డు వారాగా పడి నిద్రపోయాం. ఇంకో పది రోజులకు సరిపడా ఆహారం ఉంది.

**మే 24**

నకాహుయాసు దారిన బడ్డాం. తిన్నటిదారి. రెండు గంటల ప్రయాణం. నీటివాలు వెంబడి పడి నిటారు కొండ పగుళ్ళ గుండా నాలుగు గంటలు నడిచాం. ఈ రోజు ఎందుకోగానీ రికార్డో అయిష్టంగా నిమ్మళంగా నడక సాగించడంతో మేమూ నిదానించి నడవాల్సి వచ్చింది. అయినా మోరో ఇంకా వెనుకబడే ఉన్నాడు. మేం ఈ సాహసయాత్ర తొలి రోజున ఎక్కడ నుండి మొదలు పెట్టామో అక్కడకే వచ్చి చేరాం. మా అడుగుజాడలు లేకుండా జాగ్రత్త పడ్డాం. కొత్తగా ఏ అడుగుజాడలూ లేవు. డెబ్రే తరపున దాఖలు చేసిన హెబియస్ కార్పస్ (శరీరాన్ని కోర్టులో ప్రవేశపెట్టడం) పిటిషనును తిరస్కరించే అవకాశం ఉందని రేడియోలో వార్తలు వచ్చాయి. నా అంచనాల ప్రకారం మేం మరో ఒకటి రెండు గంటల్లో సాలడిల్లో చేరుకోవచ్చు. పైకి చేరిన తరువాత ఏం చెయ్యాలనేది నిర్ణయించుకుందాం అనుకున్నాం.

**మే 25**

గంటన్నరలో మేం సాలడిల్లో చేరుకున్నాం. ఎక్కడా మా అడుగుజాడలు పడకుండా జాగ్రత్తపడ్డాం. రెండు గంటల పాటు నదీ ప్రవాహానికి ఎగువకు నడిచాం. మధ్యాహ్నం మూడున్నరకి అక్కడ ఇంత తిని మళ్ళీ మరో రెండు గంటలు సాయంత్రం ఆరింటిదాకా నడిచాం. కొండ కనుమ చిటారుకు చేరలేదు. కాని 1100 మీటర్ల ఎత్తున విడిది చేసాం. మాతో ఉన్న పిల్లాడు వాళ్ళ తాతగారి పండ్ల తోట చేరుకోవాలంటే ఇంకొన్ని మైళ్ళు పోవాలన్నాడు. లేదూ బెనినో చెప్పినట్లు గ్రాండే నది దగ్గర ఉన్న వర్గాస్ ఇంటికి చేరుకోవాలంటే ఒక రోజంతా నడవాలి. ఎటువెళ్ళాలనేది రేపు నిర్ణయిస్తాం.

**మే 26**

రెండు గంటల నడక తరువాత 1200 మీటర్ల ఎత్తునున్న కనుమ దాటాక మేం ఆ కుర్రాడి తాతగారి పండ్లతోటకు చేరుకున్నాం. ఇద్దరు జీతగాళ్ళు మాకు ఎదురొచ్చారు. వాళ్ళను మా ఆధీనంలోకి తీసుకున్నాం. వాళ్ళిద్దరూ ముసలాయన బావమరుదులు అవుతారంట. వీళ్ళ అక్కగారిని ఆ ముసలాయన పెండ్లి చేసుకున్నారట. వీళ్ళిద్దరిలో ఒకరి వయసు పదహారు, ఇంకొకరికి ఇరవైఏళ్ళు ఉంటాయి. గజ్మాన్ మాకు కావల్సిన సరుకులు కొని బయల్దేరాడని కానీ మధ్యలోనే అతన్ని అరెస్టు చేసారని, అతను మా గురించిన సమాచారం అంతా చెప్పేసాడని, మేం అదుపులోకి తీసుకున్న కుర్రాళ్ళిద్దరూ చెప్పారు. ఇపిటాలో ప్రస్తుతం ముప్ఫైమంది సైనికులు గస్తీ

తిరుగుతున్నారన్న సమాచారం కూడా వీళ్ళే చెప్పారు. ఈ రోజుకి సీంపందిని నిప్పుల మీద కాల్చుకుని, వేయించిన పుచ్చకాయ ముక్కలతో కలిపి తిన్నాం. ఆ ప్రాంతంలో ఎక్కడా నీరు లేదు. ఇపిటా నుంచి చెక్క డ్రమ్ముల్లో నీరు ఇక్కడికి సరఫరా అవుతుంటుంది. ఆ రోజు రాత్రి నలుగురు ఇపిటా వైపుకు, ఇంకో నలుగురు పడమటి దిక్కుకేసి మిగతా వాళ్ళం ఆ కుర్రాళ్ళు ఇద్దరితో కలిసి అక్కడికి ఎనిమిది కిలోమీటర్ల దూరాన ఉన్న పండ్ల తోటకేసి బయల్దేరాం. తెలతెలవారుతుండగా మేం అక్కడికి చేరుకున్నాం.

ఎత్తు – 1100 మీటర్లు.

**మే 27**

రోజంతా విశ్రాంతి, కించిత్తు ఆందోళన. పంచభక్ష్య పరమాన్నాలు దొరుకుతాయని ఒట్టేసి చెప్పారు కానీ ఆ పాడుపడిన మిల్లులో పాత చెరుకు తప్ప ఏమీ లేవు. మేం ఊహించినట్లే పందుల కోసం బండిమీద నీళ్ళ డ్రమ్ములతో ఆ మిల్లు ముసలి యజమాని మిట్టమధ్యాహ్నం వేళకి వస్తూ కనిపించాడు. తేడాగా ఉందని గమనించినట్లు ఉన్నాడు మధ్యలోనే గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోతూ 'రియర్‌పార్టీ' చేతుల్లో బందీగా చిక్కాడు. అతనితో పాటు ఇంకో కూలీ కూడా ఉన్నాడు. సాయంత్రం ఆరు గంటల వరకూ వాళ్ళు మా అదుపులో ఉన్నారు. తరువాత వాళ్ళిద్దరితో పాటు అన్నదమ్ముల్లో చిన్నవాడిని కూడా విడిచి పెట్టాం. సోమవారం వరకూ దాపునే ఉండమనీ ఎవరు ఏం అడిగినా నోరు మెదపకూడదని హెచ్చరించాం. అక్కడ నుండి రెండు గంటలపాటు నడిచి మొక్కజొన్న తోటలో పడుకున్నాం ఆపూటకి. కారాగుయాట్రెండాకు వెళ్ళే దారి దొరికింది.

**మే 28**

ఆదివారం. పెందలాడే లేచి నడక సాగించాం. గంటన్నరలో కారాగుయాట్రెండా పొలిమేరల్లో ఉన్న పండ్లతోటల దగ్గరికి చేరుకున్నాం. బెనినో, కోకోలను చుట్టుపక్కల అంతా పరిశీలించి రమ్మని పంపాం. ఒక రైతు వాళ్ళని చూసాడు. దాంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అట్టే సమయం గడవక ముందే మేం అదుపులోకి తీసుకున్న వాళ్ళతో ఒక కాలనీనే ఏర్పడిపోయింది. అయితే వాళ్ళేం అంతగా బెదిరినట్లు కనబడలా. ఒక ముసలావిడ, ఆవిడ కొడుకులు మాత్రం కేకలు పెట్టారు. మేం గద్దించే సరికి నోరుమూసేసారు. పాచోకుగానీ పాబ్లోకుగానీ ఆవిడని ఆపతరం కాలేదు. లేచి తన పల్లెకేసి చక్కాపోయింది. మధ్యాహ్నం రెండు గంటలకు మేం ఆ పల్లెలో ప్రవేశించాం. ఆ ఊరి రెండు కొసలా తిష్టవేసాం. తరువాత కాసేపటికే ఆయిల్ కంపెనీ జీపు ఒకటి మా చేతికి చిక్కింది. నిమిషాల్లోనే రెండు జీపులు, రెండు ట్రక్కులు మా స్వాధీనంలోకి

వచ్చాయి. అందులో రెండు ప్రైవేటువి, రెండు ఆయిల్ కంపెనీవి. అంత తిని, కాసింత కాఫీ తాగాం. అర్ధనూటపదహారు వాదనలు జరిగాయి. చివరికి రాత్రి ఏడున్నరకి మేం ఇపిటాకిటో వైపు బయల్దేరాం. అక్కడ ఓ షాపులో చొరబడ్డాం. ఐదు వందల డాలర్ల విలువైన సరుకు ఎత్తేసాం. ఆ సరుకంతా ఇద్దరు రైతుల చేతులకి అప్పగించాం. జాగ్రత్తగా చూస్తుండమని, దీనికిగాను డబ్బు గిట్టుబాటు చేస్తాం అని వాగ్దానం చేసాం. ఆ పళాన ఊరిమీద పడి తిరిగాం. ఇటయి చేరుకున్నాం. అక్కడ ఒక మాస్టారుగారు మమ్మల్ని సాదరంగా ఆహ్వానించాడు. ఇపిటాకిటోలో మేం సరుకులు ఎత్తేసిన షాపు యజమాని కూడా ఆయనే అట. ధరవరల గురించి వాకబు చేసాం. నన్ను గుర్తు పట్టినట్లే ఉన్నాడు ఆయన. రొట్టె, వెన్న, కాసింత కాఫీ ఉంటే మాకే ఇచ్చేసారు. అయితే వాళ్ళు మమ్మల్ని అంత సాదరంగా ఆహ్వానించడంలోనే ఏదో తిరకాసు ఉందని అనిపించింది. శాంతాక్రజ్‌కు వెళ్ళేరైలు కట్ట వెంబడే పడి ఎస్పినోవైపు బయల్దేరాం. అయితే ఫోర్డు ట్రక్కు ముందరి పక్క ట్రాక్షను విరిగి పోయిన మూలాన కొన్ని మైళ్ళ దూరంలో ఉన్న ఎస్పినో చేరుకునే సరికి తెల్లారిపోయింది. అక్కడ నుండి మరో రెండు కిలోమీటర్లు వెళ్ళేసరికి ట్రక్కు ఇంజను ఢమాల్‌మంది. అడ్వాన్సు పార్టీ చిన్న జీపుల్లో మమ్మల్ని అందరినీ అద్దరికి చేర్చడానికి నాలుగు ట్రిప్పులు వెయ్యాల్సి వచ్చింది.

**మే 29**

ఎస్పినో సెటిల్మెంటు కాలనీ సాపేక్షంగా కొత్తది. పాత కాలనీ 58 వరదల్లో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. అక్కడ ఉండే జనాభా గుయారాని తెగవాళ్ళు. వచ్చిందే అరకొర స్పానిష్ భాష. దానికితోడు సిగ్గరులు. మాట్లాడేదే తక్కువ. దగ్గర్లో ఉన్న చమురు కంపెనీలో పనిచేస్తారు వాళ్ళంతా. అక్కడ ఇంకో ట్రక్కు దొరకబుచ్చుకున్నాం. మేం అందరివీ ఒకేసారి అందులో వెళ్ళే అవకాశం ఉన్న పెద్ద ట్రక్కు అది. కానీ రికార్డో ఆ ట్రక్కును ఓ బోదెలో దించేసాడు. ఎంతకీ బయటకు రాలా అది. అలా అదృష్టం మా చెయ్యి జారిపోయింది. అంతా నిశ్శబ్దంగా వేరే ప్రపంచంలో ఉన్నట్లుంది. దారి వెతుక్కురమ్మని కోకోను పంపించాం. అరకొరా సమాచారం, ఒకదానికొకటి పొంతన లేని విధంగా చెప్పుకొచ్చాడు. అంటే ప్రమాదకర ప్రయాణం ఆరంభించబోతున్నాం అన్న మాట. తను చెప్పిన దాని ప్రకారం మేం గ్రాండే నది దగ్గరకి వెళ్ళాలి. కాని చివరి నిమిషంలో దాన్ని రద్దు చేసుకున్నాం. నీరు పుష్కలంగా దొరికే ముఛిరి వైపు వెళ్ళడానికి నిర్ణయించుకున్నాం. నిర్మాణ సమస్యలు అలాంటివి. అలానే తెల్లవారు జాము మూడు ముప్పైకి అక్కడ నుండి బయల్దేరాం. అడ్వాన్సు పార్టీ జీపులో ఆరేడుగురిని ఎక్కించుకుని బయల్దేరింది. మిగతా వాళ్ళం కాలినడకన బయల్దేరాం.

ఎల్‌లోరో కామిరి నుండి తప్పించుకున్నట్లు రేడియోలో వార్తలు వచ్చాయి.

**మే 30**

తెల్లవారే సరికిరైలు కట్ట దగ్గరికి చేరుకున్నాం. మ్యాపులో చూసినట్లు అక్కడ నుండి ముఛిరికు వెళ్ళేదారి లేదు అక్కడ. వెతుకులాడితే రైల్వే క్రాసింగ్‌కు 500 మీటర్ల దూరంలో చమురు కార్మికుల కోసం వేసిన రోడ్డు ఒకటి తిన్నగా పోతూ కనిపించింది. అడ్వాన్సు పార్టీకి జీపులో వెళ్ళి ఆ రోడ్డు ఎటు పోతుందో చూసి రమ్మనమని పురమాయించా. ఆంటోనియో బయల్దేరు తుండగా ఒక కుర్రాడు, వెంట ఒక కుక్క తోను చేతిలో షాట్‌గన్‌తో కనిపించాడు. రైలు కట్ట వెంబడే పోతున్న ఆ కుర్రాడ్ని నిలవమని కేకేసాం. కాని అతను పారిపోయాడు. దాంతో ఆంటోనియోను రోడ్డు మొగదల మాటువెయ్యమని చెప్పా. అక్కడికి 500 మీటర్ల దూరంలో మేం కాపు వేసాం 11.45కి మిగ్యుయెల్ వెనక్కి తిరిగి వచ్చాడు. తూర్పు దిక్కుగా పన్నెండు కిలోమీటర్లు నడిచి వెళ్ళొచ్చాడు. తను దారిలో ఎక్కడా ఇళ్ళుగాని, నీటిజాడకాని లేదని చెప్పాడు. రోడ్డుమాత్రం ఉత్తరం దిక్కుకు పోతుందట. ఇంకో ముగ్గుర్ని తీసుకుని జీపులో బయల్దేరి ఉత్తరం దిక్కున మరో పది కిలోమీటర్లు పోయి చూసి చీకటి పడేలోగా తిరిగి రమ్మని పంపించాను. మధ్యాహ్నం మూడు గంటలకు నేను కమ్మటి నిద్రలో ఉండగా తుపాకి కాల్పుల మోతకు మెలకువ వచ్చింది. కాసేపటికి సమాచారం అందింది. సైన్యం మా అడ్వాన్సు పార్టీ ఉచ్చులో పడిందని – ముగ్గురు చనిపోగా ఒకరు గాయపడ్డారని ఆంటోనియో, ఆర్టురో, నాటో, లూయిస్, విల్లీ, రావుల్‌లు ఆ దాడిలో పాల్గొన్నారు. రావుల్ ఇంకా నీర్సంగానే ఉన్నాడు. మేం కాలినడకన బయల్దేరాం. క్రాసింగ్ దగ్గర నుండి పన్నెండు కిలోమీటర్లు నడిచాం. కాని మిగ్యుయెల్ జాడ కనబడలా. నీళ్ళు లేకపోవడంతో జీపు ఇంజను, రేడియేటరు పనిచేయట్లేదని సమాచారం అందింది మాకు. మరో మూడు కిలోమీటర్లు నడిచాక ఆగిపోయిన జీపు కనబడింది. నీళ్ళ ట్యాంకులో మేం అందరం పాసులు పోసాం. మాదగ్గర ఉన్న క్యానులో నీళ్ళూ పోసాం. ఇంజను పనిచేసింది. మొత్తానికి ఎట్లాగో జూలియో, పాబ్లోలు మా కోసం ఎదురుచూస్తున్న గమ్యానికి చేరుకున్నాం. తెల్లవారు జాము రెండు గంటలకల్లా అందరం అక్కడ కూడాం. మంట పెట్టాం. మూడు టర్కీ కోళ్ళు, కాసింత పంది మాంసం కాల్చుకు తిన్నాం. ఇంకో కోడిని మాత్రం మాతోనే అట్టే పెట్టుకున్నాం. నీటిచెలమల్లో ఎక్కడన్నా విషం అదీ కలిపారేమో తెలుసుకోవడానికి ఆ కోడి మాకు అక్కరకు వస్తుంది. 750 మీటర్ల ఎత్తు నుండి కిందకి దిగుతున్నాం. ప్రస్తుతానికి 650 మీటర్ల ఎత్తున ఉన్నాం.

**మే 31**

జీపు రేడియేటర్‌లో నీళ్ళు, మా మూత్రం పోసి నడిపిస్తా ఉన్నాం. ఇంతలో రెండు విషయాలు మా స్పీడుకు బ్రేకు వేసాయి. ఉత్తరం దిక్కుకు పోయే దారి అక్కడితో

అంతమైపోయింది. దాంతో మిగ్యుయెల్ దళం నడక చాలించింది. జంతువుల కోసం ఉచ్చులు పెట్టడానికని సైకిల్ మీద వచ్చిన మనిషి పక్క తోవలో సైన్యానికి చెందిన సెక్యూరిటీ గార్డులు తనని నిలేసారని చెప్పాడు. అతను రైతు మాదిరి ఉన్నాడు. పేరు గ్రెగోరియో వర్గీస్. అతన్ని నమ్మవచ్చో లేదో సరిగా అంచనా వెయ్యలేకపోయాం. కానైతే నీటి చెలమల గురించి సమాచారం ఇచ్చాడు. మాకు వెనుక పక్కగా ఒక చెలమ ఉన్నట్లు చెప్పాడు. అతను ముందుండి దోవ చూపిస్తాడు వెళ్ళి నీళ్ళు తీసుకురమ్మనమని కొందరిని పురమాయించాను. వాళ్ళు అక్కడికి చేరుకునే సమయానికి రెండు సైనిక ట్రక్కులు ఎదురయ్యాయి వాళ్ళకి. ఆలస్యం చెయ్యకుండా వాటిమీద దాడి చేసారు. ఇద్దరు సైనికులు చనిపోయారు. ఎల్‌నాటో పేల్చిన బొలియాంటీ – టాంక్ గ్రెనేడ్ లక్ష్యాన్ని 'మిస్' అయ్యింది. రెండో గ్రెనెడ్‌తో ట్రక్కులు రెండూ ఆమడదూరంలో పేలిపోయాయి. ఎల్‌నాటోకు ఏం గాయాలు కాలేదు కానీ అక్కడ నుండి ఎక్కడా ఆగకుండా పదిహేను కిలోమీటర్లు నడిచి ఓ నది చెలమదగ్గరకు చేరుకున్నారు. లేకుంటే సైనిక విమానాలు మమ్మల్ని చీకాకు పెట్టే అవకాశం ఉంది. మా దగ్గర ఉన్న జీపు ఆఖరి ఊపిరి వొదిలేసింది. పెట్రోలు నిండుకుంది. రేడియేటర్ విపరీతంగా వేడెక్కిపోయింది. ఆ రోజు రాత్రి అంతా సుబ్బరంగా తింటూ గడిపేసాం. రేడియోలో సైన్యం ఒక బులెటిన్ ప్రసారం చేసింది. ఒక సెకండ్ లెఫ్టినెంట్, ఒక సైనికుడు చనిపోయినట్లు మా దళంలో కూడా కొంత మంది హతమైపోవడం కళ్ళారా చూసినట్లు వార్తలు ప్రసారం చేసింది. రేపు రైలు పట్టాలు దాటి కొండల దిక్కుగా పోవాలని నిర్ణయించాం.

ఎత్తు – 620 మీటర్లు.

**నెలసరి సమీక్ష**

ప్రతికూల అంశం ఏమిటంటే కొండల వెంబడి పడి ఇంతగా తిరుగుతున్నా జోయాక్విన్‌తో ఇప్పటి వరకూ 'కాంటాక్టు ఏర్పడలేదు. అతను ఉత్తరదిక్కుకేసి వెళ్ళిన ఆనవాళ్ళు ఉన్నాయి.

సైనిక పరంగా చూస్తే – జరిగిన మూడు దాడుల్లోనూ సైన్యం నష్టపోయింది. మా వైపున ఎటువంటి నష్టమూ వాటిల్లలేదు. పిరిరెండా, కారా గుయాట్రెండాలలోకి మా చొరబాటు విజయమే. మమ్మల్ని పసిగట్టడంలో వేట కుక్కలు విఫలమైనందున సైన్యం ఇక వాటి జోలి వదిలేసింది.

**ముఖ్యమైన అంచనాలు ఇవీ :**

1. మనీలా, లాపాజ్, జోయాక్విన్‌లతో కాంటాక్టు ఏర్పడక పోవడంతో మా దళం సైజు పాతిక మందికి కుదించుకుపోయింది.
2. ఇప్పటిదాకా రైతులు ఎవరినీ మాలో చేర్చుకోలేక పోయాం. వారిలో మా పట్ల ఉన్న భయం తొలగిపోతా ఉంది. గెరిల్లా దళం మీద అభిమానం చూపిస్తున్నారు. ఓపికగా, నిదానంగా వాళ్ళను గెలుచుకోవాలి.
3. ఎటువంటి అభ్యంతరాలు లేకుండా పార్టీ మాతో చేతులు కలిపేందుకు సిద్ధంగా ఉందని 'కొల్లే' ద్వారా కబురు పంపింది.
4. పది మెరుపు దాడులు మూలంగా లభించే పేరు ప్రఖ్యాతుల కన్నా ఎక్కువగా మా గెరిల్లా దళానికి డెబ్రే కేసు మూలంగా ఒనగూడింది.
5. గెరిల్లా యోధుల నైతిక స్థైర్యం ఇనుమడించింది. కచ్చితంగా విజయం సాధించి తీరుతాం అనే విశ్వాసం కలిగింది వారిలో.
6. సైన్యం ఇంకా సంఘటిత పడలేదు. ఎత్తుగడల్లోనూ బలహీనంగా ఉంది.

ఈ నెల విశేషవార్త: బందీగా చిక్కిన ఎల్‌లోరో తప్పించుకుపోవడం. అయితే మాతో కలవడం లేకుంటే లాపాజ్‌కు చేరి 'కాంటాక్టు' ఏర్పరుచుకోవడం – ఏదో ఒకటి చేస్తాడు తను.

మాసిక్యురి ప్రాంతంలో మాకు సహకరించిన రైతులు అందరినీ అదుపులోకి తీసుకున్నట్లు సైన్యం వార్తలు ప్రసారం చేసింది. అంటే ఇప్పుడు రైతుల మీద ఇరుపక్షాల నుండీ ఒత్తిడి పెరుగుతుంది. అయితే మా వైపు నుండి ఉండే ఒత్తిడి సైనిక బల ప్రయోగం కన్నా, నిర్బంధం కన్నా భిన్నమైంది. మా ఒత్తిడి ఫలిస్తే రైతులలో మేం ఆశించిన గుణాత్మక మార్పు వస్తుంది.

# జూన్ 1967

**జూన్ 1**

రోడ్డు మీద కాపు కాయడానికి 'అడ్వాన్సు పార్టీ'ని పంపించాను. అక్కడ నుండి చమురు క్షేత్రాలకు వెళ్ళే దారిలో మూడు కిలోమీటర్ల దాకా పహారా కాయమని చెప్పా. వాతావరణం అనుకూలించ నందున వాయు సైన్యం కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఇంతకు ముందు రేడియోలో వార్తలు వచ్చాయి. దాన్ని నిజం చేస్తూ సైనిక విమానాలు మేం ఉన్న ప్రాంతంలో చెక్కర్లు కొడుతూ కనిపించాయి ఈ రోజున. ఇద్దరు సైనికులు మరణించినట్లు, ముగ్గురు గాయపడినట్లూ రేడియోలో ఆసక్తికరమైన వార్త వెలువడింది. అది చద్ది వార్తా లేక తాజా నష్టమా అనేది మాకు అర్థం కాలేదు. కడుపుకు ఇంత తిన్నాక తెల్లారగట్ట ఐదుగంటలకు అక్కడ నుండి రైలు కట్ట కేసి బయల్దేరాం. ఏ ఇబ్బందీ లేకుండా ఏడెనిమిది కిలోమీటర్లు నడిచాం. గంటన్నర పట్టింది. రైలు కట్ట చేరుకుని అక్కడ నుండి మూసుకుపోయిన, వాడకంలో లేని ఒక తోవగుండా బయల్దేరాం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చాకోకు చేరడానికి. కానీ అందరం అలిసిపోయి ఉన్నాం. అక్కడే కాసేపు పడుకున్నాం. దూరం నుండి తుపాకి మోత వినిపించింది.

ఎత్తు – 800 మీటర్లు.

**జూన్ 2**

గ్రెగొరియో ఊహించి చెప్పిన దారి గుండా ఏడు కిలోమీటర్లు నడిచి చాకో చేరుకున్నాం. బలిసిన సీంపంది మాకంట పడింది. దాన్ని చంపేసాం కాల్చుకు తినడానికి. ఇంతలో బ్రౌవులియో రాబ్లెస్ అనే పశువులకాపరి, అతని కొడుకు, ఇద్దరు

కూలీల సహా మా కంటబడ్డారు. ఆ కూలీల్లో ఒకతను కోతమిల్లు యజమాని సైమురి మారుటి కొడుకు అట. వాళ్ళు ఎక్కివచ్చిన గుర్రాలమీద అంతకుముందు మేం చంపి పడేసిన సీంపందిని వేసుకుని దాపునున్న ఏటి ఒడ్డుకు చేరుకున్నాం. అపరిచితులు నలుగురిన్నీ మా అదుపులో ఉంచుకున్నాం. గ్రెగోరియా కనబడకుండా పోయాడు. ఎటెళ్ళిందీ తెలీలేదు. మార్గమధ్యంలో ఉండగా ఒక సైనికట్రక్కు ఇద్దరు సైనికులతో, ట్రక్కునిండా బ్యారెళ్ళతో అటుగా వెళ్తు మా కంటపడింది. సునాయాసంగా దాన్ని పడగొట్టేసే వాళ్ళం. కానీ మా దృష్టి అంతా సీంపందితో చేసుకోబోయే విందు మీదే ఉంది. రాత్రి పొద్దు పోయేవరకు వంటలతోనే సరిపోయింది. తెల్లవారుజామున మూడున్నరకి మా ఆధీనంలో ఉన్న నలుగురు రైతులను విడిచిపెట్టాం. రోజు సంపాదన కింద వాళ్ళ చేతుల్లో తలా పది డాలర్లు పెట్టాం. గ్రెగోరియా మాతో కల్సి విందు ఆరగించేవరకూఉన్నాడు. అతను చేసిన పనికి గాను వంద డాలర్లు నజరానా ఇచ్చాం. అది తీసుకుని వెళ్ళిపోయాడు అతను. చెలమలో నీరు మహా ఉప్పగా ఉంది.

ఎత్తు – 800 మీటర్లు.

**జూన్ 3**

తెల్లవారుజాము ఆరున్నరకి బయల్దేరాం. ఏటి ఎడమ ఒడ్డునపడి మధ్యాహ్నం వరకూ నడిచాం. 'ఆంబుష్' కు తగిన స్థలం చూసి రమ్మనమని బెనినో, రికార్డోలను పంపించాం. ఒంటిగంటకు మేమంతా 'పొజిషన్'లు తీసుకున్నాం. రికార్డో, నేనూ చెరో దళంతో సెంటర్ పొజిషన్‌లో, పోంబో దళం కొసన, మిగ్యుయెల్ అడ్వాన్సు పార్టీ పొజిషన్‌లో ఉన్నాం. రెండున్నరకి ఒక ట్రక్కు నిండా పందులతో అటుగా వచ్చింది. దాన్ని వదిలిపెట్టాం. నాలుగు ఇరవైకి ఖాళీ సీసాల్తో ఇంకో లారీ అటుగా వచ్చింది. ఐదుగంటలకి నిన్నటి మాదిరే ఒక సైనిక ట్రక్కు వచ్చింది. ట్రక్కు బాడీలో ఇద్దరు యువసైనికులు దుప్పట్లు కప్పుకుని పడుకుని ఉన్నారు. ఎందుకో వాళ్ళను కాల్చడానికి నాకు మనసు రాలేదు. ఆ ట్రక్కును నిలవరించమని చెప్పాలనే జ్ఞాతి కూడా లేదు. దాన్నీ పోనిచ్చాం. సాయంత్రం ఆరుగంటలకు మెరుపుదాడి ప్రయత్నాలను కట్టిపెట్టి వచ్చిన దోవనే వెనుతిరిగి నీటి మడుగు దగ్గరకు వచ్చాం. నాలుగు లారీలు వరుసగా ఒకసారి, మూడు లారీలు వరసగా ఇంకోసారీ అటుగా వెళ్ళాయి. బహుశా ఖాళీ లారీలయి ఉంటాయి. సైనికుల జాడ లేదు వాటిల్లో.

**జూన్ 4**

నీటి మడగు ఒడ్డునే నడక సాగించాం. పరిస్థితులు అనుకూలిస్తే ఎక్కడో ఒక చోట 'ఆంబుష్' చేద్దారనే ఆలోచన. ఇంతలో పడమటి దిక్కుకు పోయే తోవ తగిలింది. ఆ దారి వెంబడిపోయాం. ఎండిపోయిన నదిగుండా దక్షిణం ఒంపుకి తిరిగి పోతా ఉంది ఆ దారి. రెండు నలభై ఐదుకి అందుబాటులోఉన్నా బురదనీటితోనే కాఫీ, బార్లీజావా కాసుకు తాగాం. చాలా టైం పట్టేసింది. అందుకే అక్కడే మకాం వేద్దాం అని నిర్ణయించుకున్నాం. రాత్రిపూట బలమైన దక్షిణపు గాలులు వీచాయి. సన్నటి తుంపరతో వాన మొదలైంది. రాత్రంతా అలా జల్లుకురుస్తానే ఉంది.

**జూన్ 5**

అక్కడ నుండి మకాం ఎత్తేసాం. జల్లులు ఇంకా కురుస్తా ఉన్న మూలాని దాపునున్న పొదల్లోకి చొరబడ్డాం. సాయంత్రం ఐదింటి వరకు నడుస్తానే ఉన్నాం. కొండవాలుల మీద పెరిగిన తుప్పలు నరుక్కుంటూ పోవడానికే రెండున్నర గంటలు పట్టింది. చలిమంట వేసుకున్నాం. దేవుడు కనిపించాడు మాకు ఆ వెచ్చదనానికి. పొద్దున్నంతా ఏం తిన్లేదు. ఫ్లాస్కుల్లో ఉన్న ఉప్పు నీరు మరుసటి రోజు అల్పాహారానికని అట్టే పెట్టుకున్నాం.

**జూన్ 6**

తలాకాస్త టిఫిన్ తిన్నాం. మిగ్యుయెల్, బెనినో, పాబ్లితోలు ముగ్గురూ దార్లు వెతకడానికి వెళ్ళారు. మధ్యాహ్నం రెండు గంటలకి పాబ్లో వెనక్కి తిరిగి వచ్చాడు. పాడు పడిన పండ్లతోట ఒకటి, పశువుల సహా, దగ్గర్లో ఉందన్న విషయం మా చెవిన వేసాడు. అందరం అటుకేసి నడక సాగించాం. ఏటి ఒడ్డు వెంబడే సాగింది మా ప్రయాణం. ఆ తోట దాటాక గ్రాండేనది ఎదురయింది. దగ్గర్లో పెదగా ఏదన్నా ఇల్లు ఉంటే చూసి రమ్మనమని కొంతమందికి పురమాయించాం. తొలీగా మాకు అందిన సమాచారం ప్రకారం మేము 'ప్యూయెర్టో కమాచో'కు మూడుకిలోమీటర్ల దూరంలో ఉన్నాం. అక్కడ దాదాపు యాభై మంది సైనికులు ఉన్నారట. కాలి నడకన అక్కడికి చేరుకోవచ్చు. ఆ రోజు రాత్రికి పంది మాంసం, బియ్యం గంజిలో ఆలుగడ్డలు ఉడికించి కలుపుకు తిన్నాం. ఆశించిన రీతిలో ముందుకు ప్రయాణించలేకపోయాం. డస్సిపోయి ఉన్నాం. దానికి తోడు పట్టపగలయిపోయింది.

**జూన్ 7**

నిదానంగా సాగింది మా ప్రయాణం. పశువుల మేతకోసం గడ్డి పెంచే పడావు భూములు ఒకటొకటిగా దాటేసాం. మాకు గైడ్‌గా మాతోపాటు ఉన్న మిల్లు యజమాని కొడుకు 'ఇక్కడితో భూములు సరి' అన్నాడు. నది ఒడ్డున ఉన్న ఇసుకలో నడుస్తూ పోగా పోగా ఒక పండ్లతోట ఎదురయింది. చెరుకు, అరటిచెట్లు, చిక్కుళ్ళ పొదలతో నిండి ఉన్న ఆ తోట ఊసు ఎత్తలేదు మా 'గైడ్'. ఆ తోటలో మకాం వేసాం. పిల్ల 'గైడ్' ఒహటే కడుపు నొప్పని సతాయించసాగాడు. నిజమో కాదో మాకు తెలీదు.

ఎత్తు – 560 మీటర్లు.

**జూన్ 8**

మేం మా మకాం మరో 300 మీటర్ల ఎగువకి మార్చాం. అక్కడ నుండయితే అటు తోటమీద, ఇటు నది ఒడ్డున ఉన్న ఒడ్డున ఉన్న ఇసుక పర్రల మీద ఒకేసారి నిఘావేసిఉండొచ్చు. ఆ తోట యజమాని అక్కడకు రావడానికి ఎలాంటి దారీ వేసుకోలేదు. పంటు మీద నది దాటి వస్తూ పోతూ ఉంటాడని తరువాత తెలిసింది మాకు. నిటారు కొండ చుట్టు తిరిగి ఆటునుండి ఏమన్నా రాస్తా ఉందేమో చూసి వస్తామని బెనినో, పాబ్లో, అర్బానో లియోన్‌లు వెళ్ళారు.

మధ్యాహ్నానికి తిరిగివచ్చి లాభంలేదని చెప్పారు. అర్బానో చేతివాటం గురించి మరో సారి హెచ్చరించాల్సి వచ్చింది. మరుసటి రోజున ఒక టెంటు తయారు చేసుకోవాలని నిర్ణయించుకున్నాం.

గెరిల్లా దిగ్బంధనాని కోసం ప్రయత్నిస్తున్నట్లు, గనుల యజమానులు బెదిరింపులకు దిగుతున్నట్లు వార్తల్లో చెప్పుకొచ్చారు అవన్నీ అర్థరహితమైనవే.

**జూన్ 11**

రోజంతా నిశ్శబ్దంగా గడిచింది. మేం 'ఆంబుష్'ను కొనసాగించాం. కానీ సైన్యం అడుగు ముందుకు వెయ్యలేదు. కాకపోతే ఒక తేలిక పాటి విమానం మేం ఉన్న ప్రాంతంలో చెక్కర్లు కొట్టిపోయింది. బహుశా రోసిటా దగ్గర వాళ్ళూ మా కోసం కాపు కాస్తూ ఉండొచ్చు. పర్వత పాదం దగ్గర దారికోసం మొదలయిన వెదుకులాట పర్వతాగ్రానికి చేరుకుంది. రేపు ఎలానూ మేం ఇక్కడ నుండి బయటపడాల్సిందే. ఐదారురోజులకు సరిపడా ఆహారం ఉంది మా దగ్గర.

**జూన్ 12**

రోసిటాకు గానీ, లేదూ మళ్ళీ గ్రాండే నది దగ్గరకు గానీ చేరుకుంటామనే సూత్రప్రాయ అంచనాతో మేం మా ప్రయాణం ఆరంభించాం. దారిలో ఒక నీటి చెలమ దగ్గరకు చేరుకునే సరికి పరిస్థితులు క్లిష్టంగా మారాయి. మేం అక్కడే ఆగిపోయాం. తగిన సమాచారం కోసం ఎదురు చూస్తూ ఉన్నాం. దగ్గర్లో ఇంతకన్నా పెద్ద నీటి చెలమ ఉందని మధ్యాహ్నం మూడు గంటలకు తెలిసింది. కాని ఇప్పుడు కిందకి దిగడం అసాధ్యం. ఇక్కడనే ఉండాలని నిర్ణయించుకున్నాం. వాతావరణం దుర్భరంగా మారింది. బలమైన దక్షిణగాలుల మూలంగా రాత్రి అంతా చలి, వానలతో గడిచింది. రేడియోలో ఆసక్తికరమైన సమాచారం వెలువడింది. 'ప్రెసెన్సియా' అనే దినపత్రిక శనివారం నాడు జరిగిన ఘర్షణలో సైన్యంలో ఒకరు మృతి చెందినట్లు ఇంకొకరు గాయాల పాలయినట్లు ప్రచురించింది. మంచిదయింది. మొత్తానికి మేం దాడికి దిగిన ప్రతిసారీ సైన్యం నష్టపోతూనే ఉంది. ఇంకొక ప్రకటనలో గెరిల్లా ప్రధాన నాయకుడు ఇంతి సహా మొత్తం ముగ్గురు మరణించినట్లు వార్త వెలువరించారు. గెరిల్లా దళంలో పదిహేడు మంది క్యూబన్లు, పధ్నాలుగు మంది బ్రెజిలియన్లు, నలుగురు అర్జెంటీనా వాసులు, ముగ్గురు పెరూవియన్ దేశస్తులు ఉన్నట్లు సైన్యం ప్రకటించింది. క్యూబన్, పెరూవియన్‌ల సంఖ్య కచ్చితంగానే చెప్పారు. ఈ సమాచారం వాళ్ళకు ఎలా చేరిందో ఆరా తియ్యాలి.

ఎత్తు – 900 మీటర్లు.

**జూన్ 13**

ఒక గంటసేపే ప్రయాణించాం. అదీ దగ్గర్లో ఉన్నా నీటి మడుగు వరకే. అక్కడనుండి రోసిటాకు గాని గ్రాండే నదివైపుకు గానీ వెళ్ళే మార్గం ఇంకా తెలియరాలేదు. మహా చల్లగా ఉందీ రోజున, బహుశా రేపటికి ఏదన్నా దారి దొరకవచ్చు. మా దగ్గర ఇంకో ఐదు రోజులకు సరిపడే ఆహారం ఉంది.

ఆసక్తికరంగా దేశంలో రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. ఆకర్షణీయమైన స్థాయిలో ఒప్పందాలు, ప్రతి–ఒప్పందాలు జరుగుతున్నట్లు ప్రచారం షికారు చేస్తూ ఉంది. గెరిల్లా ఆందోళన తరచూ ఇలాంటి ఘటనలకు ఉత్ప్రేరకంగా నిలుస్తుంది కామోసు.

ఎత్తు – 840 మీటర్లు.

**జూన్ 14**

**సెలీటా**

పగలంతా నీటి మడుగుదాపునే నెగడు ముందు గడిపేసాం. దారులు వెతుక్కురావడానికి వెళ్ళిన మిగ్యుయెల్, అర్బానోలు ఏం కబురు తెస్తారో అని ఎదురు చూస్తూ ఉన్నాం. మధ్యాహ్నం మూడు గంటలకు ఇక్కడ నుండి బయల్దేరాలని ముందుగా నిర్ణయించాం. కానీ ఆ లోగా వెళ్ళిన వాళ్ళు తిరిగి రాలేదు. ఆలస్యంగా వచ్చిన ఆర్బానో ఏటి దగ్గర నుండి దారొకటి ఉంది, బహూశా అక్కడ నుండి గ్రాండేనదికి వెళ్ళవచ్చేమో అన్న వార్త చెప్పారు. ఈ రోజుకి ఇక్కడే గడపాలనుకున్నాం. మా దగ్గర పల్లీలు, ఉడకబెట్టిన మొక్కజొన్న కండెలు మూడు మిగిలాయి.

నాకు ఇప్పుడు 39 ఏళ్ళు. కాలం ధృతవేగంతో గడిపోతుంది. గెరిల్లా యోధుడిగా నా భవిష్యత్తు ఏంటి అనేది పునరాలోచించాలి. ప్రస్తుతానికి నేనే 'ఆల్ ఇన్ ఒన్'.

**జూన్15**

గ్రాండే నది దగ్గరకు చేరుకోవడానికి కాస్త అటూఇటూగా మూడుగంటలు పట్టింది. నికోలాస్ అనే రైతు చెప్పినదాన్ని బట్టి అక్కడనుండి రోసిటా మూడు కిలోమీటర్లు దూరంలో ఉండాలి. కనీసం రెండు గంటల ప్రయాణ దూరం ఉండొచ్చని నా అంచనా. ఆ సమాచారం చెప్పినందుకుగాను ఆ రైతుకు మేం 150పెసోలు ఇచ్చి అవి జేబీలో వేసుకొని మేం వెళ్ళమన్నదే తడవుగా రాకెట్ వేగంతో అక్కడి నుండి అదృశ్యమైపోయాడు. మేం వచ్చిన చోటనే మకాం వేసాం. నది దాటుకుని వెళ్ళే అవకాశం ఉందేమో చూసివస్తానని అనీసెటో వెళ్ళాడు. పల్లీలతో సూపు కాసుకుని తాగాం. మరో మూడు రోజులకు సరిపడా ఉడకేసిన మొక్కజొన్నలు ఉన్నాయి.

ఎత్తు - 610 మీటర్లు

**జూన్16**

ఓ కిలోమీటరు దూరం నడిచాం. అడ్వాన్సు పార్టీలో వాళ్ళు కొంతమంది నది ఆవలి ఒడ్డున కనిపించారు. మేము మొలలోతు చల్లటి నీళ్ళలో, ప్రవాహవేగంలో కూడా ఎటువంటి ప్రమాదం లేకుండా మొత్తానికి నది అవలి ఒడ్డుకేసి చేరుకున్నాం. పాచో మాత్రం పై దాకా వెళ్ళి నీళ్ళు లేని చోటు వెతికి మరీ తడవకుండా ఆవలిగట్టు చేరాడు. ఇంకో గంటలో మేం రోసిటా చేరుకున్నాం. పాత అడుగు జాడలు ఉన్నాయి అక్కడ.

బహూశా సైన్యానివి కావచ్చు. రోసిటా మేం అనుకున్న దానికన్నా లోతుగా ఉంది. మేం మ్యాపులో గుర్తించిన తోవ తాలుకు ఆనవాళ్ళు కనిపించలేదు. మంచులా చల్లగా ఉన్న నీళ్ళలో ఒక గంట ప్రయాణించాం. చివరకు ఒక చోట విడిది చెయ్యాలనుకున్నాం. నంజుకు తేనె ఉంటే బావుండు అనిపించింది. అంతకు ముందు మిగ్యుయెల్ అక్కడెక్కడో తేనె పట్టు చూసిన గుర్తుందని చెప్పాడు. దాని కోసం వెతుకులాడాం. కానీ లాభం లేకపోయింది. ఉడకేసిన మొక్కజొన్నలు తిన్నాం. ఇంకో రెండు రోజులకు సరిపడా ఆహారం ఉంది. రోసిటా వెంబడి మూడుకిలోమీటర్లు, గ్రాండేనది ఒడ్డువెంబడి మరో మూడు కిలోమీటర్లు నడిచాం.

ఎత్తు – 610 మీటర్లు.

**జూన్ 17**

రోసిటా వెంబడి ఐదున్నర గంటల పాటు ఒక పదిహేను కిలోమీటర్లు నడిచాం. దార్లో నాలుగు వాగులు కనబడ్డాయి. కానీ మ్యాప్‌లో అబాపోకిటా దగ్గర ఉన్న వాగు మాత్రమే పేర్కొనబడి ఉంది. చాలా మంది అటు ఇటు ప్రయాణించిన అడుగుజాడలు కనిపించాయి. రికార్డో ఒక ఉడుమును చంపాడు. దాన్ని వండుకుని ఉడకపెట్టిన జొన్నలతో కలిపి ఆ రోజుకి భోజనం అయిందనిపించాం. మరుసటి రోజుకు కాసిన్ని జొన్నలు ఉన్నాయి. బహుశా ఈ లోపు మాకు ఏదన్నా ఇల్లు ఎదురవుతుందేమో.

**జూన్ 18**

కడుపులో మంటలు చల్లార్చుకోవడానికి ఉదయాన్నే మా దగ్గర మిగిలి ఉన్న ఉడకబెట్టిన జొన్న కండెలు తినేసాం. రెండున్నర గంటల నడక తరువాత ఉదయం పదకొండు గంటలకు జొన్నపంట, చెరకు వేసిన పొలం దగ్గరికి వచ్చాం. అక్కడ పిండిమిల్లుకూడా ఉంది. వంట చేసుకు తిన్నాం. దారులు వెతుక్కురావడానికి బెనినో, పాబ్లితోలను పంపించాం. రెండు గంటల తరువాత పాబ్లితో వెనక్కివచ్చాడు. ఐదువందల మీటర్ల దూరంలో ఒక రైతు స్థలం కనిపించిందనీ, ఇంకాస్త అవతల మరికొంత మంది మెసులుతా ఉన్నారని, వాళ్ళందరినీ అదుపులోకి తీసుకున్నట్లు చెప్పాడు. రాత్రికి మేం అక్కడ నుండి మకాం మార్చేసాం. ఏడు లీగుల అవతల అబావో నుండి వచ్చే దారి కలిసే రోడ్డు మొదట ఉన్న పిల్లవాడి తోటలో విశ్రమించాం. మాస్కెరా, ఓస్కురాల నడిమ ఉన్న ఇసుక దీవుల మధ్యన తమవాళ్ళ ఇళ్ళు ఉన్నట్లు మా అదుపులో ఉన్న రైతులు చెప్పారు. అంటే సుమారు పది పదిహేను కిలోమీటర్ల దూరం.

**జూన్ 19**

మా ప్రయాణం ఈడికగా సాగింది. సుమారు పన్నెండు కిలోమీటర్లు నడిచి మూడిళ్ళు, చాలా కుటుంబాలు ఉన్న ఒక పల్లె చేరుకున్నాం. ఇంకో రెండు కిలోమీటర్ల దిగువన గాల్వైజ్ కుటుంబం నివసిస్తుంది. వాళ్ళతో మాటకలపడం బ్రహ్మప్రళయం అయిపోయింది. మచ్చిక జంతువుల మాదిరి అనిపించారు. మమ్మల్ని సాదరంగానే ఆహ్వానించారు కానీ అంతకు ముందు అటుగా వెళ్ళిన సైన్యం ఆ పల్లెకు మేయరువని ఎగసనదోసిన కాలిక్స్టో మాత్రం అంటీముట్టనట్లు, అయిష్టంతో వ్యవహరించాడు. చిన్న చిన్న వస్తువులు అమ్మమని అడిగాం. మొహం గంటు పెట్టుకున్నాడు. రాత్రికి ముగ్గురు పందుల వ్యాపారులు, రివాల్వర్‌లు, తపంచాలతో వచ్చారు. అడ్వాన్సు పార్టీ సెంట్రీని ఎలాగోదాటుకొచ్చారు. వాళ్ళను ఆరా తీసిన ఇంతి ఎందుకో వాళ్ళ దగ్గర ఆయుధాలు స్వాధీనం చేసుకోలేదు. వాళ్ళకు కాపలాగా వచ్చిన రికార్డో కూడా అతి జాగ్రత్తతో ఆ పని చేయలేదు. వచ్చిన మనుషులను తాను ఎరుగుదునని కాలిక్స్టో హామీ ఇచ్చాడు. పోస్ట్రర్‌వాలె నుండి వచ్చిన మారుబేరగాళ్ళని చెప్పాడు.

రోసిటాకు ఎడమగట్టునుండి సుస్పిరో అనే ఇంకో నది వచ్చి కలుస్తుంది. కానీ ఆ నది వెంబడి ఎవరూ జీవిస్తున్న దాఖలా లేదు.

ఎత్తు – 680 మీటర్లు.

**జూన్ 20**

తోట దగ్గరనుండి మాతో వచ్చిన కుర్రాళ్ళలోని పౌలీనో అనే అతను వచ్చిన ముగ్గురూ మారు బేరగాళ్ళు కాదన్న విషయం మా చెవిన వేసాడు. అందులో ఒకతను లెఫ్టినెంట్ అని మిగతా ఇద్దరూ ఎవరో తెలీదు కానీ ఖచ్చితంగా బేరగాళ్ళు కాదని చెప్పాడు. కాలిక్స్టో కూతురే ఈ విషయం తనతో స్వయంగా చెప్పిందని, ఆ అమ్మాయి తనకు కాబోయే భార్యని అన్నాడు. ఇంతి ఇంకొంత మంది దళసభ్యులను తోడు తీసుకొని వాళ్ళందరినీ బయటకు రమ్మనమని గదమాయించాడు. తొమ్మిది గంటలవరకూ ఫలితం లేకపోయింది. రాకపోతే అందరినీ కాల్చేస్తాం అని హెచ్చరించాడు. దాంతో ఆ ఆఫీసరు ఏడ్చుకుంటూ బయటికి వచ్చాడు. అతను పోలీసు లెఫ్టినెంటు, వెంట వచ్చింది ఒకరు సార్జెంటు ఇంకొకరు టీచరు. టీచరు ఐచ్ఛికంగా వాళ్ళతో వచ్చినట్లు చెప్పాడు. దగ్గర్లో ఉన్న పట్టణంలో 60 మంది సైనికులతో తిష్ట వేసిన ఒక కల్నల్ వాళ్ళను పంపినట్లు చెప్పారు. నాలుగు రోజుల పాటు నడకదారిన అస్కురాకు వెళ్ళేదారిసహా అన్ని చోట్లా వెతుకులాడేపని అప్ప చెప్పారట వాళ్ళకి. ముగ్గురినీ ఖతం

చేసేద్దాం అనుకున్నాం మొదట. కాని యుద్ధ నియమాలను గౌరవించి వాళ్ళు ముగ్గురుకీ గట్టి 'వార్నింగ్' ఇచ్చి వెనక్కి పంపేసాం. గస్తీ దాటుకుని వాళ్ళు ఇక్కడి దాకా ఎలా రాగలిగారా అని ఆరా తీసా. అనీసెటో తన పొజిషన్ వదిలేసి జూలియోను పిలుచుకు రావడానికి వెళ్ళడం, దానికి తోడు గస్తీ కాసే సమయంలో లూయిస్, అనీసెటోలు నిద్రపోవడంతో ఆ ముగ్గురుకీ వెసులుబాటు దక్కిందని తేలింది. డ్యూటీలో ప్రదర్శించిన నిర్లక్ష్యానికి శిక్షగా వాళ్ళకు ఏడు రోజుల పాటు వంటపని అప్పచెప్పాం. తిండిలో వేపుడు కూరలు నిషేధించాం. బందీలుగా చిక్కిన ముగ్గురూ నిలువు దోపిడి సమర్పించుకుని అక్కడ నుండి జారుకున్నారు.

**జూన్ 21**

రెండు రోజులు వరసగా పిప్పిపళ్ళు పీకడమే పని. దాంతో నాకు ఫెర్నాండో ఉరఫ్ పళ్ళడాక్టరు అని పేరు పెట్టారు. ఆ రోజుతో నా దంతవైద్యాన్ని కట్టిపెట్టా. మధ్యాహ్నం నుంచి బయల్దేరాం. ఒక గంటనడిచాం. ఈ యుద్ధంలో తొలిసారిగా నేను కంచరగాడిద ఎక్కాను. బందీలు ముగ్గురినీ మాస్కోరా దారి వెంబడే ఒక గంటపాటు నడిపించి వాళ్ళ చేతికి ఉన్న వాచీలు, కాళ్ళకు ఉన్న రైతు జోళ్ళు సహా అన్నీ ఒలిచి పంపించేసాం. పౌలీనోతో పాటు 'మేయరు'గారిని కూడా మాతో కూడా తీసుకెళ్దాం. గైడ్‌గా పనికొస్తాడు అనుకున్నాం. కాని అతను అనారోగ్యంతోఉన్నానని చెప్పాడు. నిజమో, నాటకమో మాకు తెలీదు. ఘాటుగా హెచ్చరించి వదిలేశాం. అవి అతని మీదపని చేస్తాయనే నమ్మకంలేదు మాకు. నేనిచ్చే సందేశంతో కోచబాంబా వెళ్తానని పౌలీనో ఒట్టేసి చెప్పాడు. ఇంతి భార్య పేరిట ఒక ఉత్తరం–అదీ కోడ్ భాషలో మనీలాకు చేరేలా–ఇద్దామనుకున్నాం. దాంతో పాటేనాలుగు ప్రకటనలు పంపించాలనుకున్నాం. నాలుగో ప్రకటనలో మా గెరిల్లా దళ సభ్యుల జాతీయతకు సంబంధించి, ఇంతి మరణానికి సంబంధించిన అబద్ధాలను ఖండిస్తూ వివరాలు పొందుపరిచాం. అది (.....) మేం నగరంతో సంబంధాలు నెలకొల్పుకోవాలి. పౌలీనో మాతో పాటు ఖైదీగా వస్తానన్నాడు.

ఎత్తు – 750 మీటర్లు

**జూన్ 22**

మూడు గంటలు నడిచాం. హుషారుగా సాగింది ప్రయాణం. సూర్యా నదిని దాటి పాసియోనెస్ అనే నీటిమడుగు దగ్గరికి చేరుకున్నాం. మ్యాపు తీసి పరిశీలించాం.

ఫ్లోరిడా వెళ్ళాలన్నా, మొదట మేం చూసిన ఇళ్ళ దగ్గరకు పిరేకు చేరాలన్నా ఆరు లీగుల దూరం నడవాలి. పొలినో బావగారు అక్కడ నివసిస్తున్నారు గానీ అక్కడికి పోయె దారి తెలీదని చెప్పాడు. మా ప్రయాణం కొనసాగించాలని నిర్ణయం చేసాం. వెన్నెల అదునుగా ఉంది. కానీ రెండు దళాలుగా చెరో వైపుకి వెళ్ళడమంటే మధ్యన దూరం పెరిగిపోతుంది, మంచిది కాదనిపించింది.

ఎత్తు – 950 మీటర్లు

**జూన్ 23**

నడిచింది ఒక గంటే. ఎక్కడో తోవ తప్పాం. తెల్లవారు జామునుండి మిడిమేలపు వేళదాకా దోవ వెతుక్కోవడంతోనే సరిపోయింది. మిగతా పుణ్యకాలం ఆ దోవను మర్నటిరోజు ప్రయాణానికి అనువుగా మలచడానికి సరిపోయింది. సెయింట్ జాన్ పండగనాడు విపరీతమైన చలిగా ఉంటుంది అంటుంటారు కానీ అంత చలి అనిపించలేదు.

నా పాలిట పొంచి ఉన్న ప్రమాదం ఉబ్బసం. దగ్గర ఉన్న మందుకూడా చాలా కొద్దిగానే ఉంది.

ఎత్తు–1050 మీటర్లు.

**జూన్ 24**

నాలుగుగంటలు నడిచాం. సుమారు పన్నెండు కిలోమీటర్ల దూరం. కొంత వరకూ తోవ బాగానేఉంది. కొంతమేర తోవ వెతుక్కుని నడవాల్సి వచ్చింది. కొండ శిఖరం మీద నుండి దిగి వచ్చాం. పశువులను మేపడానికి వచ్చినకాపర్లు ఏర్పాటు చేసుకున్న తోవన పడివచ్చాం. దురాన్ కొండ పర్వతపాదాల దగ్గర ఉన్న కొండ పగుళ్ళలో మకాం వేశాం. గనుల్లో పోరు జరుగుతున్నట్లు రేడియో లో వార్తలు వచ్చాయి. ఉబ్బసం ముదురుతా ఉంది నాకు.

ఎత్తు–1200 మీటర్లు.

**జూన్ 25**

పశువుల కాపర్ల దారి వెంబడే మా ప్రయాణం సాగించాం. వాళ్ళ అజ పట్టుకోలేకపోయాం. కాని ఉదయం వేళకు కాల్చేసిన గడ్డిమేటలు కాన వచ్చాయి.

మేం ఉన్న ప్రాంతంలో ఒక విమానం గిరికీలు కొట్టి వెళ్ళింది. ఈ రెండింటి మధ్య సంబంధం ఏమిటో మాకు అంతుపట్టకుండా ఉంది. అయినా మా ప్రయాణం ముందుకే సాగింది. సాయంత్రం నాలుగు గంటలకు పాలినో వాళ్ళ నివసించే ఊరు ఎల్‌పిరే చేరుకున్నాం. అక్కడ మూడే ఇళ్ళు ఉన్నాయి. ఒకటి పాడుపడిపోయి ఉంది. ఇంకో దాన్లో ఎవరూ లేరు. మూడో ఇంట్లో నలుగురు పిల్లల్ని వేసుకుని పాలినో వాళ్ళ అక్క కనిపించింది. ఆమె భర్త ఇంట్లో లేడు. పక్కింట్లో ఉండే వనియాగ్యువా తో కలిసి ఫ్లోరిడా వెళ్ళాడు. అంతా స్థిమితంగానే ఉందనిపించింది. వనియాగ్యువా కూతురు ఒకామే అక్కడికి ఒక కిలోమీటరు దూరంలో నివసిస్తుంది. ఆ ఇంట్లో విడిది చెయ్యాలని నిర్ణయించాం. ఒక దూడను కొన్నాం, కోసుకుని వండుకు తినడానికి. కోకో, జూలియో, కాంబా, లియోన్‌లను ఏవో కొనుక్కురావడానికి ఫ్లోరిడా పంపించాం. కాని వాళ్ళకు అక్కడ ఓ యాభైమంది సైనికులు కనిపించారట. మొత్తంగా 120 నుండి 130 మంది దాకా అక్కడ పోగయ్యే సన్నాహాలు నడుస్తున్నాయని చెప్పారు. మేం ఉన్న ఇంటి యజమాని ముసలతను. పేరు ఫెనెలోన్ కోకా.

అర్జెంటీనా రేడియో మాత్రం గనులలో జరిగిన ఘర్షణలలో 87 మంది బాధితులు అని ప్రకటించింది. బొలీవియా మాత్రం ఎంతమంది చనిపోయారనే విషయమై మౌనం వహించింది. ఉబ్బసం బాగా ఇబ్బంది పెడుతుందినన్ను . కంటిమీద కునుకు రావట్లా.

ఎత్తు – 780 మీటర్లు.

**జూన్ 26**

చీకటి రోజు ఇది. అంతా సజావుగానే నడుస్తుందని తలపోసాం. ఫ్లోరిడాకు వెళ్ళే దారిదగ్గర మాటు వేసిన దళానికి బదులుగా ఇంకో ఐదుగురిని పంపించాను. మరి కాసేపటికే తుపాకి కాల్పులు వినవచ్చాయి. మేం గుర్రాల మీద అక్కడికి సవారీ తీసాం. చిత్రమైన పరిస్థితి ఎదురయ్యింది. అంతటా నీరవ నిశ్శబ్దం. నది ఒడ్డున నలుగురు యువ సైనికుల శవాలు పడి ఉన్నాయి. వాళ్ళ ఆయుధాలు సేకరించలేకపోయాం. ఎందుకంటే శతృవు పొజిషను ఏమిటో మా అంచనాలో లేదు. అప్పటికే సాయంత్రం ఐదయింది. చీకటి పడేదాకా వేచి ఉండాలి ఆ ఆయుధాలు తీసుకురావడానికి. తనకు ఎడమవైపుగా కొమ్మలు విరిగిన చప్పుడవుతుందని మిగ్యుయెల్ కబురంపాడు. ఆంటోనియో, పాచోలు అటుకేసి వెళ్ళారు. టార్గెట్ స్పష్టంగా కనబడితే

తప్ప కాల్పులు జరపవద్దని నేను ఆదేశించాను. కానీ ఉన్నట్టుండి ఇరువైపుల నుండి ఒక్కసారిగా కాల్పులు మొదలయ్యాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో మాకు నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి కాబట్టి వెనక్కి తగ్గాలని ఆదేశించా. వెనక్కి తగ్గడంలో ఆలస్యం జరిగింది. అంతలోనే మావాళ్ళు ఇద్దరు గాయపడిన సమాచారం అందింది. పోంబోకు కాలిలో, ట్యూమాకు పొట్టలో గాయాలు అయ్యాయి. వెంటనే వాళ్ళిద్దరినీ మేం బసచేసిన ఇంటికి చేర్చాం. అందుబాటులో ఉన్న వాటితో శస్త్ర చికిత్స మొదలుపెట్టా. పోంబోకు తగిలిన గాయం లోతైనదికాదు, కానీ అతను నడవగలడా లేదా అనేది మాకు ఎదురవబోయే తలనొప్పి. ట్యూమా కాలేయం దెబ్బ తిన్నది. చిన్న ప్రేవులు కూడా చిద్రమైనాయి. ఆపరేషన్ చేసేటపుడే కన్నుమూసాడు. నాతో చాలాకాలంగా విడదీయలేని అనుబంధం ఉన్న ఒక కామ్రేడ్‌ను కోల్పోయాను. తుది శ్వాసదాకా అతను ఉద్యమానికి ఎంతో విధేయంగా ఉన్నాడు. ఈ క్షణం నుండి అతను లేని లోటునన్ను బాధిస్తుంది. కన్న కొడుకును కోల్పోయినంత శోకం ఆవరించింది. అతను దెబ్బతిని పడిపోగానే తన చేతికున్న గడియారం తీసి ఇమ్మని అడిగాడట. వాళ్ళంతా అతని గాయం పట్ల ఆందోళన చెందుతూ ఆమాట పట్టించుకోకపోతే తనే స్వయంగా తన చేతికి ఉన్న గడియారం తీసి ఆర్టురోకు అందించాడట. తన కళ్ళారా చూసుకోలేకపోయిన తన కొడుకుకు అందించమని అడిగాడట. గతంలో మా దళసభ్యులు ఎవరన్నా చనిపోయినపుడు ఇలానే నేను వాళ్ళ చేతిగడియారాలు వాళ్ళ కుటుంబ సభ్యులకు జ్ఞాపకార్థం అందించే ఏర్పాటు చేసారు. ఈ యుద్ధం ముగిసేదాకా ట్యూమా చేతిగడియారాన్ని నా చేతికి తొడుక్కోవాలని నిర్ణయించుకున్నాం. ట్యూమా పార్థివాకాయాన్ని గుర్రం మీద వేసుకుని దూరంగా తీసుకెళ్ళి ఖననం చేసాం.

కొత్తగా ఇద్దరు వేగులను బందీలుగా పట్టుకున్నాం-ఒక లెఫ్టినెంటు, అతని సేవకుడు. గట్టి 'వార్నింగ్' ఇచ్చి వాళ్ళను విడిచిపెట్టేసాం. వాళ్ళ దగ్గర పనికొచ్చేవి అన్నీ వొలిచేసి వదిలిపెట్టమన్న నా ఆదేశాలను మావాళ్ళు ఎలా అర్థం చేసుకున్నారోగానీ, వాళ్ళను కేవలం కట్‌డ్రాయర్ల మీద సాగనంపారు. మా దగ్గర తొమ్మిది గుర్రాలు ఉన్నాయి.

**జూన్ 27**

ట్యూమా భౌతిక కాయాన్ని సముచిత రీతిన ఖననం చెయ్యలేకపోయాం. తరువాత అక్కడ నుండి పయనం అయ్యాం. పగటిపూటే తేజేరియా చేరుకున్నాం. మధ్యాహ్నం రెండు గంటలకు అడ్వాన్సు పార్టీ మరో పదిహేను కిలోమీటర్ల ప్రయాణానికి

అంతా సిద్ధం చేసింది. రెండున్నరకు అక్కడ నుండి బయల్దేరాం. ఈ దఫా చాలా దూరం ప్రయాణించాల్సి వచ్చింది. మధ్యలోనే చీకటి పడిపోయింది. వెన్నెల విరబూసే వరకు ఆగి మళ్ళీ ప్రయాణం మొదలుపెట్టాం. తెల్లవారుజాము రెండున్నరకు మాకు గైడ్‌గా పనిచెయ్యాల్సిన అతను వస్తానన్న పలీజా ఇంటికి చేరుకున్నాం.

మేం ఎక్కి వచ్చిన గుర్రాలను తేజారియాలోని వాటి యజమానికి అప్పచెప్పే ఏర్పాటు చేసాం.

ఎత్తు–850 మీటర్లు.

**జూన్28**

నలభై పైసోలు తీసుకుని డాన్ లూకాస్ ఇంటికి పోయే క్రాస్‌రోడ్ దగ్గరకు మమ్మల్ని తీసుకుపోవడానికి ఒక మనిషి దొరికాడు. కాని మార్గ మధ్యంలోనే నీటి వసతి అందుబాటులో ఉన్న ఒక ఇంటి దగ్గర ఆగాం. అక్కడ నుండి చాలా ఆలస్యంగా బయలుదేరాం. కానీ మోరో, రికార్డోలు జాడ లేరు. ఏళ్ళూపూళ్ళూ నడిచేలా ఉన్నారు. గంటకు కిలోమీటరు చొప్పున నడిచాం. మాస్కోరా ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మృతిచెందినట్లు ఇద్దరు గాయపడినట్లు సైన్యాన్ని ఉటంకిస్తూ రేడియోలో వార్తలు వచ్చాయట. కానీ మేం మా కళ్ళతో నాలుగు శవాలను చూసాం. బహుశా అందులో ఒకరు చనిపోయినట్లు నటిస్తూ అలా పడి ఉండిపోయారేమో.

మేం ఒక పెద్ద మనిషి ఇంటికి చేరుకున్నాం. ఇంట్లో ఎవరూ లేరు, గుంజలకు కట్టేసిన ఆవు దూడలు తప్ప.

ఎత్తు–1150 మీటర్లు.

**జూన్ 29**

మోరో, రికార్డోలు మీద విరుచుకుపడ్డా. ముఖ్యంగా రికార్డోను దులిపేసా–వాళ్ళ నత్తనడకను విమర్శించా. కోకో, డారియోలు భుజాన కిట్లు వేసుకుని గుర్రాలు ఎక్కి బయల్దేరారు. ఎల్‌నాటోకు గుర్రాలవీ చూసుకునే బాధ్యత అప్పచెప్పాను. తన 'కిట్' తన భుజాన వేసుకున్నాడు. పోంబోది, నాది ఒక కంచెరగాడిద మీద వేసాం. పోంబో గుర్రంమీద సౌకర్యంగానే సవారీ చేసాడు. అతన్ని డాన్ లూకాస్ ఇంటి దగ్గర కాపు కాయమన్నాం. 1800 మీటర్ల ఎత్తున ఉంది ఆ ప్రాంతం. లూకాస్ తన ఇద్దరు కూతుళ్ళతో అక్కడ నివసిస్తున్నాడు. అందులో ఒకామెకు థైరాయిడ్ గ్రంధి జబ్బు.

అక్కడ ఇంకో రెండు ఇళ్ళు ఉన్నాయి. అందులో ఒకటి వ్యవసాయ కూలీది. నిరుపేద కుటుంబం. రెండో ఇంటి యజమాని మాత్రం డబ్బుగల ఆసామి. రాత్రి అంతా వర్షం, చలి. అక్కడ నుండి బార్బెలాన్ చేరడానికి పూట ప్రయాణం. కానీ రైతులు ఉపయోగించే దారి ఇప్పుడు అధ్వాన్నంగా తయారైందని వివరం తెలిసింది. ఇంటి యజమాని మాత్రం మాకు అలా చెప్పలేదు. అంతా ఇట్టే సర్దుకుంటుందని భరోసా చెప్పాడు. కొంతమంది రైతులు పక్క ఇంట్లో అతన్ని చూడవచ్చారు. అనుమానం మీద వాళ్ళను అదుపులోకి తీసుకున్నాం.

రోడ్డుమీదే ఆ రోజు 24 మంది దళ సభ్యులతో మీటింగ్ పెట్టా. ఎల్‌చినో మెరికలాంటి వాడని, అందరూ అలా తయారవ్వాలని ఉదహరించా. దళానికి ఎదురయిన నష్టాలు ట్యూమా మరణం మూలంగా వ్యక్తిగతంగా నాకు కలిగిన కష్టం అన్నింటి గురించీ వివరించా. క్రమశిక్షణ లేకుండా పోతుందని, మార్చింగ్ మహా ఈడికగా సాగుతుందని విమర్శపెట్టా. ఇప్పటిదాకా జరిగిన పొరబాట్లు పునరావృతం కాకుండా ఉండడానికి ఏమైనా మెరుగైన సూచనలు ఉంటే ఇవ్వమని కోరాను. నిండు జీవితాలను వృధాగా బలిపెట్టడం గెరిల్లా ప్రమాణం కాదని నొక్కిచెప్పాను.

**జూన్ 30**

ఇరుగు పొరుగువాళ్ళ నుండి సేకరించిన సమాచారం లూకాస్ మాకు అందించాడు. దాన్ని బట్టి సైన్యం ఇక్కడ దాడి చెయ్యడానికి సర్వసన్నాహాలూ చేసుకుంటూ ఉందనే తాత్పర్యం మాకు బోధపడింది. ఈ ప్రాంతానికి రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్న అండుల్ఫోడియజ్ సైనిక నియంత బారియాంటోస్‌కు గట్టి మద్దతు దారుడు. ఇంకోరైతు ఒట్టి వాగుడుకాయ. కాని పక్షవాతంతో దెబ్బ తిన్న మనిషి మూలాన అతన్ని విడిచి పెట్టేసాం. మరోరైతు మహా పిరికి గొడ్డు. చిక్కుల్లో పడకూడదని నోటికి ఏంవస్తే అది పేలుతుంటాడు. అతన్ని వదిలేసాం. బార్బెలాన్‌కు పోయే తోవ చూపించడానికి లూకాస్ మాకు తోడుగా వస్తానన్నాడు. మిగిలిన ఇద్దరు రైతులూ మాతోపాటురావాలని ఆర్డరు వేసాం. వర్షం పడుతుంది. మహా చికాగ్గా ఉంది. వాతావరణం. అందుకే పగలంతా విశ్రాంతిగా గడిపాం.

రాజకీయ పరిణామాలను విశ్లేషిస్తే నేను బోలీవియాలో ఉన్నానని ఓవాండో అధికారికంగా ప్రకటించడం ప్రాముఖ్యతగల అంశం. బోలీవియా సైన్యం సుశిక్షిత గెరిల్లా యోధులతో తలపడాల్సిన సవాలుఎదుర్కొంటూ ఉంది. ఉత్తర అమెరికా సైన్యాన్ని

మట్టి కరిపించిన వియత్‌కాంగ్ కమాండర్‌లు కూడా మా దళంలో ఉన్నారని అతను ప్రకటించాడు. డెబ్రే ఇచ్చిన సమాచారం ఆధారంగా ఓవాండో ఈ ప్రకటన విడుదల చేసాడు. నిజానికి డెబ్రే అవసరానికి మించి మాట్లాడాడు. దీని పరిణామాలు ఎలా ఉంటాయో మాకు అవగతం కాలేదు. నిజానికి డెబ్రే ఏ పరిస్థితుల్లో, ఏం మాట్లాడాడో కూడా మాకు తెలీదు. ఎల్ లోరో హత్య కావించబడ్డాడనే పుకార్లు నడుస్తున్నాయి. గని కార్మికుల తిరుగుబాటుకు మూల కారణం నేనని, నకాహుయాసు దగ్గర జరిగిన మెరుపుదాడులకు, దీనికి సంబంధం ఉందని విమర్శపెట్టారు. అంటే పరిస్థితులు మాకు అనుకూలిస్తున్నట్లే. ఇహ ఫెర్నాండో ఉరఫ్ పళ్ళడాక్టరు అనే నామధేయానికి నేనిక స్వస్తి చెప్పవచ్చు.

పెరూలో గెరిల్లా ఉద్యమ నిర్మాణం నత్త నడకన సాగుతున్న తీరుగురించి క్యూబానుండి మాకు సందేశం అందింది. అక్కడ ఆయుధాలూ లేవు, దళంలోకి చేరే సభ్యులూ కరువయ్యారు. ఇప్పటికే చాలా ఖర్చుపెట్టారు. సీయోన్ కల్నల్‌గా ఉన్న పాజ్ ఎస్టెన్ సోరో తోను, పాండో ఏరియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఒక ధనికుడితోను కలిసి గెరిల్లా నెట్‌వర్క్ నిర్మాణం గురించి చర్చించాడు. వాళ్ళు గుయారామెరిన్‌లో ఉంటారనుకుంటాను. అది (...).

**నెలసరి సమీక్ష**

ప్రతికూల అంశాలు: జోయాక్విన్‌తో కాంట్రాక్టు ఏర్పరుచుకోవడం అసాధ్యమైపోవడం, దళసభ్యులు ఒకరొకరుగా కోల్పోవడం. దళంలో మేం కోల్పోయిన ప్రతి కామ్రేడ్ బలిదానం మా తీవ్రమైన ఓటమికి నిదర్శనం. కానీ సైన్యం ఈ విషయాన్ని గ్రహించలేకపోయింది. ఈ నెలల్లో రెండు తేలికపాటి దాడులకు తలపడ్డాం. సైన్యం వైపున నలుగురు మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు.

**గమనంలోకి తీసుకోవాల్సిన ముఖ్యాంశాలు ఇవి**

1. 'కాంటాక్టు' లోపం కొనసాగుతుంది. మా దళం సంఖ్య 24 కు తగ్గింది. పోంబో గాయపడిన మూలంగా అతనికి నడవడం కష్టంగా మారింది.

2. రైతులను 'రిక్రూట్' చేసుకోకపోవడం లోపంగా కొనసాగుతుంది. ఇదొక విషవలయం. మేం 'రిక్రూట్‌మెంట్' జరపాలంటే జన సాంద్రత ఉన్న ప్రాంతంలో నిరంతరం మేం 'యాక్షన్'లకు దిగుతూ ఉండాలి. అలా చెయ్యాలంటే మాకు మరింత మంది గెరిల్లాల అవసరం ఉంది.

3. గెరిల్లా ఉద్యమం కార్చిచ్చులా ఇట్లా అగ్గి అంటిస్తే అట్లా విస్తరించాలి. ప్రస్తుతానికి మేం సూపర్‌మాన్‌లమే కానీ అదృశ్యరూపంలో ఉండిపోయాం.

4. పార్టీ వైపు నుండి సంబంధాలు లేకుండా పోయాయి. పౌలీనో ద్వారా సంబంధాలు పునరుద్ధరించుకునే ప్రయత్నాలు చేసాం. ఫలితాలు తెస్తుందేమో చూడాలి.

5. డెబ్రే వార్తలలో వ్యక్తిగా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం నేను వార్తలలో వ్యక్తిగా మారాను. గెరిల్లా ఉద్యమానికి నేనే నాయకత్వం వహిస్తున్నాననే అంశం ప్రచారంలోకి వచ్చింది. ప్రభుత్వం ఇప్పుడు ఎలాంటి తదుపరిచర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి. ఈ ప్రచారం మాకు సానుకులంగా పరిణమిస్తుందా, ప్రతికూలంగా మారుతుందా అనేది నిలకడ మీద తేలుతుంది.

6. గెరిల్లా దళం నైతిక స్థైర్యం, పోరాట స్ఫూర్తికి లోటు లేదు. క్యూబన్‌లు దాడులలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇద్దరు ముగ్గురు బొలీవియన్లు మాత్రం బలహీనంగా ఉన్నారు.

7. సైన్యం సైనిక పరిభాషలో ప్రకటనలు జారీ చెయ్యడానికి పరిమితం అయిపోయింది. అలా అని దాన్ని తక్కువగా అంచనా వెయ్యడానికి లేదు. రైతులను ప్రభావితం చేస్తుంది. పల్లెలకు పల్లెలనే బెదిరించో, బెల్లించో ఇన్ఫార్మర్‌లుగా తయారు చేస్తుంది. మాకు దురుద్దేశాలు ఆపాదిస్తూ తప్పుడు ప్రచారానికి పాల్పడుతుంది.

8. గనులలో చోటు చేసుకున్న ఊచకోత ప్రజలలో ఆలోచన రగిలించి ఉండాలి.

తక్షణం లాపాజ్‌తో పునఃసంబంధాలు ఏర్పరుచుకోవడం మా తొలి ప్రాధాన్యత. ఆయుధాలు మందులు సమకూర్చుకోవాలి. నగరం నుండి కనీసం 50 నుండి 100 మందిని దళంలో చేర్చుకోవాలి. అందులో దాడులకు ఉపయోగపడేది పది పదిహేనుమంది ఉన్నా చాలు.

# జూలై 1967

**జూలై 1**

బార్చెలాన్ వెళ్ళడానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. మా దగ్గర ఉన్న 'మ్యాప్'లో బార్చెలాన్‌కు బదులుగా బార్సెలోనా అని గుర్తు పెట్టి ఉంది. దారి మరమ్మతులు పూర్తి చెయ్యడానికి ముసలాయన లూకాస్ మాకు సాయం చేసాడు. అయినా దారి ఇంకా ఏటవాలుగా, జారుడుగా ఉంది. అడ్వాన్స్ పార్టీ తెల్లారకట్టే బయల్దేరింది. మేం మధ్యాహ్నం బయల్దేరాం. అప్పటిదాకా కొండ పగుళ్ళు వెంబడి అటూ ఇటూ తిరిగాం. దార్లో తొలీగా ఎదురయిన పండ్ల తోట దగ్గర ఆగి అక్కడే పడుకున్నాం. అడ్వాన్సు పార్టీతో మేం వేరుపడ్డాం. వాళ్ళు ముందుకు వెళ్ళారు. తోటలో ముగ్గురు చిన్న పిల్లలు కనబడ్డారు. వాళ్ళలో ఎపీజ్ అనేవాడు మహా సిగ్గరి.

పత్రికా విలేకరుల సమావేశంలో బారియాంటోస్ నేను బొలీవియాలో ఉన్నాననే విషయాన్ని అంగీకరించాడు. అతి కొద్ది రోజుల్లో నన్ను తుడిచి పెట్టేస్తానని భవిష్యవాణి వినిపించాడు. అలవాటు కొద్దీ మమ్మల్ని మూర్ఖులని, కలుగులో ఎలుకలనీ, విషప్పురుగులని తిట్టిపోసాడు. డెబ్రేను కచ్చితంగా శిక్షించి తీరతా అని ప్రకటించాడు.

దారిలో మాకు ఎదురయిన అంద్రూస్ కోకా, రొక్కు అతని కొడుకు పెడ్రో అనే ముగ్గురు రైతులను అదుపులోకి తీసుకుని మాతోపాటు నడిపించాం.

ఎత్తు – 1550 మీటర్లు.

**జూలై 2**

తెల్లవారుజామున మేం అడ్వాన్సు పార్టీని కలిసాం. కొండ మీద ఉన్న 'డాన్ నికోమెడెస్ ఆర్టెగా' ఇంట్లో వాళ్ళు మకాం వేసారు. అక్కడ బత్తాయి తోటలు ఉన్నాయి. మాకు సిగరెట్లు కూడా అమ్మారు. కింద పియోజెరా నది దగ్గర అసలు ఇల్లు ఉంది.

కడుపారా భోంచేసాక మేం అక్కడికి వెళ్ళాం. పియోజెరా నది మొత్తం కొండవాలు మధ్యన ప్రవహిస్తుంది. అంగోస్టురా వైపుకు వెళ్ళాలంటే కేవలం కాలినడకనే సాధ్యం. లాజుంటా దగ్గర బయటకు పోయే వీలుంది. అది కూడా ఈ నదికి సంబంధించినదే. కాకపోతే ఎత్తయిన కొండ నడుము నుండి పోతా ఉంటుంది. దారులు చీలే చోటు (క్రాస్‌రోడ్) మూలాని దానికి తగిన ప్రాముఖ్యత ఉంది. ఎత్తు 950 మీటర్లు. వేడిమి కూడా ఎక్కువగానే ఉంది. సాలీళ్ళు, దోమలకు కొదవలేదు. మేం ఉన్నది ఒక సెటిల్మెంటు కాలనీ. ఆర్టెగా, అతని కొడుకుల ఇళ్ళు మాత్రమే ఉన్నాయి. కాఫీ తోటలు ఉన్నాయి. స్థానికంగా ఉన్న వాళ్ళు కౌలుకు పని చేస్తున్నారు. సాన్‌జువాన్ ప్రాంతం నుంచి వచ్చిన ఆరుగురు కూలీలు ఆరోజు పనిలో ఉన్నారు.

పోంబో కాలిగాయం ఆశించినంత వేగంగా మానుపట్టడం లేదు. గుర్రం మీద కూర్చుని చేసే ప్రయాణమే అయినా అంతూ దరీ లేకుండా సాగుతూనే ఉంది కదా. ఇతరత్రా ఇబ్బందులు ఏమీలేవు కాబట్టి తక్షణం మేం భయపడాల్సిన అవసరం ఏమీలేదు.

**జూలై 3**

రోజంతా అక్కడే గడిపాం. పోంబో కాలికి విశ్రాంతి ఇవ్వడానికి ఉపయోగపడింది. మేమంటే భయం ఉన్నా మాకు కావల్సిన వల్లా ఇవ్వడానికి రైతులు ఉత్సాహం చూపుతున్నారంటే దానికి కారణం మేం చెల్లిస్తున్న పెచ్చురేట్లు. అందరూ ముచ్చట పడుతున్నారు కదాని రమణీయ ప్రకృతిని కొన్ని ఫొటోలు తీసాను. కానీ రీలు ఎలా 'డెవలప్' చేయించాలి. ఎక్కడ కడిగించి, ఫొటో ప్రింట్లు వేసి తెప్పించాలి అనేది సమస్యే. తెల్లవారుజామున ఒక విమానం అటుగా ఎగిరి వెళ్ళింది. రాత్రికి బాంబులు కురిపిస్తారేమో అని అందరూ ప్రమాదాన్ని ఊహించారు. ఆ చీకట్లోనే తలోదిక్కూ వెళ్ళిపోదాం అనుకున్నారు. అలాంటి భయాలేం పెట్టుకోవద్దని నచ్చచెప్పి వాళ్ళందరినీ నిలవరించాం. ఉబ్బసం రోగం నాతో పెద్ద యుద్ధానికే దిగింది.

**జూలై 6**

తెల్లవారుజామునే పెనాకొలరాడా వైపు బయల్దేరాం. తోవలో కొన్ని ఇళ్ళున్నాయి. అక్కడి జనాలు మమ్మల్ని చూసి భయకంపితులైపోయారు. చీకటి పడే సమయానికి 1600 మీటర్ల ఎత్తున ఉన్న ఆల్టోడి పాలెర్మో చేరుకున్నాం. దిగువున చిన్న దుకాణం కనిపించింది. ఏమన్నా దొరికితే తిందామని కిందకి దిగాం. రాత్రి పూటే కదా అని

మెయిన్ రోడ్డు మీదకు వచ్చాం. అక్కడ ఓ ముదుసలి విధవరాలి పూరి గుడిసె ఉంది. అడ్వాన్సు పార్టీ ఊగిసలాట మూలంగా ఆ ఇంటిని షెల్టరుగా వాడుకోవడానికి అదుపులోకి తీసుకోలేదు. సుమైపాటా నుండి ఏదన్నా వాహనం వస్తుంటే దాన్ని ఆపి డ్రైవర్‌తో పాటు వెళ్ళి కావాల్సిన మందులు కొని, అవసరం పడితే ఆసుపత్రి మీద దాడి చేసి కావల్సినవి తీసుకుని తినడానికి స్వీట్లూ అవీ కొని తెచ్చుకోవాలని అనుకున్నాం.

అయితే మా ప్లాన్ మార్చేసుకున్నాం. సుమైపాటా నుండి ఎటువంటి వాహనాలు వస్తున్న జాడలేదు. జిల్లాలో ఎక్కడా వాహనాలు ఆపట్లేదని తెలిసింది. అంటే 'చెకింగ్' ఎత్తేసినట్లే అన్నమాట. రికార్డో, కోకో, పాచో, అనీసెటో, జూలియో, ఎల్‌చినోలను 'యాక్షన్‌టీం'గా పంపించాం. ఏ ఇబ్బందీ లేకుండానే వాళ్ళు శాంతాక్రజ్ నుండి వస్తున్న లారీని ఒకదాన్ని ఆపారు. ఆపిన లారీని చూసి ఏమన్నా సాయం కావాలేమో అని ఇంకో లారీ వచ్చి ఆగింది. దాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ లారీలో తన కూతురితో సహా ప్రయాణిస్తున్న ఒక ఆడకూతురు వాదన వేసుకుంది. ఏం జరుగుతుందో చూద్దాం అనే ఉత్సాహంతో ఇంకో లారీ వచ్చి ఆగింది. అప్పటికే రోడ్డు దాదాపు బంద్ అయిపోయింది. దాని వెంటనే నాలుగో లారీని కూడా ఆపారు. మొత్తానికి విషయాన్ని సర్దుబాటు చేసి నాలుగు లారీలనూ రోడ్డు వారీగా పక్కకి దించారు. ఒక డ్రైవరు 'నాకు రెస్టు కావాలి' అంటూ కాళ్ళు ఎత్తేసాడు. మొత్తానికి ఒక లారీలో బయల్దేరి సుమైపాటా వెళ్ళారు. అక్కడ ఉన్న ఆర్మీపోస్టును చుట్టుముట్టి లెఫ్టినెంట్ వాకఫ్లార్‌ను, మరో ఇద్దరు సైనికులను బందీలుగా చిక్కించుకున్నాం. సార్జంట్ దగ్గర నుండి 'కోడ్‌వర్డ్' బలవంతంగా రాబట్టి 'క్యాంప్' మీద దాడి చేసారు. పది మంది సైనికులు బందీలుగా చిక్కారు. ఒకతను ప్రతిఘటించబోతే స్వల్పంగా కాల్పులు జరిపారు మావాళ్ళు. ఐదు మౌజర్ తుపాకులు, ఒక జెడ్‌బి–30 దొరికాయి. సైనికులను లారీలో ఎక్కించి సుమైపాటాకు ఒక కిలోమీటరు ఇవతల ఒంటిమీద బట్టలన్నీ వొలిచేసి వొదిలేసి వచ్చారు. కానీ తినడానికి తిండి తీసుకురావడంలో విఫలమయ్యారు. ఎల్‌చినో ఒట్టి చేతులతో ఎప్పుడూ రాడు. కానీ, ఈ సారి పాచో, జూలియోలు అతన్ని కంగారు పెట్టేసినట్లున్నారు. గెరిల్లాలకు అత్యవసరమైన మందులు తెచ్చారు. కానీ అందులో నా ఉబ్బసానికి మందులు లేవు. ఈ దాడి అంతా జనాలు చూస్తుండగానే ఒక పట్టణంలో జరిగింది కాబట్టి ఈ వార్త కార్చిచ్చులా వేగంగా ప్రచారమై పోతుంది. చక్కటి విందుకుడిచి తెల్లవారుజాము రెండుగంటలకు మేం వెనక్కుతిరిగాం.

**జూలై 7**

ఎక్కడా ఆగకుండా ప్రయాణించి ఒక చెరుకు తోట దగ్గర ఆగాం. ఇంతకు ముందు మేం అటుగా వచ్చినపుడు అక్కడ ఉన్న పెద్దమనిషే మమ్మల్ని సాదరంగా ఆహ్వానించాడు. రామోస్ ఇల్లు అక్కడికి రెండున్నర మైళ్ల దూరంలో ఉంది. అక్కడి జనాల్లో భయం ఇంకా వదల్లేదు. అతను మాకు ఒక సీంపందిని అమ్మాడు. మనిషి సంతోషంగానే కనిపించాడు. లాస్ఎజోస్ దగ్గర దాదాపు 200మంది సైనికులు ఉన్నారని, అలాగే శాన్‌జువాన్ దగ్గరమరో 100 మంది సైనికులు ఉన్నట్లు తన సోదరుడు చెప్పాడనీ మమ్మల్ని హెచ్చరించాడు. అతనికి పిప్పి పళ్ళున్నాయి. పీకనా అని అడిగా. వద్దనేసాడు. నా ఉబ్బసం తీవ్రమైంది.

**జూన్ 8**

మేం కొన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ఇంటి దగ్గర నుండి పియోజెరా నది దగ్గరకు వెళ్ళడానికి చెరుకు తోపుల గుండా ప్రయాణించాం. అంతా సజావుగా ఉంది. ఎక్కడా సైనికులు ఉన్న జాడలేదు. శాన్ జువాన్ నుండి వస్తున్నవాళ్ళు అక్కడ సైనికులు ఉన్నారన్న విషయాన్ని కొట్టిపారేసారు. అంటే మాకు షెల్టర్ ఇచ్చిన పెద్దమనిషి మమ్మల్ని త్వరగా వదిలించుకోవడానికి అలా చెప్పి ఉంటాడు. ఎల్‌పిరే నది వెంబడి ఐదుమైళ్ళు నడిచాం. అక్కడ నుండి గుహకుచేరుకోవడానికి మరో రెండున్నరమైళ్ళు నడవాలి. చీకటిపడే సమయానికి అక్కడికి చేరుకున్నాం. ఎల్‌ఫిలోకు దగ్గరగా ఉన్నాం.

ఆరారగా నేను ఇంజక్షన్ చేసుకుంటూ ప్రయాణించాను. చివరికి అడ్రీనాలిన్ సొల్యూషన్ డోసు ఇచ్చుకున్నా. పౌలినో కనుక 'యాక్షన్'కు పూనుకోకపోయి ఉంటే నా ఉబ్బసం మందుల కోసం నకాహుయాసుకు తిరిగి వెళ్ళేవాళ్ళం.

సైన్యం మేం చేసిన దాడికి సంబంధించిన వార్తలు ప్రసారం చేసింది. ఒక సైనికుడు మృతి చెందినట్లు ధృవీకరించింది. రికార్డో, కోకో, పాచోలు మిలిటరీ క్యాంప్ మీద చేసిన దాడిలో జరిపిన కాల్పుల్లో అతను మరణించినట్లు ఉన్నాడు.

**జూలై 9**

మేం బయల్దేరాం. కానీ దారి తప్పాం. పొద్దుటపూట అంతా తోవ వెతుక్కోవడానికే సరిపోయింది. మధ్యాహ్నానికి పనికిమాలిన, ఎవరూ వాడని దారి ఒకటి కనబడింది. ఇప్పటిదాకా ఎక్కనంత 1840 మీటర్ల ఎత్తుకు చేరుకున్నాం. ఆ

తరువాత కాసేపటికే పాతబడిన పూరిపాక ఒకటి కనబడింది. ఆ రాత్రి అక్కడే గడిపాం. ఎల్‌ఫిలో కు వెళ్ళాల్సిన దారి అగమ్యగోచరం అయిపోయింది. కటావి, సిగ్లో గని కార్మికులకు, ఎంప్రెసా కామిబోల్‌గని యజమానులకు మధ్య పధ్నాలుగు అంశాల మీద ఒప్పందం కుదిరినట్లు రేడియోలో వార్తలు వెలువడ్డాయి. అంటే కార్మికులు ఓటమి చవిచూసారని తేలిపోయింది.

**జూలై 10**

గుర్రం ఒకటి తప్పిపోవడంతో ఆలస్యంగా బయల్దేరాం. ఈ లోగా తప్పిపోయిన గుర్రం తిరిగివచ్చింది. ఎప్పుడో అరుదుగా తప్ప వాడని దారి వెంబడి ప్రయాణించి 1900 మీటర్ల ఎత్తుకు చేరుకున్నాం. మూడున్నరకు పాతబడిన పూరిపాక కనిపించింది. రాత్రికి అక్కడే గడపాలని నిర్ణయించుకున్నాం. ఆశ్చర్యకరంగా మేం వెతికిన దారులన్నీ గోడ కట్టినట్లు ఎక్కడో ఒక చోట అంతమైపోయాయి. కొత్త దారుల కోసం వెతుకులాడాం. కాని అవి ఎటూ దారి తియ్యడం లేదు. అక్కడ నుండి చూస్తుంటే దూరాన కొన్ని పండ్ల తోటలు కనబడుతున్నాయి. బహుశా ఎల్‌ఫిలో దగ్గర్లోవి అయి ఉండవచ్చు.

ఎల్‌డొరాడో లో గెరిల్లాలతో ఘర్షణ జరిగినట్లు రేడియోలో వార్తలు వెలువడ్డాయి. మ్యాప్ మీద అలాంటి ప్రదేశం ఒకటి ఉన్నట్లు ఎక్కడా గుర్తు పెట్టిలేదు. బహుశా సుమైపాటా, గ్రాండే నది మధ్యన ఎక్కడో ఉండి ఉండవచ్చు. ఒక సైనికుడు గాయపడినట్లు, గెరిల్లాలు ఇద్దరు మృతి చెందినట్లు ప్రకటించారు.

డెబ్రే, ఎల్‌పీలాడో లు వేర్వేరు ప్రకటనలు చేసారు. మంచిగా లేవు అవి. గెరిల్లాల ఖండాంతర లక్ష్యాలను గురించి వాళ్ళు బయటపెట్టడం ఎంత మాత్రం సరికాదు. వాళ్ళు అలా చెప్పి ఉండాల్సింది కాదు.

**జూలై 11**

మరలా ముసురూ, పొగమంచు పట్టాయి. దారి తప్పాం. అడ్వాన్సు పార్టీతో కాంటాక్టు కోల్పోయాం. వాళ్ళు పాత దారి వెంబడే కొండ దిగువకు వెళ్ళారు. మేం ఒక లేగదూడను చంపితిన్నాం.

**జూలై 12**

మిగ్యుయెల్ దగ్గర నుండి సమాచారం కోసం రోజంతా వేచి ఉన్నాం. చీకటి పడుతుండగా జూలియో వచ్చాడు. వాళ్ళు కిందన దక్షిణం దిక్కుగా పోయేనది దగ్గరకు

చేరుకున్నట్లు చెప్పారు. మేం ఉన్న చోటే ఉండిపోయాం. ఉబ్బసం నన్ను ఇబ్బంది పెడుతుంది.

రేడియోలో ఎదురు కాల్పుల వార్తలు జోరుగా వచ్చాయి. బహుశా వాటిల్లో కొంత నిజం ఉండి ఉండొచ్చు. ఇక్యురి దగ్గర జరిగిన దాడిలో ఒక గెరిల్లా హతమై పోయినట్లు, శవాన్ని, లాంగ్యునిల్లాస్‌కు తరలించినట్లు ప్రకటించారు. శవం గురించి చెప్పేటపుడు ఆ మాటల్లో తొణికిసలాడిన ఆనందాన్ని బట్టి ఆ కథనంలో వాస్తవం ఉందనిపించింది.

**జూలై 13**

తెల్లవారు జామున అననుకూల వాతావరణంలోనే జారుడుగా ఉన్న తోవగుండా ఏటవాలు కొండ మీద నుండి కిందకు దిగాం. పదకొండున్నరకు మిగ్యుయెల్‌ను కలిసాం. నది వెంబడే పోతున్న దారి ఒక చోట వేరుపడింది. అది ఎటు పోతుందో చూసి రమ్మనమని కాంబా, పాచోలను పంపించాం. ఒక గంట తరువాత వెనక్కు తిరిగి వచ్చారు వాళ్ళు. ఇళ్ళు, పొలాలు చూసినట్లు, ఒక పాడుబడిన కొంప దగ్గరకు పోయిన చూసివచ్చినట్లు చెప్పారు.మేం అందరం అక్కడకు చేరుకున్నాం. మొదటగా కనిపించిన ఇంట్లో బస చేసాం. ఆ రాత్రి అక్కడే గడిపాం. ఆ ఇంటి యజమాని రాత్రి వచ్చి చేరాడు. ఒక ఆడమనిషి– స్థానిక మేజిస్ట్రేటు తల్లి–కంట మేం పడ్డామని, ఆవిడ ఈ పాటికే ఎల్‌ఫిలో సెటిల్‌మెంటు దగ్గర ఉన్న సైన్యానికి ఉప్పందించి ఉంటుందని, సైనిక స్థావరం అక్కడికి రెండున్నర మైళ్ళ దూరంలో ఉందని విషయం పూసగుచ్చినట్లు చెప్పాడు. దాంతో ఆ రాత్రి అంతా గస్తీ పెట్టాం.

**జూలై 14**

రాత్రీ, పగలూ తేడా లేకుండా జల్లులు కురుస్తానే ఉన్నాయి. అయినా మధ్యాహ్నం వేళకు ఇద్దరు 'గైడ్'లను తోడు తీసుకుని బయల్దేరాం. మేయరు బావమరిది పాబ్లో, మేం విడిది చేసిన ఇంటి యజమాని ఆరెలియో మాన్సిల్లాలు మాకు 'గైడ్'గా పనిచేసారు. వాళ్ళ ఆడవాళ్ళు ఏడ్చారు, మేం వాళ్ళ మగవాళ్ళిద్దరినీ మా వెంట తీసుకువెళ్తున్నామని. మేం ఒక కూడలి ప్రాంతానికి చేరుకున్నాం, ఒక దారి ఫ్లోరిడా మొరాకోల వైపు పోతుంది. రెండో దారి పాంపావైపుకు. పాంపా దారిన బడిపోతే అక్కడ నుండి కొత్తగా మాస్క్యురా వైపుకు పోయే రోడ్డు వేసారని అటుగా వెళ్దామని మా 'గైడ్'లు సూచించారు. వాళ్ళ సలహా పాటించాం. ఒక 500 మీటర్లు నడిచాం.

ఇంతలోఒక సైనికుడు, గుర్రం మీద పిండిబస్తాలు వేసుకుని వెళ్తున్న రైతు ఒకతను మాకు ఎదురయ్యారు. పాంపాలో 30 మంది సైనికులు ఉన్నారని, ఎల్‌ఫిలోలో ఉన్న సెకండ్ లెఫ్టినెంట్‌కు వాళ్ళ తరఫున ఒక సందేశం తీసుకువెళ్తున్నట్లు వెల్లడించారు వాళ్ళు. దాంతో మేం దారి మార్చాం. ఫ్లోరిడా వైపు బయల్దేరాం. కొంత దూరం పోయాక ఒక చోట మకాం వేసాం.

రెవల్యూషనరీ ఫ్రంట్ నుండి పిఆర్ఎ, పిఎస్‌బి వైదొలుగుతున్నట్లు ప్రకటించాయి. ఫాలంగే తో జట్టు కట్టాలని చూస్తున్న బారియాంటోస్‌కు రైతాంగం హెచ్చరికలు చేసింది. ప్రభుత్వం అతివేగంగా ముక్కచెక్కలయిపోతుంది. దురదృష్టం ఏంటంటే ఈ క్షణాన మా దగ్గర ఒక వంద మంది గెరిల్లాలు లేకపోవడమే.

**జూలై 15**

రోడ్డు కచ్చాగా ఉంది. చానా ఏళ్ళ నుండి వాడకంలో ఉన్నట్లు లేదు. అందుకే మా ప్రయాణం ఈడికగా సాగుతుంది. ఆరెలియో సలహా మేరకు మేజిస్ట్రేటుకు చెందిన ఆవును ఒక దాన్ని చంపి వండుకు తిన్నాం. విందు భోజనమే అనుకోండి. ఉబ్బసం ఇంకాస్త ప్రకోపించింది.

మమ్మల్ని కొద్దిగంటల్లో తుడిచి పెట్టెయ్యడానికి 'ఆపరేషన్ సింటియా'ను ఆరంభిస్తున్నట్లు బారియాంటోస్ ప్రకటించాడు.

**జూలై 16**

దారిలో తుప్పలు నరుక్కుంటూ ప్రయాణించాల్సి రావడంతో ఇబ్బంది పడ్డాం. అడ్డంగా పెరిగిన తుప్పలు పొదల మూలంగా మేం ఎక్కివచ్చిన గుర్రాలు మహా ఇబ్బంది పడ్డాయి. చెప్పుకోదగ్గ సంఘటనలు ఏమీ ఎదురవలేదు. ఒక పర్వతపంక్తి పాదాల దగ్గర ఆగిపోయాం. గుర్రాలు బరువులతో ప్రయాణించే పరిస్థితి లేదు. మిగ్యుయెల్ అడ్వాన్సు పార్టీలోని ఇంకో నలుగురు కలిసి ముందుకు వెళ్ళి అక్కడే నిద్దర్లకు పడ్డారు.

రేడియోలో చెప్పుకోదగ్గ వార్తలేమీ రాలేదు. దుర్రాన్ కొండ దగ్గర 1600 మీటర్ల ఎత్తును అధిగమించాం. దుర్రాన్ కొండ మాకు ఎడమ వైపున ఉంది.

**జూలై 17**

తోవ తప్పాం ఎక్కడో. నిదానంగా ప్రయాణం సాగించాం. దూరాన ఉన్న బత్తాయి తోటలు చూపించారు మా గైడ్‌లు. తీరా అక్కడికి వెళ్తే అన్నీ ఎండిన చెట్లే.

దాపునే చిన్న బురదనీటి మడుగు కనిపించింది. దాంతో అక్కడ మకాం వేసాం. చురుగ్గా మూడు గంటలు కూడా ప్రయాణించలేదు. ఉబ్బసం కాస్త నిదానించింది. బహుశా ఎల్‌పిరేకు పోయే దారిలో కలుస్తామేమో. దుర్రాన్ కొండ దిక్కున ఉన్నాం.

ఎత్తు - 1560 మీటర్లు.

**జూలై 18**

ఒక గంట ప్రయాణించాక మాగైడ్ దోవతప్పిపోయాం అని చెప్పాడు. అక్కడ నుండి తనకు ఇంకొక దోవ తెలియదని చేతులెత్తేసాడు. ఎట్టకేలకు మేం పాత తోవను కనిపెట్టాం. కొంత మంది ఆ తోవను ప్రయాణానికి అనువుగా చేసే పనిలో ఉంటే మిగ్యుయెల్ అడవికి అడ్డం పడి పిరేకు వెళ్ళేరోడ్డును కనిపెట్టివచ్చాడు. నీటిమడుగు ఎగువన మకాం వేసాం. మా అదుపులో ఉన్న ముగ్గురు రైతులను, సైనికుడిని వదిలిపెట్టేసాం. వదిలిపెట్టే ముందు చిన్న లెక్చర్ ఇచ్చాం. పౌలీనో కొండ బొరియలో ఏమన్నా వదలివచ్చాడేమో తీసుకు వస్తాం అని కోకో పాబ్లితో, పాచోలను వెంట తీసుకుని వెళ్ళాడు. అంతా అనుకున్నట్లు జరిగితే వాళ్ళు మరుసటి రోజు రాత్రికి తిరిగి వచ్చి మమ్మల్ని చేరుకోవాలి. మేం విడిచి పెట్టిన సైనికుడు తాను సైన్యం వదిలేస్తున్నట్లు చెప్పి మరీ వెళ్ళాడు.

ఎత్తు - 1300 మీటర్లు.

**జూలై 19**

దగ్గరలో ఉన్న పాత క్యాంపుకు వచ్చిపడ్డాం. అక్కడే బస చేసాం. సెంట్రీలను పెట్టాం. కోకో గురించి ఎదురు చూసాం. సాయంత్రం ఆరు గంటలకు వచ్చాడతను. పరిస్థితుల్లో ఏం మార్పు లేదని చెప్పాడు. పౌలీనో తుపాకి ఉంది కానీ అతను జాడ లేడట. సైన్యం అటుకేసి వెళ్ళిన దాఖలాలు ఉన్నాయి. మేం వెళ్ళిన రోడ్డున వాళ్ళ అడుగుజాడలు ఉన్నాయని చెప్పాడు.

తీవ్ర రాజకీయ సంక్షోభం ఏర్పడిందని వార్తలు వెలువడ్డాయి. ఇది ఎక్కడికి దారి తీస్తుందో తెలీదు. కోచబాంబాలో ఉండే వ్యవసాయ సిండికేట్లు క్రైస్తవ మత విశ్వాసాల ఉత్తేజంతో ఒక రాజకీయ పార్టీని ఏర్పాటు చేసాయి. నాలుగేళ్ళ పాటు పరిపాలించేందుకు అవకాశం ఇమ్మని దేబిరిస్తున్న బారియాంటోస్‌కు మద్దతు పలికాయి. సైల్స్‌సాలినాస్ ప్రతిపక్ష పార్టీలను బెదరేసే పనిలో ఉన్నాడు. మేం గనక అధికారంలోకి వస్తే అందరూ మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఇవాళ దేశం యుద్ధం అంచున ఉంది.

జాతీయ సమైక్యత తక్షణావసరం అని పిలుపునిచ్చాడు. ఒకవేపు బెదిరిస్తూనే, ఇంకోవైపు ఉదాత్త ఆశయాలను వల్లిస్తున్నాడు. బహుశా తిరుగుబాటుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ఉన్నాడు.

**జూలై 20**

మేం కడుజాగ్రత్తగా కదులుతున్నాం. తొలీగా ఎదురైన రెండు పూరిగుడిసెల దగ్గర ఆగాం. అక్కడే మాకు పనియార్యు పిల్లలు, పౌలీనో అల్లుడు తారసపడ్డారు. ఇంత క్రితం పౌలీనో గురించి వాళ్ళకూ ఏం తెలీదు. మాకు గైడ్‌గా పనిచేసేందుకు గాను సైన్యం అతని కోసం గాలిస్తుంది. అడుగుజాడలను బట్టి సుమారు వందమంది సైనికులు అటుగా వెళ్ళి ఉంటారని తెలుస్తుంది. మేం ఫ్లోరిడా దిక్కుకేసి వెళ్ళిన వారం రోజులకు వాళ్ళు ఇటుకేసి వచ్చినట్లున్నారు. మా వాళ్ళు చేసిన దాడిలో ఇద్దరు గాయాలపాలయి, ముగ్గురు మృతి చెందారు. ఫ్లోరిడాలో పరిస్థితి ఎలా ఉందో వాకబు చేసుకుని అవసరమైనవి కొని తీసుకురావడానికి కోకో, కాంబా, లియోన్, జూలియోలు నలుగురూ వెళ్ళారు. తెల్లవారు జాము నాలుగు గంటలకు కోకో కాస్త తిండి తీసుకువచ్చాడు. దాంతో పాటు ఒక మనిషిని వెంటపెట్టుకు వచ్చాడు. అతని పేరు మేల్గర్. రెండు గుర్రాలు ఉన్నాయట అతని దగ్గర. మాకు కావల్సిన వివరమైన, విశ్వాసనీయమైన సమాచారం అందించడానికి వచ్చాడు. అతను చెప్పిన వివరాల ప్రకారం మేం అక్కడ నుండి వెళ్ళిన నాలుగు రోజులకి నక్కలు, పీక్కు తిన్న ట్యూమా కళేబరాన్ని కనిపెట్టారట. దాడి జరిగిన మరుసటి రోజునే సైన్యం ముందుకు పోయిందట. సైనిక లెఫ్టినెంట్ ఒకతను బోసిమొలతో కనిపించాడట. సుమైపాటా దగ్గర జరిగిన దాడి వివరాలు పొల్లుపోకుండా తెలుసుకున్న రైతులు అతన్ని ఆటపట్టించారట. అక్కడ వాళ్ళకు ట్యూమా వాడిన సిగార్ పైపు ఇంకా ఏవో వస్తువులు చుట్టుపక్కల దొరికాయట. సోపర్నో అనే సైనిక మేజరు మా మీద సానుభూతి ప్రదర్శించాడట. మమ్మల్ని పొగిడాడట. సైన్యం ట్యూమా మరణించిన ఇంటిని గాలించి అక్కడి నుండి తేజెరియా వెళ్ళిందట. తిరిగి ఫ్లోరిడాకు తెరిగి వెళ్ళిపోయారట. ఇన్ని వివరాలు చెప్పిన ఈ మనిషి చేతికి ఒక ఉత్తరం ఇచ్చి పంపిద్దామని కోకో అన్నాడు. కాని అతన్ని విశ్వాసంలోకి తీసుకోవడానికి ముందుగా అతనితో మందులు తెప్పిద్దాం అని ప్రతిపాదించా నేను. ఒక దళం అందులో ఒక ఆడ మనిషి సహా ఇటుకేసి వస్తుందని మేల్గర్ చెప్పాడు. రియోగ్రాండే మేజిస్ట్రేటు ఇక్కడకు పంపిన ఉత్తరంలో ఆ సమాచారం ఉందని వివరించాడు. ఇంతి, కోకో, జూలియోలను ఈ విషయమై వాకబు చేసి రమ్మని పంపించా. దళం సంగతి తెలియదు

కానీ మొత్తానికి మేల్గర్ చెప్పినట్లు ఒక ఉత్తరమయితే వచ్చిందన్న విషయం రూఢీ అయింది. వర్షం మూలాన రాత్రి అంతా భారంగా గడిపాం. చనిపోయిన గెరిల్లా ఎవరన్నదీ మోజెస్ గువేరా గుర్తించినట్లు రేడియోలో వార్తలు వచ్చాయి. కానీ విలేకరుల సమావేశంలో ఒవాండా కడు జాగ్రత్తగా వ్యవహరించాడు. అది తేల్చాల్సింది హోం మంత్రిత్వశాఖ అని జవాబు ఇచ్చాడు. గుర్తించిన మనిషి వివరాలను పరిశోధించి కనిపెట్టినట్లు గప్పాలు చెప్పుకోవడానికి ఆ మాత్రం తంతుకావాలి కదా.

ఎత్తు – 680 మీటర్లు.

**జూలై 21**

రోజంతా ప్రశాంతంగా గడిచింది. ఇంటిగల ముసలాయన కోకోను కూర్చోబెట్టి ఆవు తనది కాకపోయినా తనదే అని చెప్పి మాకు ఎలా అమ్మావని అడిగాం. నాకు మీరు డబ్బులిచ్చారా అని ఎదురడిగాడు అతను. నిలువునా అబద్ధం ఆడుతున్నాడు. అందుకే ముక్కుపిండి మరీ అతను మా దగ్గర పుచ్చుకున్న డబ్బులు వసూలు చేసాం.

రాత్రికి తేజేరియా వెళ్ళి బాగా బలిసిన సీంపందిని, కొన్ని కేకులు కొని తెచ్చుకున్నాం. అవి కొని తీసుకు రావడానికి వెళ్ళిన ఇంతి, బెనినో, అనీసెటోలకు అక్కడి జనాలు ఘనస్వాగతం పలికారు.

**జూలై 22**

తెల్లారగట్టే బయల్దేరాం. గుర్రాల మీద, మా వీపుల మీదా మోయలేని బరువులు వేలాడుతున్నాయి. మేం ఎటూ వెళ్ళిందీ ఎక్కడ ఉన్నదీ ఎవరికీ అర్థం కాకుండా ఉండడానికి మాస్కాకొట్టే ఉద్దేశంతో ప్రయాణం సాగించాం. మొరాకో వెళ్ళే దారిని వదిలిపెట్టి వేరే దారి పట్టాం. దక్షిణానికి ఒకటి రెండు కిలోమీటర్లు ప్రయాణించాం. ఆ తరువాతి ఎటూ వెళ్ళాలనేది మాలో ఎవరికీ తెలీదు. దారి వెతుక్కు రమ్మనమని కొంత మందిని పంపించాం. ఇంతలో మంకిల్లా, పనియాగ్యువాలో ఎదురయిన కుర్రాడు ఇద్దరూ పశువులను మేపుకుంటూ అటుకేసి వచ్చారు. వాళ్ళను నోరు విప్పద్దన్నాం కదా మేము అడిగినా నోరు విప్పలేదు. ఇప్పుడు పరిస్థితులు వేరుగా ఉన్నాయి. కొన్ని గంటల పాటు నడిచాం. ఒక నీటి చెలమ దగ్గర పడి నిద్రపోయాం. అక్కడ నుండి ఒకటి దక్షిణానికి, ఇంకొకటి ఆగ్నేయానికి పోయే దారులు ఉన్నాయి.

బస్టోస్ భార్య నన్ను చూసినట్లు చెప్పిందని రేడియో వార్తల్లో చెప్పారు. అయితే నేను ఇతరత్రా ఏదో పనిమీద వచ్చినట్లు చెప్పిందామె.

ఎత్తు – 640 మీటర్లు.

**జూలై 23**

నిన్న బస చేసిన చోటే ఉండిపోయాం. కనిపిస్తున్న రెండు దారులూ ఎటు పోతాయో ఆరా తీసుకురమ్మనమని పంపించా. ఒక దారి సీకో నది కేసి పోతుంది. ఎల్‌పిరే నుండి వచ్చే పాయ ఒకటి, అక్కడ ఈ నదిలో కలుస్తుంది. అంటే ఫ్లోరిడాకు గతంలో మేం 'ఆంబుష్' ఏర్పాటు చేసిన ఏరియాకు మధ్యన ఉన్నాం. రెండో దారిన పడి రెండు మూడు గంటలు నడిస్తే ఒక గుడిసె తగిలిందని మిగ్యుయెల్ చెప్పాడు. అక్కడ నుండి రోసిటా మీదుగా బయట పడొచ్చని చెప్పుకొచ్చాడు. మరుసటి రోజు ఆదారిన ప్రయాణిద్దాం అని నిర్ణయించుకున్నాం. కోకో, జూలియోలకు మేల్గార్ వినిపించిన కథలను బట్టి ఆదారి ఇదే అయి ఉంటుంది.

**జూలై 24**

మూడు గంటల పాటు ప్రయాణించాం. వెయ్యి మీటర్ల ఎత్తుకు చేరుకున్నాం. 940 మీటర్ల దగ్గర ఒక నీటి చెలమ ఉంది. అక్కడ మకాం వేసాం. ఇక్కడితో రోడ్డు అంతమైపోయింది. రేపు అంతా ఇక్కడే ఉండి ఇక్కడ నుండి బయట పడే మార్గమేదో చూడాలి. చాలా పళ్ళతోటలు సాగులో ఉన్నాయి ఇక్కడ. ఫ్లోరిడాను తలపిస్తున్నాయి. బహుశా ఇది కానలోన్స్ ప్రాంతం కావచ్చు. మనీలా నుండి అందిన సుదీర్ఘ సందేహాన్ని డీకోడ్ చేసాం. మాక్సిమోగోమెజ్ అకాడమీలో ఉత్తీర్ణులయిన సైనిక ఆఫీసర్లను ఉద్దేశించి రాహుల్ కాస్ట్రో ప్రసంగించాడు. 'మరిన్ని వియత్నామ్'లు అని నేను రాసిన వ్యాసం మీద 'చెక్' (స్లోవేకియా) కమ్యూనిస్టులు ఎక్కు పెట్టిన విమర్శలను తన ప్రసంగంలో తిప్పికొట్టాడు. నా స్నేహితులు నన్ను ఇప్పుడు సరికొత్త బకూనిన్‌గా అభివర్ణిస్తున్నారు. జరిగిన రక్త పాతాన్ని ఎత్తి చూపుతూ, మరిన్ని వియత్నామ్‌ల కోసం ఇంకెంత రక్తం ధారబోయాల్సి వస్తుందో కదా అన్న అనుమానాలు వెలిబుచ్చారు.

**జూలై 25**

ఇద్దరేసి, ముగ్గురేసి సభ్యులను జట్లుగా చేసి దారులు వెతుక్కురమ్మని పంపించాం. మిగతా అందరం విశ్రాంతిగా గడిపాం రోజంతా. కోకో, బెనినో, మిగ్యుయెల్‌లు దారులు వెతికే పనికి బాధ్యులుగా ఉన్నారు. కోక్, బెనినోలు ఇద్దరూ మొరాకోకు వెళ్ళే దారిని కనిపెట్టుకు వచ్చారు. మేం బస చేసిన నీటి మడుగు ప్రవాహంగా మారి రోసిటాలో వెళ్ళి కలుస్తుందని, కాబట్టి ఆ ప్రవాహం ఒడ్డున పడి వెళ్ళొచ్చని, దార్లో తుప్పలూ పొదలూ నరుక్కుంటూ పోవాల్సిన అవసరం పడుద్దని మిగ్యుయెల్ వచ్చి చెప్పాడు.

రెండు చోట్ల దాడులు జరిగినట్లు రేడియోలో వార్తలు వెలువడ్డాయి. టావెరాస్ దగ్గర ఒకటి, శాన్‌జువాన్ డెల్ పొట్రెరో దగ్గర ఇంకొకటి జరిగినట్లు – రెండు దాడులకూ ఒకే దళం పాల్పడినట్లు చెప్పుకొచ్చారు. అయితే అవి నిజంగా జరిగిన దాడులేనా, ఇంకో దళం ఉనికి వాస్తవమేనా అనేది తేలాల్సి ఉంది.

**జూలై 26**

మొరాకో వైపు కాకుండా వేరే ఏదన్నా దారి ఉందేమో చూసి రమ్మనమని బెనినో, కాంబా, అర్బానోలను పంపించాం. మిగతా వాళ్ళం అక్కడనే ఉండిపోయాం. సెంటర్ పార్టీ వెనుక వైపుగా 'ఆంబుష్'కు ఏర్పాటు చేసింది. ఎలాంటి ఘటనలూ జరగలేదు.

శాన్‌జువాన్ డెల్ పొట్రెరో దగ్గర జరిగిన దాడి పూర్తి వివరాలను విదేశీ రేడియోస్టేషన్‌లు ప్రసారం చేసాయి. పదిహేనుమంది సైనికులు, ఒక కల్నల్‌లను బందీలుగా చేజిక్కించుకుని నిలువుదోపిడి చేసి వదిలిపెట్టారట. మా టెక్నిక్కే. కొచబాంబా – శాంతాక్రజ్ హైవేకు ఆవలి దిక్కున జరిగిందట ఈ ఘటన. జూలై 26 విశిష్టత గురించి రాత్రి సమావేశంలో చిన్నపాటి ఉపన్యాసం ఇచ్చాను. అధికారం కుదవ బెట్టుకున్న కులీనులకు, విప్లవపిడివాదానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటుగా జూలై 26ను అభివర్ణించా. ఫైడల్ రేఖా మాత్రంగా బొలీవియా గురించి ప్రస్తావించాడు.

**జూలై 27**

మేం అక్కడ నుండి బయల్దేరడానికి సర్వం సమాయత్తం అయ్యాం. పదకొండు గంటలకు ఆటోమేటిక్‌గా ఆంబుష్‌ను వదిలిపెట్టి యాక్షన్ టీంను కూడా బయల్దేరమని ఆర్డరు వేసా. పదకొండు కావడానికి కొన్ని నిమిషాల ముందుగా విల్లీ వచ్చి 'ఆంబుష్ ఏరియా'లోకి సైన్యం వచ్చిందన్న విషయం చెప్పాడు. రికార్డో, ఇంతి, ఎల్‌చినో, లీయోన్, యూస్టెక్వియోలు విల్లీతో కలిసివెళ్ళి ఆంటోనియోతో ఆర్టురో, చపాకీలతో కలిసారు యాక్షన్ చేపట్టడానికి. దాడి జరిగిన క్రమం ఇదీ – కొండ మీద తొలిగా ఎనిమిది మంది సైనికులు కనిపించారట. అక్కడ నుండి దక్షిణ దిశగా ఉన్న ఒక పాడుబడిన దారి గుండా మోర్టారు గుళ్ళు పేలుస్తూ, గుడ్డ పీలికతో సిగ్నల్ ఇస్తూ వెళ్ళి వచ్చారట. మధ్యలో వాళ్ళు 'మేల్గార్' అని కూడా పిలిచారట. ఫ్లోరిడాలో మేం కలిసిన అతనే అయి ఉండొచ్చు అతను. కాసేపు ఆగి ఎనిమిది మందీ మేం వలపన్నిన వైపుగా వచ్చారు. ఉచ్చులో పడింది నలుగురే. మిగతా నలుగురూ నిదానంగా నడుస్తున్న మూలాన

వెనక ఉండిపోయారట. అంతే మా వాళ్ళు దాడి చేయ్యడంతో స్పాట్‌లో ముగ్గురు చనిపోయారు. నాలుగో వాడూ గాయపడి ఉంటాడు. మెరుపులా దాడిచేసి మా దోవన వచ్చేసారు మావాళ్ళు. మరణించిన సైనికుల ఆయుధాలూ అవీ తీసుకు రావడం కుదరలేదు. అలా ఇంకో నీటి మడుగు దగ్గర ఎండిపోయిన ఇసుక తిన్నెల దగ్గరకు చేరుకున్నాం. గుర్రాలను వదిలేసాం. అక్కడ మళ్ళీ వలపన్నాం.

నాకు ఉబ్బసం తిరగబెట్టింది. మత్తు ఇంజక్షన్లు అయిపోవచ్చాయి.

ఎత్తు– 800 మీటర్లు.

**జూలై 28**

నదీ ముఖ ద్వారం దగ్గర కాపు కాయమని కోకో, పాచో, రావుల్, అనీసెటోలను పంపించాం. బహుశా మేం ఉన్నది సుస్పిరో నదీ ప్రాంతం అనుకుంటా. ఇరుకుగా ఉన్న కొండ ప్రాంతం కేసి దారి తీసాం మేం. అడ్వాన్సు పార్టీ నుండి వేరుపడ్డాం. మిగ్యుయెల్ దళం చాలా ముందుకు పోయింది. ఇసుక, రాళ్ళూ, రప్పల మూలంగా మేం ఎక్కిన గుర్రాలు జోరుగా ముందుకు సాగలేక పోతున్నాయి.

ఎత్తు – 760మీటర్లు.

**జూలై 29**

పర్వత పాదం వెంబడే మా ప్రయాణం సాగించాం. దక్షిణ దిక్కున ఏటవాలుగా ఉండి మేం దాక్కోవడానికి చాలా అనువైన ప్రదేశాలు ఉన్నాయి అక్కడ. దానికి తోడు నీరు పుష్కలంగా లభించే చోటయ్యే. సుమారు సాయంత్రం నాలుగు గంటలకు పాచ్యితోను కలిసాం. ప్రస్తుతానికి మేం సుస్పిరో నది రెండో అంచుకు చేరుకున్నామని, అంతా సజావుగానే ఉందని చెప్పాడు తను. అయితే ఇది సుస్పిరో నది కాదేమో అని నా అనుమానం. ఆ నది దక్షిణం దిక్కుకు ప్రవహిస్తూ ఉండాలి. అయితే ఈ నది పశ్చిమానికి తిరిగి చివరి వొంపు నుండి పోయి రోసిటా నదిలో కలుస్తుంది.

నాలుగున్నరకి 'రియర్ పార్టీ' వచ్చి చేరింది మాతో. అక్కడ నుండి దూరంగా పోవాలనే ఉద్దేశంతో ప్రయాణం కొనసాగించడం మంచిదని నిర్ణయించా. పౌలీనో పండ్ల తోటను దాటుకు వెళ్ళాలి. కానీ దళ సభ్యుల పరిస్థితి చూస్తే 'ముందుకు పోదాం' అనబుద్ధి కాలేదు నాకు. సుస్పిరో నది దాటి ఒక గంట నడిచాక రోడ్డుకు రెండు వైపులా విశ్రమించాం. జూలై 28 వాళ్ళ దేశ స్వాతంత్ర్య దినోత్సవం కాబట్టి ఎల్‌చినోను

ఆ విషయమై మాట్లాడమన్నాను. తర్వాత ప్రస్తుతానికి మేం మకాం ఉన్నచోటు ఎంత ప్రమాదకరమో నేను వివరించి, తెల్లవారు జాము ఐదు గంటలకే లేచి పాలీనో వాళ్ళ తోటకు చేరుకోవాలని చెప్పా.

గెరిల్లాల దాడిలో సైనికులు చనిపోయారని, వారి మృతదేహాలను హెలికాప్టర్‌లో తరలించారని రేడియో హవానాలో వార్తప్రసారం అయ్యింది. కాని 'న్యూస్' సరిగ్గా వినలేకపోయా.

**జూలై 30**

ఉబ్బసం నన్ను తెగ చికాకు పెట్టింది. రాత్రంతా కంటిమీద కునుకు లేకపోయింది. తెల్లారకట్ట నాలుగున్నరకే మోరోలేచి కాఫీ కాస్తూ నది ఒడ్డున కాంతి కదలాడుతున్నట్లు చూసి మమ్మల్ని లేపి హెచ్చరించాడు. సెంట్రీలను మార్చడానికి మిగ్యుయేల్ కూడా లేచాడు. ఇటుగా వస్తున్న వాళ్ళను అదుపులోకి తీసుకోవడానికి మోరో వెళ్ళాడు. మంట దగ్గర కూచుని ఉన్ననాకు ఈ మాటలు వినిపించాయి. ముందు – హేయ్, ఎవరక్కడా? – ట్రినిడాడ్ 'డిటాచ్‌మెంట్'కు చెందిన సైనికులం. అంతే హఠాత్తుగా కాల్పులు మొదలయ్యాయి. రెండు నిమిషాల తరువాత మిగ్యుయెల్ గాయపడిన ఒక సైనికుడి నుండి ఎం౧. తుపాకి, క్యాటరిడ్జ్ పెరుక్కుని నా దగ్గరకు వచ్చాడు. అచాపో దారిన 21 మంది సైనికులు వెళ్తున్నారని, మొరాకోలో 150 మంది సైనికులు ఉన్నారన్న సమాచారం చెప్పాడు. సైనికులకు ఇంకా నష్టం కలిగించాం. కానీ గాభరాలో పూర్తి వివరాలు తీసుకోలేక పోయాం. సామాన్లు గుర్రాలకు ఎక్కించడానికి చాలా సమయం పట్టింది. ఆ హడావుడిలో సైన్యం దగ్గర స్వాధీనం చేసుకున్న ఒక పట్టా కత్తిని, మోర్టారును ఎల్‌నీగ్రో ఎక్కడో జారవిడిచాడు. తెల్లవారిపోయింది. ఆరు గంటలు అయింది. గుర్రాలకు ఎత్తిన బరువులు జారిపోతా ఉండడంతో అవి మళ్ళీ సర్దవలసి వచ్చింది. ఇంకాస్త టైం తినేసింది. ఫలితంగా దళంలో చివరి వరస వాళ్ళు సైన్యం కాల్పుల మధ్యనే దాటుకుని ఇటురావల్సి వచ్చింది. అంటే అడుగు జారిపోయిన సైన్యం ఆపాటికి కూడదీసుకుంది అన్నమాట. పండ్లతోటలో పోలీనో సోదరి ఉంది. మమ్మల్ని శాంతంగా స్వాగతించింది. మొరాకోలో ఉన్న దళ సభ్యులను అరెస్టు చేసి లాపాజ్ తరలించారన్న సమాచారం మా చెవిన వేసింది.

నేను దళాన్ని తొందరపెట్టాను. కొండవాలు నదిని దాటా పోంబోతో కలిసి. మరలా కాల్పులు జరిగాయి. మేం ఇప్పుడు సైన్యాన్ని నిలవరించగలిగే పొజిషన్‌లో

ఉన్నాం. మిగ్యుయెల్, కోకో, జూలియోలను 'ఫార్వార్డ్ పొజిషన్' తీసుకోమన్నాను. గుర్రాలను అటూ ఇటూ పరుగులెత్తిస్తూనే ఉన్నా. అడ్వాన్సు పార్టీలో ఏడుగురిని, రియర్‌పార్టీలో నలుగురిని, రికార్డోను మేం వచ్చినదారిన కాపు కాయమన్నాను. వాళ్ళది 'డిఫెన్స్ పొజిషన్'. డారియో, పాబ్లో, కాంబాలు కుడి వైపున కాపు కాసారు. మిగతా వాళ్ళు ఎడమ వైపుగా నడవసాగారు. దాక్కోవడానికి వీలుగా ఉన్న చోట ఆగి కాస్త అలుపు తీసుకుంటా ఉండమన్నాను. ఇంతలో కాంబావచ్చి నది దాటుతూండగా రికార్డో, అనీసెటోలు పడిపోయారన్న సమాచారం చెప్పాడు. మిగ్యుయెల్, జూలియోల పరిస్థితి ఏమిటో చూసిరమ్మని అర్బానో, ఎల్‌నాటో, లియోన్‌లను రెండు గుర్రాలిచ్చి పంపించా. కోకోను అక్కడే సెంట్రీగా వదలిరమ్మన్నా. అయితే ఈ సూచనలు పాటించకుండా వాళ్ళు ముందుకు వెళ్ళారు. కాంబా వెనక్కి తిరిగి వచ్చి సైనికులు అనుకున్న దానికన్నా చాలా ముందుకు చొచ్చుకు వచ్చారని అవతల మిగ్యుయెల్, జూలియోలు వెనుకడుగు వేసి (రిట్రీట్) నా తదుపరి ఆజ్ఞల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పాడు. ఇంతి, పాంబో, ఎల్‌చీనో, నేను తప్ప మిగతా వారిని అక్కడ నుంచి పంపించేసా. ఒంటిగంటకు జూలియోను అడ్వాన్సు సెంట్రీగా ఉండమని చెప్పి మిగ్యుయెల్‌ను వచ్చెయ్యమన్నా. గుర్రాల సహా మేమూ అక్కడ నుండి వెనక్కి తగ్గాం. నేను కోకో ఉన్న 'పోస్టు' చేరుకున్న. ఇంతలో రావుల్ చనిపోయినట్లు, రికార్డో పాచోలు గాయపడినట్లు సమాచారం అందింది. రికార్డో, అనీసెటోలు దూకుడుగా 'క్లియరింగ్' చేస్తుండగా రికార్డోకు గాయాలు అయ్యాయట. దాంతో ఆంటోనియో కాల్పులు సాగిస్తుండగా ఆర్టురో, అనీసెటో, పాచోలు రికార్డోను రక్షించి తీసుకువచ్చారు. కానీ ఆ క్రమంలో పాచో గాయపడ్డాడు. రావుల్ నోట్లోంచి బుల్లెట్ దూసుకుపోయి అక్కడికక్కడే చనిపోయాడట. విల్లీ, చపాకోలు ఉన్నా వాళ్ళ నుంచి అందిన సాయం అంతంత మాత్రమేనట, మరీ ముఖ్యంగా చపాకో అయితే మొద్దల్లే ఉండిపోయాడట. దాంతో ఇద్దరు గాయపడిన మనుషులను భుజాల మీద వేసుకుని వెనక్కి తగ్గాల్సి రావడం కనాకష్టంగా మారింది. అలాంటి పరిస్థితులో అర్బానో తన దళంతో, గుర్రాలతో బెనినో తన మనుషులతో వాళ్ళకు అండగా వచ్చారు. ఫలితంగా మిగతా వాళ్ళకు రక్షణ లేకుండా పోయింది. సైనికులు మిగ్యుయెల్‌ను దెబ్బతీసే దిశగా దూసుకువచ్చారు. అడవుల్లో పడి నానాకష్టాలు చవిచూస్తూ ఎట్టకేలకు వచ్చి మమ్మల్ని కలుసుకున్నారు. గాయపడిన పాచోను గుర్రం మీద ఎక్కించి తీసుకువచ్చారు. రికార్డో గుర్రం మీద కూచోలేని పరిస్థితి మూలాన కాన్వాస్ ఉయ్యాలలో పడుకోబెట్టి తెచ్చారు. పాబ్లితో, డారియో, కోకో, అనీసెటోలను వెళ్ళి నది బాహ్యాముఖ ద్వారం ఎడమ గట్టున మాటు వేసి ఉండమని పంపించాను. గాయపడిన వాళ్ళకు

శుశ్రూష చేసాం. పాచోకు పైపైన గాయం అయింది. పిర్రలమీద, వృషణాల మీద చర్మం రేగిపోయింది. రికార్డో గాయం తీవ్రమైనదే. అతనికి ప్లాస్మా ఎక్కించాల్సి ఉండే. కానీ ఆ మందులు ఉన్న బ్యాగును విల్లీ గుర్రాలకు ఎక్కించేటపుడు ఎక్కడో పడిపోయింది. రికార్డో చనిపోయాడు. నది దాపున సైనికులు కంట పడని ఒక రహస్య ప్రదేశంలో రికార్డో భౌతిక కాయాన్ని ఖననం చేసాం.

**జూలై 31**

తెల్లవారుజాము నాలుగు గంటలకు ఒక 'షార్ట్‌కట్' మార్గం గుండా నదికి అడ్డంపడి వెళ్ళాం. ఎక్కడా మా అడుగుజాడలు, ఆనవాళ్ళు లేకుండా జాగ్రత్త పడ్డాం. మిగ్యుయెల్ మీద దాడి జరిగిన ప్రదేశానికి చేరుకున్నాం. అడుగుజాడలు పడకుండా చూసుకోమన్నాం. అతను తగిన జాగ్రత్తలు తీసుకోలేదని అర్థం అవుతుంది. నది ఎగువకు నాలుగు కిలోమీటర్లు ప్రయాణించాం. అడవుల్లోకి చొరబడ్డాం. మేం అటుగా వచ్చిన జాడలు అన్నీ శుభ్రంగా తుడిపేసాం. అడవిలో ఒక నీటి మడుగు దగ్గర మకాం వేసాం. రాత్రి జరిగిన చర్చలో మా 'యాక్షన్'లో లోపాలను నేను వివరించా. (1) మకాం వేసిన చోటే సురక్షితమైనది కాదు. (2) బయల్దేరడంలో జరిగిన ఆలస్యం శత్రువు మాపై కాల్పులు జరపడానికి అవకాశం ఇచ్చింది. (3) మితిమీరిన ఆత్మవిశ్వాసం మూలంగా రికార్డో, రావుల్‌లు ఆత్మరక్షణలో పడిపోయారు. (4) ఆయుధాలు, సామాన్లు కాపాడుకోవడంలో నిబద్ధత లేకుండా పోయింది. మందులు ఉన్న పదకొండు కిట్లు జారిపోయాయి. టేప్‌రికార్డరు, ఫీల్డ్‌గ్లాస్‌లు ఇతరత్రా అత్యవసరమైన వస్తువులు చేజారిపోయాయి. ట్రాట్స్కీపుస్తకం, నన్ను ఇంటర్వ్యూ చేస్తూ డెబ్రేరాసిన నోట్‌పుస్తకం కూడా పోయాయి. ఇప్పుడు మేం పోగొట్టుకున్న వన్నీ శతృవుకు విశ్వాసాన్ని ఇచ్చేవే. మా లెక్కప్రకారం ఇద్దరు సైనికులు మృతిచెంది, నలుగురు గాయపడి ఉండాలి. కాని ఈ విషయమై పరస్పర విరుద్ధమైన వార్తలు వెలువడ్డాయి. 28న జరిగిన దాడిలో నలుగురు సైనికులు మృతి చెందినట్లు, మరో నలుగురు గాయపడినట్లు సైన్యం ప్రకటించింది. కానీ చిలీ నుండి ప్రసారమయిన వార్తల్లో 30న జరిగిన దాడిలో ఆరుగురు సైనికులు గాయపడ్డారని, ముగ్గురు మృతిచెందారని ప్రకటించారు. తరువాత సైన్యం మరో ప్రకటన విడుదల చేసింది. గెరిల్లా శవాన్ని ఒక దాన్ని స్వాధీనం చేసుకున్నట్లు, ప్రమాదకర పరిస్థితుల్లో చిక్కుకుపోయిన ఒక సబ్-లెఫ్టినెంట్‌ను రక్షించినట్లు చెప్పుకొచ్చారు. రావుల్ మరణం లెక్కలోకి రాకుండా పోయింది. సహజంగానే తను

అంతర్ముఖంగా ఉంటాడు. అతను గొప్ప యోధుడో, మెరికలాంటి కార్యకర్తో కాకపోవచ్చు కానీ రాజకీయ సమస్యల మీద తీవ్రమైన ఆసక్తి కనబరిచేవాడు. క్యూబన్ దళ సభ్యులలో కెల్లా రికార్డో అత్యంత క్రమశిక్షణా రాహిత్యంతో ఉండేవాడు. రోజు రోజుకు దళ సభ్యుల బలిదానాలు పెరుగుతా ఉన్న కూడా నిర్ణయాత్మకంగా వ్యవహరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించాడు. కాని అతను అద్భుతమైన యోధుడు. కాంగోలో జరిపిన గెరిల్లా యుద్ధంలో సెగుండో దగ్గర మేం ఓటమి చవిచూసినప్పుడు, అతను నా సహచరుడిగా ఉన్నాడు. ఇప్పుడు ఇక్కడ. అతని అలవాట్లే అతని ప్రాణం మీదకు తెచ్చేవి. ఇరవై ఇద్దరం మిగిలాం. పాచో, పాంబోలు గాయపడ్డారు. నేను ఉబ్బసంతో తీసుకుంటున్నా.

**నెలసరి సమీక్ష**

క్రితం సమీక్షలో గుర్తించిన బలహీనతలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. జోయాక్విన్‌తో, బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. దళ సభ్యులను కోల్పోతున్నాం. ఉన్నది ఇరవై రెండుమంది. నాతో సహా ముగ్గురు వికలాంగుల కింద లెక్కే. మా మూలంగా మొత్తం దళం కదలికలకు పరిమితులు ఏర్పడిపోయాయి. సుమైపాటా సహా మొత్తం మూడు దాడులు నిర్వహించాం. సైన్యం వైపున ఏడుగురి మృతి, పది మందికి గాయాలు. ఇవి సుమారు లెక్కలే. మా వైపున ఇద్దరిమృతి, ఒకరికి గాయాలు.

**మొత్తం పరిస్థితిని ఈ విధంగా అంచనా వేసుకోవచ్చు.**

(1) బాహ్య సంబంధాల లేమి కొనసాగుతుంది.

(2) రైతులు మాతోచేతులు కలపని బలహీనత లోటుగా కొనసాగుతుంది. అయితే మేం ఎరిగిన రైతులు మమ్మల్ని ఇప్పుడు సాదరంగా స్వాగతించడం ఆశావహంగా కనబడుతుంది.

(3) గెరిల్లాలు మా ఉద్యమానికి ఖండాంతర రూపురేఖలు తీసుకురావడంలో విశేషంగా కృషి చేస్తున్నారు. ఓన్‌గానియా అర్జెంటీనా సరిహద్దులను మూసివేసాడు. పెరూ తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది.

(4) పౌలీనో ద్వారా 'కాంటాక్టు' ఏర్పరుచుకోవాలన్న ప్రయత్నమూ విఫలమైంది.

(5) పోరాటాలు పెరిగే కొద్దీ గెరిల్లా దళ సభ్యుల నైతిక స్థైర్యం, అనుభవం, ఇనుమడిస్తుంది. కాంబా, చపాకోలు దుర్బలంగా ఉన్నారు.

(6) సైన్యం చొరబడడానికి కాళ్ళు తొక్కుకుంటుంది. కాని కొన్ని డివిజన్ల సైన్యం సాపేక్షంగా దూకుడుగా ఉన్నారని అర్థం అవుతుంది.

(7) రాజకీయ సంక్షోభం తీవ్ర తరం అవుతుంది. అయితే అమెరికా అంచెలంచెలుగా అందిస్తున్న రుణం అసంతృప్తిని, తిరుగుబాటును ఎగసన దొయ్యకుండా నివారిస్తుంది. బొలీవియా ప్రమాణాల ప్రకారం చూస్తే అమెరికా అందిస్తున్న ఆర్థికసాయం ఏ రకంగానూ తక్కువ కాదు.

తక్షణ కర్తవ్యాలు: 'కాంటాక్టు' పునరుద్ధరించుకోవడం, దాడులు చెయ్యగలిగే వాళ్ళను 'రిక్రూట్ చేసుకోవడం, మందులు సంపాదించడం.

# ఆగస్టు 1967

**ఆగస్టు 1**

సాధారణంగా గడిచింది ఈ రోజు. మిగ్యుయెల్, కాంబాలు కొత్త దారి ఏర్పాటు చేసే పనిలో ఉన్నారు. కానీ క్లిష్టమైన పని కావడంతో ఒక కిలోమీటరు దూరానికే బాగా డస్సిపోయారు. చిత్రంగా ఒక పందెపు గుర్రం మాకు చిక్కింది. దాన్ని చంపేసాం. ఐదారు రోజులకు సరిపడా మాంసం దొరికింది. అక్కడక్కడ చిన్న చిన్న కందకాలు తవ్వాం. సైన్యం ఆ తోవన వస్తే ఆ కందకాల్లో ఉండి దాడులకు పాల్పడాలని ప్లాన్ వేసాం. సైన్యం రేపో, ఎల్లుండో అటుగా వస్తే ముందు పోనిచ్చి, మా స్థావరం కనిపెట్టలేక వెనక్కి తిరిగి వచ్చేటప్పుడు దాడి చెయ్యాలనేది మా వ్యూహం.

**ఆగస్టు 2**

ఆ రోజు డొంకరోడ్డు పని బాగా సాగింది. బెనినో, పాబ్లోలకు అభినందనలు చెప్పాల్సిందే. ఇవాళ వాళ్ళవంతు పని. వాళ్ళు మలిచిన రోడ్డు చివర నుండి మా స్థావరం దగ్గరకు రావడానికి రెండు గంటలు పట్టింది. రేడియోలో ప్రత్యేకించి వార్తలేవీ లేవు. అసాంఘిక వ్యక్తి మృతదేహాన్ని ఒక దాన్ని తరలించినట్లు ఒక వార్త మాత్రం ప్రసారం అయ్యింది. ఉబ్బసం రోగం నన్ను బాగా ఇబ్బందిపెడుతుంది. మిగిలిన ఆఖరి ఇంజెక్షను చేసుకున్నా. ఇహ నాదగ్గర మిగిలింది టాబ్లెట్లు. అవి కూడా పది రోజులకు మాత్రమే సరిపడా ఉన్నాయి.

**ఆగస్టు 3**

దారి పని ప్రహసనంగా మారింది ఈ రోజు. మిగ్యుయెల్, అర్బానోలు 57వ నిమిషంలో వెనక్కి తిరిగొచ్చారు. పని మహా ఈడికగా సాగింది. వార్తల్లో విశేషాలేమి

లేవు. పాచో బాగానే కోలుకుంటున్నాడు. నా పరిస్థితే దిగజారిపోతుంది. పగలూ, రాత్రి యమయాతన పడ్డాను. ఈ బాధ నుండి తక్షణం ఉపశమనం ఏదీ కానరాకుండా పోయింది. నోవాకైన్ ఇంజక్షను నరాలకు చేసుకున్నా ఫలితం లేకపోయింది.

**ఆగస్టు 4**

మా వాళ్ళు ఒక కొండ వాగును చేరుకున్నారు. అది నైరుతి దిక్కుకు ప్రవహిస్తుంది. బహుశా గ్రాండే నదిని కలిసే నీటి ప్రవాహంతో ఎక్కడో అక్కడ కలవవచ్చు. మరుసటి రోజు నుండి ఇద్దరేసి చొప్పున తుప్పలు నరికే పనికి వెళ్ళాలని నిర్ణయించాం. మిగ్యుయెల్ కొండెక్కి దగ్గర్లో ఏమన్నా తోటలు ఉన్నాయోమో చూసి రావాలని చెప్పాం. నా ఉబ్బసం కాస్త నిమ్మళించింది.

**ఆగస్టు 5**

బెనినో, కాంబా, అర్బానో, లియోన్‌లు రెండు జట్లుగా పని ప్రారంభించారు. దాని సంగతి త్వరగా తెమల్చడానికి పూనుకున్నారు. అయితే మధ్యలోనే వాళ్ళకు ఇంకో ప్రవాహం అడ్డు తగిలింది. అది రోసిటా నదిలోకి పోయి కలుస్తుంది. దాంతో వాళ్ళు చుట్టు తిరిగి వెళ్ళారు. కొండ మీదకు వెళ్ళొచ్చిన మిగ్యుయెల్ దగ్గర్లో తోటలేవీ లేవన్న కబురు చెప్పాడు. మా దగ్గర నిలవ ఉన్న గుర్రపు మాంసం అయిపోయింది. ఇవాళా, రేపూ చేపలు పట్టుకుని కడుపు నింపుకోవాలనుకున్నాం. ఎల్లుండికి అవసరాన్ని బట్టి మా దగ్గర ఉన్న గుర్రాల్లో ఒక దాన్ని బలి ఇద్దాం అనుకున్నాం. రేపు కొత్తగా కనుగొన్న నీటిమడుగు దగ్గరకు వెళ్దాం అనుకున్నాం. ఉబ్బసం నన్ను విడిచి పెట్టనంటుంది. అయిష్టంగానే రెండు గ్రూపులుగా విడివడ్డాం. ఒక గ్రూపును ముందుగా పంపించాలి. బెనినో, జూలియోలు ముందుకొచ్చారు. ఎల్‌నాటో పరిస్థితి ఏంటో పరిశీలించాలి.

**ఆగస్టు 6**

అనుకున్నట్లే ఈ రోజు మకాం మార్చాం. దురదృష్టం ఏమిటంటే మేం అనుకున్నట్లు ప్రయాణం మూడు గంటలు పట్టలేదు. ఒక గంటలో పూర్తయిపోయింది. అంటే మేం వెళ్ళాల్సిన దూరం ఇంకా చాలా ఉంది. బెనినో, అర్బానో, కాంబా, లియోన్‌లు తమ పట్టా కత్తులకు పనిచెబుతూ తుప్పలు,పొదలు నరుకుతూ ముందుకు సాగారు. మేం మకాం చేసిన మడుగు ఎక్కడ రోసిటా నదిలోకి కలుస్తుందో చూసి

రావడానికి మిగ్యుయెల్, అనీసెటోలు వెళ్ళారు. చీకటి పడినా వాళ్ళింకా తిరిగి రాలేదు. దాంతో మేం తగిన జాగ్రత్తలు తీసుకున్నాం. అదీగాక దగ్గర్లో ఎక్కడి నుండో మోర్టారు పేలిన శబ్దం లీలగా నేను విన్నాను. ఈ రోజున బొలీవియా స్వాతంత్ర్య దినోత్సవం. నేను, ఇంతి, చపాకో ఈ విషయమై చిన్న మీటింగు చెప్పాం.

ఎత్తు – 720 మీటర్లు.

**ఆగస్టు 7**

పదకొండు గంటల వరకూ చూసి ఇహ మిగ్యుయెల్, అనీసెటోలు తప్పిపోయినట్లే అనుకున్నా. రోసిటా నది వరకూ వెళ్ళి మన వాళ్ళు ఇద్దరి జాడా కనుక్కురమ్మని బెనీనోకు పురమాయించా. 'జాగ్రత్తా' అని హెచ్చరించి మరీ పంపించా. మధ్యాహ్నం ఒంటిగంటకు తప్పిపోయారు అనుకున్న ఇద్దరూ మాముందు ప్రత్యక్షమయ్యారు. దార్లో నానా అగచాట్లూ పడ్డారట. వెనక్కి తిరిగి వద్దామనుకుంటే చీకటి పడిపోయిందట. రోసిటా చేరనే చేరలేదని చెప్పారు. మిగ్యుయెల్ నాతో చేదు మింగించాడు ఈ పూట. హరాయించుకోలేక పోయాను. విషయం విన్నాక. ఈ రోజుకు ఇక్కడనే మకాం అని నిర్ణయించాం. అయితే దార్లు వెతకడానికి వెళ్ళిన వాళ్ళు ఇంకో నీటి మడుగు అజ కనుక్కుని వచ్చారు. రేపు అక్కడికి మారిపోవాలి. ముసలిగుర్రం ఇవాళ చనిపోయింది. మా బరువులన్నీ మోసేదానికి ఇంక ఒక గుర్రమే మిగిలింది. నా ఉబ్బసం తేడాపాడా లేకుండా అదే లెక్కన కొనసాగుతుంది. మందులయితే వాడుతున్నాను. నకాహుయాసుకు ఒక దళాన్ని పంపాలా లేదా అనేది రేపు నిర్ణయం తీసుకోవాలి.

మేం ఇక్కడకు అడుగుపెట్టి గెరిల్లా దళాన్ని ఏర్పాటు చేసి నేటికి తొమ్మిది నెలలు నిండాయి. తొలి ఆరు నెలల్లో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఒకరి ఆచూకీ లేకుండా పోయింది. నేను ఉబ్బసంతో తీసుకుంటున్నా. దీని నిదానం ఎలానో అర్థంకాకుండా ఉంది.

**ఆగస్టు 8**

చురుగ్గా ఒక గంట ప్రయాణించాం. కానీ నాకైతే రెండు గంటలు ప్రయాణం చేసినట్లు అనిపించింది. గుర్రం అంతలా చికాకు పెట్టింది. ఒక దశలో అసహనంతో తట్టుకోలేక గుర్రం మెడ మీద నా దగ్గర ఉన్న చిన్నకత్తిదూసా. గాయం అయింది

దానికి.  కొత్తగా మకాం వేసే చోటు అటు రోసిటా నదికి గానీ ఇటు గ్రాండే నదికి గానీ పోయే తోవలో ఉన్న చివరాఖరి నీటి మడుగు ఉన్న ప్రాంతం. పట్టాకత్తి దళం మాకన్నా ఒక నలభై నిమిషాల ముందు ఉంది. (బహుశా రెండు మూడు కిలోమీటర్ల దూరం). ఎనిమిది మంది సభ్యులతో ఒక దళాన్ని, అది చెయ్యాల్సిన పనిని రూపొందించా. రేపు దళం బయల్దేరి రోజంతా ప్రయాణం సాగించాలి. మరుసటి రోజు కాంబో వెనుదిరిగి రావాలి. ఏం జరిగిందీ రిపోర్టు చెయ్యాలి. ఆ మరుసటి రోజు పాబ్లితో, డారియోలు వెనక్కి తిరిగి వచ్చి రిపోర్టు చెయ్యాలి. మిగతా ఐదుగురూ వర్గాస్ ఇంటి దాపుల వరకూ వెళ్ళాలి.  అక్కడ నుండి కోకో, అనీసెంటోలు వెనక్కి తిరిగి వచ్చి విశేషాలు రిపోర్టు చెయ్యాలి. బెనినో, జూలియో, ఎల్‌నాటోలు నకాహుయాసు వెళ్ళి నాకు మందులు దొరుకుతాయేమో ప్రయత్నించాలి. ఎక్కడా దాడులకు పూనుకోకుండా జాగ్రత్త వహించాలి. ఎందుకంటే తరువాత దళం అంతా అదే దారిన ప్రయాణించాలి. వర్గాస్ ఇంట్లోగాని ఇంకాస్త ఎగువన గానీ ఒక చోట మా ప్రయాణ వేగాన్ని బట్టి గ్రాండే నది వైపు ఉండే గుహల దాపున ఉన్న నీటి మడుగు దగ్గర గానీ నకాహయాసు దాపున గానీ మరో చోట విందుకు ఏర్పాట్లు చెయ్యాలి. 'డంప్'లో దాచిన మా ఆయుధాలు సైన్యం స్వాధీనం చేసుకున్నట్లు రేడియోలో ఒక ప్రకటన వచ్చింది.

రాత్రికి అందరినీ సమావేశపరిచాను. ముఖ్యమైన విషయాలు చర్చకు పెట్టాను. "మనం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. పాచో పరిస్థితి మెరుగవుతుంది. నేను విరిగిన ఓడ మాదిరి తయారయ్యాను. ఇవాళ గుర్రం మీద కత్తిదూసిన ప్రహసనాన్నే తీసుకోండి నేను నిగ్రహం కోల్పోతున్నా అనే దానికి ఉదాహరణ కదా. నన్ను నేను సరిదిద్దుకుంటాను. ఇలాంటి పరిస్థితే మీ అందరికీ ఎదురుకావచ్చు. అలా ఎవరికన్నా అనిపిస్తే మనసువిప్పి చెప్పడం అందరికీ మంచిది. ఇలాంటి పరిస్థితులలో మనం కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి.  క్లిష్టమైన  పోరాటాలు మనల్ని మనం విప్లవకారులుగా తీర్చిదిద్దుకునే అవకాశాలు, సర్వోత్కృష్ట మానవ జీవితం అంటే అదే కదా. అంతే కాదు. సుశిక్షిత గెరిల్లా యోధుడిగా తయారయ్యేందుకు కూడా ఇది అవకాశం ఈ రెండు దశలూ చేరుకోవడానికి ఎవరికన్నా ఏ ఇబ్బందులు ఉన్నా అశక్తులయినా ఈ క్షణానే వాళ్ళు పోరాటం నుండి పక్కకు వైదొలగడం మంచిది' అని చెప్పా. క్యూబా, బొలీవియా దేశాల నుండి ప్రతినిధులుగా ఉన్న దళ సభ్యులు కడదాకా కొనసాగుతాం అని చెప్పారు. ఈస్టెక్వియో కూడా అదే మాట మీద ఉన్నాడు.  ముందుగా తన కిట్ బ్యాగ్ తాను మోసుకోకుండా గుర్రం మీద వేసినందుకు, వంట చెరకు మోసుకు రానందుకు నేను విమర్శించా. దాంతో అతను ఘాటుగా స్పందించాడు. మోరో, పాచోల మీద కూడా జూలియో ఇలాంటి విమర్శే సంధించాను. దానికి పాచో ఘాటుగా బదులిచ్చాడు. అయితే నేను కల్పించుకుని విషయాలను కలగాపులగం చేసి చర్చించుకోవడం వలన ఉపయోగం లేదని చెప్పి చర్చకు ముగింపు పలికాను. మన ముందు ఉన్న సమస్య

గెరిల్లా పోరాటాన్ని కడదాకా కొనసాగించడమా లేదా అనేదే. మిగతా వన్నీ ఉద్యమంలో తలెత్తే చిన్న చిన్న సమస్యలు. ఈ సమస్యల ప్రాతిపదికన కీలక నిర్ణయాలను అప్రాధాన్యంగా చేసి చూడకూడదు. ఈస్టెక్వియో, జూలియోల ధోరణిగాని, మోరో, పోచోల స్పందనగానీ సరికావని నొక్కి చెప్పాను. మనం విప్లవతత్వాన్ని మరింత వంటబట్టించుకోవాలి. ఆదర్శంగా మిగలాలి అని హితవు పలికాను.

**ఆగస్టు 9**

ఎనిమిది మంది దళం తెల్లవారు జామునే బయల్దేరింది. పట్టాకత్తి దళం – మిగ్యుయెల్, అర్బానో, లియోన్‌లు – మా స్థావరానికి 50 నిమిషాల దూరంలో ఉన్నారు. నా అరిపాదం మీద లేచిన 'ఆనె'కు శస్త్రచికిత్స చేసి తొలగించాను. కాలు కింద పెట్టనిస్తుంది కానీ ఒకటే తీపి, నొప్పి. కాస్త జ్వరం కూడా వచ్చింది. పాచో హుషారుగా ఉన్నాడు.

ఎత్తు – 780 మీటర్లు.

**ఆగస్టు 10**

ఆంటోనియో, చపాకో వేటకు వెళ్ళారు. ఒక దుప్పిని టర్కీకోడిని కొట్టుకు తెచ్చారు. వాళ్ళు ఇంతకు ముందు మేం వదలి వచ్చిన స్థావరం కేసి వెళ్ళి వచ్చారు. చెప్పుకోదగిన విశేషాలేమీ లేవు. వస్తూ వస్తూ మోపెడు బత్తాయిలు తెచ్చారు. నేను రెండు పళ్ళు తిన్నా. క్షణాల్లో ఆయాసం కమ్మేసింది నన్ను. మధ్యాహ్నం ఒకటిన్నరకు కాంబా తిరిగి వచ్చాడు. నిన్నటి రోజున చుక్క నీళ్ళు లేకుండా పడుకోవాల్సి వచ్చిందట. ఇవాళ ఉదయం తొమ్మిది గంటల వరకూ ఏమీ కనబడలేదని చెప్పాడు. బెనీనో మొత్తానికి వెళ్ళాల్సిన చోటును గుర్తుపట్టినట్లే ఉన్నాడు. నీళ్ళ కోసం రోసిటా వైపు ప్రయాణం చేస్తున్నారు. నీటి మడుగును చేరుకుంటే కనుక పాబ్లో, డారియోలు అక్కడ నుండి వెనక్కి మళ్ళీ వస్తారని కాంబా రిపోర్టు చేసాడు.

ఫైడల్ ఇవాళ సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చాడు. సంప్రదాయ రాజకీయ పార్టీలను దునుమాడేసాడు. మరీ ముఖ్యంగా వెనిజులా పార్టీల మీద ధ్వజం ఎత్తాడు. బహుశా తెరవెనుక ఏవో క్లిష్టమైన ఇబ్బందులే ఉన్నట్లున్నాయి.

నా పాదానికి మందులవీ పూసారు. కాస్త మెరుగ్గా ఉంది. కానీ పరిస్థితి ఏమీ బాగాలేదు. ఏది ఎలా ఉన్నా రేపు ఇక్కడ నుండి బయల్దేరాలి. పట్టాకత్తి దళానికి మా స్థావరానికి ఉన్న దూరం తరగాలి. రోజంతా శ్రమపడితే వాళ్ళు 35 నిమిషాల నడకదారి ఏర్పాటు చెయ్యగలిగారు.

**ఆగస్టు 11**

దారి పని ఈడికగా సాగుతుంది. సాయంత్రం నాలుగు గంటలకు పాబ్లో, డారియోలు తిరిగి వచ్చారు. రోసిటా చేరుకున్నట్లు అక్కడ నుండి వర్గాస్ ఇంటికి చేరుకోవడానికి కనీసం మూడు రోజులు పడుతుందని బెనినో లెక్కవేసి మరీ వివరాలతో ఒక చిట్టీ పంపించాడు. రాత్రి గడిపిన నీటి మడుగు దగ్గర నుండి పాబ్లితో తెల్లారుగట్ల ఎనిమిదింబావుకి బయల్దేరాడు. మధ్యాహ్నం మూడు గంటలకు మిగ్యుయెల్‌ను కలిసాడు. అంటే అక్కడికి చాలా దూరం పోవాలన్న మాట. టర్కీకోడి మాంసం నా ఉబ్బసానికి సరిపడదు. అందుకే నాకు కొద్దిగా పెట్టారు. అది కూడా నేను పాచోకే ఇచ్చాను. మా మకాం కొత్త నీటిమడుగు దగ్గరకు మార్చాం. మధ్యాహ్ననికి ఎండిపోయి ఏ అర్థరాత్రికో నీరు ప్రత్యక్షమవుతుంది ఆ మడుగులో. వర్షం కురిసింది. కాని చలిపెట్టల్లేదు. చచ్చే దోమలు.

ఎత్తు – 740 మీటర్లు.

**ఆగస్టు 12**

ఎండ కాచింది. పొడిపొడిగా ఉందీరోజు. పట్టాకత్తి దళం పెద్దగా ముందుకు పోలేకపోయింది. అంతా ప్రశాంతంగా గడిచింది. ఆహారం నిండుకోసాగింది. రేపు గుర్రాన్ని బలిపెట్టాలి. ఐదారు రోజుల వరకూ అదే ఆహారం. నా ఉబ్బసం కాస్త నిదానించింది. భరించగలుగుతున్నా. గెరిల్లా దళం తరిగిపోతుందని బారియాంటోస్ ప్రకటించాడు. క్యూబా మీద దండెత్తి విధ్వంసానికి, పూనుకుంటాం అని మరోసారి వదరాడు. మూర్ఖుడు, ఎప్పుడూ ఇంతే.

మాంటెగుడో దగ్గర సైన్యం జరిపిన దాడిలో ఒక గెరిల్లా మరణించినట్లు రేడియోలో వార్త వచ్చింది. టారతాకు చెందిన ఆంటోనియో, ఫెర్నాండెజ్‌గా గుర్తించారు. ఆ పేరుపెడ్రో అసలు పేరును పోలి ఉంది. అతను కూడా టారతాకు చెందినవాడే.

**ఆగస్టు 13**

మిగ్యుయెల్, అర్బానో, లియోన్, కాంబాలు బెనినో కనిపెట్టిన నీటి మడుగు దగ్గరకు బయల్దేరారు. అక్కడ నుండి ముందుకు పోవాలని నిర్ణయించారు. వాళ్ళతో మూడు రోజులకు సరిపడా ఆహారం కూడా తీసుకు వెళ్ళారు. నిన్నటి రోజున పాచో గుర్రాన్ని చంపి ఉప్పురాసి ఎండబెట్టిన మాంసపు తునకలే వాళ్ళ ఆహారం. మా దగ్గర

మరో నాలుగు జీవాలు ఉన్నాయి. మాకు ఆహారం దొరికే లోపు మరొక జీవాన్ని త్యాగం చెయ్యాల్సి ఉంటుందేమో. అంతా సజావుగా సాగితే కోకో, అనీసెటో రేపీపాటికి వచ్చి మమ్మల్ని కలుసుకోవాలి. ఆర్టురో రెండు గిన్నీ కోళ్ళను చంపి తెచ్చి వండి నా వాటాగా ఇచ్చేసాడు. ఉన్న జొన్నలూ కొద్దిగానే ఉన్నాయి. చపాకో నానాటికీ స్థిమితం కోల్పోతున్న దాఖలాలు కనబడుతున్నాయి. పాచో పరిస్థితి మెరుగవుతుంది. కానీ నా ఉబ్బసం నిన్నటి కన్నా ముదిరింది. రోజుకు మూడు మాత్రలు మింగుతున్నా. అరిపాదం దాదాపుగా మానుపట్టింది.

**ఆగస్టు 14**

చీకటి రోజు. మా కార్యకలాపాలు చురుగ్గా లేవు. అందుకే మావైపున ఏం విశేషమూ లేదు. అయితే మా దళం ఏ గుహను చేరుకోవడానికి బయల్దేరిందో ఆ గుహను సైన్యం చేజిక్కించుకున్నట్లు రేడియో ప్రసారం చేసింది. వివరాలు సంక్షిప్తంగా ఉన్నా సందేహమేం లేదు అందులో. ఇహ నేను ఉబ్బసంతో తీసుకుంటా ఉండాల్సిందే. డాక్యుమెంట్లు, ఫొటోలు కూడా సైన్యం స్వాధీనం చేసుకుంది. ఇది మేం కోలుకోలేని దెబ్బ. ఎవరో ఉప్పందించి ఉంటారు. ఎవరయి ఉంటారు? మాకూ తెలీదు.

**ఆగస్టు 15**

పాబ్లితో ద్వారా మిగ్యుయెల్‌కు ఒక సందేశం పంపించా. కోకో, అనీసెటోలు గనుక ఇప్పటికీ వెనక్కి రాకపోయి ఉంటే బెనీనో జాడ కనుక్కోవడానికి ఇద్దరు మనుషులని పంపించమని ఆదేశించా. అయితే దారిలోనే వాళ్ళిద్దరూ ఎదురుకావడంతో ముగ్గురూ కలసి వెనక్కి వచ్చారు. పొద్దువాలిన చోట మకాం వేస్తున్నానని వీలయితే తాగడానికి మంచినీళ్ళు పంపించమని మిగ్యుయెల్ సమాచారం పంపాడు. రేపు ఎట్టి పరిస్థితుల్లోనూ దళం ఇక్కడ నుండి బయల్దేరాల్సిందే అన్న హెచ్చరికను మిగ్యుయెల్‌కు అందించి రమ్మని దారియోను పంపించా. అయితే అతను దారి తప్పి లియోన్ దగ్గరకు వెళ్ళి వచ్చి మార్గం సిద్ధం అయిందన్న వార్త చెప్పాడు.

ముయుపాంపా దళానికి చెందిన ఇద్దరు సభ్యులను సైన్యం బందీలుగా చేజిక్కించుకుందనే సంక్షిప్త సమాచారం శాంతాక్రజ్ రేడియో ప్రసారం చేసింది. నిస్సందేహంగా వాళ్ళు జోయాక్విన్ దళానికి చెందినవారే. వాళ్ళిద్దరినీ విపరీతంగా చిత్రహింసలు పెట్టినట్లున్నారు. ఇద్దరూ రహస్యాలు కక్కేసారు. చలిగా ఉంది. ఐనా ఆ

రాత్రి గడవడానికి నేను అట్టే ఇబ్బంది పడలేదు. అరిపాదంలో మరో ఆనె లేచింది. దాన్ని కోసెయ్యాలి. పాచో బాగున్నాడు.

చుయుయాకీ దగ్గర సైన్యానికి గెరిల్లాలకు మధ్యన కాల్పులు జరిగాయనీ, సైన్యం వైపున ఎటువంటి నష్టం జరగలేదని రేడియో ప్రసారం చేసింది.

**ఆగస్టు 16**

మూడు గంటల నలభై నిమిషాల పాటు ఏకబిగిన చురుగ్గా నడిచాం. ఒక గంట విశ్రాంతి తీసుకున్నాం. దారి బాగుంది. గుర్రం జీను మీద నుండి నన్ను పడదోసింది. ఒక కర్ర గుచ్చుకుంది నాకు. కానీ గాయం ఏమీకాలేదు. అరిపాదం నయం అవుతావుంది. మిగ్యుయెల్, అర్బానో, కాంబాలు తుప్పలు నరుక్కుంటూ రోసిటా చేరుకున్నారు. బెనినో ఈ రోజున గుహ దగ్గరకు చేరుకోవాల్సి ఉండె. మేం ఉన్న ప్రాంతం గగనతలం మీద విమానాలు చక్కర్లు కొట్టాయి. బహుశా వెర్గాస్ ఇంటి దగ్గర మా కాలిజాడలో, రోసిటా వైపుగా వస్తున్న అడుగుజాడలో, గ్రాండే నదికేసి వెడుతున్న వారి ఆనవాళ్ళో కనిపెట్టినట్లున్నారు. రాత్రి అందరినీ కూచోబెట్టి నదిదాటడంలో ఉన్న ప్రమాదాల గురించి వివరించాను. మరుసటి రోజు పక్కా ప్రణాళిక రూపొందించాం.

ఎత్తు – 600 మీటర్లు.

**ఆగస్టు 17**

తెల్లవారుజామునే బయల్దేరాం. తొమ్మిది గంటలకల్లా రోసిటా చేరుకున్నాం. కాల్పుల శబ్దం వినబడిందని కోకో అన్నాడు. దాంతో మెరుపుదాడికి వ్యూహం వేసాం. కానీ ఏ హడావుడీ లేదు. మిగతా ప్రయాణం అంతా నిదానంగా సాగింది. మధ్య మధ్యలో పొరబాటున దారి తప్పుతూ సరిదిద్దుకుంటూ మొత్తానికి సాయంత్రం నాలుగున్నరకి గ్రాండెనది దగ్గరకు చేరుకున్నాం. అక్కడ మకాం వేసాం. వెన్నెల వెలుగులో ముందుకు సాగాలనేది నా ఆలోచన. కానీ దళంలో అందరూ బాగా అలిసిపోయి ఉన్నారు. మా దగ్గర ఇంకో రెండు రోజులకు సరిపడా మాంసం తునకలు ఉన్నాయి. పరిస్థితి చూస్తే ఇంకో జీవానికి ఆయువు మూడడం ఖాయమల్లే ఉంది. నకాహుయాసు కొండ గుహలో దొరికిన డాక్యుమెంట్లు, సాక్ష్యాలూ ప్రదర్శించనున్నట్లు రేడియోలో వార్తలు ప్రసారం అయ్యాయి. అంటే కోతి గుహకూడా చేజారిపోయినట్లే. ఉబ్బసం నాతో శాంతంగా వ్యవహరించింది ఈ రోజున.

ఎత్తు – 640 మీటర్లు. (వితండ వాస్తవమే మరి, నిన్నటి రోజున 600 మీటర్ల ఎత్తున ఉంటే గనుక)

**ఆగస్టు 18**

మామూలుగా కన్నా ముందుగానే బయల్దేరాం. నాలుగు చోట్ల ఎండిన నదీపాయలను దాటాల్సి వచ్చింది. ఒకచోట బాగా లోతుగా ఉంది. కొన్ని చోట్ల 'ట్రయల్' వేసాక గానీ నీటిలో దాటలా. ఇన్ని అడ్డంకుల మూలాన మేం మడుగు దగ్గరికి చేరుకునే సరికి సాయంత్రం నాలుగయింది. దళ సభ్యులందరూ అలసిపోయి చచ్చిన శవాల మాదిరి అడ్డం పడిపోయారు. ఆ ప్రాంతంలో కీటకాలు గుంపులు గుంపులుగా, నల్లమబ్బులకు మల్లే తిరుగాడుతున్నాయి. రాత్రికి బాగా చలిగా ఉండొచ్చు. ఇంతి వచ్చి దళం నుండి కాంబా వైదొలగాలనే ఆలోచనతో ఉన్నట్లు చెప్పాడు. శారీరకంగా తన పరిస్థితి ఏం బాగాలేదని, ఈ పోరాటానికి ఏ విలువా లేకుండా పోతుందని, ఇంతకన్నా భవిష్యత్తు గొప్పగా ఉంటుందని తాను ఆశించడం లేదని కాంబో చెప్పాడట. పిరికితనం ఆవహించిన మూలాన అతను అటువంటి నిర్ధారణకు వచ్చేసాడు. అతన్ని పంపించెయ్యడమే మంచిది. అయితే అతనికి మా భవిష్య ప్రణాళిక – జోయాక్విన్‌ను కలుసుకునే ప్రయత్నం సహా – అంతా తెలుసు. మేం ఏఏ దారుల గుండా పోతామో కూడా తను ఎరుగుదును. కాబట్టి అతన్ని వదలిపెట్టడం అంత క్షేమం కాదు. రేపు కాంబా చపాకోలతో మాట్లాడాలి.

ఎత్తు – 680 మీటర్లు.

**ఆగస్టు 19**

వర్గాస్ ఇంటి దగ్గర సైనికులు మోహరించి నట్లు ఉన్నారు. అయినా వర్గాస్ ఇంటికి వెళ్ళడానికి ఇంకా ఉత్తమమైన మార్గం ఏమన్నా ఉందేమో చూసిరావడానికి మిగ్యుయెల్, కోకో, ఇంతి, అనీసెటో వెళ్ళారు. కానీ లాభం లేకపోయింది. మేం పాత తోవనే వెళ్ళాల్సి వచ్చేట్టుంది. ఆర్టురో, చపాకోలు వేటకు వెళ్ళారు. ఒక దుప్పిని కొట్టి తెచ్చారు. అదే ఆర్టురో అర్బానోతో కలిసి సెంట్రీ డ్యూటీ చేస్తూ ఏదు పందిని ఒక దాన్ని కాల్చి చంపారు. దాని కోసం ఏడు సార్లు తుపాకి కాల్చారు. దాంతో స్థావరంలో ఉన్న మేమంతా ఆందోళన పడ్డాం. ఆ జీవం మాకు నాలుగు రోజులకు సరిపడా తిండి, దుప్పి మాంసం ఇంకో రోజుకు సరిపోతుంది. ఇవి కాక సోయాబీన్స్, ఎండుచేపా ఉన్నాయి. మొత్తం మరో ఆరు రోజులకు రేషనుకు కొదవ లేదు. బహుశా మేం చంపి

తినాలనుకున్న తెల్లగుర్రానికి ఈ భూమీ మీద ఇంకా నూకలు ఉన్నాయనుకుంటా. కాంబాతో విషయం చర్చించాను. జోయాక్విన్‌ను కలుసుకున్నాక మా తదుపరి కార్యాచరణ ఏమిటో నిర్ణయించుకునే సందర్భంలో అతను దళం విడిచిపెట్టి వెళ్ళొచ్చని చెప్పా. చపాకో మాత్రం తాను దళం విడిచివెళ్ళే ప్రసక్తే లేదని, అలా చెయ్యడం పిరికితనం అవుతుందని చెప్పాడు. కాకపోతే ఒక ఆర్నెల్ల తరువాతో, ఏడాది లోపో వెళ్ళాలనే కోరిక ఉందన్నాడు. అతని ఆశను ఎందుకు కాదనడం. సరే అన్నా. పొంతన లేని విషయాలు చాలా మాట్లాడాడు అతను. మనసు బాగాలేనట్లుంది.

ఈ రోజు వార్తలన్నీ డెబ్రే గురించే. మిగతా ఖైదీల ఊసేలేదు. బెనినో నుండి ఎలాంటి సమాచారం లేదు. బహుశా అనుకున్న చోటుకు చేరుకుని ఉంటారు.

**ఆగస్టు 20**

పట్టా కత్తిదళం – మిగ్యుయెల్, అర్బానోలు, నా 'పబ్లిక్‌వర్క్స్ టీమ్ – విల్లీ, డారియోలు – పెద్దగా పురోగతి సాధించలేక పోయింది. ఈ రోజుకు ఇక్కడే ఉందామని నిర్ణయించుకున్నాం. వేటకు వెళ్ళిన కోకో, ఇంతిలు ఉత్త చేతులతో వచ్చారు. చపాకో మాత్రం ఒక కోతిని, ఒక లేడిని చంపి తెచ్చాడు. నేను కొద్దిగా దుప్పి మాంసం రుచి చూసాను. మధ్య రాత్రిలో విపరీతమైన ఉబ్బసంతో బాధపడ్డాను. డాక్టరు కూడా అనారోగ్యంతో ఉన్నాడు. వెన్ను కండరాల నొప్పి మూలాన కదలలేకుండా ఉన్నాడు. బెనినో నుండి సమాచారం లేదు. కాబట్టి అతని గురించి ఆందోళన మొదలయ్యింది. సుక్రేకు 85 కిలోమీటర్ల దూరంలో గెరిల్లాల ఉనికి పసిగట్టినట్లు రేడియోలో వార్తలు వెలువడ్డాయి.

**ఆగస్టు 21**

ఇంకో రోజు అదే స్థావరంలో గడిపాం. బెనినో దగ్గర నుండిగాని అతని సహ కామ్రేడ్స్ దగ్గర నుండి కానీ ఎలాంటి సమాచారం లేకపోయిన మూడో రోజు ఇది. ఐదు కోతులను చంపారు. ఈస్టెక్వియో నాలుగింటిని, మోరో ఒకదాన్ని చంపారు. మోరో ఇంకా అనారోగ్యంగానే ఉన్నాడు. కండరాల నొప్పి నిదానించడానికి మెపిరిజన్ మందు ఇచ్చా. దుప్పి మాంసం తిన్న మూలాన పెరిగిన ఉబ్బసం ఇంకా తగ్గలేదు నాకు.

**ఆగస్టు 22**

చివరికి అక్కడ నుండి కదిలాం. చివరి క్షణాల్లో ఎవరో మనిషి నది ఒడ్డున ఇసుకు తిన్నెల చాటుగా జారుకుంటున్నట్లు గమనించాం. తీరా చూస్తే అది అర్బానో. దారి తప్పాడు ముందే. డాక్టరు గారికి 'లోకల్ అనస్తీషియా' ఇచ్చా. వెన్నుకండరాల నొప్పి తెలీకుండా ఉండడానికి గుర్రం ఎక్కించాం. మమ్మల్ని కలుసుకున్నప్పుడు నొప్పితో యమయాతన పడుతూ కనిపించాడు. ఇప్పుడు కాస్త ఫర్లేదు అనిపిస్తుంది. పాచో కాళ్ళకు పనిపెట్టాడు. కుడి ఒడ్డున మకాం వేసాం. వర్గాస్ ఇంటికి చేరుకోవడానికి ఇంకాస్త దూరం పొదలు, తుప్పలు కొట్టాలి. ఏదు పందిమాసం ఇంకో రెండు రోజులకు సరిపడా వుంది. రేపు వేట అస్సలు కుదరదు. బెనినో నుండి ఎలాంటి సమాచారం లేదు. కోకోను వెనక్కి పంపిన దగ్గర నుండి ఇవాళ్టికి పదిరోజులు వాళ్ళు మమ్మల్ని విడిచిపెట్టి.

ఎత్తు – 580 మీటర్లు.

**ఆగస్టు 23**

చెమటోడ్చాల్సి వచ్చిన రోజు ఇది. సన్నటి కొండవాలున మా ప్రయాణం. తెల్లగుర్రం కదలడానికి మొరాయించింది. చివరికి ఒక చోట బురదలో దిగబడిపోయింది. శాల్తీ గల్లంతు అయింది. దగ్గర్లో ఉన్న వేటగాళ్ళ పాకను చేరుకున్నాం. ఇంతకు ముందు దాన్లో ఎవరో ఉండి వెళ్ళిన దాఖలాలు కనిపించాయి. చుట్టూ వలపన్నాం. ఇద్దరు చిక్కారు. జీవాలను పట్టుకోవడానికి పదిచోట్ల ఉచ్చులు పెట్టి వచ్చాం, ఏమన్నా వేట పడిందేమో చూడ్డానికి వెళ్తున్నాం అని చెప్పారు. వాళ్ళు ఇచ్చిన సమాచారం ప్రకారం వెర్గాస్ ఇంట్లో, టాటరెండా, కారాగుయాట్రెండా, ఇపిటా, యమోన్‌లలో సైన్యం తిష్టవేసింది. రెండు రోజుల క్రితం కారా గుయాట్రెండా దగ్గర జరిగిన ఘర్షణలో ఒక సైనికుడు గాయపడినట్లు చెప్పారు. బహుశా ఆ దాడి చేసింది బెనినో కావచ్చు. సైన్యం చుట్టుముట్టినప్పుడో, ఆకలికి తాళలేకో కాల్పులు జరిపి ఉంటాడు అనిపించింది. రేపు సైన్యం ఇటుగా చేపలు పట్టుకోవడానికి వస్తుందని, వాళ్ళు పదిహేను, ఇరవై మంది ఒక జట్టుగా వస్తారని మాకు దొరికిపోయిన పెద్ద మనుషులు ఉప్పందించారు. ఏదు పందిమాంసం తలా కొంచెం పంచుకు తిన్నాం. కొన్ని చేపలు పట్టుకు తిన్నాం. నేను అన్నం తిన్నా. అదే నా ఒంటికి సరిపడేది. డాక్టరుగారు కాస్తంత తేరుకున్నారు. డెబ్రీ విచారణ సెప్టెంబరుకు వాయిదా వేసినట్లు రేడియోలో ప్రకటన వెలువడింది.

**ఆగస్టు 24**

తెల్లవారు జాము ఐదున్నరకే సైనిక వ్యూహం పన్నాం. మేం పర్వత పాదం గుండా పోతున్నాం అనుకుని ముందుకు సాగాం. అడ్వాన్సు పార్టీ కొన్ని మీటర్లు వెళ్ళిందో లేదో అవతలి వైపున ముగ్గురు రైతులు ప్రత్యక్షం అయ్యారు. అడ్వాన్సు పార్టీగా ఉన్న మిగ్యుయెల్‌ను అతని మనుషులను వెనక్కి రమ్మన్నాం. అందరం కలసి 'స్పాట్ పెట్టాం'. ఎనిమిదింటికి సైనికుల జాడ కనిపించింది. వాళ్ళు నది దాటుకుని ఇసుక తిన్నెల మీదుగా మా వైపు వచ్చే దారిలో ఉండగా ఫైరింగ్ ఓపెన్ చెయ్యమని ఆదేశాలు ఇచ్చాను. కానీ వాళ్ళు నదిదాటి ఇవతలకు రాలేదు. మా తుపాకి గుండ్లకు అందేంత దూరంలో పైకీ కిందకీ తిరుగుతా ఉండిపోయారు. మాకు తుపాకి పేల్చే అవకాశం ఇయ్యలేదు. మా ఆధీనంలో ఉన్న వాళ్ళు 'వాళ్ళు సైనికులు కాదు, వేటగాళ్ళని'చెప్పారు. మా అదుపులో వున్న వేటగాడు హ్యూగోగుజ్‌మాన్‌ను తోడు తీసుకుని మిగ్యుయెల్ అర్బానో,కాంబా, డారియోలు పడమటి దిక్కుగా ఉన్న రోడ్డు ఎక్కడిదాకా పోతుందో చూసి రమ్మని పంపా. రోజంతా 'పొజిషన్'లోనే గడిపాం. చీకటి పడింది. పట్టాకత్తి దళం వెనుదిరిగి వచ్చింది. వేటాగాళ్ళు పన్నిన ఉచ్చులు, అందులో చిక్కుకున్న ఒక అమెరికన్ గద్ద, ఒక జంగురు బల్లిని తీసుకు వచ్చారు. అవిరెండూ మా దగ్గర మిగిలిన ఏదు పంది మాంసం సహా వాతాపి జీర్ణం అయిపోయాయి. ఇక మాదగ్గర మిగిలింది సోయాబీన్సు, వేటలో ఏం దొరికితే అది. కాంబా మానసికస్థైర్యం పూర్తిగా అడుగు జారిపోయింది. సైనికులు అన్న మాట వినబడగానే మనిషి నిలువెల్లా ఒణికిపోతున్నాడు. డాక్టరుగారు నొప్పితో తీసుకుంటున్నారు. 'టాల్‌మనాల్' బిళ్ళలు వేసాం. నేను భేషుగ్గా ఉన్నా. విపరీతమైన ఆకలిగా ఉంది. సైన్యం ఇంకో గుహను స్వాధీనం చేసుకున్నట్లు, ఇద్దరు సైనికులు స్వల్పంగా గాయపడినట్లు, గెరిల్లాలు నష్టపోయినట్లు రేడియోలో ఒక ప్రకటన జారీ చేసింది. టాపరిల్లాస్ దగ్గర జరిగిన దాడిలో ఒక సైనికుడు గాయపడినట్లు రేడియో హవాన ఒక వార్త ప్రసారం చేసింది.

**ఆగస్టు 25**

ఈ రోజు ఎటువంటి ఘటనా చోటు చేసుకోలేదు. తెల్లవారుజాము 5 గంటలకే సైనిక వ్యూహం పన్నాం. పట్టాకత్తి దళం కూడా తొందరగానే పన్లోకి దిగింది. ఏడుగురు సైనికులు మేం ఉన్న పొజిషన్‌కు సమీపంగా వచ్చారు. కాని వాళ్ళు నది దాటి ఇవతలకు రాలేదు. అవతల వైపునుండే కాల్పులు జరుపుతూ బహుశా వేటగాళ్లకు సంకేతాలు

ఇస్తున్నట్లున్నారు. వాళ్ళు అవకాశం ఇవ్వాలేగానీ రేపుదాడి చేస్తాం.ఇవాళ దారి పని అంతగా సాగలేదు. అర్బానోను ఏదో విషయమై తనను వచ్చి సంప్రదించమని మిగ్యుయెల్ కబురంపాడు కానీ సమాచార లోపం మూలంగా అటూ ఇటూ ఏం పని జరగలేదు.

మాంటెడొరాడోలో దాడి జరిగినట్లు రేడియోలో వార్తలు వచ్చాయి. బహుశా జోయాక్విన్ దళమే ఆ దాడి చేసి ఉంటుంది. అంటే గెరిల్లాలు'కామిరి'కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నారన్నమాట.

**ఆగస్టు 26**

అనుకున్నది అంతా ఎదురు తిరిగింది. రావడం అయితే ఏడుగురు సైనికులు వచ్చారు కానీ అందులో ఇద్దరే నది దాటడానికి ప్రయత్నించారు. మిగతా ఐదుగురు నది ఆవలి ఒడ్డు వెంబడి పచార్లు చేస్తా ఉన్నారు. హఠాత్తుగా ఆంటోనియో తుపాకి పేల్చాడు. గుళ్ళు గురి తప్పాయి. ఆ ఇద్దరూ తప్పించేసుకున్నారు. అదనపు బలగాల కోసం కేకలు పెట్టారు. ఇది చూసి మిగతా ఐదుగురూ ఒక్క ఉదుటన కనుమరుగయిపోయారు. ఇంతి, కోకోలు వెనుకవైపు నుండి వాళ్ళ మీద విరుచుకు పడ్డారు. సైనికులు కూడా మరుగు చూసుకుని మావాళ్ళ మీద ఎదురు కాల్పులు జరిపారు. వేట జరిగేతీరును పరిశీలిస్తూ ఉన్న నేను బుల్లెట్లు దళ సభ్యుల చుట్టుపక్కలకు జోరుగా దూసుకు రావడం గమనించాను. నేను ఒక్క పరుగున అటుకేసి వెళ్ళిపడ్డా. ఈస్టెక్వియో కాల్పులు జరుపుతా ఉన్నాడు. అవి మా వాళ్ళ మీదకే దూసుకు వస్తున్నాయి. పక్కన ఉన్న ఆంటోనియో అతన్ని వారించే ప్రయత్నమూ చెయ్యలేదు. చెప్పాపెట్టకుండా కాల్పులు మొదలు పెట్టింది కాక, ఈస్టెక్వియో మతి లేకుండా కాల్పులు జరుపుతుంటే చోద్యం చూస్తున్నందుకు ఆంటోనియోను కడిగి పారేసాను. పుంజాలు తెంపుకున్న కోపం కొద్దీ నేనుస్థిమితం కోల్పోయా. ఆంటోనియో పట్ల చాలా మొరటుగా వ్యవహరించాను.

మేం 'పొజిషన్' ఉపసంహరించుకుని వెనక్కి మళ్ళాం. డాక్టరుగారు చురుగ్గా కదిలే పరిస్థితి లేదు గనుక మా ప్రయాణం అంతంత మాత్రంగా సాగుతుంది. ఈ లోగా దాదాపు ఇరవై ముప్పై మంది సైనికులు నది అవతలి వైపు నుండి ముందుకు వచ్చేందుకు ప్రయత్నిస్తూ కనబడ్డారు. ఇప్పుడు వాళ్ళను ఎదుర్కోవడం పనికిమాలిన వ్యవహారం అవుతుంది. మహా అయితే ఇద్దరు ముగ్గురు గాయపర్చగలం అంతే. ఈసారి కోకో, ఇంతి నిర్ణయాత్మకంగా వ్యవహరించి తమ ప్రత్యేకతను చాటుకున్నారు.

డాక్టరుగారు పూర్తిగా అలిసిపోయే వరకూ మా ప్రయాణం సజావుగా సాగింది. రాత్రి ఆరున్నరకు మేం ఒక చోట ఆగాం. మిగ్యుయెల్‌ను ఇంకా చేరుకోలేదు. అతను మా కన్నా కొన్ని మీటర్ల ముందు ఉన్నారు. చివరికి తనే వచ్చి మమ్మల్ని కలిసాడు. నిటారు కొండను పూర్తిగా ఎక్కలేక మోరో చివర్లో ఆగిపోయాడు. మేం అందరిమి మూడు గ్రూపులుగా విడిపోయి వేర్వేరు చోట్ల పడుకున్నాం. మమ్మల్ని వెంటాడుతున్న దాఖలాలు ఏమీ లేవు.

ఎత్తు – 900 మీటర్లు.

**ఆగస్టు 27**

అక్కడ నుండి బయట పడే మార్గం కోసం వెంపర్లాడుతూ వెదుకులాడాం. స్పష్టమైన పరిష్కారం దొరకనేలేదు ఇంకా. గ్రాండేనది దగ్గరకు వచ్చాం. యమోన్ దాటేసాం. కాని అక్కడ ఎక్కడా ఎండిన నదీపాయలు ఏమీ కనబడలేదు. ఇక మిగిలి ఉన్నదల్లా నిటారు కొండ ఎక్కడం. మాతో ఉన్న జీవాలు ఆ పని చెయ్యలేవు. ఇలా చేస్తే చిన్న పర్వత పంక్తిని దాటుకుని గ్రాండేనది మీదుగా మాసిక్యురి వైపు వెడతాం. అది సాధ్యమో కాదో రేపటికి గానీ తేలదు. 1300 మీటర్ల ఎత్తును అధిగమించాం. ఈ ప్రాంతంలో ఇదే సముద్ర మట్టానికి గరిష్ట ఎత్తు. 1240 మీటర్ల ఎత్తున విశ్రమించాం. వాతావరణం అతి శీతలంగా ఉంది. నా పరిస్థితి బాగానే ఉంది. ఎటొచ్చీ డాక్టరు గారే అస్వస్థతకు గురయ్యారు. మా దగ్గర నీరు కూడా నిండుకుంది. కొద్దిగా ఉంది కానీ అది డాక్టరు గారి అవసరాల కోసం ఉంచాం.

శుభవార్త ఏంటంటే, అనూహ్యమైన అద్భుతంగా బెనినో, నాటో జూలియోలు ముగ్గురూ ప్రత్యక్షమయ్యారు. వాళ్ళది ఒక సుదీర్ఘ సాహసయాత్ర. వర్గాస్ ఇంటి దగ్గర, యమోన్‌లో సైనికులు కాపుకాసి ఉన్న మూలాన వాళ్ళతో దాదాపు కాల్పుల దాకా వచ్చిందట వ్యవహారం. అక్కడ నుండి సాలడిల్లో వైపు దిగిన సైనిక దళాన్ని వెంబడించి నకాహుయాసు వరకూ వెళ్ళారట. కాంగ్రీ కనుమ దగ్గర సైనికులు మూడు తడవలు పైకి ఎక్కి దిగడం గమనించారట. 18వ తేదీన ఎలుగుబంటి గుహ దగ్గరకు చేరుకున్నారట. అప్పటికే అది 150 మంది గెరిల్లా వ్యతిరేక సైనిక శిబిరంగా మారిపోయిందట. అది చూసి ముందు బిత్తర పోయారట. తేరుకుని అక్కడ నుండి జారుకున్నారట ఎవరికంటా పడకుండా. అక్కడ నుండి ముత్తాతి పండ్లతోట దగ్గరకి చేరుకున్నారట. అది కూడా పాడుపెట్టి ఉందట. దొరికిన పుచ్చకాయలతో

సరిపెట్టుకున్నారట. ఇంతలో మళ్ళీ సైనికులు అటుగా వెళ్ళడం, కాల్పుల మోత వినరావడంతో ఆ చుట్టుపక్కలే పడుకున్నారట. తర్వాత నుండి మా జాడ పసిగడుతూ ఇలా బయల్దేరి వచ్చి కలుసుకున్నారట. బెనినో చెప్పిన దాని ప్రకారం ఎల్‌నాటో నిబ్బరంగా ఉన్నారు కానీ, జూలియో రెండుసార్లు దారి తప్పిపోయాడట. సైనికులను చూసి కాస్త బెదురుకున్నాడని కూడా చెప్పాడు. జోయాక్విన్ దళం వాళ్ళు కొన్ని రోజుల క్రితం అటుగావెళ్ళి ఉంటారన్న అనుమానం వెలిబుచ్చాడు.

**ఆగస్టు 28**

ఆందోళనకరంగా గడిచింది ఈ రోజు. దాహాన్ని తీర్చుకోవడానికి సీతాఫలాలు తిన్నాం. గొంతును మాయ చెయ్యగలమా. వేటగాడిని తోడు తీసుకుని దగ్గర్లో నీళ్ళు ఎక్కడన్నా ఉన్నయేమో చూసిరమ్మని పాబ్లీతోను పంపించాడు మిగ్యుయెల్, అదీ చిన్న రివాల్వర్ మాత్రమే పాబ్లీతో చేతిలో ఉంచి.

సాయంత్రం నాలుగున్నర అయింది. వాళ్ళు రాలేదు. పోయి వాళ్ళను వెతుక్కురమ్మనమని కోకో, అనీసెటోలను పంపాను. చీకటి పడింది. అర్ధరాత్రి దాటింది అయినా వెళ్ళిన నలుగురి జాడలేదు. 'రియర్‌పార్టీ' విశ్రాంతి తీసుకుంటుంది. రేడియో ప్రసారాలు సరిగ్గా అందట్లే. కొత్త సమాచారం కూడా ఏమీ ఉన్నట్లు లేదు. చివరికి గుర్రం పిల్లని చంపేసాం. రెండు నెలలు మాతో నానా కష్టాలు పడింది అది. చంపకుండా ఉండడానికి నే చెయ్యగలిగిందంతా చేసా. కానీ ఆకలి మా చెడ్డది. దాహాన్ని తట్టుకున్నా కనీసం ఆకలి అన్నా తీర్చుకోవాలి కదా. అందుకే అది అట్లా బలయిపోయింది. బహుశా రేపు కూడా మంచినీరు లేకుండా గడపాలేమో.

టోటరెండా ఏరియాలో జరిగిన దాడిలో ఒక సైనికుడు గాయపడినట్లు రేడియోలో వార్త వచ్చింది. నాకు అర్థం కాని విషయం ఏంటంటే సైన్యం చవిచూస్తున్న నష్టాలని ఇంత ఫక్కాగా ఒక పక్కన ప్రకటిస్తూనే మరో పక్కన తప్పుడు వార్తలు కావనుకుంటే కారాగుయాట్రెండా, టాపరిల్లాస్‌లతో పోయి ఇతరత్రా చోట్ల ఎవరు దాడులకు పూనుకున్నట్లూ? జోయాక్విన్ దళం రెండు గ్రూపులుగా విడిపోతే తప్ప వేర్వేరు ప్రాంతాలలో ఒకే మారు దాడి చెయ్యడం కుదరదు. అలా కాదనుకుంటే మరి మాకు తెలియని కొత్త గెరిల్లాలు ఎవరన్నా ఆ దాడులకు పూనుకుని ఉండాలి.

ఎత్తు – 1200 మీటర్లు.

**ఆగస్టు 29**

భారంగా, ఆందోళనగా గడిచింది ఈ రోజు. పట్టా కత్తి దళం తోవ పని అట్టేచెయ్యలేక పోయింది. మాసిక్యురికు వెళ్ళే దిక్కు అనుకుని పొరబడి వేరేవైపుకు మళ్ళారు కూడా ఒక దశలో. 1600 మీటర్ల ఎత్తులో ఉన్నాం. వాతావరణం తేమగా వుంది. అక్కడక్కడా చెరకు మొక్కలు ఉన్నాయి. వాటితో దాహం తీర్చుకున్నాం. చపాకో, ఈస్టెక్వియో, ఎల్‌చినోలు తాగడానికి నీళ్ళులేక పోవడంతో నిస్పృహకు లోనయ్యారు. రేపు తిన్నగా దగ్గర్లో నీరు దొరికే చోటుకు పోవాలి.

రేడియోలో వినదగ్గ వార్తలేమీ లేవు. డెబ్రీ మీద విచారణ మొదలయి వచ్చేవారం వరకూ కొనసాగుతుంది అనేది ఆసక్తికరమైన సమాచారం.

**ఆగస్టు 30**

పరిస్థితి దయనీయంగా తయారయింది. పట్టాకత్తి దళం దాదాపు స్పృహతప్పే పరిస్థితికి వచ్చారు. మిగ్యుయెల్, డారియోలు దాహానికి ఓపలేక వాళ్ళ మూత్రాన్నే పట్టి తాగారు. ఎల్‌చినో కూడా వాళ్ళనే అనుకరించాడు. ఫలితంగా కడుపునొప్పి, బేదులతో బాధపడ్డారు. అర్బానో, బెనినో, జూలియోలు కొండదిగారు. నీళ్ళు ఉన్న చోట కనుగొన్నారు మొత్తానికి. కానీ గుర్రాలు అక్కడికి దిగిరాలేవని చెప్పారు. నేను, ఎల్‌నాటో అక్కడే ఉండిపోయాం. ఇంతి మా కోసం నీరు తీసుకువచ్చి పైన మాతో ఉండిపోయాడు. మాంసం తిన్నాం. ప్రత్యేక సమాచారం ఏమీలేదు. ఎందుకంటే రేడియో కూడా కిందకు వెళ్ళింది.

ఎత్తు – 1200 మీటర్లు.

**ఆగస్టు 31**

అనీసెటో, లియోన్‌లు తెల్లవారు జామునే కిందికి వెళ్ళారు. సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి వచ్చారు. ఇక్కడ స్థావరం నుండి గుర్రాలను కింద ఉన్న నీటి మడుగు దగ్గరకు తీసుకు రావడానికి వేరే దారి ఉందన్న సమాచారం తెచ్చారు. కానీ మొదట్లో అధ్వాన్నంగా ఉంది దారి. కాస్త కష్టపడితే గుర్రాలను ఆ మార్గం గుండా కిందికి నడిపించవచ్చు. కాస్త పెడగా ఉన్న దారి వరకు రేపు ఏదన్నా 'షార్ట్‌కట్' ఏర్పాటు చేస్తే గుర్రాలను కిందకు దించేద్దాం అని చెప్పా మిగ్యుయెల్‌కు. మనీలా నుండి సందేశం వచ్చింది. కానీ దాన్ని రికార్డు చెయ్యలేక పోయాం.

**నెలసరి సమీక్ష**

గెరిల్లా యుద్ధ కోణం నుండి సమీక్షిస్తే నిస్సందేహంగా ఈ నెల మహా చెత్తగా గడిచింది. 'డంప్'లుగా ఉపయోగ పెట్టుకున్న గుహలన్నీ సైన్యం పాలు కావడం, డాక్యుమెంట్లు, మందులు వాళ్ళు స్వాధీనం చేసుకోవడం మాకు తీరని దెబ్బే. వస్తుగతంగానే కాకుండా మానసికంగా కూడా మమ్మల్ని దెబ్బతీసింది. ఈ నెలలో ఇద్దరు దళ సభ్యులను కోల్పోవాల్సి రావడం, ప్రయాణానికి ఉపయోగించుకునే గుర్రాల్నే చంపి తినాల్సి రావడం దళాన్ని కుంగదీసింది. దళం విడిచిపెట్టిపోతా అని తొలిసారిగా గళం విప్పారు ఒకరు. ఇంకో ఇంకో పరిస్థితిలో అయితే ఇవన్నీ దళానికి బలం చేకూర్చేవే కానీ ఇప్పుడున్న పరిస్థితిలో కాదు. జోయాక్విన్‌తోను, బాహ్య ప్రపంచంతోను సంబంధాలు పూర్తిగా తెగిపోవడం, సైన్యానికి పట్టుబడ్డ జోయాక్విన్ దళ సభ్యులు రహస్యాలు కక్కెయడం కూడా మా దళ సభ్యుల నైతిక స్థైర్యాన్ని కూడా ఒక మేరకు దెబ్బతీసాయి.

నా అనారోగ్యం గురించి కొంత మందిలో సందేహాలు తలెత్తాయి. ఈ ప్రభావాలన్నీ పడి శతృసైనికులకు తీరని నష్టం కలిగించే అవకాశాలు ఉన్న సందర్భాలన్నీ చిల్లర తగాదాలుగా నడిచి ఒకటీ అరా గాయాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అంతేకాదు తాగునీరు లేకుండా కొండల గుండా చేసిన ప్రయాణంలో దళ సభ్యులతో ఉన్న ప్రతికూల అంశాలూ బయటపడ్డాయి.

**స్థూలంగా చెప్పకోవాలంటే ఈ నెల కార్యకలాపాల స్వరూప స్వభావాలు ఇవీ:-**

(1) ఏరకమైన బాహ్య సంబంధాలూ లేకుండా పోయాయి. సమీప భవిష్యత్తులో సంబంధాలు ఏర్పడే అవకాశం కానీ, ఆశ కానీ లేవు.

(2) రైతులతో ఆలస్యంగా ఏర్పడ్డ కొద్దిపాటి సంబంధాలయినా తార్కికంగా చూస్తే వాళ్ళను మాలో కలుపుకునేందుకు దోహదపడాలి. అలా జరగలేదు.

(3) పోరాట పటిమ, తాత్కాలికంగా అయినా, కాస్తంత వెనుకపట్టు పట్టింది.

(4) సైన్యం చురుకుదనం ప్రదర్శించడం లేదు. పోరాటపటిమా చూపించడం లేదు.

మహోత్తర విప్లవ కార్యసాధనలో ప్రస్తుతానికి మేం నిరాశపూరిత క్షణాలను ఎదుర్కొంటున్నాం. గత నెల సమీక్షలో అనుకున్న తక్షణ కర్తవ్యాలే కొనసాగించాలి. సంబంధాల పునరుద్ధరణ, గెరిల్లా రిక్రూట్‌మెంటు, మందులు – ఆయుధాలు పోగేయడం... ఇవీ కర్తవ్యాలు.

ఒక్క విషయం మాత్రం చెప్పుకోవాలి. ఇంతి, కోకో, ప్రతి సందర్భంలోనూ విప్లవయోధులుగా, సైనికయోధులుగా మరింత బలం పుంజుకుంటున్నారు.

# సెప్టెంబరు 1967

**సెప్టెంబరు 1**

పెందళాడే గుర్రాలను కిందకు దించాం. అక్కడక్కడా ఎదురు దెబ్బలు తగిలినా, ఒక గుర్రం అయితే ఏకంగా డింకీలు కొట్టింది వాలులోకి, మొత్తానికి కిందకు చేరుకున్నాం. డాక్టరు గారు ఇంకా తేరుకోలేదు. నేను కాస్త మెరుగ్గా ఉన్నాను. గుర్రాన్ని ముందుండి నడిపించుకుంటూ తీసుకెళ్ళాను. నీటి మడుగు మేం ఊహించిన దానికన్నాపెద్దది. సాయంత్రం ఆరుంబావుకు గానీ మేం ఉన్నది హోనోరాట్ ఇంటి దగ్గర చూసిన నీటివాగు దగ్గర అని గుర్తించలేకపోయాం. మిగ్యుయెల్ చాలా హుషారుగా బయల్దేరాడు. కాని మెయిన్‌రోడ్డు చేరుకునే సరికే చీకటిపడిపోయింది. బెనినో, ఆర్భానోలు ఆచితూచి వ్యవహరిస్తూ ముందుకు వెళ్ళారు. అసాధారణంగా తోచింది ఏమీలేకపోవడంతో ఖాళీగా ఉన్న ఆ ఇంటిని ఆక్రమించుకున్నారు. అంతకు ముందు సైన్యం తన అవసరాల కోసం ఆ ఇంటికి పొడిగింపుగా బ్యారక్‌లు ఏర్పాటు చేసుకుంది గానీ ప్రస్తుతానికి వాటిని పాడుబెట్టింది. పిండి, ఉప్పు, ఉప్పుచేప, మేకలు ఉన్నాయి. రెండు మేకల్ని చంపాం. పిండి కూడా ఉండడంతో నిజమైన విందు భోజనం చేశాం. కాని రాత్రి పొద్దుగూకులూ వండుకోవడంతోనే సరిపోయింది. తెల్లవారుజామున మేం అక్కడ నుండి వెనక్కి వచ్చేసాం. లోపల ఒక సెంట్రీని, రోడ్డు మొదట్లో ఒక సెంట్రీని అట్టేపెట్టాం.

**సెప్టెంబరు 2**

తెల్లవారు జామున మేం పండ్లతోటలోకి వెళ్ళిపోయాం. మిగ్యుయెల్ బాధ్యుడిగా కోకో, పాబ్లో, బెనినోలను ఆ ఇంటి దగ్గర 'ఆంబుష్' ఏర్పాటు చేసాం. ఇంటికి రెండో వైపున కూడా ఇంకో సెంట్రీని ఉంచాం. ఎనిమిదింటికి కోకో మా దగ్గరకు వచ్చి గుర్రం మీద స్వారీ చేసుకుంటూ ఒక మనిషి హోనోరాట్ కోసం వచ్చి పైకి వెళ్ళాడని చెప్పాడు. మొత్తం నలుగురు వచ్చారని చెప్పిన మీదట మిగతా ముగ్గురిని కూడా

అటుగా దాటుకు వెళ్ళనీయమని ఆ తర్వాత చూద్దాం వాళ్ళ సంగతి అని చెప్పి పంపించా. అయితే అప్పటికే మాకు ఈ సమాచారం ఆలస్యంగా చేరింది. కోకో ఆ ఇంటి దగ్గరకు రావడానికి గంటకు పైగా పట్టింది. మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకి తుపాకి కాల్పులు వినబడ్డాయి. ఒక రైతు గుర్రాన్ని, ఒక సైనికుడిని వెంటబెట్టుకుని అటుగా వచ్చినట్లు తెలిసింది. పాంబో, ఈస్టెక్వియోలతో కలసి సెంట్రీడ్యూటీ చేస్తున్న ఎల్‌చినో 'అదిగో సోల్జర్' అని అరిచాడట. తుపాకి ట్రిగ్గర్ సిద్ధం చేసుకునేలోగా ఆ సైనికుడు ఎల్‌చీనో మీద కాల్పులు జరిపి అక్కడ నుండి ఉరుకులెత్తి మరీ పారిపోయాడట. పాంబో జరిపిన కాల్పుల్లో గుర్రం చనిపోయిందట. నాకు వెర్రి కోపం వచ్చింది. చవటదద్దమ్మ తనం కదా జరిగింది అనిపించింది. ఎల్‌చినో పాపం, అత్యుత్సాహం చూపించాడు. ఈ మధ్యలో అటుకేసి వచ్చిన నలుగురినీ మా అదుపులో ఉన్న ఇద్దరినీ మొత్తం ఆరుగునీ విడిచి పెట్టేసాం. అందరినీ మాసిక్యూరి వైపు వెళ్ళమనమని చెప్పాం. గుర్రాల రౌతుల వద్ద నుండి ఏడువందల పెసోలు ఇచ్చి ఎద్దును కొనుక్కున్నాం. హ్యాగీ చేతిలో వంద పెసోలు పెట్టాం, అతను మాకు చేసిన సాయానికి. అలాగే అతని దగ్గర మాకు కావల్సినవి తీసుకున్న దానికి ఖరీదు కట్టి మరో యాభై పెసోలు ముట్టచెప్పాం. చనిపోయిన గుర్రం బహుశా హోనోరాటో ఇంటినుండి తప్పిపోయిన కుంటిగుర్రం అయి ఉంటుంది. హోనోరాటో ఇంటి మీద పడి సైన్యం అతన్ని కొట్టి ఇంట్లో ఉన్న తిండిగింజలన్నీ ఊడ్చేసుకు పోయారని వాళ్ళావిడ శాపనార్థాలు పెట్టి మరీ తమకు చెప్పిందని గుర్రాల రౌతులు మాకు చెప్పారు. అడవి పిల్లి కరిచిన మీదట అతను వైద్యం కోసం వాలెగ్రాండెకు వెళ్ళాడట. మేం ఆ ఇంటికేసి బయల్దేరాం. లోపల ఎవరో ఉన్నట్లున్నారు. మంట వెలుగు కనిపిస్తా ఉంది. ఎల్‌చినో చేసిన తప్పు మూలంగా ఆ రాత్రికి అక్కడ నుండి బయల్దేరి రౌతులు వెళ్ళిన తోవనే ముందుకు పోయి వేరే ఇల్లు పట్టుకుందాం అని నిర్ణయించాను. బహుశా అక్కడ మాకు సైనికులు తారసపడవచ్చని ఊహించాం. కానీ మేం బయల్దేరడం ఆలస్యం కావడంతో తెల్లవారుజాము మూడు ముప్పావుకి ఎండిన నదీపాయను దాటగలిగాం. దగ్గర్లో ఎక్కడా ఇల్లు కనబడలేదు. పశువుల మంద తిరిగే దారిలో విశ్రమించాం. సూర్యోదయం కోసం ఎదురు చూస్తూ ఉండిపోయాం.

కామిరి ప్రాంతంలో జోయాక్విన్ అనే క్యూబా దేశస్థుడి నాయకత్వంలో ఉన్న పది మంది దళ సభ్యులను హతమార్చినట్లు రేడియోలో ఒక దరిద్రపు వార్త వెలువడింది. ఆ వార్తను ప్రసారం చేసింది 'వాయిస్ ఆఫ్ అమెరికా' రేడియో. కానీ స్థానిక రేడియో స్టేషన్లు ఏవీ ఆ వార్తను ప్రసారం చెయ్యలేదు.

**సెప్టెంబరు 3**

ఆదివారం ముహూర్తం కుదిరినట్లు ఈసారి దాడి జరిగింది. మాసిక్యురి శివార్ల వరకూ వెళ్ళి అక్కడ నుండి ఎగువన గ్రాండే నదికి పోయే దారికి మళ్ళాం. మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంతి, కోకో, బెనినో,పాబ్లితో, జూలియో, లియోన్‌లు దగ్గర్లో ఏదన్నా ఇల్లు ఉందేమో, అది కూడా సైన్యం నీడలో లేకుంటే, చూసి వీలయితే మా పరిస్థితి మరీ దుర్భరంగా కాకుండా ఉండడానికి అవసరమైన సరుకులు ఏమన్నా ఉంటే కొని తీసుకు వద్దామని వెళ్ళారు. ముందుగా మా వాళ్ళు ఇద్దరు నౌకర్లను పట్టేసారు. ఇంటి యజమానీ లేడూ, సైనికుల నీడ కూడా లేదు, కావల్సినంత తిండి ఉంది. ఇతరత్రా సమాచారం ఏంటంటే – ఓ ఐదుగురు సైనికులు ఆ ఇంటి దగ్గర ఆగకుండా జోరుగా పరుగెత్తుకెళ్ళారు. హోనోరాట్ రెండురోజుల క్రితం తన ఇద్దరు కొడుకులను వెంట బెట్టుకుని అటుగా వాళ్ళ ఇంటికేసి వెళ్ళాడు. తీరా మా వాళ్ళు ఆ ఇంటి దగ్గరకు వెళ్ళేసరికి అక్కడ ఆ ఇంటి యజమానీ ఉన్నాడు. ఓ నలభై మంది దాకా సైనికులూ అప్పుడే అక్కడికి దిగబడ్డారు. అంతా తికమక వ్యవహారం అయిపోయింది. మా వాళ్ళు జరిపిన కాల్పుల్లో అందరికన్నా ముందు కుక్కను నడిపించుకుంటూ వస్తున్న సైనికుడు చనిపోయినట్లున్నాడు. సైనికులు వెంటనే స్పందించి మా వాళ్ళను చుట్టుముట్టారట. కానీ అంతలోనే మా వాళ్ళ అరుపులకి, కేకలకి జడిసి వెనక్కి తగ్గారట. ఇంత జరిగిన మూలాన గింజ బియ్యం కూడా తీసుకురాలేకపోయారు. కాసేపటికి విమానం పైన ఆకాశంలో మేం ఉన్న ఏరియా మీదుగా ఎగురుతూ వెళ్ళింది. రాకెట్లు పేల్చింది. బహుశా అది నకాహుయాసు వైపు నుండి వచ్చినట్లుంది. రైతులు చెప్పింది ఏంటంటే – క్రితం రోజున గుర్రాల రౌతులు ఇటుగా వెళ్ళారు కానీ ఈ ప్రాంతంలో గెరిల్లాలు ఎవరూ ఉన్నట్లు లేరు అన్నారు.

సైన్యంతో జరిగిన ఘర్షణల గురించి 'వాయిస్ ఆఫ్ అమెరికా' ఇంకొంత సమాచారం ప్రసారం చేసింది. పది మంది దళ సభ్యులలో జోస్‌కార్రిల్లో అనే అతను మాత్రం బతికి ఉన్నట్లు ప్రకటించారు. వాళ్ళు చెప్పే కార్రిల్లో పాకో కావచ్చు. బక్కపలుచటి మనిషి. అమెరికా వార్తల ప్రకారం దళం తుడిచిపెట్టుకు పోయిన ప్రాంతం మాసిక్యురికి దగ్గరగా ఉండాలి. ఇదంతా చూస్తుంటే ఆవార్త సర్వాబద్ధం అనిపిస్తుంది.

ఎత్తు – 650 మీటర్లు.

**సెప్టెంబరు 4**

మిగ్యుయెల్ బాధ్యుడిగా మొత్తం ఎనిమిది మంది దళ సభ్యులు మాసిక్యురి నుండి హోనోరాట్ ఇంటివైపుకు వెళ్ళే దారిలో మాటు వేసారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎలాంటి సంఘటనా జరగలేదు. ఇంతలో నానా కష్టాలు పడి ఎల్‌నాటో, లియోన్‌లు ఒక ఆవును తోలుకువచ్చారు. తరువాత రెండు బలిసిన గిత్తలు దొరికాయి. అర్బానో, కాంబాలు ఇద్దరూ నది ఎగువకు ఒక పది కిలోమీటర్ల దూరం పోయివచ్చారు. మధ్యలో నాలుగు మడుగులు ఉన్నాయి. ఒకటి మరీ లోతుగా ఉందట. ఒక ఎద్దును చంపి కోసి వండుకు తినడం అయింది. అందరూ అలా షైరుకి వెళ్ళినట్లు వెళ్ళి ఆహారం, సమాచారం ఏమన్నా ఉంటే పోగేసుకు రమ్మని పంపించా. ఇంతి బాధ్యుడిగా కోకో, జూలియో, ఆర్టురో అనీసెటో, చపాకోలను వెళ్ళమన్నా. పాచో, పోంబో, ఆంటోనియో, ఈస్టెక్వియోలు కూడా వెళ్తామని అడిగారు. ఇంతి అందరికీ కొన్ని జాగ్రత్తలు చెప్పాడు. సూర్యోదయానికల్లా ఆ ఇంటి దగ్గరకు చేరుకోవాలి. చుట్టుప్రక్కల కదలికలను క్షుణ్ణంగా గమనించాలి. సైనికుల జాడ లేకపోతే తిండి తెచ్చుకోవడం, సైనికులు ఉంటే గనుక ఆ ఇంటిని అన్ని వైపుల నుండి చుట్టుముట్టి ముందుకు చొచ్చుకుపోయి కనీసం ఒకరినన్నా బందీగా పట్టుకోవాలి. ప్రాథమికంగా దళానికి ఎటువంటి నష్టం వాటిల్ల కూడదు అనే విషయం గమనంలో ఉంచుకోవాలి. చివరి జాగ్రత్త పాటించడం అన్నింటికన్నా ముఖ్యం.

వాడోడెల్‌వైసో దగ్గర జరిగిన ఘర్షణలో ఒకరు మృతిచెందినట్లు రేడియోలో వార్తలు వచ్చాయి. పది మంది దళాన్ని తుడిచిపెట్టాం అనిప్రకటించిన చోటే కొత్తగా ఘర్షణ జరిగిందనే కథనాన్ని బట్టి జోయాక్విన్ దళం గురించి వెలువరించిన వార్తలు, కథనాలు తప్పుడువనిపిస్తుంది. మరో ప్రక్కన ఎల్‌నీగ్రో, పెరూ డాక్టరు గారి గురించి పూర్తి వివరాలు ప్రసారం చేసారు. ఈ ఇద్దరూ పాల్మరిటీ దగ్గర చనిపోయినట్లు, శవాలను కామిరికు తరలించినట్లు ప్రకటించారు. ఎల్‌పీలాడో ఈ వివరాలు సరైనవని తేల్చాడు. కాబట్టి వాళ్ళు నిజంగానే చనిపోయి ఉండొచ్చు. అయితే జోయాక్విన్ దళం, బక్కపలుచటి మనిషి కథనాలు కల్పితాలు అయి ఉండాలి. ఏది ఏమైనా ప్రభుత్వ కథనాలకు కొత్త సొబగులు అద్దుతున్నారు. మాసిక్యురి నుండి కామిరికు సంఘటనలను బదిలీ చేస్తున్నారు.

**సెప్టెంబరు 5**

ఈ రోజంతా మామూలుగా గడిచింది. నిన్న వెళ్ళిన దళం కోసం ఎదురు చూస్తూ ఉన్నాం మేం. నాలుగున్నరకు దళం గుర్రం మీద సరుకులు వేసుకుని వచ్చింది.

మోరోన్ ఇంటి దగ్గర సైనికులు మకాం చేసి ఉన్నారట. వేటకుక్కల సాయంతో మా వాళ్ళ రాకను పసిగట్టి చీకట్లోనే కదిలారట. దాంతో మా వాళ్ళు చుట్టు తిరిగి అడవుల్లో దూరి దూరాన ఉన్న మోంటానీ ఇంటి దగ్గరకు చేరుకున్నారట. అక్కడ ఎవరూ లేరు. కాని కావల్సినన్ని జొన్నలు ఉన్నాయి. అందులోంచి ఓ క్వింటా జొన్న తీసుకువచ్చారు. మిట్టమధ్యాహ్నం వేళకి నదిని దాటుకుని ఆవలి ఒడ్డున ఉన్న రెండు ఇళ్ళమీద పడ్డారట. అందులో ఒక ఇంట్లో వాళ్ళు బెదురుకుని ఒక్కరు కూడా మిగలకుండా పారిపోయారట. రెండో ఇంటి వాళ్ళని గుర్రం కావాలని అడిగితే ఏ మాత్రం సహకరించలేదట. దాంతో బెదిరింపులకు దిగాల్సి వచ్చిందట. ఎవరూ కూడా అంతకు ముందు అక్కడ గెరిల్లాలను చూడలేదంటే చూడలేదని చెప్పారట. క్రితం సారి సంత జరగడానికి ముందు పెరెజ్ ఇంటి వైపుగా కొంత మంది గెరిల్లాలు వెళ్ళడం మాత్రం ఎరుగుదుం అని చెప్పారట. (అది మేమే కదా). అక్కడ నుండి వెనక్కి తిరిగి మోరోన్ ఇంటిని దాటుకు రావడానికి చీకటిపడేదాకా ఆగారట. అంతా పక్కాగానే నడిచింది. కాకపోతే ఆర్టురో మధ్యలో ఎక్కడో తప్పిపోయి రోడ్డు వారన పడి నిద్రపోయాడట. అతని గురించి ఎదురు చూడ్డం మూలాన రెండు గంటల సమయం వృథా అయింది. అక్కడ కూడా అడుగుజాడలు ఉండిపోయాయి. కానీ మర్నాడు పశువుల మందలు అటుగా వెళ్తే ఏ అనవాళ్ళూ మిగలవు. అదీగాక కొన్ని వస్తువులు దారిపక్కన గిరాటేసి వచ్చిన విషయం బయట పడింది. అక్కడితో అందాకా హుషారుగా ఉన్న వాళ్ళు గతుక్కుమన్నారు.

మృత గెరిల్లాను ఇంకా గుర్తించలేదని రేడియోలో సమాచారం. ఏ క్షణాన్నైనా వివరాలు వెలుగులోకి వస్తాయని కొసవార్త. మాకు అందిన సందేశాన్ని డీకోడ్ చేసాం. ఒఎల్ఎఎస్ గొప్ప విజయం అని పేర్కొని ఉంది ఆ సందేశంలో. కానీ బొలీవియా ప్రతినిధి వర్గం అంత అశుద్ధం లేదని, బొలీవియా కమ్యూనిస్టు పార్టీ తరుపున వచ్చిన ఆల్ఫో ఫ్లోర్స్ జాతీయ విముక్తి సైన్యానికి తానే ప్రతినిధి అయినట్లు వ్యవహరించాడని, అతను ఒక అబద్దాల కోరని రుజువు చెయ్యాలని, కోల్లె మనిషిని చర్చలకు పంపించినట్లు, లోజానో ఇంటి మీద 'రెయిడ్' చేసారని, అతను అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడని, బహుశా డెబ్రేకు మారుగా బొలీవియా ప్రభుత్వం ఏదో బేరం కుదుర్చుకునేలా ఉందనే వివరాలు ఉన్నాయి అందులో... ఇంతకు ముందు మేం పంపిన సందేశం 'వారికి' చేరలేదని తెలిసిపోతా ఉంది.

**సెప్టెంబర్ 6**

**బెనినో**

ఇవాళ బెనినో పుట్టిన రోజు. సూర్యోదయానే శుభారంభం. జొన్నన్నం వండుకు తిన్నాం. పంచదార వేసి పాయసం చేసుకున్నాం. తరువాత మిగ్యుయెల్ బాధ్యుడిగా ఎనిమిది మంది దళ సభ్యులు మాటు వేసారు. లియోన్ ఎద్దును మళ్ళీ తీసుకురావడానికి వెళ్ళారు. పదిగంటలు దాటింది. వెళ్ళిన వాళ్ళింకా తిరిగిరాలేదు. జాగ్రత్తగా ఉండమని ఆర్టురోతో వాళ్ళకు కబురుపంపాను. పన్నెండు గంటల కల్లా వెనక్కి వచ్చెయ్యమని ఆర్డరు వేసా. ఆ తరువాత కాసేపటికి తుపాకీ మోత వినిపించింది. వెన్వెంటనే ఒక్క జడిన కాల్పులు మొదలయ్యాయి. మేం ఉన్న దిక్కుకి కూడా కాల్పులు సాగాయి. మేం పొజిషన్ తీసుకున్నాం. ఇంతలో అర్బానో పరుగెత్తుకుంటూ వచ్చాడు మా దగ్గరికి. వేట కుక్కలతో పెట్రోలింగ్‌కి వచ్చిన వాళ్ళతో తలపడ్డానని చెప్పాడు. నేనైతే తీవ్ర ఉద్వేగానికి లోనయ్యా. అవతల ఉన్న నా తొమ్మండుగురు దళసభ్యుల పరిస్థితి ఏమిటో తెలీదు. దారిచూస్తే మెరుగ్గానే ఉంది. నది ఒడ్డుకు తిన్నగా పోతుంది. ఇటుకేసి పోవచ్చు. మోరో, పోంబో, కాంబా, కోకోలు నలుగురు అటుకేసే వెళ్ళారు. ముందు ఇక్కడినుండి కిట్ బ్యాగులు తరలించి 'రియర్ పార్టీ'తో సమన్వయం చేసుకోవాలని అనుకున్నాం. అదీ వీలైతే, వాళ్ళు నలుగురు కూడితే – ఇటు వైపున మేం దాడికి ఉచ్చు పన్నినట్లు అవుతుంది. అయితే ఈ లోగా మిగ్యుయెల్ తన సభ్యులందరితో కలసి అడవికి అడ్డం పడి వచ్చి మమ్మల్ని కలుసుకున్నారు.

ఆ తరువాత వివరం తెలిసింది. మేం ఉన్న చిన్న దారిలో సెంట్రీని నిలపకుండానే మిగ్యుయెల్ ముందుకు పోయాడు తన దళంతో. పశువుల కోసం వెతుకులాటలో ఉన్నారు వాళ్ళంతా. లియోన్‌కు కుక్క మొరుగుళ్ళు వినిపించాయట. అయితే వెనక్కి మరలడం మంచిది కాదేమో అని మిగ్యుయెల్ ఆలోచిస్తుండగా తుపాకి పేలిన శబ్దం అయింది. అంటే ఆ దారికి అడవికి మధ్యన పెట్రోల్ పార్టీ తిరుగుతుందని అర్థం అయి అడవి గుండాచుట్టు తిరిగి వచ్చారు.

మేం ఆట్టే కష్టపడకుండా, మా మూడు గుర్రాలు, మూడు పశువుల సహా, వెనక్కి తగ్గాం. నాలుగు మడుగులు దాటుకుని వెళ్ళాం. అందులో రెండింటిని దాటడం కష్టమయింది. అక్కడ నుండి ఇంకో ఏడు కిలోమీటర్ల ఆవల మకాం వేసాం. ఆవును చంపి వండుకుని విందు చేసుకున్నాం. మేం విడిచిపెట్టిన స్థలం వైపుకి మెషిన్‌గన్‌లతో భారీగా కాల్పులు జరిపిన శబ్దాలు విన్నట్లు 'రియర్ పార్టీ' రిపోర్టు చేసింది.

ఎత్తు – 640 మీటర్లు.

**సెప్టెంబరు 7**

స్వల్ప ప్రయాణం. ఇంకో నీటిమడుగు దాటాం. అక్కడ నుండి నిటారు కొండల రూపంలో కష్టాలు ఎదురయ్యాయి. మిగ్యుయెల్ అక్కడే మకాం వేసి వేచిచూద్దాం అని నిర్ణయించాడు. రేపు దారుల కోసం క్షుణ్ణంగా వెదుకులాడదాం అనుకున్నాం. పరిస్థితి ఇదీ. వాయుసైన్యం మేం ఉన్న ప్రాంతంలో చక్కర్లు కొడుతుంది గానీ ఎందుకో గాలింపు జరపడం లేదు. గెరిల్లా దళానికి నేను నాయకత్వం వహిస్తున్నాననే వాస్తవాన్ని రేడియో వార్తలు నిర్ధారణ చేసాయి. మరింక వాళ్ళు దేనికోసం వేచి ఉన్నట్లూ? భయమా? కాదు. పోనీ ఇక్కడికి చేరుకోవడం అసాధ్యం అనుకుంటున్నారా? మా అనుభవం రీత్యాగానీ వాళ్ళకు తెలిసిన దాన్ని బట్టిగానీ అదీ కాకపోవచ్చు. మమ్మల్ని చక్రబంధంలో ఇరికించే ప్రాంతంలోకి వచ్చి చేరే వరకూ ఇలానే ముందుకు సాగనిస్తుంటారా? కావచ్చు. మేము సరుకుల కోసం మాసిక్యురి వైపు వెళ్దామనేది వాళ్ళ ఆలోచనా? కావచ్చు. డాక్టరుగారికి బాగానే ఉంది. కానీ నా పరిస్థితే దిగజారుతుంది. రాత్రి అంతా నిద్రలేకుండా గడిపాను.

జోస్ కార్రిల్లో (పాకో) చెప్పిన విషయాలంటూ రేడియో వార్తలు ప్రసారం చేసింది. మేం అందరమూ అతన్ని ఆదర్శంగా తీసుకోవాలి. వేటకు వెళ్ళిన మూలాన చేతిలో తుపాకి ఉంచుకున్నా తప్ప వేరేకాదని పాకో చెప్పాడు. రేడియో 'క్రజ్‌డెల్‌సుర్' గ్రాండెనది ఒడ్డున టానియా అనే గెరిల్లా మృతదేహాన్ని కనుగొన్నట్లు వార్త ప్రసారం చేసింది. ఎల్‌నీగ్రో మరణానికి మల్లే ఇది కూడా సాధికారమైన వార్త కాదనిపిస్తుంది. మృతదేహాన్ని శాంతాక్రజ్‌కు తరలించినట్లు ఈ రేడియో ప్రకటించింది కానీ 'ఆల్టిప్లేనో' రేడియోలో ఈ అంశం ప్రసారం కాలేదు.

జూలియోతో చర్చ పెట్టాను. అతను బాగానే ఉన్నాడు. కానీ బాహ్య సంబంధాలు తెగిపోవడం, కొత్త రిక్రూట్‌మెంటు లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నాయని అన్నాడు.

ఎత్తు – 720 మీటర్లు.

**సెప్టెంబరు 8**

ప్రశాంతమైన రోజు, ఆంటోనియో, పోంబోల సారథ్యంలో మొత్తం ఎనిమిది మంది సభ్యులతో పగలు నుంచి రాత్రి వరకూ 'మాటు' వేసి ఉంచాం. వెదురు పొదలు నిండుగా పచ్చగడ్డి ఉన్న ప్రాంతం కాబట్టి జీవాలు కడుపారా మేత మేసాయి. దెబ్బతిన్న

గుర్రం కోలుకుంటుంది. అనీసెటో, చపాకో లిద్దరూ నది వెంబడే పైదాకా వెళ్ళొచ్చి గుర్రాలను కూడా సునాయాసంగా తీసుకెళ్ళగలిగేంత భేషుగ్గా ఉంది దారి అని చెప్పారు. కోకో, కాంబాలు నది గుండా గుండెల లోతు నీళ్ళలో నడుచుకుంటూ అటువైపు ఉన్న గుట్టలు ఎక్కిచూసి వచ్చారు. ఏం పసిగట్టలేకపోయారు. మిగ్యుయెల్, అనీసెటోలను వెళ్ళిరమ్మన్నా. సుదీర్ఘ అన్వేషణ కొనసాగించి వచ్చి అటుగా గుర్రాలను తీసుకుని వెళ్ళడం కష్టం అని తేల్చేసారు. ఈ రోజుకు ఇక్కడే మకాం ఉండిపోవాలని నిర్ణయించాం. కడుపారా మేత, తాగడానికి పుష్కలంగా నీళ్ళు దొరుకుతున్నాయి కాబట్టి గుర్రాలు కాస్త తేరుకుంటాయి కూడా.

మరణించిన గెరిల్లా అవశేషాల ఖనన కార్యక్రమానికి బారియాంటోస్ హాజరయినట్లు రేడియోలో వార్తలు వచ్చాయి. క్రైస్తవ సంప్రదాయం ప్రకారం ఖననం జరిగిందట. అటు పిమ్మట హోనోరాట్ ఇల్లు ఉన్న పూర్టోమౌరికో ఊరికి వెళ్ళినట్లు ప్రకటించింది. దారి తప్పిన బొలీవియన్లు ఇప్పటికయినా తప్పు తెలుసుకుని, సొమ్ములు ఆశచూపించిన మీదట ఉద్యమాల్లోకి వెళ్ళిన వాళ్ళు దగ్గర్లో ఉన్న ఏ సైనిక పోస్టు దగ్గరకు వచ్చి లొంగిపోయినా వాళ్ళ మీద ఎలాంటి చర్యలూ తీసుకోబోం అని బారియాంటోస్ ప్రకటించాడు. బారియాంటోస్ రాక సందర్భంగా హడావుడి చేయడానికా అన్నట్లు ఒక విమానం. హోనోరాట్ ఇంటి దగ్గర నుండి దిగువ వరకూ బాంబుల వర్షం కురిపించింది.

చేగువేరా అరాచకవాది, బాధ్యతా రహితమైన వ్యక్తి అని బుడాపెస్ట్ నుండి వెలువడే పత్రిక ఒకటి విమర్శించింది. వాస్తవాలు ఎదురయినప్పుడు 'ప్రాక్టికల్' దృక్పథంతో వ్యవహరించే చిలీ కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయాలను ఉటంకిస్తూ ఆ పత్రిక ఈ వ్యాఖ్యానాలు చేసింది. నాకే గనుక అధికారం ఉంటే పిరికివాళ్ళు, కేతిగాళ్ళ ముఖాలకు తొడుకున్న ముసుగులు ఊడబీకేసి వాళ్ళు చేసే గారడీలతోనే వాళ్ళ ముక్కులు నేలకు రాయిస్తా.

**సెప్టెంబరు 9**

మిగ్యుయెల్, ఎల్‌నాటోలు వెళ్ళి దారులు వెతుక్కు వచ్చారు. మనుషులను దాటించడానికి బల్లకట్టులు ఉన్నాయి కాబట్టి నది దాటుకుని వెళ్ళొచ్చు కాకపోతే గుర్రాలు నీళ్ళలో ఈదుకుని రావాలి అనిచెప్పారు. ఎడమగట్టుకు అవతల పెద్ద నీటి ప్రవాహం ఉంది. అక్కడ దగ్గర్లో మకాం వెయ్యాలి. ఆంటోనియో, పోంబోల సారథ్యంలో మొత్తం ఎనిమిది మంది సభ్యులతో 'ఆంబుష్'ను కొనసాగించాం. అనీసెటోతో చర్చ పెట్టా. అతను నిబ్బరంగానే ఉన్నాడు. అయితే దళంలోని బొలీవియా సభ్యులు

నీరసపడిపోతున్నట్లు చెప్పాడు. కోకో, ఇంతిలు రాజకీయ కృషి చెయ్యడం లేదనే అభిప్రాయం వ్యక్తం చేసాడు. ఈ రోజు ఒక ఆవును చంపి వండుకు తిన్నాం. నాలుగు కాళ్ళు మాత్రం మిగిలాయి. రేపు కాళ్ళ పులుసు కాసుకు తాగాలి.

డెబ్రే మీద విచారణకు సెప్టెంబరు 17 వరకు వాయిదా పడింది అనేది రేడియోలో తాజా వార్త.

**సెప్టెంబరు 10**

దుర్దినం. రోజు మొదలవడం శుభశకునాలతోనే మొదలయింది. కానీ నది ఒరవడి మీద ఉండడంతో గుర్రాలు రలాయించాయి ముందుకు అడుగు వెయ్యడానికి. చివరికి మగ గుర్రం వీసమెత్తు ముందుకు కదల్లేదు. దాన్ని అవతల ఒడ్డునే వదిలేసాం. దానికి తోడు నీటి మట్టం విపరీతంగా పెరిగిపోవడంతో కోకో ఆ నిర్ణయం తీసుకున్నాడు. అలాగే కొన్ని ఆయుధాలూ మోరో తుపాకి, బెనినో వాడే యుద్ధట్యాంకు వ్యతిరేక మోర్టారు షెల్‌లు – అటు ఉండిపోయాయి. గుర్రాన్ని తీసుకుని నేను నది ఈదుకుంటూ దాటాను. నా కాలి బూట్సు నీళ్ళలో కొట్టుకుపోయాయి. అందుకే చెప్పులు తొడుక్కున్నా. నిజానికి చెప్పులు వేసుకోవడం నాకు అసలు ఇష్టం ఉండదు. ఎల్‌నాటో తన బట్టలు, ఆయుధాలూ అన్నీ చుట్టచుట్టి మైనపు సంచిలో కట్టబెట్టి మరీ నీళ్ళలో దూకి ఈదుకుంటూ వచ్చాడు. కానీ అతని మూట మూటా నీళ్ళలో కొట్టుకుపోయింది. మిగిలిన ఒక్క గుర్రం ఒంటరిగా దాటుకు రావడానికి ప్రయత్నించింది. కాని దాని వల్లకాక వెనక్కి తిరిగి వెళ్ళింది. లియోన్ వెళ్ళి దాన్ని ఇటుగా తీసుకు వచ్చాడు కానీ మధ్యలో మళ్ళీ హఠాత్తుగా నీటి ఉరవడి పెరగడంతో ఇద్దరూ మునిగినంత పనయింది. ఏమైతేనేం అందరం కలిసి అనుకున్న నీటి వాగు దగ్గరకు వచ్చి చేరాం. డాక్టరుగారికి అస్సలు బాగోలేదు. రాత్రంతా నరాల పోట్లు,నొప్పులు అని మూలుగుతూనే ఉన్నాడు. గుర్రాలను మళ్ళీ నదికి అటుకేసి ఈదులాడుకుంటూ వెళ్ళేలా చేద్దాం అని ముందు అనుకున్నాం గానీ నీరు పోటుమీద ఉండడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాం. తాత్కాలికంగా వరదనీరు తీసాక ఆలోచించవచ్చు. దీనికి తోడు మేం ఉన్న ప్రాంతం గగన తలం మీద ఈసారి విమానాలతో పాటు హెలికాప్టర్లు కూడా చక్కర్లు కొట్టాయి. హెలికాప్టర్ లంటే నాకు అస్సలు పడదు. వాటిని ఉపయోగపెడుతున్నారంటే నది వాలున ఎక్కడో ఒక చోట మా మీద దాడికి ప్రణాళిక వేస్తున్నట్లే. రేపు నది ఎగువ దిక్కుకేసి, పైకి వెళ్ళి మేం ఎక్కడ ఉన్నాం అనేది నిర్ధారించుకోవాలి.

ఇంకో విషయం ముఖ్యంగా చెప్పాల్సింది మర్చేపోయా. దాదాపు ఆరు నెలల తరువాత ఇవాళ స్నానం చేసా నేను ఒక రకంగా రికార్డే అది. నా సహచరులు కూడా ఆ రికార్డుకు దగ్గరలోనే ఉన్నారు.

ఎత్తు - 780 మీటర్లు, దూరం - 3.4 కి.మీ.

**సెప్టెంబరు 11**

ప్రశాంతమైన రోజు. కొంత మంది నది ఎగువకు, ఇంకొంత మంది నీటి మడుగు ఎగువకు వెళ్ళివచ్చారు. నది ఎగువకు పోతే దారి దొరకవచ్చుని, ఇసుక తిన్నెలు కూడా ఉన్న మూలాన గుర్రాలకు కూడా ఇబ్బంది ఉండదని వాళ్ళు చెప్పారు. బెనినో, జూలియోలు నీటి మడుగు ఎగువకు వెళ్ళి వచ్చారు. కానీ అంతా పైపై వ్యవహారంగా చూసి వచ్చారని మధ్యాహ్నం 12 గంటలకల్లా వెను తిరిగి రాగానే అర్థమైంది. ఎల్‌నాటో, కోకోలు 'రియర్‌పార్టీ' సాయంతో ఆవలి ఒడ్డున వదిలేసిన సామాను తీసుకు వచ్చారు. గుర్రాన్ని కూడా తెచ్చారు కానీ మిషన్‌గన్ బుల్లెట్లు ఉన్న దట్టీని వదిలేసారు.

అనాహ్లాదకరమైన సంఘటన ఒకటి చోటు చేసుకుంది. ఎల్‌చినో నా దగ్గర కొచ్చి తన కళ్ళెదుటే ఎల్‌నాటో ఒక మాంసపు తునక కాల్చుకు తిన్నాడని 'కంప్లెయింట్' చేసాడు. కళ్ళ ముందు జరిగే దాన్ని ఆపకుండా తీరిగ్గా కంప్లెయింట్ చేస్తున్నందుకు ఎల్‌చినో మీద నాకు కోపం వచ్చింది. కానీ ఆరా తీస్తే ఎల్‌చినోకు ఎల్‌నాటో వాళ్ళ పనిలో తల దూర్చాల్సిన అవసరం ఏమొచ్చింది? అనే ప్రశ్న తలెత్తింది. దాంతో అతన్ని బాధ్యతల నుండి తప్పించి పోంబోకు అప్పచెప్పా. అయితే ఇదంతా ఎల్‌చినో దిగమింగు కోలేకపోయాడు.

ఉదయాన్నే రేడియో వార్తల్లో బారియాంటోస్ నేను ఎప్పుడో చనిపోయాననీ, ఇప్పుడు జరిగేది అంతా నాపేరున ప్రచారం అవుతుందనీ ప్రకటించాడు. సాయంత్రానికల్లా అదే బారియాంటోస్ అదేనోటితో నన్ను సజీవంగా గానీ నిర్జీవంగా గాని అప్పగించినా, నా గురించి సమాచారం అందించినా యాభైవేల పెసోలు (4200 అమెరికన్ డాలర్లు) బహుమతిగా అందచేస్తానని ప్రకటించాడు. బహుశా సైనిక దళం అతనికి ( సరిగా కనిపించడం లేదు) ఇచ్చినట్లున్నాయి. నా గురించిన వివరాలతో కూడిన కరపత్రాలు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో విమానాల్లోంచి వెదజల్లినట్లు ఉన్నారు. "బారియాంటోస్ ది అంతా మేకపోతు గాంభీర్యమే. గెరిల్లా యోధులు ఎంతటి

పక్కలోబల్లాలో అతనికీ తెల్సు. వాళ్ళు సుదీర్ఘ పోరాటానికి సన్నాహాలు చేస్తున్నారు" అని రెక్విటెరాన్ వ్యాఖ్యానించాడు.

పాబ్లితో చాలా ఆందోళనగా ఉన్నాడు. అతనితో చర్చ పెట్టాను. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయనేదే అతని ఆందోళన. మా ఆందోళన కూడా అదేకదా. ముందు వీలయినంత త్వరగా నగరాలతో సంబంధాలు పునరుద్ధరించుకోవడం ప్రాథమిక కర్తవ్యంగా ఉండాలని అతని అభిప్రాయం. అయితే నికరంగా, పూర్తి నిబద్ధతతో మమ్మల్ని అంటి పెట్టుకునే ఉంటానన్నాడు.

**సెప్టెంబరు 12**

విషాద హాస్యంతో మొదలయిందీ రోజు. ఆరుగంటలకల్లా సైనిక వ్యూహం పన్నే ఏర్పాట్లలో ఉన్నాం. ఇంతలో ఈస్టెక్వియో వచ్చి నీటి మడుగు వైపుగా ఎవరో వస్తున్నారనీ, అందరూ ఆయుధాలు చేతబూని ఉండాలని హెచ్చరించాడు. దాంతో అందరం సర్వసన్నద్ధం అయ్యాం. ఆంటోనియో వాళ్ళను చూసాను అన్నాడు. ఎంత మంది ఉంటారని నేనడిగితే ఐదు వేళ్ళు చూపించాడు. కానీ నిజానికి అది భ్రాంతి అని తేలింది. ఇలాంటి వారి మూలంగా దళం నైతిక స్థైర్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. అందరూ 'సైకోసిస్' మీద ఎవరికి తోచింది వాళ్ళు మాట్లాడుకోసాగారు. నేను ఆంటోనియోతో విడిగా మాట్లాడాను. అతను స్థిమితంగా లేడు కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకున్నాడు. చిత్త భ్రాంతి లాంటిదేమీ లేదు. మానసిక సమస్య అంతకన్నా లేదు, బహుశా నిద్రలేమి మూలంగా అలా అనిపించి ఉండొచ్చు అని చెప్పాడు. సెంట్రీ డ్యూటీ చేస్తూ నిద్ర పోయినందుకు గాను అతనికి ఆరు రోజులు అదనపు డ్యూటీ పడింది. కానీ తను నిద్రపోలేదని బుకాయించాడు. అలాగే చపాకో ఏవీ ఆదేశాలు పాటించనందుకు అతనికి మూడు రోజులు 'ఎక్స్ట్రా డ్యూటీ' వేసా. ఆ రాత్రి అతను తనని 'అడ్వాన్సు పార్టీ'లోకి మార్చమని, ఆంటోనియోతో సరిగా పొత్తు కుదరడం లేదని చెప్పాడు. కానీ నేనతని విజ్ఞప్తిని తిరస్కరించా. ఇంతి, లియోన్, ఈస్టెక్వియోలు నీటి మడుగు ఎగువ దిక్కున దూరాన కనబడుతున్న పెద్ద పర్వతశ్రేణిని దాటుకుని వెళ్ళడానికి మార్గం ఎదన్నా ఉందేమో క్షుణ్ణంగా పరిశీలించి వస్తామని వెళ్ళారు. కోకో, అనీసెటో, జూలియోలు నది ఎగువ దిక్కుకేసి వెళ్ళారు దారులు వెతకడానికి. ఇటుగా వెళ్ళాల్సి వస్తే గుర్రాల సహా వెళ్ళడానికి అనువైన మార్గం చూసి వస్తామన్నారు.

బహుశా బారియాంటోస్ ప్రకటించిన, నజరానా సంచలనం సృష్టించినట్లుంది. తెలివిమాలిన విలేకరి ఒకతను 4200 డాలర్ల లెక్కే చూసుకున్నట్లు ఉన్నాడు గానీ నేను ఎంతటి ప్రమాదకరమైన మనిషినో అంచనా వేసినట్లు లేదు. జాతీయ విముక్తి సైన్యం ఒఎల్ఎఎస్‌కు మద్దతు ప్రకటించింది, అన్న వార్తను రేడియో హవానా ప్రసారం చేసింది. నేనిది ముందుగా ఊహించినదే. అంటే నాకు అద్భుత అదృశ్యవాణి (టెలిపతీ) శక్తులు ఉన్నట్లే.

**సెప్టెంబర్ 13**

దారులు వెతకడానికి వెళ్ళిన వారు తిరిగి వచ్చారు. ఇంతి వాళ్ళు రోజంతా మడుగు ఎగువ దిక్కుకేసి ప్రయాణించారు. ఎతైన, చల్లని ప్రదేశం మీద విశ్రాంతి తీసుకున్నారు. పర్వతశ్రేణుల నుండి మొదలైన ఆ నీటి మడుగు ప్రవాహం పశ్చిమానికి పోతా ఉంది. గుర్రాలతో అటుగా వెళ్ళలేం అని తేల్చారు. కోకో వాళ్ళు నదిని దాటడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. పదకొండు గుట్టలు దాటాక కొండ వాలులోకి ప్రవహిస్తున్న నదిని – బహుశా వెస్కా నది అయిఉండొచ్చు. చూసారట అటుగా తగలబడిన పండ్ల తోటలు, ఎద్దులు కనబడ్డాయి. కాబట్టి మానవ సంచారం ఉండి ఉంటుందనేది వారి అంచనా. గుర్రాలు నదిని దాటుకుని ఆవలిఒడ్డుకు చేరాలి. తెంటు లాంటిది ఏదన్నా తయారు చేసుకుంటే మేం కూడా దాటవచ్చు. ఆ ఏర్పాట్లు చూడాలి.

డారియోతో చర్చ పెట్టా. దళాన్ని వదలి వెళ్ళిపోతావా అని అడిగాను. వెళ్ళాలనుకుంటే వెళ్ళిపోవచ్చని చెప్పా. 'ప్రమాదం కాదూ' అని జవాబు ఇచ్చాడు అతను. కానీ గెరిల్లా దళం అంటే తలదాచుకోను శరణార్థి శిబిరం కాదన్న విషయం గుర్తుంచుకోవాలని, ఉండిపోవాలనుకుంటే కడదాకా అంటిపెట్టుకుని ఉండాలని గట్టిగా హెచ్చరించి మరీ చెప్పా. 'ఉంటాను, నీతో పాటు సరిదిద్దుకుంటాను' అని చెప్పాడు అతను. చూడాలి మరి.

డెబ్రే తండ్రిని తుపాకి చూపించి భయపెట్టి తన పక్షాన వాదించుకోవడానికి (డిఫెన్సు) డెబ్రీ సిద్ధం చేసుకున్న డాక్యుమెంట్లు ఎవరో ఎత్తుకెళ్ళి పోయారన్న వార్తను రేడియో ప్రసారం చేసింది. ఆ వంకన డెబ్రీ రాజకీయ కరపత్రం తయారు చెయ్యకుండా చూడాలని ప్రయత్నిస్తున్నట్లు ఉన్నారు.

**సెప్టెంబరు 14**

ఆకలి రోజు. ఉదయం ఏడు గంటలకే మిగ్యుయెల్ 'అడ్వాన్సు పార్టీ'ని ఎల్‌నాటోను తోడ్కొని బయల్దేరాడు. నది ఒడ్డునే ప్రయాణించి, నది దాటడం ఎక్కడ

కష్టమో అక్కడ ఒక టెంటు తయారుచేసి ఉంచమని సూచించా. ఆంటోనియో 'రియర్‌పార్టీ'తో కలిసి శత్రువు కోసం మాటువేసి ఉన్నాడు. రెండు ఎం-ఐ తుపాకులు ఒక గుహలో దాచిపెట్టాం. అది ఎల్‌నాటో, విల్లీలకే తెలుసు. మధ్యాహ్నం మూడున్నర వరకూ చూసి ఎలాంటి కబురూ లేకపోవడంతో మేమూ బయల్దేరాం.

గుర్రాలు ఎక్కినడవడం సాధ్యం కాలేదు. గుర్రాన్ని లియోన్‌కు అప్పగించి నేను కాళ్ళకు పనిచెప్పాను. అప్పటికే ఉబ్బసం మూలాన ఆయాసం మొదలయింది నాకు. వేరే సమాచారం ఏదీ పంపించకపోతే 'రియర్‌పార్టీ' మూడు గంటలకు బయల్దేరాలని ముందే ఆదేశాలు ఇచ్చాను. సరిగ్గా ఆ గంటకు పాబ్లితో వచ్చి ఎద్దు జీవాలను దాటించేందుకు అనువైన మార్గం దగ్గరకు చేరిందని, ఇంకో కిలోమీటరు అవకతల  తెంటు తయారవుతుందన్న వార్త తెచ్చాడు.  గుర్రాలన్నీ చేరేసరికి రాత్రి ఆరుంబావు అయింది. అది కూడా మనుషుల్ని సాయం పంపిస్తే, వాటిని అప్పుడు నది దాటించాం. ఎద్దు అంతకన్నా ముందే ఆవలి ఒడ్డుకు చేరుకుంది. అక్కడ నుండి తెంటు దగ్గరకు నిమ్మళంగా చేరుకున్నాం. ఇటు వైపున ఇంకా పన్నెండు మంది ఉన్నారు. పది మందే అవతలకు చేరారు. రాత్రికి అటు వాళ్ళు అటు, ఇటు వాళ్ళం ఇటు గడిపేసాం. సగం చెడిపోయిన ఆవు మాంసమే ఈ రోజుకు మా ఆహారం.

ఎత్తు - 720 కి.మీ.  దూరం-2.3 కిలోమీటర్లు.

**సెప్టెంబరు 15**

ఈ రోజు కాస్త ఎక్కువ దూరమే నడిచాం. ఓ ఐదారు కిలోమీటర్లు నడిచి ఉంటాం. వెస్కా నదిని ఇంకా చేరుకోలేదు. అప్పటికి గుర్రాలు రెండుసార్లు నీటి మడుగులను దాటాల్సి వచ్చింది. ఒక గుర్రం అయితే బెదురుకుని కాసేపు హడావుడి చేసింది. మేం ఇంకో నీటి మడుగును దాటాలి. గుర్రాలు దాటగలవో లేదో చూడాలి.

లయోలాను అరెస్టు చేసినట్లు రేడియోలో వార్తలు వచ్చాయి. అంతా ఫొటోలు తెచ్చి పెట్టిన తిప్పలు. మిగిలిన ఒక ఎద్దూ ఈ రోజు మరణించింది. అదీ మా చేతుల్లోనే.

ఎత్తు - 780 మీటర్లు.

**సెప్టెంబరు 16**

రోజంతా తెంటు తయారు చెయ్యడానికే సరిపోయింది. ఒక ఐదు వందల మీటర్ల దూరాన ఉన్న నీటి చెలమ దగ్గర విశ్రమించాం. ఈ సారి తెంటు మీద నది

దాటేటప్పుడు ఏ ఇబ్బందీ ఎదురవలేదు. తెంటును అటుకేసీ, ఇటుకేసీ తాళ్ళు కట్టి ఆ ఒడ్డున లాగే వాళ్ళూ ఈ ఒడ్డున వదిలేవాళ్ళతో క్షేమంగా నదిని దాటాం. ఆంటోనియో, చపాకోలు ఇద్దరూ విడిగా ఉన్నప్పుడు మళ్ళీ ఏదో గిల్లికజ్జా పెట్టుకున్నట్లు ఉన్నారు. తనను అవమానించినందుకు గాను చపాకోకు ఆరు రోజుల పనిష్మెంటు ఇచ్చాడు ఆంటోనియో. రాత్రి ఇంకో ప్రహసనం జరిగింది. ఎల్‌నాటో రెండుసార్లు భోంచేసాడని ఈస్టెక్వియో గొడవ వేసుకున్నాడు. పొదల మాటున దాచిన కొవ్వు పట్టిన మాంసం ముక్కలు బయటపడ్డాయి. డాక్టరుగారు ఇంకో సమస్య తెచ్చిపెట్టారు. తన జబ్బు గురించి దళంలో ఎవరెవరు ఏమనుకుంటున్నారో చెప్పి వాపోయాడు. ముఖ్యంగా జూలియో ఏదో కూసాడని, మొత్తానికి రోజంతా ఇలాంటి అసంగతులతో గడిచిపోయింది.

**సెప్టెంబరు 17**

**పాబ్లితో**

దంతవైద్య శిబిరం నడిచింది ఈ రోజున. ఆర్టురో, చపాకో పళ్ళు పీకాను. మిగ్యుయెల్ నది ఎగువకు, బెనినో డొంకదారి వెంబడి పోయి వచ్చారు. గుర్రాల్ని నడిపించవచ్చు కాకపోతే నదిని రెండుసార్లు ఈదుకు రావాలని చెప్పాను. పాబ్లితో గౌరవార్థం అతని మట్టుకు అన్నం వండి పెట్టాం. ఈ రోజుకి అతనికి ఇరవైరెండేళ్ళు. మాగెరిల్లాలో పిన్న వయస్కుడు. డెబ్రీ విచారణ మళ్ళీ వాయిదా పడినట్లు, లయోల గుజ్‌మన్‌ను గెరిల్లాలు నిర్బంధించిన దానికి ఖండిస్తూ రేడియోలో వార్తలు వచ్చాయి.

**సెప్టెంబరు 18**

ఉదయం ఏడు గంటలకు ప్రయాణం మొదలయింది. ఇంకాసేపటికే మిగ్యుయెల్ వచ్చి నదీ తిన్నెల దగ్గర ముగ్గురు రైతులను చూసాననీ, వాళ్ళు తనని గమనించిందీ లేనిదీ తెలియదని చెప్పాడు. ఏదేమైనా వాళ్ళను అదుపులోకి తీసుకోమన్నా. చపాకో అర్టురోతో గొడవ వేసుకున్నాడు. తన తుపాకి 'మ్యాగజైన్' నుండి అతను పదిహేను బులెట్లు దొంగిలించాడని ఆరోపణ. మహా తేలుకొండి మనిషి చపాకో, గుడ్డిలో మెల్లలా అతను సహ క్యూబన్లతోనే లడాయి పెట్టుకున్నాడు ఇప్పటిదాకా. దళంలో ఉన్న బొలీవియన్లు అతన్ని అట్టే పట్టించుకోలేదు. నదిలో ఈదులాడాల్సిన అవసరం పడలేదు గుర్రాలకు. కానీ నల్లగుర్రం బాటన నడుస్తూ పక్కనే ఉన్న వాలులోకి 50 మీటర్లు దొర్లి పడిపోయిన మూలాన దానికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాడిదలను వేసుకుని పిరేరెండీ నది దిక్కుకు వెళుతున్న నలుగురు రైతులనూ అదుపులోకి తీసుకున్నారు. ఆ

నది ఇక్కడికి ఒక లీగు దూరం ఉంటుంది. అలాడినో గుయా్ట్రిజ్ అతని మనుషులతో కలసి గ్రాండే నది దగ్గర వేటకు వచ్చాడని, చేపలు పట్టుకుంటున్నారని వాళ్ళు చెప్పారు. అలాడినో, అతని భార్య, ఇంకొక రైతు అటుగా వెళ్ళడం చూసి వొదిలేసాడు బెనినో. ఈ విషయం తెలియగానే నాకు కోపం నషాళానికి అంటింది. అలా చెయ్యడం వెన్నుపోటే అన్నాం. దాంతో బెనినో వెక్కి వెక్కి ఏడ్చాడు. నలుగురు రైతులూ అక్కడికి ఏడెనిమిది లీగుల దూరంలో ఉన్న జిటానో అనే సెటిల్మెంట్‌కు చెందిన వాళ్ళు. అక్కడి దాకా మాతోనే కలిసి రావాలని చెప్పాం. అలాడినో అతని భార్య మహా గుట్టు మనుషులు. వాళ్ళ దగ్గర నుండి తిండి సంపాదించడానికి మా చేతి చమురు చాలానే వదిలింది. మా నుండి దండన తప్పదన్న భయంతో లయోల రెండుసార్లు ఆత్మహత్యకు పాల్పడినట్లు రేడియోలో వార్తలు వచ్చాయి. కొంత మంది టీచర్లను కూడా అరెస్టు చేసారట. లయోల ఇంటి దగ్గర ఫొటోలు దిగిన వ్యవహారం చాలా దూరం వచ్చింది. ఇదంతా సైన్యం కొండ గుహనుండి చేజిక్కించుకున్న ఫొటోల మూలంగానే జరిగింది అనడంలోనాకు సందేహం లేదు. సాయంత్రం ఒక చిన్న విమానం, యుద్ధవిమానం అనుమానాస్పదంగా ఈ ప్రాంతంలో ఎగిరాయి.

ఎత్తు - 800మీటర్లు.

**సెప్టెంబరు 19**

పెందళాడే బయల్దేరలేకపోయాం. రైతుల గాడిదలు కనిపించకుండా పోయినందున ఆలస్యం అయింది. చివరికి వాళ్ళకు ఒక ఉపన్యాసం చెప్పి మరీ బయల్దేరదీసాను. మోరో మూలంగా మేం నిదానంగా నడవాల్సి వచ్చింది. నది నుంచి ఎడంగా వెళ్ళాల్సి వచ్చే సమయానికి మరో ముగ్గురు రైతులు బందీలుగా చిక్కారనీ, 'అడ్వాన్సు పార్టీ' ఇప్పుడే బయల్దేరిందని, రెండు లీగుల అవతల ఉన్న చెరకు తోటకు ఇంకాసేపట్లో చేరనుంది అనే సమాచారం అందింది. లీగు అని ఉజ్జాయింపున అన్నారు కానీ నిజానికి రెండు లీగుల కన్నా చాలా దూరంలో ఉంది ఆ తోట. రాత్రి తొమ్మిది అయింది మేం అక్కడికి చేరుకునేసరికి. అదొక్కటే అక్కడున్న తోట. 'రియర్‌పార్టీ' తొమ్మిది దాటాక వచ్చి చేరుకుంది మమ్మల్ని.

నేను ఇంతితో చర్చ పెట్టాను. తిండి విషయంలో అతని బలహీనత గురించి మాట్లాడాను. అతనికి బాగా కోపం వచ్చింది. అవసరమైతే అందర్లోనూ బహిరంగ చర్చ పెట్టి తన బలహీనతల గురించి ఆత్మవిమర్శ చేసుకుంటాను అన్నాడు. కానీ తన

మీద వచ్చిన ఆరోపణల్లో నిజం లేదన్నాడు. మేం 1440 మీటర్ల ఎత్తుకు ఎక్కాం. ప్రస్తుతానికి 1000 మీటర్ల ఎత్తులో ఉన్నాం. ఇక్కడ నుండి లూసిటానోకు మూడు గంటల ప్రయాణం, నిరాశావాదుల లెక్కలే నాలుగు గంటలు. ఈ రోజు సీంపంది మాంసం తిన్నాం. పళ్ళ తీపులు ఉన్నవాళ్ళు మొలాసిస్‌తో చేసిన కేకులు తిని సరిపెట్టుకున్నారు.

ఈ రోజు రేడియోలో వార్తలన్నీ లయోల గురించి, సమ్మె చేస్తున్న టీచర్ల గురించే. హిగ్యురాస్ పని చేస్తున్న సెకండరీ స్కూలు ప్రాంతంలో ప్రజలు నిరాహారదీక్ష చేసారు. అరెస్టయిన వారిలో ఒక చమురు కంపెనీ ఉద్యోగి కూడా ఉన్నాడు. బడా చమురు కంపెనీల ఏర్పాటుకు వ్యతిరేకంగా చమురు కార్మికులు సమ్మెలోకి వెళ్ళనున్నారు.

పరిస్థితులు పాకాన పడుతున్నాయి. నా కలంలో సిరా అయిపోయింది.

**సెప్టెంబరు 20**

మధ్యాహ్నం మూడు గంటలకు బయల్దేరి మునిమాపు వేళకు లూసిటాన్ చేరుకోవాలని నిర్ణయించుకున్నాం. మూడు గంటల్లో అక్కడికి చేరుకోవచ్చని చెప్పారు. రకరకాల కారణాలతో మా ప్రయాణం మొదలయిందే సాయంత్రం ఐదు గంటలకు. కొండ మీదకు చేరుకునే సరికి చిమ్మచీకటి కమ్మేసింది. అర్ధరాత్రి 11 గంటలకు అలాడినో గుయాట్రిజ్ ఇల్లు ఎక్కుడుందో తెలుసుకోవడానికి దీపం వెలిగించాం. అతని ఇల్లు పచారీ కొట్టులా ఉంది. చిరుతిండి, సిగరెట్లు దొరికాయి. బట్టలు లేవు. కాసేపు కునుకు వేసాం. తెల్లవారుగట్ట మూడు గంటలకు ఆల్టో సెస్కో వైపుకు బయల్దేరాం. అక్కడికి నాలుగు లీగుల దూరం అని చెప్పారు. మెజిస్ట్రేటు ఇంటి దగ్గర ఫోన్ వాడుకుందాం అని ప్రయత్నించాం. కాని చాలా కాలంగా అది పనిచెయ్యడం లేదని తెలిసింది. వేసిన టెలిఫోన్ లైనులు కూడా కూలిపోయాయట. మేజిస్ట్రేట్ వర్గాస్‌ను కేకేసాడు. అతను ఆఫీసులో కాసేపు వుండి వెళ్ళిపోయాడు.

రేడియో ప్రసారాల్లో ప్రత్యేక వార్తలు ఏమీ లేవు. 1800 మీటర్ల ఎత్తుకు ఎక్కాం. లూసిటానీ 1400 మీటర్ల ఎత్తులో ఉంది.

మేం ఆ సెటిల్మెంట్ ఏరియా చేరుకోవడానికి రెండు లీగుల దూరం నడిచాం.

**సెప్టెంబరు 21**

తెల్లవారు జాము మూడు గంటలకు పిండారబోసినట్లు ఉన్న వెన్నెలలో మా ప్రయాణం మొదలుపెట్టాం. ఉదయం తొమ్మిది గంటల వరకూ నడిచాం. నరమానవుడి

జాడలేదు. మధ్యలో 2040 మీటర్ల ఎత్తుకు చేరుకున్నాం. శిఖరాగ్ర ప్రయాణం అంటే ఇదే. మరి కాసేపటికి ఇద్దరు రౌతులు కనపడ్డారు. రెండు లీగుల దూరంలో ఉన్న ఆల్టోసెకోకు దారి చూపించారు. సగం రాత్రి, కాస్తంత ఉదయ కాలం పట్టింది ఆ దూరం ప్రయాణించడానికి. మొదటగా ఎదురయిన ఇంట్లో తిండి కొనితిన్నాం. అక్కడ నుండి మేయర్ ఇంటికి వెళ్ళాం వండుకు తినడానికి. పిరేమిరి నది ఒడ్డున (1400 మీటర్ల ఎత్తున) ఉన్న జల విద్యుత్ ఉత్పాదన మీద ఆధారపడి నడుస్తున్న ఒక జొన్నల మిల్లును దాటుకు వెళ్ళాం. జనాలు పూర్తిగా బెదురుకున్నారు. మమ్మల్ని చూడ్డంతోటే వెళ్ళి దాక్కుంటున్నారు. నడక మహా మందంగా తయారయింది. రెండు లీగుల దూరంలో ఉన్న ఆల్టోసెకోను చేరడానికి మధ్యాహ్నం 12.35కు బయల్దేరితే సాయంత్రం 5 గంటలు అయింది.

**సెప్టెంబరు 22**

'సెంటర్ పార్టీ'గా ఉన్న మేం ఆల్టోసెకోలో అడుగు పెట్టేసరికి మేజిస్ట్రేటు లేకుండా పోయాడు. మేం ఈ దీవుల్లోనే ఉన్నాం అన్న విషయాన్ని చేరవెయ్యడానికి నిన్ననే అక్కడ నుండి జారుకున్నాడట. అందుకు ప్రతీకారంగా అతని పచారీ కొట్టులో సామానంతా దోచేసాం.. ఆల్టోసెకో 1900 మీటర్ల ఎత్తున ఉన్న ఓ యాభై గడపల పల్లె. సగం భయం, సగం ఉత్సుకతలతో అక్కడి వాళ్ళు మమ్మల్ని స్వాగతించారు. తినడానికి గట్టిగానే పోగయింది. దగ్గర్లో ఉన్న నీటి మడుగుపక్కనే ఉన్న పాడుపడిన ఇంట్లో మకాం వేసాం. వాలెగ్రాండె నుండి రోజూ అక్కడికి రావాల్సిన ట్రక్కు రానేలేదు. అంటే అతను మా గురించి ఉప్పందించడానికి వెళ్ళాడన్న కథనం నిజం అని రూఢీ అయింది. వాళ్ళ ఆవిడ ఏడ్చుకుంటూ వచ్చి తన బిడ్డల మీద, దేవుడి మీద ఒట్లు పెట్టి మరీ వాళ్ళ కొట్లో మేం తీసుకున్న సామాన్లకు సొమ్ములు ఇమ్మని అడిగింది. నేను లేదనేసాను. రాత్రి బడిలో చదువుకోవడానికి వచ్చిన పదిహేను మంది రైతులకు మా విప్లవ ఆశయాలను వివరిస్తూ ఇంతి ఉపన్యాసం ఇచ్చాడు. వాళ్ళంతా సంభ్రమాశ్చర్యాలతో మౌనంగా అతను చెప్పిందంతా విన్నారు. అక్కడ చదువు చెప్పడానికి వచ్చిన పంతులుగారు మధ్యలో కల్పించుకుని గ్రామాల్లో పోరాటాలు చేసారా అనడిగారు. చదువుకున్న తెలివితేటలు, నక్క వినయం, పిల్లలలో ఉండే పెంకితనం వంటి లక్షణాలన్నీ కలిసి ఉన్న ఆ రైతు సోషలిజం గురించి అనేక ప్రశ్నలు అడిగాడు. అక్కడ ఉన్న వాళ్ళలో ఒక పెద్ద కుర్రాడు తను మా గైడ్‌గా పనిచేస్తానని అడిగాడు. పంతులుగారిని నమ్మొద్దు అతనో గుంటనక్క అని చెప్పాడు. అక్కడ నుండి మేం అర్థరాత్రి ఒకటిన్నరకు శాంటీఎలెనా వైపుకు బయల్దేరాం. తెల్లవారి పదిగంటలకు అక్కడకు చేరుకున్నాం.

బారియాంటోస్, ఒవాండోలు సంయుక్తంగా ఒక పత్రికా సమావేశంలో ప్రసంగించారు. స్వాధీనం చేసుకున్న మా డాక్యుమెంట్లలో సమాచారం అంతా చెప్పారు. జోయాక్విన్ దళాన్ని తుడిచి పెట్టేసాం అని ప్రకటించారు.

**సెప్టెంబరు 23**

పచ్చగా కళకళలాడుతున్న బత్తాయి తోటలో పగలు విశ్రాంతి తీసుకున్నాం. నిండా పండ్లు ఉన్న తోట అది. అక్కడే పడుకున్నాం. ఇద్దరిని సెంట్రీలుగా పెట్టాం. మధ్యాహ్నం ఒంటిగంటకు లేచాం. రెండు గంటలకు అక్కడ నుండి 'లోమాలార్గా' వైపుకు బయల్దేరాం. పొద్దుకూకే సమయానికి అక్కడికి చేరుకున్నాం. వీపున బరువులు ఎక్కువ ఉండడంతో నిమ్మళంగా సాగింది నడక. బెనినో వంట చేసాడు. అది తిని నేను అజీర్తితో బాధపడ్డా.

**సెప్టెంబరు 24**

'లోమాలార్గా' సెంటిల్మెంటుకు చేరుకున్నాం. నా కాలేయం కళ తప్పింది. వాంతి అయింది. దూరాభారాలు నడవడమే తప్ప ఎలాంటి ప్రయోజనమూ లేకపోయె. దళ సభ్యులందరూ డస్సిపోయారు. ఆ రోజు రాత్రికి పూజియోకు వెళ్ళే దారి కూడలిలో విశ్రమించాలని నిర్ణయించా. మమ్మల్ని చూడగానే ఆ పల్లెలో వాళ్ళంతా పారిపోయారు. ఒకే ఒక రైతు ఇంటి పట్టున ఉన్నాడు. సోస్టెనాస్ వర్గాస్ అతనిపేరు. తన దగ్గర ఉన్న సీంపందిని మాకు అమ్మాడు. దాన్ని చంపి వండుకుతిన్నాం.

ఎత్తు – 1400మీటర్లు.

**సెప్టెంబరు 25**

పెందళాడేసరికి పూజియో చేరుకున్నాం. మొన్నటి రోజున మేం చూసిన మనుషులు కొందరు ఇక్కడ మాకు తారసపడ్డారు. అంటే మా గురించి నోటిమాటగా ప్రచారం చెయ్యడానికి వాళ్ళు ఇక్కడికి వచ్చారని అర్థమైంది. మాకు కొండ శిఖరాన ఉన్న చిన్న పల్లెపట్టు ఆ ప్రాంతం. మమ్మల్ని చూడగానే జనాలు ముందు తలోదిక్కున పారిపోయారు. తరువాత వచ్చి మమ్మల్ని చేరారు. బాగానే చూసుకున్నారు 'చుక్విసాకా'లోని సెర్రానీ ప్రాంతంలో అప్పుతీసుకున్న ఓ మనిషి అరెస్టు చెయ్యడానికి వచ్చిన ఒక గ్రామీణ పోలీసు అంతకు ముందే అటుగా వెనుతిరిగి వెళ్ళాడని చెప్పారు. మూడు దారులు కలిసే చోట ఉన్నాం. గుర్రాల మీద పోవడం ప్రమాదంతో కూడుకున్నది.

కానీ డాక్టరుగారు ఇంకా బలహీనంగా ఉన్న మూలాన అతన్ని సంభాళించుకోవడానికి ప్రయత్నిస్తున్నా. చుట్టుపక్కల ఎక్కడా సైన్యాన్ని చూడలేదని జనాలు చెప్పారు. 'ట్రాంకామేయో' అనే ఊరికి చేరుకునే వరకూ దశలవారీగా ప్రయాణించాం. రోడ్డువారగా పడి నిద్దర్లుపోయాం. హిగ్యూరాస్ మేజిస్ట్రేట్‌ది ఈ ప్రాంతమే. కాబట్టి కనబడితే అదుపులోకి తీసుకోమని సెంట్రీకి ఆర్డరు వేసా.

ఇంతి, నేను కలిసి కాంబాతో మాట్లాడాం. హిగ్యురా వరకూ మాతో కలసి వస్తానన్నాడు. అక్కడికి దగ్గరలో పుకారా అనే ఊరుంది. అటునుంచి శాంతాక్రజ్‌కు వెళ్ళిపోతానని చెప్పాడు.

ఎత్తు – 1800 మీటర్లు.

**సెప్టెంబరు 26**

ఓటమి.సూర్యోదయానికల్లా పికాచో చేరుకున్నాం. అక్కడ అంతా పండగ వాతావరణం ఉంది. 2280 మీటర్ల ఎత్తున ఉన్న ప్రదేశం అది. రైతులు మమ్మల్ని బాగానే చూసుకున్నారు. ఏ పట్టింపూ లేకుండా వ్యవహరించాం మేం కూడా. ఓవాండా మాత్రం మమ్మల్ని ఇవాళో, రేపో పట్టేస్తాం అని ప్రకటనల మీద ప్రకటనలు కుప్పిస్తున్నాడు. అక్కడ నుండి లాహిగ్యురా చేరుకునే సరికి పరిస్థితి అంతా మారిపోయింది. ఒక్క మగపురుగు కూడా కన్పించలేదు. కొంత మంది ఆడవాళ్ళు ఉన్నారు. కోకో టెలిగ్రాఫిస్ట్ ఇంటికి వెళ్ళాడు. అక్కడ టెలిఫోన్ ఉంది. అక్కడ నుండి 2వ తారీఖున వాలెగ్రాండే సహ మున్సబు మేజిస్ట్రేటుకు ఒక సందేశం పంపిన దాఖలాలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో గెరిల్లాల సంచారం ఉన్నట్లు, వాళ్ళకు సంబంధించిన సమాచారం అందించడానికి ఖర్చవుతుందని' ఆ సందేశం సారాంశం. గుట్టురట్టయిందని తెలిసి ఆ మనిషి పారిపోయాడు. అతని భార్య మాత్రం పక్కటౌన్లో, జాగ్వే ఈ రోజు సంత మూలాన ఆ సందడిలో ఉన్నారు. ఇవాళ మా గురించి ఎవరూ ఫోన్ చెయ్యలేదని భరోసాగా చెప్పింది.

మధ్యాహ్నం ఒంటిగంటకు అడ్వాన్సు పార్టీ 'జాగ్వే' వెళ్ళడానికి బయల్దేరింది. గుర్రాల గురించి, డాక్టరు గురించి అక్కడి పరిస్థితులను బట్టి ఒక నిర్ణయం తీసుకోవాలని అనుకున్నారు. ఊళ్ళో మిగిలిన ఒకే ఒక మగమనిషితో నేను మాట్లాడాను. అతను అప్పటికే విపరీతంగా భయపడిపోయి ఉన్నాడు. ఇంతలో కోకా బేరగాడు ఒకరు అటుగా వచ్చాడు. వాలెగ్రాండెలో గానీ, పుకారాలోగానీ హడావుడి ఏం లేదని చెప్పాడు. అతను కూడా వణికిపోతున్నాడు. కానీ మా ఎదురుగా వణుకును అదుపు చేసుకుని బింకంగా

మాట్లాడాడు. వాళ్ళు ఇద్దరూ చెప్పింది అబద్దాలని తెలిసి కూడా వాళ్ళను పొమ్మని విడిచిపెట్టాం. నేను కొండ కొమ్ముకేసి వెళ్ళా. సుమారు ఒకటిన్నరకు లోతట్టున అన్ని వైపుల నుండి తుపాకి కాల్పుల శబ్దం వినవచ్చింది. మా దళ సభ్యులు సైనిక ముట్టడిలో చిక్కుకున్నారని గ్రహించా. పల్లెలో మిగిలిన వాళ్ళతో ఆత్మరక్షణ ఏర్పాటు చేసుకున్నాం. దాడి నుండి బయటపడ్డ వాళ్ళు ఎవరన్నా వచ్చేదాకా ఆగి గ్రాండెనది కేసి పోయే దారి వెంబడి పడిపోదాం అని నిర్ణయించుకున్నాం. కాసేపటికి గాయపడిన బెనినో ప్రత్యక్షమయ్యాడు. తరువాత అనీసెటో ఆ తరువాత పాదం బాగా దెబ్బతిని పోయిన పరిస్థితిలో పాబ్లితో వచ్చాడు. మిగ్యుయెల్, కోకో, జూలియోలు నేలకొరిగారు. కాంబా తన 'కిట్' వదిలేసి పారిపోయాడు. 'రియర్ పార్టీ' మేం ఎంచుకున్న తోవ గుండా వేగంగా ప్రయాణం మొదలుపెట్టింది నేను వాళ్ళని అనుసరించాను. రెండు గుర్రాలను వెంట నడిపిస్తున్నా. కడగా ఉన్న వాళ్ళ మీద దాపు నుండి కాల్పులు జరిగాయి. దాన్తో వాళ్ళు వెనక్కి తగ్గారు. ఇంతితో మాకు కాంటాక్టు లేకుండా పోయింది. అతని కోసం అరగంట వేచిఉన్నాం. మేం కూడా సైనికుల దాడిని తిప్పి కొట్టడానికి వ్యూహం పన్ని ఉన్నాం. చివరికి అక్కడ నుండి బయల్దేరాలని నిర్ణయించుకున్నాం. ఇంతలో అతను వచ్చి చేరాడు మాతో. లియోన్ కనిపించకుండా పోయాడని అప్పుడు గమనించాం. అతని కిట్‌బ్యాగ్ ఒక మురుగు కుంటలో చూసానని, దాన్లోంచి దాటుకుంటూ వచ్చి పడ్డాననీ ఇంతి చెప్పాడు. కొండవాలు వెంబడి పోతున్న ఒక మనిషి మా కంట పడ్డాడు. జోరుగా పరిగెడుతున్న అతనే లియోన్ అయి ఉంటాడనే నిర్ధారణకు వచ్చాం. గుర్రాలు మా దోవన పడి రాకుండా ఉండడానికి లోయవైపుకు తోలేసాం వాటిని. మేం ఇంకో వైపుకు దిగాం. అక్కడ దొరికేది అంతా ఉప్పునీరే. మధ్య రాత్రి ఎప్పుడో కునుకు తీసాం. ఇంక ముందుకు పోవడం అసాధ్యమై పోయింది.

**సెప్టెంబరు 27**

తెల్లవారు జాము 4 గంటలకే మా ప్రయాణం మొదలయింది. ఏదో ఒక కొండ గుట్ట మీదకు చేరుకోవాలని ప్రయత్నించాం.మొత్తానికి ఏడుగంటలకు ఒక కొండకు చేరుకున్నాం.అది మేం అనుకున్న కొండ కాకపోయినా అప్పటిదాకా ఎవరూ కాలు మోపని ప్రాంతంలా కనిపించింది. కాబట్టి అట్టే ప్రమాదం లేదు. ఇంకాస్త పైకి ఎక్కి హోరుగాలి తాకిడి లేకుండా ఉండడానికి పలుచటి దుబ్బల మాటున దాక్కున్నాం. ఆ కొండ మీద ఒకదారి కనబడింది. పగలంతా ఎవరూ అటుగా పోయిన దాఖలా లేదు. చీకటి పడినాక ఒకరైతును వెంటపెట్టుకుని ఒక సైనికుడు ఆ దారిన సగం కొండ

ఎక్కి కాసేపు అక్కడే కాపు కాసాడు. మేం వాళ్ళ కంటపడలేదు. అనీసెటో పరిస్థితి ఎలా ఉందో రహస్యంగా గమనించి వచ్చాడు. దాపునున్న ఓ ఇంటి దగ్గర సైనికులు గుంపుగా ఉన్నారని, ఇక్కణ్ణించి తేలిగ్గా బయట పడే మార్గం అదేననీ, అది కాస్తా ఇప్పుడు మూసుకుపోయిందనీ చెప్పాడు. తెల్లవారు జామున కొండ దగ్గర బారులు తీరిన సైనికులు కనిపించారు. వాళ్ళు కొండ ఎక్కుతుంటే సూర్యకాంతి వాళ్ళ ఆయుధాల మీద, సామాగ్రి మీద పడి తళతళ మెరుస్తున్నాయి. మిట్టమధ్యాహ్నం పూట ఆగాగి కాల్పులు వినిపించాయి. ఆ తరువాత మిషన్‌గన్ గర్జించింది కాసేపు. 'అడుగో అక్కడున్నాడు వాడు' 'అక్కడా' బయటికి వస్తావా లేదా' అన్న అరుపులతో పాటు మధ్య మధ్యన తుపాకి కాల్పులు వినిపించాయి.ఆ మనిషికి ఏమైందో తెలియరాలేదు. కాని అది బహుశా కాంబో అయి ఉండొచ్చు అని ఊహించాం. అవతలి పక్కన ఉన్న నీటి మడుగు దగ్గరకు వెళ్ళడానికి సాయంత్రం పూట ప్రయత్నించాం. ఇంతకు ముందు కన్నా కాస్త దట్టంగా ఉన్న పొదల మాటున దాక్కున్నాం. కొండమీద నీరు దొరికే అవకాశం ఉన్నట్లు లేదు. లోయలో ప్రయత్నించాలి.

రేడియోలో వచ్చిన వార్తలను బట్టి గాలిండో సైనిక కంపెనీ మాతో తలపడిందని తెలియవచ్చింది. ముగ్గురు గెరిల్లాలు చనిపోయారని, శవాలను గుర్తించడానికి వాలెగ్రాండె తరలిస్తున్నట్లు ప్రకటించారు. కాంబా, లియోన్‌లు సైన్యం చేతికి చిక్కి ఉండరని భావించాం. ఈసారి మాకు తీరని నష్టం జరిగింది. కోకోను కోల్పోవడం భరింప శక్యం కాకుండా ఉంది. మిగ్యుయెల్, జూలియోలు అద్భుతమైన పోరాట వీరులు. మేం పోగొట్టుకున్న ఈ ముగ్గురి విలువను ఎంచడానికి మాటలు చాలవు. లియోన్ దారిన పడుతున్నాడు.

ఎత్తు - 1400 మీటర్లు.

**సెప్టెంబరు 28**

రోజంతా ఆందోళనకరంగా గడిచింది. ఒక దశలో ఇదే మా చివరి రోజు అనిపించింది. ఉదయమే కాసిన్ని నీళ్ళు తెచ్చుకున్నాం. ఇంతి, విల్లీలు ఇద్దరూ ఇక్కడ నుండి బయట పడడానికి వేరేమార్గం ఏమన్నా ఉందేమో అన్వేషించడానికి వెళ్ళారు. కానీ అంతలోనే తిరిగి వచ్చేసారు. ఎడమవైపు నుండి కొండ ముందుకు పోవడానికి ఒక దారి ఉంది గానీ ఒక రైతు గుర్రం మీదెక్కి అటుగా వెళ్తూ కానవచ్చాడట. పదిగంటలకు ఒక నలభై ఆరుగురు సైనికులు భుజాన కిట్‌లు మోసుకుంటూ మా

ముందు నుంచే వెళ్ళారు. ఏళ్ళూ పూళ్ళూ గడిచినట్లు అనిపించింది వాళ్ళు మమ్మల్ని దాటుకుని వెళ్ళేసరికి. మిట్టమధ్యాహ్నం పన్నెండు గంటలకు ఇంకొందరు సైనికులు గుంపుగా ప్రత్యక్షమయ్యారు. మొత్తం డెబ్భై ఏడు మంది ఉన్నారు. పులిమీద పుట్రలా మధ్యలో తుపాకి కాల్చిన శబ్దాలు విని వీళ్ళందరూ అక్కడే 'పొజిషన్లు' తీసుకున్నారు. వాళ్ళ ఆఫీసరు వాలుగా ఉన్న కొండలోయ కేసి పదమని ఆర్డరు వేసాడు. చివరికి అతనికి రేడియోలో సందేశం వచ్చాక తృప్తి పడి సైన్యాన్ని అక్కడ నుండి బయల్దేరదీసాడు. పై నుండి మా మీద దాడి మొదలయితే అంతా దొరికి పోయేవాళ్ళమే. ఆత్మరక్షణకు అవకాశమే లేదు. అంతకన్నా అక్కడ నుండి తప్పించుకునే దారీ లేదు. వాళ్ళు గనక మమ్మల్ని కనిపెడితే మా పని ఖాళీయే. అంతావెళ్ళి పోయారనుకున్న సమయానికి ఒక సైనికుడు కాళ్ళీడ్చుకుంటూ, అలిసిపోయి నడవడానికి మోరాయిస్తున్న వేటకుక్కను ఈడ్చుకుంటూ, అటుగా మమ్మల్ని దాటుకుంటూ వెళ్ళాడు. మేం ఊపిరి పీల్చుకున్నాం. ఇంకాసేపటికి ఇంకో సైనికుడు ఓ రైతును వెంటబెట్టుకుని అటుగా వచ్చాడు. దారి తప్పిన అతనికి రైతు దారి చూయించడానికి వచ్చాడనుకుంటా. ఆ రైతు అటుగా వెళ్ళి మళ్ళీ ఇటుగా వచ్చాడు. ఇహ ఆ తరువాత అంతా మామూలుగానే ఉంది. కాని తుపాకి కాల్పులు వినబడ్డాక సైనికులు పొజిషన్ తీసుకోవడం చూసి మేం చాలా ఆందోళన పడ్డాం. సైనికులు అందరూ కిట్ బ్యాగ్‌లు వీపున మోసుకుంటూ వెళుతున్నారంటే అక్కడ నుండి బలగాలను ఉపసంహరిస్తున్నట్లే అని అర్థం చేసుకున్నాం. దూరాన ఉన్న పాక దగ్గర ఎలాంటి చలిమంటలూ కనబడలేదు. చీకటి పడగానే సంప్రదాయంగా కాల్చే తుపాకి మోతలూ వినబడలేదు. రేపు ఈ సెటిల్మెంటు ప్రాంతం చుట్టు ప్రక్కలంతా గాలించాలి. కాస్త జల్లులు పడ్డాయి. మేం ముద్దగా తడిసిపోయాం. అయితే మార్గంలో మేం నడిచివచ్చిన కాలిజాడలు చెరిగిపోవడానికి ఆ వర్షం చాలదనిపించింది.

రేడియో వార్తలలో కోకో శవాన్ని గుర్తుపట్టినట్లు ప్రకటించారు. జూలియోను గుర్తించడంలో అయోమయంలో పడ్డారు. మిగ్యుయెల్‌ను ఆంటోనియోగా పొరబడ్డారు. ముందు నేను కూడా చనిపోయానన్న వార్త ప్రసారం చేసారు. ఆనక కాదని ప్రకటించారు.

**సెప్టెంబరు 29**

ఉద్రిక్తంగా గడిచింది ఈ రోజు. తెల్లవారే చిలీ దేశపు రేడియో 'బాల్మసెడా' ఒక బాంబు పేల్చింది. సైన్యంలోని అత్యున్నత అధికారుల సమాచారం అని ఉటంకిస్తూ చేగువేరా ఒక కొండ మీద దుబ్బలోయలో దాగి ఉన్నాడన్న వార్త ప్రసారం చేసింది.

నమ్మక ద్రోహం జరిగిందని అర్థం అయింది. సైన్యం మేం ఎక్కడుందీ పసిగట్టింది. ఇంకాసేపటికి అన్ని వైపులనుండి సైన్యం కదలికలు మొదలయ్యాయి. మధ్యాహ్నానికి నలభైమంది సైనికులు తుపాకులు బారు చేసి దూరాన ఉన్న ఇంటిని చుట్టుముట్టారు. గుబులు పడుతూనే సెంట్రీలను నిలబెట్టారు. ఈ విషయం అనీసెటో, పోచోలు 'రిపోర్టు' చేసారు. ఇంతి, విల్లీ వెనక్కి వచ్చారు. తిన్నగా పోతే రెండు కిలోమీటర్ల దూరంలో గ్రాండెనది ఎదురుపడుతుందని, అక్కడ ఉన్న లోయ వాలులో మూడు ఇళ్ళు కనపడ్డాయని అక్కడైతే మేం ఎవరికంటా పడకుండా ఉండొచ్చని చెప్పారు. అందరం కేవలం నీళ్ళు తాగి రాత్రి పది గంటలకు చిమ్మచీకటిలోనే అక్కడ నుండి బయల్దేరాం. చీకటి మూలంగా ఎల్‌చినో బాగా వెనుకపడిపోయాడు. బెనినో పరిస్థితి మెరుగయింది. డాక్టరు మాత్రం పూర్తిగా కోలుకోలేదు.

**నెలసరి సమీక్ష**

ఈనెల అంతా మమ్మల్ని మేం కూడదీసుకోవడంతోనే గడిచింది. మిగ్యుయెల్, కోకో, జూలియోలు సైన్యం ఉచ్చులో బలికావడం పరిస్థితి మొత్తాన్ని దిగజార్చింది. అప్పటి నుండి అనుక్షణం మేం ప్రమాదం అంచునే గడిపాం. లియోన్‌ను పోగొట్టుకున్నాం. కాంబా కూడా జారిపోయాడు. అతను చేజారిపోవడం మాకు జరిగిన మేలే.

చిన్న చిన్న కొట్లాటలు మినహా భారీ దాడులకు పాల్పడలేక పోయాం. ఒక సైనికుణ్ణి గాయపరిచాం. ఇంకో సైనికుడిని, గుర్రాన్ని బలితీసుకున్నాం. గస్తీ తిరుగుతున్న సైన్యం మీద అర్బానో కాల్పులు జరిపాడు. ఆ తరువాత లాహిగ్యురా దగ్గర జరిగిన దారుణమైన ఎదురుదాడి. మేం గుర్రాలను విడిచి పెట్టేసాం. మళ్ళీ ఉబ్బసం తిరగబెడితే తప్ప గుర్రాలను వాడకూడదు.

ఇంకోపక్కన చూస్తే రెండవ దళం తుడిచిపెట్టుకు పోయిందన్న వార్తల్లో నిజం ఉందనిపిస్తుంది. ఒకరో, ఇద్దరో మిగిలి ఉన్నా సైన్యానికి ఎదురుపడకుండా తప్పించుకు తిరుగుతూ ఉండి ఉండాలి. ఏడుగురు సభ్యులతో కూడిన దళం పూర్తిగా తుడిచిపెట్టుకు పోయిందనే మాట పూర్తి నిజం కాకపోవచ్చు. కాకుంటే బడాయి కోసం అలాంటి వార్త ప్రసారం చేసి ఉండొచ్చు.

కార్యకలాపాల సమీక్ష యధావిధిగా గత నెల మాదిరిగానే ఉంది. కాకపోతే సైన్యం కార్యకలాపాలు ఇప్పుడు చురుగ్గా ఉన్నాయి. రైతుల నుండి మాకు వీసమెత్తు సాయం అందకపోగా వాళ్ళే 'ఇన్ఫార్మర్లు'గా వ్యవహరిస్తున్నారు.

ముఖ్యమైన, తక్షణ కర్తవ్యం ఏంటంటే – ముందు మేం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ నుండి బయటపడి, మాకు అనువైన ప్రాంతానికి చేరుకోవాలి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు పునరుద్ధరించుకోవాలి. లాపాజ్‌లో మేం నెలకొల్పుకున్న సమాచార వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని పోయింది. ఇక్కడ మేం కూడా గట్టి ఎదురు దెబ్బలు తిన్నాం. ఇంత జరిగినా దళం మనోధైర్యంతో ఉంది. విల్లీ గురించి మాత్రం నా సందేహాలు నాకు ఉన్నాయి. నేను చొరవ తీసుకుని అతనితో మాట్లాడి సరిదిద్దకపోతే ఆ వంకనో, ఈ వంకనో తనంతట తనే దళం నుండి వెళ్ళిపోయేందుకు ప్రయత్నిస్తాడు.

# అక్టోబరు 1967

**అక్టోబరు 1**

ఈ నెల తొలి రోజున ఎటువంటి ఘటనా చోటుచేసుకోలేదు. తెల్లవారుజామున మేం సున్నం గుట్టలు, దట్టమైన పొదలు ఉన్న ఒక ప్రాంతానికి చేరుకుని అక్కడే మకాం వేసాం. అన్ని వైపులా సెంట్రీలను ఉంచాం. దూరాన ఉన్న కొండ లోయలో 40 మంది సైనికులూ వెళ్ళిపోతున్నారనుకున్నాం. వీడ్కోలు సందర్భంగా జరిపే తుపాకి కాల్పులు వినవచ్చాయి. ఆ పూరిపాకలో ఎవరూ ఉన్న ఆనవాలు లేదు. వాళ్ళు మమ్మల్ని వెంబడిస్తున్న దాఖలాలేదు. కాబట్టి ఇంకో రోజు ఇక్కడే మకాం ఉండాలని నిర్ణయించాం. అన్ని విధాలా అనువుగా ఉంది. వెనక్కి తిరిగి పోవడానికి సురక్షితమైన మార్గం ఉంది. ఇక్కడ నుండి అయితే మేం సైన్యం కదలికలన్నీ గమనించవచ్చు. పాచో, ఎల్‌నాటో, దారియో, ఈస్టెక్వియోలు నీళ్ళు తీసుకురావడానికి వెళ్ళి రాత్రి తొమ్మిది గంటలకు తిరిగి వచ్చారు. తినడానికి చపాకో మాంసం వడలు, పాయసం చేసాడు. ఆకలి అన్న మాట మర్చిపోయేలా తిన్నాం.

రేడియోలో కొత్తగా సమాచారం ఏమీ లేదు. ఎత్తు – 1600 మీటర్లు.

**అక్టోబర్ 2**

**ఆంటోనియో**

ఈ రోజు సైనికుల జాడలేదు. కాని గొర్రెలు కాచే కుక్కలు కొన్ని మేకల్ని మళ్ళేయడానికి మేం ఉన్న దాపులకి చాలా మార్లు వచ్చాయి. మమ్మల్ని పసిగట్టి మొరిగాయి. దగ్గరలో ఉన్న పండ్ల తోటలను దాటుకుని అవతలగా ఉన్న కొండగుట్ట మీదకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాం. సాయంత్రం ఆరు గంటలకు బయల్దేరాం. వండుకు తిని తాపీగా అక్కడకు చేరుకోవడానికి కావల్సినంత సమయం ఉంది. కానీ ఎల్‌నాటో ఎక్కడో దోవ తప్పిపోయాడు. బహుశా మమ్మల్ని వీడి వెళ్ళిపోవాలి అనుకుంటున్నాడేమో.

వెనుదిరుగుదాం అనుకున్నాం. కానీ ఈ సారి మేం దారితప్పాం. ఆ రాత్రికి అక్కడే ఉండిపోయాం. తినడానికి, తాగడానికి లేకుండా గడిపాం. ముప్పైయ్యవ తారీఖున సైన్యాన్ని మోహరించడానికి గల కారణాలు ఏంటో రేడియో వార్తలను బట్టి అర్థం చేసుకున్నాం. రేడియో 'క్రజ్‌డెల్ సుర్' ప్రసారాలను బట్టి క్వినాల్ లోయ దగ్గర చిన్న గెరిల్లా దళంతో సైన్యానికి లడాయిపడింది. (ఆదళం మాదే). ఇరుపక్కలా ఎలాంటి నష్టం వాటిల్లలేదు కానీ ఆ తరువాత మేం వదిలి వచ్చిన ప్రాంతంలో రక్తం మరకలు కనుగొన్నదట సైన్యం. మా దళంలో ఆరుగురు సభ్యులు ఉన్నారని ఆ రేడియో ప్రకటించింది.

**అక్టోబరు 3**

అనవసరమైన ఆందోళనతో, సుదీర్ఘంగా గడిచిన రోజు. మేం మా 'బేస్ క్యాంప్'కు వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. ఇంతలో అర్బానో వచ్చాడు. అటుగా వెళ్తున్న రైతులు 'రాత్రి మనం విన్నామే. వాళ్ళనే మనం చూసింది' అని మాట్లాడుకోవడం విన్నాడట. అప్పటికే మేం బయల్దేరి చాలా సేపయింది. అర్బానో చెప్పింది తప్పుడు వార్త అనిపించింది. అయినా నిజమని నమ్మినట్లు నటించా. దాహం కూడా తీర్చుకోకుండా సైన్యం తిరిగిన ఆనవాళ్ళున్న దారినబడి కొండ మీదకి నడిచాం. మిగిలిన రోజంతా ప్రశాంతంగా గడిచింది. సాయంత్రం కిందకు దిగి కాఫీ కాచుకున్నాం. టీ కెటిల్ జిడ్డోడుతున్నా, ఉప్పునీళ్ళతో కాచుకున్న కాఫీనే అయినా అమృతంలా తోచింది మాకు. జొన్నపిండి సంకటి చేసుకుతిన్నాం. కాసింత అన్నం, మాంసం వండుకున్నాం మాతో తీసుకువెళ్ళడానికి. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రయాణం ఆరంభించాం. అన్ని ముందు జాగ్రత్తలూ తీసుకున్నాం. పండ్లతోటను దాటి మేం అనుకున్న కొండవాలుకు చేరుకున్నాం. నీరు ఉన్న జాడలేదు. అంతకు ముందు సైనికులు గాలింపు జరిపిన దాఖలాలు లేవు.

రేడియోలో ఇద్దరు బందీలకు సంబంధించిన వార్తలు ప్రసారం చేసారు. ఆంటోనియో డోమిన్‌గెజ్ ఫ్లోరెస్ (లియోన్), ఓర్లాండో జిమెంజ్ బాజాన్ (కాంబా)లు ఇద్దరూ బందీలుగా చిక్కారు. సైన్యానికి వ్యతిరేకంగా పోరాడడానికి వచ్చినట్లు అంగీకరించారు. అధ్యక్షుడు బారియాంటోస్ మాటమీద నమ్మకం ఉంచి తను లొంగిపోయినట్లు లియోన్ చెప్పుకొచ్చాడు. చాలా సమాచారం చెప్పేసారు వాళ్ళు – ఫెర్నాండో గురించి, నా ఆరోగ్యం, దళంలో ఇతర సభ్యుల వివరాలు సహా చాలానే చెప్పారు. బహిరంగంగా చెప్పిందే ఇంత సమచారం అయితే ప్రైవేటున ఇంకెన్ని నిజాలు కక్కేసి ఉంటారో? ఇద్దరు వీరోచిత గెరిల్లాల కథ ఈ విధంగా ముగిసింది.

డెబ్రే ఇంటర్వ్యూ ఒకటి విన్నాం. రెచ్చగొడుతూ మాట్లాడిన విద్యార్థికి చాలా ధైర్యంగా బదులిచ్చాడు. ధీటుగా తలపడ్డాడు చర్చలో.

ఎత్తు 1360 మీటర్లు.

**అక్టోబరు 4**

లోయలో విశ్రాంతి తీసుకుని ఇంకాస్త దిగువకు బయల్దేరాం. అరగంట గడిచింది. అక్కడ ఒక గుట్ట వైపుకు పోయే దారి ఎదురయింది. ఆ గుట్ట ఎక్కి మధ్యాహ్నం మూడుగంటల వరకూ విశ్రాంతి తీసుకున్నాం. ఎండ బారిన పడకుండా ఉండడానికి. తరువాత ఇంకో అరగంట పాటు ప్రయాణించాం. మాకన్నా ముందుగా బయల్దేరిన వాళ్ళిద్దరూ తిరిగి వచ్చి మమ్మల్ని కలుసుకున్నారు. ఆ దారి కడదాకా వెళ్ళివచ్చారట. ఎక్కడా చుక్కనీరు లేదట. సాయంత్రం ఆరుగంటలకు మేం ఆ దారిని వదిలి పెట్టి పశువులు నడిచిన దారిని ఒకటి పట్టుకున్నాం. రాత్రి ఏడున్నర వరకూ నడిచాం. అక్కడితో చిమ్మచీకటి ఆవరించి ఏం కనబడకుండా పోయింది. తెల్లవారు జాము మూడు గంటల వరకూ అక్కడే ఉండిపోయాం.

నాల్గవ డివిజన్ సైన్యం సిబ్బందికి చెందిన ప్రాంతీయ కేంద్ర కార్యాలయాన్ని లాంగ్యునిల్లాస్ నుండి పడిల్లాకు మార్చినట్లు రేడియోలో వార్తలు వచ్చాయి. గెరిల్లాలు తప్పించుకోవడానికి అవకాశం ఉన్న సెర్రానో ప్రాంతం మొత్తాన్ని ఆధీనంలోకి తీసుకోవడానికి ఈ మార్పు చేసారట. నేను నాల్గవ డివిజను సైన్యానికి చిక్కితే నన్ను కామరిలో విచారిస్తారని, ఎనిమిదవ డివిజను చేతికి చిక్కితే శాంతాక్రజ్‌లో విచారిస్తారని రేడియో చర్చలో పాల్గొన్న వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

ఎత్తు – 1650 మీటర్లు.

**అక్టోబరు 5**

తిరిగి ప్రయాణం మొదలు పెట్టాం. ఉదయం ఐదుంపావు వరకూ నానా కష్టాలు పడ్డాం. పశువులదారిని విడిచిపెట్టి దట్టంగా ఉన్న సున్నం గుట్టలోకి దారి తీసాం. ఎవరికంటా పడకుండా ఉండేందుకు అనువైన స్థలం అది. నీళ్ళ కోసం అని బెనినో, పాచోలు తిరగని చోటు లేదు. దూరాన ఉన్న గుడిసె చుట్టుప్రక్కల దాకా వెళ్ళొచ్చారు. అక్కడ ఒక చిన్న నుయ్యి ఉంది. కాని గాలింపు కోసం వెళ్ళిన ఓ ఆరుగురు సైనికులు వెనుతిరిగి అక్కడికి రావడం కనబడిందట. సాయంత్రానికి అక్కడ నుండి

బయల్దేరాం మళ్ళీ. తాగేందుకు నీరు లేని మూలాన అందరూ బాగా అలిసిపోయారు. గుక్కెడు నీళ్ళు పొయ్యండర్రా అని గుంజుకుంటూ ఈస్టెక్విియో కొంత గందరగోళం చేసాడు. దారి దరిద్రంగా ఉంది. ఆగాగి నడవాల్సి వచ్చింది. తెల్లవారు జాముకు చిన్న అటవీ ప్రాంతం చేరుకున్నాం. దగ్గర్లోంచి కుక్కల మొరుగుడు వినిపించింది. ఎవరూ అడుగుపెట్టని ఎత్తైన కొండ ఒకటి దగ్గర్లో కనిపించింది.

బెనినో కాలి గాయానికి చీము పోసింది. నేను శుభ్రం చేసాను. డాక్టరుకు ఇంజెక్షను చేసాను. గాయం శుభ్రం చేసిన మూలాని ఆ రాత్రికి కాలు నొప్పి చేసిందని కంప్లెయింట్ చేసాడు బెనినో.

రేడియోలో వార్తలను బట్టి డెబ్రి విచారణలో సాక్ష్యులుగా ఉపయోగపెట్టుకోవడానికి కాంబాలు ఇద్దరినీ కామిరికి తరలించారని తెలిసింది.

**అక్టోబరు 6**

చుట్టుపక్కల వెతుకులాడడానికి వెళ్ళిన వాళ్ళకు దగ్గర్లో ఒక ఇల్లు కనబడింది. ఇంకా ముందుకు వెళితే నీటిమడుగు కూడా ఉందట. మేం నీటి మడుగు దగ్గరకే వెళ్ళాం. వంట చేసుకు తిన్నాం. తల దాచుకోవడానికి ఒక కప్పుకిందకి చేరి విశ్రమించాం. కానీ నాలో ఏదో తెలీని అసౌకర్యం మెదలాడుతా ఉంది. పట్టపగలు, దగ్గర్లో జనావాసం ఉన్న ప్రాంతం – బొరియలో చిక్కిన వాళ్ళం అయిపోం కదా అని పీకులాటగా ఉంది. వంట చేసుకు తినేసరికి చాలా సేపు పట్టింది. కాబట్టి వేకువ జామునే అక్కడ నుండి బయల్దేరి దగ్గర్లో ఉన్న కనుమ దగ్గరకు వెళ్ళి అక్కడ నుండి మా భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించుకుందాం అనుకున్నాం.

రేడియో 'క్రజ్ డెల్సుర్' ఈ రోజు ఇద్దరు కాంబాలతో ఇంటర్వ్యూ ప్రసారం చేసింది. ఓర్లాండో నక్కజిత్తులన్నీ వేస్తున్నాడు. చిలీ రేడియో సెన్సారయిన ఒక వార్త ప్రసారం చేసింది. మొత్తం 1800 మంది సైనికులు ఈ ప్రాంతంలో మా కోసం గాలింపు జరుపు తున్నారట.

ఎత్తు – 1750 మీటర్లు.

**అక్టోబరు 7**

గెరిల్లా ఉద్యమం మొదలు పెట్టి ఇవాళ్టికి సరిగ్గా పదకొండు నెలలు. ఎటువంటి సమస్యలు లేకుండా గడిచింది. దాపున గొర్రెల కాపర్లు తిరుగుతున్నారు. మధ్యాహ్నం

పన్నెండున్నరకు మేం మకాం వేసిన ప్రాంతానికి ఒక ముసలావిడ మేకల్ని తోలుకుంటూ వచ్చింది. మేం ఆమెను అదుపులోకి తీసుకున్నాం. మేం అడిగిన ఏ ప్రశ్నకూ ఆమె నమ్మదగిన జవాబు ఒక్కటీ చెప్పలేదు. సైనికుల గురించి ఆరా తీస్తే 'నాకేం తెల్వదు' అని చెప్పింది. 'చాలా కాలంగానే నీడ ఉండడం లేదు' అని కూడా చెప్పింది. కాని అక్కడ నుండి ఏ దారి ఎటుపోతుందో చెప్పింది. ఆమె చెప్పిన సమాచారం ప్రకారం ఒక దారిన పడి ఒక లీగు దూరం పోతే హిగ్యురాస్ తగులుతుంది. ఇంకో దారి జాగ్యుయి వైపుకు పోతుంది. మరో దారిన పడి రెండు లీగులు ప్రయాణిస్తే పుకారా తగుల్తుంది. ఇంతి, అనీసెటో, పాబ్లితోలు ఆ ముసలావిడను వెంటబెట్టుకుని వాళ్ళ ఇంటి దగ్గర దిగవిడిచి వచ్చారు. వికలాంగురాలైన కూతురు, ఒక మరుగుజ్జు కూతురూనట ఆమెకు. ఆవిడ చేతిలో ఓ యాభై పెసోలు పెట్టి వచ్చారట. మా గురించి ఎక్కడా, ఎవరితోనూ, ఏం

చెప్పనని మాట తీసుకున్న ఆమె మాట నిలబెట్టుకునే దానిలా కనబడడం లేదు కాబట్టి వృధా శ్రమ అనుకుని వచ్చేసారట. మిగిలిన పదిహేను మంది చిరు వెన్నెలలో ప్రయాణం ప్రారంభించాం అక్కడ నుండి. ప్రయాణం భారంగా ఉంది. చాలా చోట్ల మా అడుగుజాడలు ఉన్నాయి. దగ్గర్లో ఎక్కడా ఇళ్ళు లేవు. నీటి మడుగు ప్రవహించే తోవన కుంటలు తవ్వి ఆలుగడ్డలు పండిస్తున్న పొలాలు కనిపించాయి. అర్ధరాత్రి రెండు దాటాక మేం విశ్రాంతి కోసం ఆగాం. ముందుకు వెళ్ళి ఉపయోగం లేదు. రాత్రిపూట ప్రయాణం అంటే చాలు ఎల్‌చినో మా పాలిట భారంగా తయారయ్యాడు.

సైన్యం ఒక చిత్రమైన ప్రకటన జారీ చేసింది. సెర్రానో దారిన పడిపోతున్న ముప్ఫై ఏడుమందిని 250 మంది సైనికులు చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారట. మేము ఏసిరో, ఓరో నదుల మధ్యన దాంకుని ఉన్నామని వాళ్ళు సైన్యానికి చెప్పారట.

ఇదంతా మమ్మల్ని తప్పుదోవ పట్టించడానికే అని ఇట్టే తెలిసిపోతుంది.

ఎత్తు – 2000 మీటర్లు.

* * *

ఇక్కడితో డైరీ సమాప్తం.

1967 అక్టోబరు 8న చేగువేరా గాయపడి, బందీగా చిక్కాడు. తరువాత అతన్ని కాల్చి చంపారు.

# 'తుది పలుకులు'

**ఇంతి పెరెడో**

బొలీవియాలో గెరిల్లా యుద్ధతంత్రం అంతం కాలేదు. అది ఇప్పుడే మొదలయ్యింది.

బొలీవియా గెరిల్లా యోధులు ఇప్పుడు పరిపూర్ణంగా పోరు బాటలో ఉన్నారు. ఎత్తిన జెండా దించకుండా పోరాటం కొనసాగిస్తున్నారు. విప్లవ శక్తులు అద్భుత విజయం సాధించే వరకూ, లాటిన్ అమెరికా సోషలిజం సాధించే వరకూ ఈ పోరాటం కొనసాగుతుంది.

మౌళికంగానే మా దేశం ఏ ఖండాతర దేశం కలలోనైనా తలవని విప్లవ అనుభవాన్ని స్వంతం చేసుకుంది. మా పోరాటానికి విషాదాంత ప్రతికూలత ఎదురయ్యింది. మహితుడు, సఖుడూ, మా కామ్రేడ్ మేజర్ ఎర్నెస్టో చేగువేరా భౌతిక మరణం, అతనితో పాటు ఇంకొందరి గెరిల్లా యోధుల ప్రాణతర్పణం మాకు గట్టి ఎదురు దెబ్బే. పూడ్చుకోలేని నష్టమే. మానవ జాతి విముక్తి కోసం తమ జీవితాలను తృణప్రాయంగా త్యాగం చెయ్యడానికి సిద్ధపడిన తరం ఉన్న భూ ఖండం మాది. స్వచ్ఛమైన, ఉదాత్త తరానికి ప్రతినిధులు వాళ్ళు.

వారిని కోల్పోయిన నష్టం బాధాకారమే కానీ మమ్మల్ని ఇంచుక భయపెట్టలేదు. మా విప్లవ చైతన్యాన్ని బలోపేతం చేసింది వారి త్యాగం. సామాజిక న్యాయం కోసం పోరాడాలన్న మా నిబద్ధతను, నిమగ్నతను మరింత పెంపొందించింది. మేం బలపడడానికి, అప్రతిహతంగా ముందుకు సాగడానికి ఆలంబనగా నిలిచింది. ప్రజాయుద్ధాన్ని మా రక్తంతో పునీతం చేస్తాం. నేలకొరిగిన వీరులం గౌరవాంజలి ఘటించడానికి కొత్త నాయకులు, సరికొత్త యోధులూ పుట్టుకు వస్తూనే ఉంటారు.

మేం దేనికోసం పోరాడుతున్నామో మాకు తెలుసు. మేం యుద్ధం కోసం యుద్ధానికి తలపడడం లేదు. మేం ఊహల్లో గాలిమేడలు కట్టేవాళ్ళం కాదు. వ్యక్తిగత

ప్రతిష్ట కోసమో, పార్టీకి పేరుతేవడానికో మేం పోరాడడం లేదు. సాటి మనిషిలో విశ్వాసం ఉంది మాకు. మనిషిని మనిషిగా చూడాలనే మతం మాది.

మా ఏకైక, అంతిమ లక్ష్యం లాటిన్ అమెరికా విముక్తి. తాత్కాలికంగా ఇరవై దేశాలుగా ముక్కలయి ఉన్నా మా దృష్టిలో లాటిన్ అమెరికా ఖండం అంతా ఏకరక్త బంధువే. ఇదే మా మాతృభూమి.

లాటిన్ అమెరికా దేశాలు రాజకీయంగా, భౌగోళికంగా ఏకీకృతం కావాలన్న సైమన్ బొలివర్, చేగువేరాలు కన్న కలలు సాకారం కావడానికి సాయుధ పోరాటం ఒక్కటే మార్గమని విశ్వసించిన వాళ్ళం. ఈ మార్గం ఒక్కటే నిజాయితీతో కూడినది, హుందా అయినది, మహోజ్వలమైనది. ప్రజలను ఉత్తేజపరిచేది. ఇతరత్రా మార్గాల కన్నా పోరాట పంథా స్వచ్ఛమైనది. గెరిల్లా యుద్ధతంత్రం అనేది సాయుధ పోరాటానికి ఉన్న అత్యంత ప్రభావవంతమైన, నికరమైన మార్గం.

ఈ కారణాల రీత్యానే లాటిన్ అమెరికాలో నిజాయితీ గల మనిషి ఒక్కరు బతికి ఉన్నా గెరిల్లా యుద్ధానికి చావు ఉండదు. ప్రజలు చైతన్యవంతులై, ఆయుధాల్ని చేతబూని ఉమ్మడి శత్రువైన అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన ఉత్తుంగ తరంగంలా ఉద్యమించడానికి ఈ సాయుధ పోరాటం ఊతం ఇస్తుంది.

బొలీవియాలో గెరిల్లా యుద్ధం అంతం కాలేదు.

అది ఇప్పుడే ఆరంభమయ్యింది.

మేం ఒక యుద్ధాన్ని చేజార్చుకున్నాం. పీడిత ప్రజల సమున్నత నాయకుడు మేజర్ ఎర్నెస్టో చేగువేరా తన జీవితాన్ని తృణప్రాయంగా అర్పించాడు ఈ యుద్ధంలో. కాని మా యుద్ధం కొనసాగుతుంది. ఎప్పటికీ ఇది ఆగదు. 'చే' పక్షాన ఉండి పోరాడిన వాళ్ళం, 'లొంగుబాటు' అనే పదానికి అర్థం తెలియని వాళ్ళం. చే, చే సహచరులు ఈ బొలీవియా మట్టిలో చిందించిన రక్తం విముక్తి విత్తనాలకు జీవం పోస్తుంది. ఈ ఖండాన్ని ఒక అగ్ని పర్వతంగా మారుస్తుంది. సామ్రాజ్యవాదాన్ని ధ్వంసం చేసేలా లావాను విరజిమ్ముతుంది.

ఆదర్శ, వీరోచిత దార్శినికుడు చే ఆకాంక్షించిన, స్వప్నించిన మరో వీర వియత్నాంను ఇక్కడ ఆవిష్కరిస్తాం.

– ఈ ఆశయాల కోసం విజయమో, వీరస్వర్గమో వరించడానికి మేం సంసిద్ధంగా ఉన్నాం.

– ఈ ఆశయాల కోసమే క్యూబా కామ్రేడ్లు ఆశువులు బాసారు.

- పెరూవియా కామ్రేడ్లు ప్రాణం త్యాగం చేసిందీ ఈ ఆశయాల సాధన కోసమే.
- అర్జెంటీనా కామ్రేడ్లు తమ జీవితాల్ని అర్పించిందీ ఈ ఆశయాల సాఫల్యం కోసమే.
- బొలీవియా కామ్రేడ్లు ఆత్మార్పణం చేసిందీ ఈ ఆశయాల సిద్ధికోసమే.

టానియా, జోయాక్విన్, జువాన్ పాబ్లీచాంగ్, మోజెస్ గువేరా, జార్జ్‌వాజెక్వెజ్, అనీసెటో రెనెగా, ఆంటోనియా జిమెంజ్, కోకోపెరిడోలకు గౌరవాంజలి, అరుణాంజలి. చేతిలో ఆయుధంతో కన్నుమూసిన ప్రతి కామ్రేడ్‌కు విప్లవాంజలి.

“మరణం హఠాత్తుగా మన ముందు నిలుస్తుందా, రానీండి దాన్ని స్వాగతిద్దాం. గెరిల్లా యుద్ధపు పోరుకేక చెవినబడి మన ఆయుధాన్ని అందుకోవడానికి ఇంకో చెయ్యి ముందుకు వస్తుంది. మన అంతిమ సంస్కార సంగీతం చెవినబడి ఇంకొందరు ముందుకు వస్తారు. మిషన్‌గన్‌ల గర్జనల గీతం వినిపిస్తారు. సరికొత్త యుద్ధానికి సవాలు విసురుతారు. అంతిమ విజయం సాధిస్తారు” అన్న చే గువేరా మాటలు అర్థాన్నీ, పరమార్థాన్నీ ఈ కామ్రేడ్స్ అర్థం చేసుకున్నారు.

మన జెండా నలిగి, ముడతలు పడుతుందేమో కానీ అవనతం చెందదు.

లాటిన్ అమెరికా ఆధునిక బొలివర్ – మన చేగువేరా బోధనలే తన వారసత్వంగా ‘జాతీయ విముక్తి సైన్యం విశ్వసిస్తుంది.

పిరికితనంతో చే ను హత్య చేసినవాళ్ళు అతని ఆలోచనలను, వారసత్వాన్ని నిలవరించలేరు.

సామ్రాజ్యవాదులు, వాళ్ళ తైనాతీలు ఇహనయినా మీ విజయకీర్తనలు చాలించండి. ఎందుకంటే మీరు అనుకుంటున్నట్లు ఈ యుద్ధం అంతంకాలేదు. ఇప్పుడే ఆరంభమయింది.

**మేం మళ్ళీ ఆ కొండలకు తిరిగి వస్తాం**
**ఆ కొండల్లో మార్మోగే మా నినాదాలు ప్రతిధ్వనులు**
**బొలీవియా అంతటా వినిపిస్తాం**
**విజయమో – వీరస్వర్గమో**

**బొలీవియా, జూలై 1968.**




(ఎగువ) బొలీవియాకు బయలుదేరే ముందు మారువేషాల్లో చేగువేరా (కుడి)
టుమా (కార్లస్ కోయెల్లో)
(దిగువ) హోటల్ గదిలో మారువేషంలో ఉన్న చే తనను తాను తీసుకున్న ఫోటో






(ఎగువ) బొలీవియాలో ప్రవేశించేందుకు చే సిద్ధం చేసుకున్న నకిలీ పాస్‌పోర్ట్,
(దిగువ) చేగువేరా, పోంబో, మార్కస్ (పినారెస్)





(ఎగువ) చినో (జువాన్ పాబ్లో చాంగ్), చేగువేరా

(దిగువ) చేగువేరా, పోంబో, మార్కస్ (పినారెస్)





(ఎగువ) మారియో మోంజె, చేగువేరా, 31 డిసెంబరు 1966

(దిగువ) చేగువేరా, లయోలా గుజ్మన్





(ఎగువ) గెరిల్లాలు దిగిన ప్రాంతంలో బొలీవియా రైతులు
(దిగువ) పడకను సిద్ధం చేసుకుంటున్న ఓ గెరిల్లా



(ఎగువ) రోలాండో (శాన్‌లూయిస్), ఓలోపంటోజా, పోంబో, మార్కస్,
(దిగువ) సెంట్రీ డ్యూటీలో టుమా, చేగువేరా





(ఎగువ) రెజిస్ డి‌బ్రే, సిరో బస్టాస్‌లతో మాట్లాడుతూ చేగువేరా

(దిగువ) చేగువేరా





(ఎగువ) మిగుయెల్ (మానువెల్), ఇంటి

(దిగువ) నకావుజునదీ తీరాన తుపాకిని బిగిస్తూ చేగువేరా





(ఎగువ) కోకో పెరెడో, టానియా
(దిగువ) ఇంతి, పోంబో, అర్బానో (టామయో), రోలాండో, అడిజాండ్రో(మాచిన్)
టుమా, ఆర్టురో, మోరో





(ఎగువ) కోకో, లయోలా గుజ్మన్, ఇంతి, అలెజాండ్రో,

(దిగువ) అర్బానో, మిగుయెల్, చే, మోరో, చినో, పాకో(పచుంగా) పోంబో, ఇంతి, లోరో





(ఎగువ)  విశ్రమిస్తున్న గెరిల్లాలు

(దిగువ)  నదిని దాటుతున్న గెరిల్లా



సెంట్రీడ్యూటీ చేస్తూనే
గ్రంథ పఠనం చేస్తున్న చే



ఓలో పోటోంజా
మోయిజెస్
గువేరా



అలెజాండ్రీ, ఇంతి
అర్బానో, రోలాండో,
చే, టుమా,
ఆర్టుర్, మార్కస్





(ఎగువ)  టానియా

(దిగువ) జీ నదీ తీరాన చేగువేరా



7 de noviembre 1

Hoy comienza una nueva etapa. Por la noche llegamos a la finca. El viaje fue bastante bueno. Luego de entrar, convenientemente disfrazados, por Cochabamba, Pachungo y yo hicimos los contactos y viajamos en jeep, en dos días y dos vehículos. Al llegar cerca de la finca detuvimos las máquinas y una sola llegó a ella para no atraer las sospechas de un propietario cercano, que murmura sobre la posibilidad de que nuestra empresa esté dedicada a la fabricación de cocaína. Como dato curioso, el inefable Tumaini es indicado como el químico del grupo. Al seguir hacia la finca, en el segundo viaje, Bigotes, que acababa de enterarse de mi identidad, casi se va por un barranco, dejando el jeep varado en el borde del precipicio. Caminamos algo así como 20 kilómetros, llegando a la finca, donde hay 3 trabajadores del partido, pasada la media noche.

Bigotes se mostró dispuesto a colaborar con nosotros,



JUNI Resumen del mes TERMIN-ÜBERSICHT

Las características más importantes son:

1º) Falta total de contacto con Manila, La Paz y Joaquín, lo que nos reduce a los 25 hombres que constituyen el grupo.

(ఎగువ) చేగువేరా బొలీవియా డైరీ మొదటి ఎంట్రీ 7 నవంబరు, 1996

(దిగువ) చేగువేరా బొలీవియా డైరీ







**(ఎగువ) చేగువేరా బొలీవియా డైరీలో జీ పేజీ, చే జన్మదినం 14 జూన్, 1967**

**(దిగువ) చేగువేరా బొలీవియా డైరీ**






**(ఎగువ) చేగువేరా బొలీవియా డైరీ చివరి ఎంట్రీ, 7 అక్టోబరు,1967**

**(దిగువ) గెరిల్లా బృందంలో మిగిలిన సభ్యులు చిలీ చేరుకున్న దృశ్యం**

చే ఏనాడూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం–పదవుల కోసం, హోదాకోసం, పేరు కోసం – పాకులాడలేదు. లాటిన్ అమెరికా దేశాల్లో నెలకొని ఉన్న ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితుల దృష్ట్యా ఆయా దేశాల్లోని ప్రజల విముక్తి కోసం విప్లవ సాయుధ గెరిల్లా పోరాటం ఒక్కటే మార్గమని చే బలంగా విశ్వసించాడు. గెరిల్లా ఉద్యమానికి సైనిక – రాజకీయ నాయకత్వం ఒకటిగా ఉండాలని, అలాంటి ఐక్య నాయకత్వం నగరాల్లో ఉండే బ్యూరోక్రటిక్ ఆఫీసుల నుండి గాక గెరిల్లా దళం నుండే రావాలని చే గట్టిగా నమ్మాడు.

–ఫైడెల్ కాస్ట్రో

ప్రజాశక్తి బుక్‌హౌస్